పరిణతవాణి

(ఐదవ సంపుటి)

(65 ఏళ్ళకు పైబడిన తెలుగు భాషా సాహిత్యరంగ
ప్రముఖుల ఆత్మకథా ప్రసంగ వ్యాసాలు)

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాదు - 500 001
ఫోన్‌నం. 040-2475 3724

పరిణతవాణి

(ఐదవ సంపుటి)

*(65 ఏళ్ళకు పైబడిన తెలుగు భాషా సాహిత్యరంగ
ప్రముఖుల ఆత్మకథా ప్రసంగ వ్యాసాలు)*

ప్రధాన సంపాదకులు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా. సి. నారాయణరెడ్డి

అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

సంపాదకులు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాదు - 500 001

ఫోన్‌నం. 040-2475 3724

PARINATHAVANI
(VOLUME - V)
(A collection of autobiographical speeches
of Eminent Telugu Literary Persons)

ప్రథమ ముద్రణ: డిసెంబర్, 2009

ప్రతులు : 1000

మూల్యం : రూ. 60/-

ప్రతులకు:
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాదు - 500 001
ఫోన్: +91-40-24753724

డిటిపి:
లిటరసీ హౌస్, ఆంధ్ర మహిళాసభ
ఉస్మానియా యూనివర్సిటీ రోడ్
హైదరాబాదు 500 007
ఫోన్: +91-40-2709 8406, 2709 6464

ముద్రణ:
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్,
40.ఎ.పి.హెచ్.బి, విద్యానగర్,
హైదరాబాదు - 500 044
ఫోన్ : 040-2761 8261, 2765 3348

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా॥సి. నారాయణరెడ్డి

అధ్యక్షులు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

ప్రవేశిక

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాల్లో 'పరిణతవాణి' ప్రసంగ పరంపర ఎందరో సహృదయుల ప్రశంసలు అందుకున్నది. ఆంధ్రదేశంలోని ప్రముఖులను ఆహ్వానించి వారి జీవిత విశేషాలు, సాహిత్యవేత్తలతో వారికి ఉన్న పరిచయం, ఉద్యమాలతో వారికి గల సంబంధం, సాహిత్య సాంస్కృతిక భాషా రంగాల్లో వారు చేసిన కృషిని గురించి ప్రసంగించమని కోరాము. మొదట డెబ్భై యేళ్ళకు పై బడ్డ ప్రముఖులచేత ప్రసంగాలు ఇప్పించాము. తరువాత అరవై అయిదేళ్లు పైబడ్డ వారిని ఆహ్వానించాము.

ప్రసంగ కర్తలు తమ ప్రసంగ వ్యాసాలు సమర్పించారు. సుదీర్ఘంగా ఉన్న వ్యాసాలను క్లుప్తీకరించాము. విషయ ప్రధాన దృష్టితో ఈ ప్రసంగ వ్యాసాలను సంపుటీకరిస్తున్నాము. అందుచేత ఈ ప్రసంగ వ్యాసాలు విస్తృతిలో కొన్ని చిన్నవిగా, మరికొన్ని పెద్దవిగా రూపొందాయి.

పరిషత్తు కార్యవర్గంవారు, కార్యకర్తలు, ఈ ప్రసంగ పరంపరకు విచ్చేసిన సదస్యులు, సాహిత్యవేత్తలు వీటిని పుస్తక రూపంలో తీసుకురావలసిందని సూచించారు. వారి సూచన ప్రకారం అయిదు ప్రసంగాలతో మొదటి సంపుటిని, ఏడు వ్యాసాలతో రెండవ సంపుటిని, ఎనిమిది ప్రసంగాలతో మూడవ సంపుటిని, తొమ్మిది ప్రసంగాలతో నాల్గవ సంపుటిని వెలువరించాము. మరో పది ప్రసంగవ్యాసాలతో ప్రస్తుతం ఐదవ సంపుటిని వెలువర్తిస్తున్నాము. ఈ పరిణత ప్రముఖుల ఆశయాలు ఆదర్శ కరదీపికలుగా నేటి తరాన్ని ఉద్దీపింప చేస్తాయని ఆశిస్తున్నాను.

హైదరాబాదు

15 డిసెంబర్ 2009

డా॥ సి. నారాయణ రెడ్డి

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

ముందుమాట

'పరిణతవాణి' అన్నది ఒక విశిష్టమైన ప్రసంగ పరంపర. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య సి. నారాయణ రెడ్డి గారు ఈ ప్రసంగ పరంపర స్వరూప శిల్పి. పరిణతవాణి కార్యక్రమంలో పరిషత్తు వేదిక నుంచి సాహిత్య సాంస్కృతిక రంగాలకు చెందిన తెలుగు ప్రముఖులు వారి అనుభవాలను, ప్రముఖులతో వారికి గల పరిచయాలను, వారు చేసిన కృషిని గురించి ఆత్మ కథాకథన రూపంలో ఎన్నో విశేషాలు వివరించారు. అందులో కొన్ని మనకు తెలిసిన విషయాలు కాకపోవచ్చు. ఈ తరం వారికి వారి అనుభవాలు, జ్ఞాపకాలు, ఎంతైనా అవసరం. భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంలో ఈ తెలుగు ప్రముఖుల అనుభవాలను, జ్ఞాపకాలను మొదటి సంపుటిగా పుస్తక రూపంలో తీసుకురావడానికి కారణం మా అధ్యక్షుల వారి సంకల్ప బలం. ఇప్పటికి నలభైతొమ్మిది ప్రసంగాలు జరిగాయి. నాలుగు సంపుటాలు ప్రచురించాం.మరో తొమ్మిది వ్యాసాలతో ఈ ఐదవ సంపుటిని వెలువరిస్తున్నాం.

ఈ ప్రముఖులు వ్యాస రూపంగా ఇచ్చిన ప్రసంగాలను ఇందులో ప్రచురించాం. సాధ్యమైనంత వరకు విషయ ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకోవడం జరిగింది. చాలా వరకు వారి స్వచ్ఛందమైన అభిప్రాయాలను గౌరవిస్తూ వాటిని ప్రచురించాం. అభిప్రాయ భేదాలు ఉన్నచోట ఆ అభిప్రాయాలు ఆ ప్రముఖుల వెలువరించినవవీ, ఆంధ్రసారస్వత పరిషత్తు కేవలం వాటిని ప్రచురించిందనీ గమనించవలసిందిగా మా విజ్ఞప్తి.

ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యక్రమాల్ని తీర్చి దిద్దుతూ, ఎన్నో సదస్సులను నిర్వహింపజేస్తూ మా అధ్యక్షులు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ **డా॥ సి. నారాయణరెడ్డిగారు** కార్యక్రమాల్లో చైతన్యం తీసుకువచ్చారు. ఈ సంపుటాలను ప్రచురించడంలో వారి ప్రోత్సాహం ఎంతైనా ఉంది. వారికి కృతజ్ఞతలు. నాతో సహకరిస్తున్న కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు. ఈ సంపుటిని తీర్చిదిద్దడంలో **శ్రీ గోవిందరాజు రామకృష్ణారావుగారు, శ్రీ పాండురంగయ్యగారు, శ్రీ తాళ్లపల్లి మురళీధరగౌడ్‌గారు** ఎంతగానో సహకరించారు. వారికి నా కృతజ్ఞతలు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

హైదరాబాదు
15 డిసెంబర్ 2009

ప్రసంగ వ్యాససూచిక



డా॥ వి.వి.యల్. నరసింహారావు

ఆంధ్ర సారస్వత పరిషదధ్యక్ష కార్యదర్శుల ఆహ్వానాన్ని పురస్కరించుకొని 'పరిణత వాణి' శీర్షిక క్రింద స్వీయానుభవాలను గురించి, సాహిత్య కృషిని గురించి ఇప్పుడు నేను ప్రసంగించవలసి ఉంది.

నాకిప్పుడు 70 ఏళ్లు నిండి 71 (10-7-1930 నా జన్మదినం) నడుస్తూ ఉంది. అయిదారు దశాబ్దులుగా ఆంధ్ర-ఆంధ్రేతర ప్రాంతాలలో కొన్నివేల ప్రసంగాలు చేశాను. కాని ఈ వేళ 'పరిణతవాణి' అనే శీర్షిక క్రింద ప్రసంగించటానికి కొంచెం భయం వేస్తున్నది. ఎందుకంటే వాక్కు పరిపక్వమై పరిపాకం సిద్ధిస్తే తప్ప వాణి పరిణతం కాదు. 'అటువంటి పరిణతవాణి నాకు సిద్ధించి ఉందా?' అని అనుమానం. అయితే వాణి చాలా ఉదారస్వభావురాలు. అవసరమైతే మనకు కావసిన అర్థాలు తన వాక్కుద్వారానే మనకు ప్రసాదిస్తుంది. 'పరిణతము' అనే మాటే ఉంది. 'పరి', ఉపసర్గ అనుకుంటే, 'నతము' అనే దానికి నమ్రము, వంగినది అని అర్థాలు. 'పరిణతము'నకు 'మిక్కిలి వినమ్రమైనది' అని కూడా అర్థం చెప్పవచ్చు. అదుగో అటువంటి వినమ్రమైన శిరస్సుతో నా పలుకులు మీకు వినిపించదలచుకున్నాను.

వాక్పరిపాకం ఎట్లా ఉన్నా వయఃపరిపాకం సిద్ధించి ఉంది కనుక నాది పరిణత వాక్కే.

70 ఏళ్ల క్రిందట గుంటూరు జిల్లా చేబ్రోలు గ్రామంలో బ్రహ్మశ్రీ వాసిలి కోటిలింగం, శ్రీమతి వెంకటసుబ్బమ్మ దంపతులకు ఎనిమిదవ సంతానంగా జన్మించినవాణ్ణి. ఆ దంపతులకు పదిమంది బిడ్డలు పుడితే అష్టమగర్భంగా అవతరించి

బతికి బట్టకట్టినవాణ్ణి నేనొక్కణ్ణే. తక్కిన తొమ్మిదిమందీ పసితనంలోనే కన్నుమూశారు. మంగళగిరి లక్ష్మీనృసింహస్వామి పేరు మీదుగా నాకు వెంకట లక్ష్మీనరసింహారావు అని పేరు పెట్టుకున్నారు. ఆ స్వామి దయవల్లనే నే నామాత్రంగా నిలిచానని మా పెద్దల నమ్మకం; నా నమ్మకం.

మా తండ్రిగారు నా తొమ్మిదవ యేటనే కన్ను మూశారు. నా మారుటక్క భర్తగారైన బ్రహ్మశ్రీ వేడూరి గోవిందాచార్యులుగారి పెంపకంలో పెరిగాను. ఆయన సంస్కృతాంధ్రాలలో గొప్ప పండితుడు; కవి; సుపౌరాణికుడు; వేద విదుడు; విశ్వబ్రాహ్మణుడుగా, కులవృత్తి అయిన స్వర్ణకార వృత్తిని కూడా చేస్తుండేవారు. ఆయన సన్నిధిలో పెరిగిన బలంవల్ల ఈ అన్ని విద్యల్లో అంతో ఇంతో నైపుణ్యం చిన్నతనంలోనే నాకూ అబ్బింది.

మా బావగారైన గోవిందాచార్యులుగారు గృహగ్రంథాలయంగా శ్రీ గౌరీసరస్వతీ నిలయమనే ఒక గ్రంథాలయం స్థాపించి, రాత్రివేళల వయోజనులకు విద్య నేర్పుతూ ఉచిత వయోజనవిద్యను ఆనాడే (1940 ప్రాంతం) అమలులో పెట్టారు. గ్రంథాలయంలో సంస్కృతాంధ్ర సాహిత్య గ్రంథాలతోపాటు 'తెలుగు వెలుగు' అనే ఒక మాసపత్రిక వ్రాత ప్రతిగా అందరికీ అందుబాటులో ఉండేది. దాని సంపాదకుడు మా బావగారైన గోవిందాచార్యులు గారే. చేబ్రోలు పరిసర ప్రాంతాలలోని పలువురు కవిపండితుల రచనలు 'తెలుగు వెలుగు'లో వస్తూ ఉండేవి. చేబ్రోలు గ్రామానికి గోవిందాచార్యులుగారు నడిపే గ్రంథాలయం, 'తెలుగు వెలుగు' పత్రిక, వయోజనుల రాత్రి పాఠశాల గొప్ప ఆకర్షణలు. చేబ్రోలు యుద్ధమల్లుడి బెజవాడ శాసనంలో చెప్పబడ్డ చేబ్రోలే అని ఆ పత్రికద్వారానే నాకు తెలిసింది. పెద్దవాణ్ణి అయిన తరువాత "జననుత చేబ్రోలనుండి బెజవాడ జాత్రకువచ్చి త్రిణయనసుత డొందుసోటుమెచ్చక తవిరి యిన్నెలవ సేకొనియుండె" అనే శాసన విశేషాలు కూడా విపులంగా తెలుసుకున్నాను.

ఈ శాసనంలో చెప్పబడ్డ త్రిణయనసుతుడికి – అంటే కుమారస్వామికి, చేబ్రోలులో వెయ్యిస్తంభాల గుడి ఒకటి ఉండేదట. దాని స్థానంలో ఇప్పుడు బ్రహ్మగుడి అందమైన కోనేటి మధ్యలో ఉంది. దీనికి అన్ని దిక్కుల్లో అనేక శివకేశవాలయాలున్నాయి. మాయింటి వెనుక భాగంలో నిలబడి చూస్తే అన్ని గుడులూ ఆత్మకు ఇంపుగా కనిపించేవి. జైన బౌద్ధహిందూ సంప్రదాయాలకు చెందిన నూటొక్క గుడులుగల చరిత్ర ప్రసిద్ధమైన గ్రామం గుంటూరు జిల్లా చేబ్రోలు. లేపాక్షి బసవన్నకు దీటైన నంది విగ్రహం, శివాలయం, భీమేశ్వరాలయం, రంగనాథస్వామి ఆలయం ఇంకా ఇంకా ఎన్నో ఎన్నో ఆలయాలు.

మా ఇంటికి దాపున ఉన్న శ్రీరంగనాయక స్వామి ఆలయ ఆవరణలో రాత్రివేళల మా బావగారు పురాణ పఠనం చేసేవారు. భారత రామాయణాది మహాకావ్యాలు వారి ముఖతః ఆ నాడే వినగలిగాను. ఆ రోజుల్లోనే నాకు ఎన్నో పద్యాలు శ్లోకాలు కంఠస్థంగా వచ్చేవి. చిన్ననాటి గురువులుగా సర్వశ్రీ కొర్నెపాటి శేషగిరిరావుగారు, తుమ్మల వెంకటరత్నంగారు, లెక్కల మాష్టారు ఆలూరు శేషగిరిరావుగారు మొదలైనవారు గుర్తుంచుకోదగ్గవారు. హైస్కూల్ చదువు తెనాలిలో తాలూకా హైస్కూల్లో సాగింది. అక్కడ సర్వశ్రీ పులిగడ్డ సుబ్బారావుగారు, బూరుగుల గోపాలకృష్ణమూర్తిగారు మొదలైన పండితుల భాషాసాహిత్య బోధన ఫలించి ఆనాడే నాకు పద్యవ్యాసాది రచనల పోటీల్లో బహుమానాలు కూడా పుష్కలంగా వస్తుండేవి.

స్కూల్ ఫైనల్, ఇంటర్మీడియెట్ క్లాసుల్లో గణిత భౌతిక రసాయన (MPC) శాస్త్రాలు అభిమాన విషయాలు నన్నెంతగానో ఆకర్షించాయి. ఇంటర్మీడియట్ గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో చదివాను. సర్వశ్రీ తెలికచర్ల వెంకటరత్నంగారు, జమ్మలమడక మాధవరాయశర్మగారు, ఎలవర్తి రోశయ్యగారు, జార్జిథామస్‌గారు మొదలైన మహోపాధ్యాయుల పాఠాలు విని ప్రోదిచేసుకొన్న విజ్ఞానం నాది. నేను ఆ రోజుల్లోనే (1947-49) భారతి మొదలైన పత్రికల్లో వ్యాసాలు పద్యాలు వ్రాస్తుండేవాణ్ణి.

ఇంటర్మీడియెట్ తరువాత ఒక రెండేళ్లు (1949-51) చదువుకు అంతరాయం ఏర్పడింది. ఆ రోజుల్లో చేబ్రోలు హైస్కూల్లో గుమాస్తాగా, అధ్యాపకుడుగా కూడా పనిచేశాను. ఆ రోజుల్లోనే 'కవిబ్రహ్మ' ఏటుకూరి వెంకట నరసయ్యగారు కన్నుమూస్తే (1950) "కవిబ్రహ్మ నిర్గమనం" అనే శీర్షికతో భారతిలో పద్యాలు ప్రచురించాను.

> "తెగిపడె తెన్గుపాట నినదించెడి మోహన వీణతంత్రి; నె
> వ్వగ నెద భారమై తెనుగు భారతి కుందె"... ఇట్లా సాగుతై పద్యాలు.

ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షల్లో నెగ్గి రెవెన్యూ శాఖలో గుమాస్తాగాను, కొన్నాళ్లు స్పెషల్ రెవెన్యూ ఇన్స్పెక్టరుగాను కృష్ణా జిల్లా తిరువూరు - ఎస్టేట్ మేనేజరు కార్యాలయంలో పనిచేశాను. త్వరత్వరగా ప్రమోషన్లు వస్తున్నా నా దృష్టి ఉన్నతవిద్యమీద ఉండటంవల్ల ఆ ఉద్యోగాలు వదిలి, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో తెలుగు ఆనర్సులో చేరి సర్వశ్రీ భూపతిలక్ష్మీనారాయణరావుగారు, పి.ఎస్.ఆర్. అప్పారావుగారు, జి.ఎన్. రెడ్డిగారు మొదలైన మహామహుల సన్నిధిలో భాషాసాహిత్యాలు బాగా అభ్యసించగలిగాను.

భాషా సాహిత్యాలు మాత్రమేకాక నాటక కళలో కూడా మంచి ప్రవేశం ఏర్పడింది. సర్వశ్రీ పి.ఎస్.ఆర్. అప్పారావుగారు, బాలాంత్రపు రజనీకాంతరావుగారు మొదలైన వారి శిక్షణలో రంగస్థలనాటకాల్లో నటించి, శ్రీ గిడుగు సీతాపతిగారి వంటి మహామహుల చేతిమీదుగా బహుమతులు కూడా అందుకోగలిగాను. నాకు లలిత సంగీతంలో కూడా ప్రవేశం ఉండటంచేత - మద్రాసులోని తెలుగు, తమిళ, కన్నడ మళయాళాది భాషా విద్యార్థులతో పోటీల్లో పాల్గొని ఉత్తమ బహుమతులు పొందిన అనుభవం కూడా ఉంది. తెలుగు కవిత్వం సంగతి చెప్పక్కర్లేదు. తెలుగులో ఉత్తమ పద్యకవితా బహుమతులు కూడా పొందాను. మాన్యులు శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి వంటి కవిసత్తముల అభినందనలు కూడా అందుకోగలిగాను. ఆ రోజుల్లోనే వ్రాసిన 'వీణానిర్వేదం' పద్యఖండిక శ్రీ కాటూరి వారి 'విప్రలబ్ధ విపంచి' స్థాయిలో ప్రస్తుతి పాత్రమైంది.

మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో 1954 వరకు తెలుగు బి.ఏ. ఆనర్స్ చదివి డిగ్రీ అందుకొన్న వెంటనే గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో తెలుగు ఉపన్యాసకుడుగా ఉద్యోగం చేసే అవకాశం వచ్చింది. అక్కడ 1959 వరకు ఆ ఉద్యోగం ఆనందంతో నిర్వహించగలిగాను. నేను ఏ ఉత్తమ ఉపన్యాసకులవద్ద చదువుకొన్నానో వారితో సహోపన్యాసకుడుగా ఉద్యోగం చేసే అవకాశం కలిగింది. అధ్యాపకుడుగా విద్యార్థుల అభిమానం సంపాదించటమే కాకుండా నటుడుగా, నాటక దర్శకుడుగా కూడా అటు విద్యార్థుల అభిమానం, ఇటు అధ్యాపకాభిమానం కూడా సంపాదించగలిగాను.

1953లో 'భారతి' మాసపత్రికలో నా "నిషాపురం" అనే నాటిక ప్రచురించబడింది. అది ఉమర్ ఖయ్యాము జీవితానికి సంబంధించిన నాటిక. ఖయ్యాము స్వస్థలానికి సంబంధించిన నైషాపూర్ (పారశీకదేశం) అనే పేరునూ, తాగిన నిషాలో ఉండే ఖయ్యాం స్వభావాన్నీ రెండింటినీ స్ఫురింపజేసే 'నిషాపురం' అనే పేరు దానికి ఎంతో తగి ఉందని అందరూ అనేవారు. ఆ నాటిక నేను 1956 ఏ.సి. కాలేజి రంగస్థలంమీద- నేనే ఖయ్యాము పాత్ర ధరించి ప్రదర్శించాను. ఈ నాటికకూ ఆహార్య దర్శకత్వాది బాధ్యతలు మా మేనమామగారైన శ్రీ గోనుగంటా రామయ్యగారు వహించారు. నాటిక బాగా రక్తికట్టింది. రామయ్యగారు గొప్పనటులు. జీవితాంతం ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల శాఖనుండి నెలకు రూ100/- గౌరవపురస్కార వేతనం అందుకుంటూ ఉండేవారు.

ఆ కళాశాల రంగస్థలంపై శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారి "విసర్జన" (టాగూరు Sacrifice నాటకానికి అనువాదం - శ్రీ జగ్గయ్యగారు 'బలిదానం' అనే పేరుతో ఈ నాటకాన్ని ప్రదర్శించేవారు) నాటకంలో రాణి పాత్ర అభినయించాను. అట్లాగే 'Bishop

and the Candle sticks' నాటకంలో బిషప్ పాత్రకూడా ధరించి ప్రేక్షకుల మన్నన సంపాదించగలిగాను.

అక్కడ నా వద్ద విద్యార్థులుగా ఉన్న కొందరు ఇప్పుడు ప్రభుత్వోద్యోగాలలో కమీషనర్ పదవుల్లో ఉంటూ ఇప్పటికీ నన్ను జ్ఞాపకం చేసుకుంటూ ఉంటారు. అది నా అదృష్టంగా నేను భావిస్తాను.

అట్లాగే 1959-62 వరకు కాకినాడ పి.ఆర్. ప్రభుత్వ కళాశాలలోను, 1962-67 దాకా రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాలలోను ఆంధ్రోపన్యాసక పదవిలో ఉన్ననాళ్లల్లో విద్యార్థులుగా ఉన్న శ్రీ డి. మురళీకృష్ణగారు, శ్రీ కల్లూరి మురళీకృష్ణగారు మొదలైనవారు ఇప్పుడు ప్రభుత్వోద్యోగాల్లో మహోన్నత పదవుల్లో ఉండటమే కాకుండా నవ్యగాయకుల్లో సుప్రసిద్ధులుగా ఉండి కచేరీలు కూడా చేస్తూ ఉండటం అందరికీ తెలిసిందే.

రాజమహేంద్రవరం కళాశాలలో ఉండగానే నేను నా 'ఆనందభిక్షువు' పద్య కావ్యాన్ని ప్రచురించాను. మాన్యమిత్రులు శ్రీ సూర్యదేవర మల్లికార్జునరావుగారి తండ్రిగారికి అది అంకితం చేశాను. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు, శ్రీ భాష్యం అప్పలాచార్యులుగారు, డా॥ జి.వి. కృష్ణారావుగారు ఆ కావ్యానికి అమూల్య పీఠికలు వ్రాశారు. కావ్యం తెనుగునాట సుప్రసిద్ధులైన కవిపండితులెందరికో శ్రీ మల్లికార్జునరావుగారే బహూకరించారు (పోస్టు ద్వారానే).

కావ్యం అందుకొన్న వారం పదిరోజుల్లోనే గొప్ప స్పందన వచ్చింది. పూజ్య కవిపండితులెందరో పద్యవచన రూపంలో అభినందనాశీస్సులందజేశారు. శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు, శ్రీతుమ్మల సీతారామమూర్తిచౌదరిగారు, శ్రీమధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు, శ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారు, శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు, శ్రీ సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారు, శ్రీశ్రీగారు మొదలైన ప్రాజ్ఞులు ప్రస్తుతి పాత్రమైన పలుకులు పలికారు. మచ్చుకు శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారి పద్యాల్లో ఒకటి -

"రొట్టె నేమూల నేనియుపట్టి తిన్న
అమృత మేవేపు నుండియు ఆరగింప
ఒక్క చందమె అయినట్టు లుండు నయ్య
'అమృత భిక్షువు' ఏ పుటయైన జదువ"

మాన్యులు శ్రీ తుమ్మల సీతారామమూర్తిచౌదరిగారి దృష్టికి 'ఆనందభిక్షువు కృతి కర్త, కవీంద్రుడు'లా కనిపించాడు చూడండి–

"ఆనందభిక్షువుంగని యేనలరితినారసింహ! ఇంతటి దనుకన్
నీ నామము నాణెము నా వీనులబడకుంట పెద్దలింక కవీంద్రా!"

నేను చిరకాలం గుర్తుపెట్టుకోదగిన మరో అంశం పూజ్యులు శ్రీ దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారు వారి స్వస్థలమైన మసకపల్లి గుడిలో ఈ కావ్యం పురాణపరనంగా వినిపించి గ్రామస్థులకు ఆనందం కలిగించారట. కాకినాడలో కళ్లకు వైద్యం చేయించుకుంటూ స్వయంగా వారినోటితోనే వారు ఈ విషయం నాకు చెప్పారు. నా జీవితానికి ఇంతకంటే చరితార్థత ఏముంటుంది? నిజానికి వారు నన్నెప్పుడూ చూడలేదు. ఆంధ్రయూనివర్సిటీ విద్యార్థిని కాకపోవుటంవల్ల వారికి సాక్షాత్తు విద్యార్థినయ్యే అవకాశమూ లేకపోయింది. పోనీ ఆసుపత్రిలోనైనా నన్ను వారు చూస్తారా – అనుకుంటే ఆపరేషనై కళ్లకు గంతలుకట్టుకొని ఉన్నారు. డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావుగారి సాహాయ్యంతో వారిని ఆనాడు చూడగలిగాను. ఆ మహానుభావుడు – శ్రీ శాస్త్రిగారు అన్నారు "నరసింహారావుగారూ, మిమ్మల్ని నేనెప్పుడూ చూడలేదు – మీ ఆనందభిక్షువు ద్వారా తప్ప. ఆ పుస్తకంలో మీ ఫోటో కూడా మీరు ముద్రించుకోలేదు. ఆనందభిక్షువు చదివిన అనుభవంతో మీ రూపం ఎట్లా ఉంటుందో పోల్చుకోగలను. చెబుతున్నాను వినండి – ఇదుగో ఇట్టా ఉంటారు" అంటూ వివరాలు చెప్పారు. ప్రక్కనున్న మృత్యుంజయరావుగారు "కావ్యం చదివి కవి భౌతికరూపంకూడా గుర్తించగలగడం మీకు మాత్రమే సాధ్యం. నిక్కచ్చిగా నరసింహారావుగారి రూపం మీరు చెప్పారు" అన్నారు.

పూజ్యశ్రీ వెంకటరమణశాస్త్రిగారి పాదాలకు నమస్కరించి, మృత్యుంజయరావు గారి సెలవుతీసుకొని ఆసుపత్రినుండి బైటకు వచ్చాను. ఆ దినం నా జీవితంలో మరపురానిది.

నిజానికి నేను ఆ రోజు ఉద్యోగవిధిగా కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తులోని తాళపత్ర గ్రంథాలుకొన్ని పరిశీలించేందుకు ఆంధ్రరాష్ట్ర ప్రాచ్య లిఖిత భాండాగార పరిశోధనాలయం డైరెక్టరుగా వెళ్ళాను. ఆ పనితోపాటు శ్రీ శాస్త్రిగారిని సందర్శించే అదృష్టం కూడా లభించింది నాకు. ఇటువంటి అనుభవాలు ఎట్లా మరచిపోగలుగుతాను?

నేను 1981 నుంచి 1988 వరకు పై పరిశోధనాలయం డైరెక్టరుగా పనిచేశాను. అంతకుముందు ప్రిన్సిపల్‌గా కడపజిల్లా రాయచోటి కళాశాలలోను, గుంటూరుజిల్లా

మాచర్ల కళాశాలలోను పనిచేశాను. అంతకంటే ముందు మాచర్ల కళాశాలలోను, అంతకు ముందు చిత్తూరు కళాశాలలో తెలుగు సీనియర్ లెక్చరర్‌గా కూడా పనిచేశాను. ఆ రోజుల్లోనే మాన్యులు శ్రీ పి. రాజగోపాలనాయుడుగారితో సాహితీ సంబంధమైన పరిచయం కూడా బలంగా ఏర్పడి వారి "పాటలలో ఛందస్సు" అనే విమర్శ గ్రంథానికి విపులమైన పీఠిక కూడా వ్రాసి ఉన్నాను. ఎన్నో సాహిత్య సభల్లో శ్రీ రామవిలాస సభావేదికపై పాల్గొని ఉన్నాను. అక్కడికి శ్రీశ్రీగారు మొదలైన మహాకవుల్ని పిలిపించి కార్యక్రమాలు నడిపిస్తూ ఉండేవాళ్ళం.

1972-79 మధ్యకాలంలో మాచర్ల కళాశాలలో పనిచేసే రోజుల్లోనే "నన్నయ కవిత్వం అక్షర రమ్యత" పరిశోధన గ్రంథాన్ని పూర్తి చేయటం. పిహెచ్.డి. డిగ్రీ పొందటం, ఆ గ్రంథాన్ని ముద్రించి రాజమహేంద్రవరంలో శ్రీ నార్ని కేదారేశ్వరుడుగారికి అంకితం చెయ్యటం, అంకిత సభలో మాన్యులు శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు గ్రంథంలోని విశేషాలను వివరించటం, ఆ సభలోనే నాకు నవరత్నస్థగిత సువర్ణ కంకణం బహూకరించటమూ జరిగాయి.

రాజమహేంద్రవరంలో ఆంధ్రోపన్యాసకుడుగా పనిచేస్తున్న రోజుల్లోనే మాన్యులు శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యగారి ప్రేరణతో 'విశ్వవాణి' అనే పద్యకృతి ఒకటి వ్రాశాను. అది రష్యాతాత్వికురాలైన 'మేడమ్ బ్లావిట్‌స్కీ' రచించిన The voice of silence కు అనువాదం. అది కృష్ణమాచార్యులవంటి ప్రాజ్ఞుల అభినందనకు పాత్రమైంది. దానికి వారు పీఠిక వ్రాస్తామన్నారు. అది అప్పటిలో జరగలేదు. వారి పీఠికలేకుండా దాన్ని ముద్రించే ఆసక్తిలేక అట్లాగే అముద్రితంగానే ఉంచాను. ఇప్పుడైనా ముద్రించాలి.

రాజమండ్రి తరువాత చిత్తూరులో పనిచేసే అవకాశం లభించింది. ఒక ప్రక్క ప్రఖ్యాత కళాశాలలో ఆంధ్రోపన్యాసక పదవి, మరొక ప్రక్క స్థానిక సాహిత్య సభల్లో పాల్గొనటం గొప్ప ఉత్సాహాన్ని కలిగించింది. నేను 1956 నుండి అప్పటివరకు రేడియోలో చేసిన ప్రసంగాలలో స్కూలు విద్యార్థుల కోసం చేసిన రేడియో ప్రసంగాలను ఒక గ్రంథరూపంగా పిల్లల "రేడియో కథలు-వ్యాసాలు" అనే పేరుతో ప్రచురించటం జరిగింది. ప్రచురణకు దోహదం కల్పించిన అధ్యాపక సాహితీ రచయిత శ్రీ కె.రామకృష్ణగారు, ఆ గ్రంథానికి శ్రీ బి.వి. నరసింహారావుగారు మంచి పీఠిక కూడా వ్రాశారు. ద్వితీయ ముద్రణకు సాయపడిన శ్రీ పి.భాస్కరరెడ్డి గారికి కూడా కృతజ్ఞతలు.

చిత్తూరులో ఉన్న రోజుల్లోనే (1970-71లో) మద్రాసులోని తెలుగు సాహిత్య సభాకార్యక్రమంలో "సాహిత్యము - సహృదయత" అనే ఉపన్యాసం చేసే అవకాశం

వచ్చింది. సభకు శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, శ్రీ బి.ఎస్.రెడ్డిగారు, శ్రీ విద్వాన్ విశ్వంగారు, శ్రీ బి.ఎస్.ఆర్.కృష్ణగారు మొదలైన ప్రాజ్ఞులెందరో వచ్చారు.

ఆ రోజు నా ప్రసంగం పెద్దలను కూడా చాలా అలరించిందట. పెద్దలు వారి ఇళ్లకు నన్ను మర్యాదగా ఆహ్వానించారు; వెళ్ళాను. శ్రీ కృష్ణశాస్త్రిగారింట్లో వారితో మాట్లాడుతుండగా వారు (అప్పటికే గొంతుపలికే సౌకర్యం కోల్పోయి ఉన్నారు) కాగితంమీద ఏదో వ్రాసి నా చేతికిచ్చారు. అందులో విషయం చూచి నాకు ముత్పులక లుదయించాయి. అందులో వారు వ్రాసినదేమంటే, "ఈ వేళ మీ ప్రసంగం విన్న తరువాత నాకు గొంతు పోయిందనే విచారం తొలగిపోయింది" అని ఉంది.

చిత్తూరులో ఉన్న రోజుల్లోనే నేను పిహెచ్.డి.కి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్య జి.ఎన్.రెడ్డి గారి చోదకత్వంలో "నన్నయకవిత్వము: అక్షర రమ్యత" అనే విషయం మీద పరిశోధన ప్రారంభించాను. పంపనన్నయల కవితా శైలీ సారూప్యాది విషయాల పరిశీలనకోసం బెంగుళూరు వెళ్ళి అక్కడి విశ్వవిద్యాలయంలో కన్నడ పండితుల దగ్గర 'పంప మత్తు నన్నయ" అనే విషయం మీద విపులంగా అధ్యయనం కొనసాగించాను. దాని ఫలితంగా పరిశోధన గ్రంథం సమగ్రం కాగలిగిందని నా పరిశోధన చోదకులు సంతృప్తి వ్యక్తం చేశారు. చిత్తూరులో ఉన్న రోజుల్లోనే "వసుచరిత్రతత్వ" మనే ఒక బృహద్వ్యాసం - రామరాజ భూషణ పరిషత్తు (భీమవరం) వారికి వ్రాసి ఇచ్చాను.

అనుకోకుండా నాకు చిత్తూరునుండి శ్రీకాకుళానికి బదిలీ అయింది. శ్రీకాకుళం డిగ్రీకళాశాల గ్రంథాలయంలో సంస్కృతవ్యాస భారతాది గ్రంథాలు అనేకం ఉన్నాయి. అవి నా పరిశోధనకు ఎంతగానో ఉపకరించాయి. ఒకవంక పరిశోధన సాగిస్తూ ప్రధాన వృత్తి అయిన అధ్యాపకత్వంలో ఆనందం పొందుతూ ఒరిస్సా సరిహద్దుల వరకూ అనేక సాహిత్య సభల్లో పాల్గొంటూ స్థానికుల అభిమానాన్ని చూరగొనగలిగాను.

అదుగో - అటువంటి సందర్భాల్లోనే నాకు గుంటూరు జిల్లా మాచర్లకు బదిలీ అయింది. అక్కడ ఉన్నన్నాళ్లలోనే పరిశోధన పూర్తయి, పిహెచ్.డి. డిగ్రీ సంపాదించటమే కాక పరిశోధన గ్రంథ ముద్రణావకాశం కూడా లభించింది. రాజమహేంద్రవరములో పూర్వపరిచితులైన శ్రీ నార్ని కేదారేశ్వరుడుగారికి గ్రంథాన్ని అంకితం ఇవ్వటం, అంకిత సభలో మాన్యులు శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు గ్రంథంలోని అమూల్య పరిశోధనాంశాలను వివరించటమూ జరిగింది. ఈ గ్రంథం అంకితంవల్ల కేదారేశ్వరుడుగారి వంశం ఏడుతరాలు ముందు, ఏడు తరాలు తరువాత పునీతమయ్యే అవకాశం కలిగిందని మహోపన్యాసం చేశారు. ఆ సభలోనే ప్రభుత్వానుమతితో శ్రీ

జంపని కామేశ్వరరావుగారు నవరత్న స్థగిత సువర్ణ కంకణం బహూకరించటమూ జరిగింది. నాటి సభ గొప్ప సాహిత్య సభగా స్థానిక పండిత రసజ్ఞులు ఎందరో ఆనందపడ్డారు. అదొక మధురానుభూతిగా నిలిచిపోయింది.

మాచర్లలో ఉన్న కాలంలోనే "వినరాసుమతీ!" అనే సుమతిశతక వ్యాఖ్య గ్రంథాన్ని సుజనరంజనీవ్యాఖ్యగా బందరు స్పందన సాహితి ఆధ్వర్యంలోనే ఆవిష్కరించటం జరిగింది.

ఈ విమర్శ గ్రంథాలతోపాటు – రేడియో నాటికలు, నాటకాలు అనేకం వ్రాయటమూ జరిగింది. అప్పటికే దూత వాక్యం, బసివి, కాఫీరాగం మొదలైన రేడియో నాటకాలు విజయవాడ కేంద్రం నుండి ప్రసారమై శ్రోతల మన్ననలందుకొన్నాయి. 'దూతవాక్యం' భాసుని రూపకానికి అనుసరణ. విషయం కృష్ణుని రాయబారానికి సంబంధించిందే. ఈ నాటిక రేడియోలో క్రిస్మస్ పండుగనాడు ప్రసారం కావటంవల్ల 'దూత' అంటే క్రీస్తు దేవుడనే అభిప్రాయం కూడా ముందుగా కొందరికి కలిగింది. అయినా నాటకం విన్నాక వారికే అసంతృప్తి కలగలేదు. 'బసివి' బసివి సంప్రదాయం గురించిన నాటిక. 'కళాప్రపూర్ణ డా॥ కొందూరి వీరరాఘవాచార్యులుగారి 'మోహనాంగి' నవల ఆధారంగా వ్రాసిన నాటిక. 'కాఫీరాగం' – కాఫీనారాయణ రాగం గూర్చి మాత్రమే కాక 'కాఫీ ఉంటే పిచ్చివ్యసనంగల వారిని గూర్చి కూడా చెప్పే హాస్యనాటిక.

నిజానికి నావరకు నేను మొదటినుంచీ విమర్శవ్యాసాలు, నాటికలు, నాటకాలు, పరిశోధన వ్యాసాలు మొదలైనవి వ్రాస్తూండేవాణ్ణి. కాని తొలినాళ్లలో కథలు కూడా వ్రాసే అలవాటుండేది. ఉండటమే కాదు, అవి ప్రసిద్ధ పత్రికల్లో ప్రచురితమౌతూ కూడా ఉండేవి. "వాడిన మొగ్గ" అనే కథానిక 1955 ప్రాంతంలో వ్రాసింది. వారపత్రికలో ప్రచురితం. క్రొత్తగా కాపురం పెట్టిన దంపతుల్లో భర్త, భార్యకోరే గొంతెమ్మ కోరికలు తీర్చలేక నిస్పృహపాలై తనువు చాలించిన సందర్భం – "వాడిన మొగ్గ" అనే పేరులో కూడా ఆ అర్థస్ఫూర్తి ఉండేటట్లు పేరు పెట్టాను. 'మమత' అనే మరోకథ పిల్లలుగన్న పిల్లి పిల్లల్ని పాముబారినుండి రక్షించుకోవటం కోసం తాను బలౌతూ పామునుకూడా హతమార్చిన సన్నివేశం. ఈ కథ చిన్నపిల్లలు వింటూ తల్లిని వేసే కొన్ని ప్రశ్నలకు తల్లి జవాబు చెప్పలేని స్థితి మమకారపు లోతుల్ని తట్టిచూపుతుంది. 'తమసోమా' అనారోగ్యవంతుడైన బిడ్డని రక్షించటంకోసం నోరుగల పితరులే కాక నోరులేని పెంపుడు కుక్క మొదలైనవి కూడా ఎట్లా తాపత్రయ పడ్డాయో చిత్రించే కథ. 'కొడిగట్టినదీపం' అనే కథ భారతిలో ప్రచురితం – మా శ్రీమతి అనసూయ నేను కలిసి వ్రాసిన కథ. పరిస్థితులవల్ల శీలభంగం కాబోయేస్థితిలో ఒక బ్రహ్మచారి యువకుడు తెలివిగా సంయమంతో ఒడ్డునపడిన స్థితి.

దీపానికి కొడి రాలిపోయిన తరువాత బాగా దీపం వెలిగినట్లు – ఆ బ్రహ్మచారి ప్రమాదంనుంచి బైటపడి పరిశుద్ధంగా వెలిగిన సందర్భం – అందులోని ప్రధానాంశం. ఇటీవలి కాలంలో "భర్త– మార్కండేయ" అనే ఒక హాస్య కథకూడా వ్రాయటం జరిగింది. శీర్షికనుబట్టి పఠితలు కథ ఊహించుకోవచ్చు.

1979లో నాకు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్‌గా 'ప్రమోషన్' వచ్చింది. కడప జిల్లా రాయచోటి కళాశాలలో చేరాను. ఉద్యోగవిధులు సంతృప్తిగా నెరవేరుస్తూనే రాత్రివేళల 'సత్యశాయి ప్రభూ!' అనే మకుటంతో ఒక శతకం – స్వీయానుభవాలు పురస్కరించుకొని వ్రాశాను. ఒకనాడు పుట్టపర్తి స్వామి సందర్శనార్థం వెళుతూ వెంట ఆ శతకం వ్రాత ప్రతిని కూడా పదిలంగా తీసుకువెళ్ళాను. స్వామి అందులో ఒకటి రెండు పద్యాలు విని – మహిమలు క్షుద్రవిద్యలనే భావంగల పద్యం గూర్చి –ముందు ముందు మీ అభిప్రాయాలు మారే అవకాశముందని ప్రబోధాత్మకమైన చూపుచూచి ప్రసాదం పెట్టించి పంపారు. సత్యశాయి ముద్రణ మహాకవి, రచయితలైన శ్రీ ఊట్ల కొండయ్యగారు, శ్రీ త్రిపురనేని సుబ్బారావుగారు నిర్వహించారు.

రాయచోటి నుండి కొన్ని నెలల్లోనే తిరిగి మాచర్ల కాలేజికి ప్రిన్సిపాల్‌గా రావటం జరిగింది. 1981లో అక్కడినుండి బదిలీయై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయం పరిశోధనాలయానికి డైరెక్టరుగా హైదరాబాదు వచ్చాను. ఈ పదవిలో 1988 జులై చివరిదాకా పనిచేసి, అనేక గ్రంథాలకు ఆంగ్ల పీఠికలు వ్రాసే పని కొనసాగించాను. వ్రాతప్రతులుగా ఉన్న తాళపత్రాల గ్రంథాలు అనేకం పరిష్కరించే బాధ్యత కూడా సంతృప్తిగా నెరవేర్చగలిగాను. ఆంధ్ర, సంస్కృత, పారశీక, ఉర్దూ, అరబ్బీ గ్రంథాల పరిష్కృత ప్రతులు ప్రచురించే అమూల్యమైన పనిని సంతృప్తిగా నెరవేర్చగలిగాను. రాష్ట్రేతర లిఖిత గ్రంథాలయాలనే కాక ఖండాంతర లిఖిత గ్రంథాలయాలలో కూడా సంబంధం ఏర్పరచుకొని లోకం వెలుగు చూడని అనేక అమూల్య గ్రంథాలను ప్రచురించ గలిగాను. ఈ గ్రంథాలకు వ్రాసిన అనేక ఆంగ్లాంధ్ర పీఠికలు విడిగా ప్రచురిస్తే రెండు మూడు సంపుటాలుగా ప్రచురణకు అవకాశం ఉంటుంది. 1991లో ఆచార్య సి.నారాయణరెడ్డిగారి అధ్యక్షతన నా షష్టిపూర్తి ఉత్సవం జరిగింది. ఆ సభలోనే నాకు "సాహిత్య బ్రహ్మ' అనే బిరుదం కూడా ప్రసాదించబడింది. కృతజ్ఞతతో స్వీకరించాను.

ప్రభుత్వోద్యోగంలో పదవీ విరమణ చేసిన తరువాత తెలుగు విశ్వవిద్యాలయంలో ఆచార్య తూమాటి దొణప్పగారు ఉపాధ్యక్షులుగా ఉన్న సమయంలో ప్రచురణాధికారిగా

చేరి అనేక ఆంధ్ర సంస్కృత గ్రంథాలు పునర్ముద్రణ చేసే పనిని సంతృప్తిగా నెరవేర్చగలిగాను. నూతన గ్రంథముద్రణ కూడా నా పీఠికలతో ముద్రింపజేసే అవకాశం లభించింది. కొన్నాళ్లు విజ్ఞాన సర్వస్వ సంపుటాలకు సంకలనకర్తగా కూడా పనిచేసి, తెలుగు ఇంగ్లీషు వ్యాసాలు సంతృప్తిగా వ్రాసే అవకాశం కూడా పొందాను. ఆచార్య సి. నారాయణరెడ్డి గారి హయాములో కూడా కొన్ని నెలలు పనిచేశాను. తరువాత అంటే 1992-1993 లోBanking Service Recruitment Board (BSRB) Panel chairman గా పనిచేయవలసి వచ్చింది. దీనిని కూడా సంతృప్తికరంగా నిర్వహించగలిగాను.

తరువాత 1994 నుండి 1999 ఫిబ్రవరి మాసం వరకు కేంద్రప్రభుత్వ విద్యాశాఖలో నేషనల్ ఓపెన్ స్కూల్ - రీజినల్ డైరెక్టరుగా ఆంధ్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు, పాండిచ్చేరి లక్షద్వీప్ ప్రాంతాలకు జాతీయ సార్వత్రిక విద్యావ్యాప్తికి అవిరళంగా కృషిచేశాను. నిర్విరామంగా ఈ పని సాగిస్తూనే అనేక సాహిత్య సభలకు నా సేవలు అందిస్తూ ఉండేవాణ్ణి.

ఈ కాలంలో 'School Education' శాఖలో తెలుగు పాఠ్యగ్రంథాల రచనా సంపాదకత్వ బాధ్యత వహిస్తూ ఎన్నో పాఠ్యగ్రంథాలకు ప్రభుత్వపు ఉత్తరువుల ననుసరించి సంపాదకత్వ బాధ్యత వహించాను.

నా స్వతంత్ర రచనల్లో విమర్శవ్యాసాలు, నాటికలూ, నాటకాలూ మొదలైనవే కాకుండా గేయాలూ, వచనకవితలూ అనేకం ఉన్నాయి. నాటకాలలో సందర్భవశంగా వ్రాసిన గేయాలు, స్వతంత్ర గేయాలూ ఉన్నాయి. నాటకాలలో “ధర్మవీరులు” అనే నాటకంలో కొన్ని గేయాలున్నాయి. ధర్మవీరులు నాటకం నక్సలైట్ ఉద్యమాన్ని దృష్టిలో ఉంచుకొని వ్రాశాను. దీనికి నగ్నమునిగారు మంచి పీఠికకూడా వ్రాశారు. టి.వి. కోసం వ్రాసినవీ, రంగస్థల ప్రదర్శన కోసం వ్రాసినవీ అయిన 'సమ్రాట్ శాతవాహన' అనే నాటకం, 'కుతుబ్‌షాహి దర్బార్' అనే నాటకం (400 సం॥ క్రిందట భాగ్యనగర చరిత్ర) ఎడనెడ గేయాలతో కూడా నడుస్తాయి.

'సమ్రాట్ శాతవాహన'లో ఆటవికులైన ప్రాకృత దంపతులు పరస్పర ప్రేమతో పాడుకొనేపాట ఉంది: పెండ్లాం అంటుంది సంగీతం పాడిగిస్తూ - మగనితో

“దొంగనిద్దుర చాలు లేవయ్యా! నా ముద్దులంటినచాలు నీ మేనుమేనంతా
గరిపొడిచి పులకించి గగురుపాటౌను; పాటకాదది గగుర్పాటయ్యా మగడా!”

'కుతుబ్‌షాహి దర్బార్'లో – గజల్ బాణీలో – ప్రియుడు ప్రేయసితో –

''భాగమతి భాగమతి ఓసి నా భాగ్య నక్షత్రమా!
రాగవతి రాగవతి ఓసి అనురాగ నిక్షేపమా!
ఇంక రమ్మని నన్ను ఎద కరుగ పిలువవే, ప్రేమ ఒకటి తప్ప ప్రాణాలు మిగలవే,
ఎంత ఎత్తైనదో ఈ ప్రేమ సౌధమ్ము? ఎన్ని అంతస్తులో ఎవరెక్కగలరు?''

ఇట్లా సాగుతుంది. ఈ నాటకం రవీంద్రభారతిలో నా దర్శకత్వంలోనే ప్రదర్శితమైంది. ఇందులో మాన్యులు శ్రీ ఉత్పల సత్యనారాయణాచార్య గారు, డా॥ ఉండేల మాలకొండారెడ్డిగారు, శ్రీ డి. మురళీ కృష్ణగారు, డా॥ జె. బాపురెడ్డిగారు, శ్రీ ఓలేటి పార్వతీశంగారు మొదలైన పలువురు ప్రసిద్ధులు నటులుగా పాల్గొన్నారు. నేనూ ఒక పాత్ర (కందుకూరి రుద్రకవి) ధరించాను. ఇది ఢిల్లీ నుండి దూరదర్శన్ నేషనల్ ప్రోగ్రాములో ప్రదర్శితమైంది. ఆకాశవాణి హైదరాబాద్ నుండి కూడా ప్రసారమైంది.

స్వతంత్ర గేయాల్లో – మచ్చు కొకటి:

“ముద్దబంతిపూవులాగ మురిసిమురిసి ఊరేగిపో
ఆనందం ఆపలేని అంబుధివలె పొంగిపో”

ఇట్లా సుదీర్ఘంగా సాగుతుంది సంగీత తరంగాలు లేపుకుంటూ, ఈ గేయం.

ఇక వచనకవితకు ఒకటి రెండు ఉదాహరణలు:

'కాళ్లు తెగిన ధర్మదేవత' అనే కవిత ఉంది. ఇది ఆంధ్రప్రభవార పత్రికలో ముద్రితం–

“నిప్పులు గక్కే ఎండలో నీడకోసం వచ్చి వచ్చి
కాలసర్పం పడగ కింద కన్ను మూసింది కప్ప పిల్ల–
చేనునే మేసిన కంచె చిట్టడవిలా బలిసింది
కంచుకోటలా నిలిచిన మంచె పంటకాపును బలిగొన్నది –
పులినీడలో మేకనీ – సింహం నోట్లో లేడినీ పడుకోబెట్టి
సర్కస్ ఎరీనాలో ఒంటి తీగపై కుంటి కామాక్షి వింత ఫీట్సు చేస్తోంది –
ఇంతకీ ఎవరా కామాక్షి?... ఇంకెవరు?...
నాలుగు పాదాలలో మూడు పాదాలు దారుణంగా తెగగొట్ట బడ్డ
దీనురాలు – ధర్మదేవత – కాళ్లు తెగిన ధర్మదేవత”

పరిస్థితుల్నిబట్టి ఆత్మాభిమానం చంపుకొని బ్రతుకు తెరువు చూచుకుంటున్నాడు ఆధునిక దరిద్రుడు. ఈ రకమైన జీవి ఎట్లా ఉన్నాడంటే –

"బతకనేర్చినవాడు దూదూ బసవన్న । నేడు
తిరగబడ్డవాడి బతుకు తిరుక్షౌరమేరా తండ్రీ!"

అన్నట్లున్నాడు.

సెక్సును నిషేధిస్తున్నట్లే కనిపిస్తూ – దాని ద్వారానే సొమ్ముచేసుకునే చిత్ర ప్రదర్శనను విమర్శిస్తూ –

"మానభంగం నేరమని నిరూపించేందుకు
అరడజన్ మానభంగాలు వరసగా తెరమీద చూపించటం
అల్ట్రా మోడరన్ టెక్నిక్..."

అనక తప్పలేదు.

ఇక ఆడపిల్లల పెళ్లి తంతు ఎంత చెప్పినా తీరదు. అదీ ప్రస్తావించాను కొన్ని కవితల్లో–

"మెళ్లో మూడుముళ్లూ పడలేదని దిగులుకంటే
పడిన పీటముళ్ళ మారాముల్ల భయం పెద్దది
అల్లుడు దొరకలేదన్న ఆరాటంకంటే –
దొరికి నల్లుడి దండయాత్ర భయం దొడ్డది."

ఒకప్రక్క ఇటువంటి వచన కవితలు సాగిస్తూనే ఉద్యోగధర్మంగా అనేక ఆంగ్ల రచనలు చెయ్యవలసి రావటం కూడా ఒక అదృష్టంగా భావించాను. నేను ఆంధ్రప్రదేశ్ ప్రాచ్యలిఖిత గ్రంథాలయం పరిశోధనాలయం డైరెక్టరుగా పనిచేసే రోజుల్లో (1981–88) ఆంధ్రసంస్కృత – ఉర్దూ, పారశీక అరబ్బీ భాషల్లోని అనేకమైన వ్రాతప్రతులను పరిష్కరణ చేయించి, వాటికి సంస్థడైరెక్టరుగా పీఠికలు వ్రాయవలసిన సందర్భాల్లో ప్రపంచంలోని బహులిఖిత గ్రంథాలయాలకు ఉపకరించేటట్లు గ్రంథాలయాలనుండి వచ్చిన అభ్యర్థనలను పురస్కరించుకొని ఈ నిర్ణయానికి రావలసి వచ్చింది. కొన్ని వందల వ్రాత ప్రతుల గ్రంథాలకు ఈ దృష్టితో ఆంగ్లంలోనే పరిచయ పీఠికలు వ్రాశాను.

ఉదయనోదయం, వనమాలి విలాసం, తారక బ్రహ్మరాజీయం, ఆర్షకుటుంబం, కవి చింతామణి, యోగ సక్తా పరిణయం, భార్గవ పురాణం, "ముస్తలాహత్–ఇ–థగ్గి"

కోడ్ లాంగ్వేజి నిఘంటువు, 'నాస్కెట్ పురాణ్' అనే (నచికేతోపాఖ్యానానికి ఉర్దూ అనువాదం) ఉర్దూగ్రంథం, 'ఖుతూబ్-ఇ-మీర్ ఆలమ్' అనే పారశీక గ్రంథం, ఇంకా 'అల్-నజ్మీర్ దురార్-వల్- మర్జాన్' అనే అరబ్బీ గ్రంథం- వీటి అన్నిటికీ ఆంగ్ల పీఠికలు వ్రాశాను.

ఇవి కాక కేంద్ర సాహిత్య అకాడమీ కోరికపై 'చిలకమర్తి లక్ష్మీనరసింహం' అనే ఇంగ్లీషు మోనోగ్రాఫ్, దాని తెనుగుసేత - ఇంకా "స్వామి శ్రీ వీరబ్రహ్మేంద్ర" అనే ఇంగ్లీషు మోనోగ్రాఫ్ వ్రాశాను.

1992లో నన్ను శ్రీ వీరబ్రహ్మేంద్ర మఠం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరభోగవసంత వేంకటేశ్వర స్వాములవారు - మఠం (కందిమల్లాయపల్లె - కడపజిల్లా) ఆస్థాన కవిగా నియోగించారు. వీరబ్రహ్మేంద్రుల రచనలను సావధానంగా పరిశీలించి ప్రచురించే బృహత్కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కలిగింది. వీరబ్రహ్మేంద్రస్వామి తత్వగీతాలను గోవింద పదాలను, కాలజ్ఞాన సూక్తులను పునర్ముద్రించే కార్యక్రమంలో పూర్తిగా నిమగ్నుణ్ణి కాగలిగాను. బ్రహ్మేంద్రుని కాళీమకుట కందాలకు యోగరంజనీవ్యాఖ్య, కాలజ్ఞాన పరిష్కరణ, పీఠికా రచన మొదలైనవి ఆత్మానందంతో చెయ్యగలిగాను. కాలజ్ఞానం టీ.వీ. సీరియల్‌కు స్క్రిప్టు, సంభాషణ కూడా వ్రాశాను. ఇది అందరికీ తెలిసిన విషయమే.

బ్రహ్మంగారి మఠం ఆస్థానకవిగా నాకంటే ముందు కళాప్రపూర్ణ డా॥ కొండవీటి వెంకటకవిగారు ఉండేవారు. బ్రహ్మంగారి పద్యకృతి అయిన "కాళికాయీ సప్తశతి" ని పరిష్కరించి అవసరమైన లఘుటిప్పణి కూడా వ్రాసి గ్రంథాన్ని మఠం ప్రచురణగా విడుదల చేయించాను. ఆ గ్రంథానికి నేనుకూడా పీఠిక వ్రాశాను. ఆచార్య సి.నారాయణరెడ్డిగారు కూడా పరిచయ వాక్యాలు వ్రాశారు. బ్రహ్మంగారి రచనయే అయిన "వీరకాళికాయీ శతక"మనే 470 పద్యాలుకల రచన ఒకటి తిరుపతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయం (శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోనిది) నుండి సంపాదించి పరిష్కరించి దానిని "కాలజ్ఞాన సుధ" అనే మాసపత్రిక (ఒంగోలు అచలానందాశ్రమం-ప్రచురణ)లో భావార్థ సహితంగా ప్రచురిస్తున్నాను. ఈ ప్రచురణకు కందిమల్లయ్యపల్లి బ్రహ్మంగారి మఠాధిపతుల అనుమతి కూడా తీసుకోవటం జరిగింది.

బ్రహ్మంగారి జీవితం గూర్చి ఇంగ్లీషులో నేను వ్రాసిన "Swami Sree Veerabrahmendra" దేశ విదేశాల్లో వ్యాప్తిచెంది స్వామి జీవిత విశేషాలు అంతటా తెలిసే అవకాశం కలిగింది.

నా ఆంగ్లరచనల్లో డా॥ భరద్వాజ 'జీవన సమరం'లోని "అన్నమోరామచంద్రా" మొదలైన వ్యాసాలను "Oh God! Give me A Loaf of Bread" మొదలైన శీర్షికలతో ప్రచురించటం జరిగింది. భరద్వాజగారి ఈ రచనలను గూర్చి, "కొండ అద్దమందు" అనే పేరుతో ఆచార్య సి.నారాయణరెడ్డిగారి కవితను 'The Mountain in the Mirror' అనే శీర్షికతో ఆంగ్లంలోకి నేనూ, శ్రీ సి.ఎన్. బాబుగారు కలిసి అనువదించాం. ఇంకా శ్రీ దీవి సుబ్బారావుగారి 'వాన' అనే కవితను 'The Rain' అనే పేరుతో రచించి 'Indian Express' లో ప్రచురించటం జరిగింది. ఇవి కాక కళాప్రపూర్ణ డా॥ కొండూరి వీర రాఘవాచార్యులుగారి "Rigveda Digdarshana" అనే గ్రంథానికి విపుల ఆంగ్లపీఠిక వ్రాశాను. "Honouring an honest Biographer" అనే శీర్షికతో శ్రీ త్రిపురనేని సుబ్బారావుగారిని గూర్చి పత్రికలో ప్రచురించం జరిగింది. ఇంతేకాక National Book Trust వారి "Masterpieces of Indian literature" గ్రంథంలో కళాపూర్ణోదయం గురించి సుదీర్ఘమైన ఆంగ్లవ్యాసం వ్రాశాను. తెలుగు విశ్వవిద్యాలయంవారి విజ్ఞాన సర్వస్వం ఆంగ్ల సంపుటంలో శ్రీనాథయుగం గూర్చి కూడా బృహద్వ్యాసం వ్రాయటం జరిగింది.

తెలుగు విశ్వవిద్యాలయంవారు 1992లో - నా "విద్యారణ్య వీక్షణం" అనే నాటకానికి ఆ సంవత్సరపు ఉత్తమ నాటకంగా బహుమతి ఇవ్వటం జరిగింది. ఈ నాటకం ఆకాశవాణిలో గంట నాటకంగా కూడా అంతకుముందు సమర్థులైన నటులచే ప్రదర్శితమైంది.

ఇప్పటికీ నిత్యరచనావ్యాసంగం మానుకోకుండా యథాశక్తి కృషిచేస్తున్నాను. సుప్రసిద్ధులైన కవిపండితులతో అనేక సందర్భాలలో భువన విజయాలు, వైకుంఠ సాహితీ సభలు, కైలాస సాహితీ సభలు, భారతంపై తీర్పు మొదలైన అనేక సాహితీ రూపకాల్లో వివిధ పాత్రలు ధరించి అటు కవిత, ఇటు నటన - రెండు విధాలైన సంతృప్తినీ సంతరించుకోగలుగుతున్నాను.

ఎల్లకాలం ఆరోగ్యం ఒక తీరుగా ఉండదు గదా! కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖలో దక్షిణభారత ప్రాంతీయ సంచాలకుడుగా 1995-99 వరకు పనిచేస్తున్న కాలంలో సుదీర్ఘ సంచారం చేయవలసి వచ్చేది. అయినా సంతృప్తి కరంగా విధ్యుక్త ధర్మ నిర్వహణం యథావిధిగా కొనసాగించగలిగాను. 1996లో అమెరికాలోని ATA వారి ఆహ్వానాన్ని పురస్కరించుకొని మాన్యమిత్రులు శ్రీ కనుమలూరి వెంకటశివయ్యగారి ఆధ్వర్యంలో శ్రీ మొవ్వ వృషాద్రిపతిగారితో కలిసి హ్యూస్టన్ నగరంలో తెలుగు సభలలో "భారతంపై తీర్పు" అనే సాహితీరూపకంలో కౌరవపక్ష న్యాయవాదిగా అభినయించటం జరిగింది. ఇదొక

అపూర్వమైన అనుభవం. ఈ అనుభవం శ్రీ శివయ్యగారు ప్రసాదించిందేనని అనుకుంటూ ఉంటాను. "కృతమెఱుగుట పుణ్యము" గదా!

1988లో ఒకసారి, 1999లో ఒకసారి తీవ్ర అనారోగ్యం పాలై కొంత నిస్పృహకు లోనైన స్థితి కూడా ఏర్పడింది. ఆ సమయంలో ప్రేమాదరాలు, భక్తి శ్రద్ధలు కలిగిన వైద్య శిఖామణులు నాకు వైద్యం చేసి నన్ను స్వస్థుణ్ణి చేశారు. వీరిలో డా|| గోపాలకృష్ణగారు, డా|| కల్పనగారు, డా|| అమరవాది ప్రభాకరాచారిగారు ముఖ్యంగా చెప్పుకోదగినవారు. వీరు కవులు, కళాకారులు కూడా. ఈ అనారోగ్య సమయంలో కూడా నా రచనా వ్యాసంగాన్ని వీరు ప్రోత్సహిస్తూనే ఉండేవారు. ఈ ధైర్యంతోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయ పరిశోధనాలయ శాఖకు, Departmental Manual, Functionary Manual అనే రెండు ప్రామాణిక నిబంధనావళికి సంబంధించిన బృహత్సంపుటాలను ఆంగ్లంలో వ్రాసి ఇవ్వగలిగాను.

2000 మార్చి నెల నుండి 'MAC INFO' అనే ఒక సమర్థమైన సాఫ్ట్‌వేర్ కంపెనీలో Language professional గా బాధ్యతగల ఉద్యోగం నిర్వహిస్తున్నాను. ఇది కూడా భాషకు సంబంధించినదే కనుక నా భాషావ్యాసంగానికీ, సాంకేతిక పరిశోధనకూ సంబంధించి – ఎంతో పురోగమనం సాధించే అవకాశం గలిగింది.

తెనుగునాట – ఇంకా రాష్ట్రేతర – దేశాంతర ప్రదేశాలనేకం చుట్టి వచ్చి ఎన్నో సాహిత్య విషయాలకి వేలకొలది ప్రసంగాలు శ్రోతృజనానందకరంగా చేయగలిగాను. వందలకొలది సాహిత్యాదిగ్రంథాలకు ప్రామాణికమైన పీఠికలు వ్రాయగలిగాను – ఇటు తెలుగులో అటు ఇంగ్లీషులో అనేకానేక సాహిత్య పీఠాల ఆదరాభిమానాలు చూరగొని సన్మానాలు అందుకొన్నాను.

అనేక సాహిత్య సంపుటాలకు వ్యాసరచయితగానే కాక సంపాదకుడుగా నా సేవలు అందించగలిగాను. జాషువా స్మారక సంపుటి, త్రిపురనేని స్మారక సంపుటి, భారత వికాస పరిషత్ సంపుటి, విశ్వబ్రాహ్మణ ధర్మపీఠ రజతోత్సవ సంపుటి మొదలైన ఎన్నో సంపుటాలకు నా సేవలు అందించగలిగాను.

ఇప్పటికీ అముద్రితంగా పడివున్న నా రచనలు – అయిదు బృహత్ సంపుటాలకు సరిపడ ఉన్నాయి. కాలం కలిసివస్తే వీటిని ముద్రించగలననుకొంటున్నాను.

వీటి అన్నిటికీ మించి కవి - రచయిత - సాహిత్య జీవి అయినవాడికి సాంస్కృతికమైన, సాంఘికమైన ఒక పెద్ద బాధ్యత ఉందని బలంగా నమ్మేవారిలో నేనూ ఒకణ్ణి. ఆ నమ్మకంతోనే ఇంకా అనేక సాహిత్య రచనలు, ప్రసంగాలు కొనసాగిస్తూనే ఉన్నాను.

సంఘంలోనే కాక కుటుంబంలో కూడా స్త్రీకి పురుషుడితో సమాన ప్రతిపత్తి మాత్రమేకాక మానవీయమైన స్థానం ఉండాలని భావించేవారిలో నేనూ ఒకణ్ణి. నా రచనలు ఈ ఆదర్శానికి స్వచ్ఛమైన ఆదర్శాలు (దర్పణాలు) కావాలని నేటికీ కృషి చేస్తున్నాను.

కవి గతించినా, కవిత గతించకుండా ఉండేట్లు రచన సాగించాలి. రచయిత కన్ను మూసినా, రచనలు లోకం కన్ను తెరిపించేవిగా ఉండాలి. దీనికి కవి, రచయితలు స్వయంగా శీలవంతులు, ఆదర్శవంతులు కావాలి. కవి రచయితలంటే కవయిత్రులు రచయిత్రులు అనే అర్థం అంతర్భూతమే.

ఈ వేళ నా చేత ఈ పరిణతవాణిని పలికించిన ఆంధ్రసారస్వత పరిషత్ కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు.

సభకు అధ్యక్షత వహించిన మాన్యులు ఆచార్య సి. నారాయణరెడ్డిగారికి, ప్రధాన కార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారికి, తదితర కార్యకర్తలకు మరొకమారు ధన్యవాదాలు.

చివరగా ఒక్కమాట "డా.వి.వి.యల్. సాహిత్య ప్రస్థానం" అనే విషయంపై విశిష్ట కళాకారుడు అధ్యాపకుడు అయిన శ్రీ టి.వి. భాస్కరాచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆచార్య ఎస్.వి.రామారావుగారి పర్యవేక్షణలో పరిశోధనచేసి డాక్టర్ డిగ్రీ పొందారు. గ్రంథముద్రణ కూడా పూర్తయి ప్రతులు సిద్ధంగా ఉన్నవి. ఈ సందర్భంలో ఈ విషయాన్ని తమ దృష్టికి తేవటం సముచితమనిపించింది.

ఇక నా పరిణతవాణి ప్రసంగాన్ని విరమిస్తాను. సెలవు.



డా॥ తుర్లపాటి కుటుంబరావు

ఆంధ్ర సారస్వత పరిషత్తు ఒక మహాసంస్థ. ఆనాటి నిరంకుశ హైదరాబాదు ప్రభుత్వం తెలుగు భాషను అణచివేస్తున్న దశలో ఆరు దశాబ్దాలకు పూర్వం ఆవిర్భవించి, పరిషత్తు తెలుగు భాషాసంస్కృతులను పరిరక్షించి సాగిస్తున్న ప్రస్థానం తెలంగాణ చరిత్రలో ప్రముఖస్థానం వహించింది. శ్రీ లోకనంది శంకర నారాయణరావు, శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, డా॥ బూర్గుల రామకృష్ణారావు వంటి మహనీయులెందరో ఈ సంస్థ స్థాపనలో విశేష పాత్ర వహించారు. డా॥ దేవులపల్లి రామానుజరావుగారు దీని అభివృద్ధికి అవిశ్రాంతంగా శ్రమించారు. ప్రస్తుత అధ్యక్షులు మహాకవి, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత "పద్మభూషణ్" డా॥ సి. నారాయణరెడ్డిగారి నేతృత్వంలో పరిషత్తు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు పండిత వర్గం నుంచి, జనసామాన్యులనుంచి ప్రశంసలందుకుంటున్నాయి.

డా॥ నారాయణరెడ్డిగారు రూపకల్పన చేసిన 'పరిణతవాణి' ప్రసంగ పరంపర చాలా విలక్షణమైంది. నన్ను ప్రసంగకర్తగా ఆహ్వానించడం పత్రికారంగంపట్ల డా॥ నారాయణరెడ్డిగారికివున్న అభిమానానికి తార్కాణం. మౌలికంగా నేను పత్రికారచయితను. పరిషత్తు ప్రధానకార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారు తమ స్వాగత వచనాలలో 'పరిణతవాణి' పరిధిని తెలియజేశారు. నా గురించి నాలుగు మంచి మాటలు చెప్పారు. అధ్యక్షోపన్యాసంలో డా॥ నారాయణరెడ్డిగారు ఈ కార్యక్రమం ప్రత్యేకత వివరిస్తూ, ఇది ఒక విధంగా లఘు ఆత్మకథారూపంలో వుంటుంది కాబట్టి నా జీవిత విశేషాలను, పత్రికారంగం, తదితర రంగాలలో నా సేవను, సాహిత్యకృషిని నన్నే చెప్పమని సూచించారు.

పరిషత్తు వారుపంపిన 'పరిణతవాణి' నాలుగు సంపుటాలు చదివాను. అగ్రశ్రేణి సాహితీ మూర్తుల ప్రసంగాలు స్ఫూర్తిదాయకాలుగా వున్నాయి. ప్రేక్షకుల్లో ఎందరో పండితులు, ప్రముఖులు, పరిషత్తు రెండు కళాశాలలకు చెందిన విద్యార్థులు కనుపిస్తున్నారు. నా అనుభూతులు పంచుకోవడం నా కెంతో ఆనందాన్నిస్తోంది.

తెలుగు పాఠకలోకం నన్ను ప్రధానంగా 'వార్తల్లోని వ్యక్తి' రచయితగా, తెలుగు ప్రజలు వక్తగా సమాదరిస్తున్నారు. ఆరుదశాబ్దాలకు పైగా నా రచనా వ్యాసంగాన్ని నిరవధికంగా కొనసాగిస్తున్నాను. ఒకసారి గతంలోకి వెళ్ళి కొన్ని ముఖ్యఘట్టాలు మీముందుంచే ప్రయత్నం చేస్తాను.

నేను పుట్టింది కృష్ణాజిల్లా, విజయవాడ నగరంలో 1933 ఆగస్టు 10వ తేదీన. నా విద్యాభ్యాసమంతా ఆ జిల్లాలోనే సాగింది.

అమ్మానాన్నలు

మా అమ్మగారి పుట్టిల్లు విజయవాడ కావడం వల్ల నేను విజయవాడలో జన్మించాను. కాని, నాన్నగారి స్వస్థలం కృష్ణాజిల్లా పామర్రు. అక్కడికి ఎన్.టి.రామారావు గారి స్వస్థలం నిమ్మకూరు నాలుగు మైళ్ళు. అక్కినేని నాగేశ్వరరావుగారి స్వగ్రామం వెంకటరాఘవాపురం (గుడివాడవద్ద) దాదాపు పదిమైళ్లు.

నాన్నగారు సుందర రామానుజరావుగారు లాయర్. పెద్ద గొంతు, మంచి వాగ్ధాటి. లాయర్‌గా రాణించడానికి అవి అవసరమే. బహుశా నాకు కూడా ఆయన గొంతే వచ్చి వుంటుంది. అమ్మ పేరు శేషమాంబ. ఆమె కవితలు రాసేది. తెలుగువారి ఇష్టదైవం శ్రీ వేంకటేశ్వరస్వామిపట్ల ప్రగాఢ భక్తి. ఆ ఏడుకొండల స్వామిపై ఆమె సినీగీతాల బాణిలో చాలా కీర్తనలు రాసి, వాటిని తిరుపతి వెళ్లినప్పుడు ఆ స్వామివారికి సమర్పించిన మహాభక్తురాలు.

మాది ప్రారంభంలో సంపన్నకుటుంబమైనా, 1930 దశకంలో వచ్చిన ఆర్థిక మాంద్యంలో బాగా దెబ్బతిన్నది. అందువల్ల, మా బాల్యంలో ఆర్థిక బాధలు ఎదుర్కొనక తప్పలేదు.

నా చదువు పామర్రు, గన్నవరం, విజయవాడలలో సాగింది. దాదాపు 10, 12 సంవత్సరాల వయస్సులో పెద్దవారు కాణీ, అర్ధణా యిస్తే, చిరుతిండి కొనుక్కోకుండా ఆ డబ్బుతో లైబ్రరీలో పుస్తకాలు అద్దెకు తీసుకుని చదివేవాడిని. విద్యాసంస్థలలో చదివిన

చదువుకంటె ఆ పుస్తకపఠనమే నా జీవితాన్ని తీర్చిదిద్దిందని నా నమ్మకం. అప్పటిలో కొవ్వలి లక్ష్మీనరసింహారావుగారి సాంఘిక నవలలు, అపరాధ పరిశోధక నవలలు ఎక్కువగా చదివేవాడిని. అంతేకాక, మహామహుల జీవిత చరిత్రల పఠనంపట్ల కూడా ఆసక్తి చూపించేవాడిని. వారిలోని కొన్ని ఉత్తమగుణగణాలను నేను కూడా అలవరచుకుని, వారంతకాకపోయినా కొంతయినా కావాలని అనుకునేవాడిని. ఆ ప్రభావం నాపై చాలావరకు ప్రసరించిందని చెప్పవచ్చు.

చిన్ననాటి ముచ్చట్లు

ఒకసారి హైస్కూల్లో "క్లాస్‌మానిటర్" "పోస్టు"కు ఎన్నిక జరిగింది. కాజ జనార్దనరావు అనే విద్యార్థికి, నాకు పోటీ. మా క్లాసులోవున్న 12 మంది విద్యార్థినులు నాకే ఓటు వేశారు. వారి ఓట్లవలననే నేను గెలిచాను. అప్పటినుంచి నాకు ఆడపిల్లలన్నా, పెద్దయిన తరువాత స్త్రీలన్నా సానుభూతి, గౌరవం. పెళ్లి అయిన సంవత్సరంవరకు నా సతీమణిని "ఏమండీ!" అని పిలిచేవాడిని. పెద్దవారు నన్ను మందలిస్తే అలా పిలవడం మానివేశాను కాని భార్యను "ఏమే", "ఒసే" అని పిలిచే పద్ధతికి స్వస్తి చెప్పాను. నేను అలా చేసేసరికి ఆ తరువాత అది చాలావరకు మా కుటుంబాలలో తక్కినవారికి మార్గదర్శకమైంది.

అలాగే నాకు చాలా చిన్నవయసులో మా నాన్నగారు గతించారు. భర్త పోయిన భార్యకు శిరోముండనం చేయించడం అప్పటిలో నేను జన్మించిన సామాజిక వర్గంలో ఆచారం. అది నేను తీవ్రంగా వ్యతిరేకించాను. అప్పటికి నా వయస్సు 17 సంవత్సరాలే. అమ్మగారికి శిరోముండనం చేయిస్తే ఇంటిలో నుంచే వెళ్లిపోతానన్నాను. దానితో పెద్దవారు తలవొగ్గారు. ఆ తరువాత మా కుటుంబాలలో కూడా ఆ పద్ధతిని మార్చివేశారు.

ఆ విద్యార్థి దశలోనే జరిగిన మరో సంఘటన ప్రభావం నా జీవితంపై గట్టిగానే పడింది. అప్పట్లో స్కూళ్లు, కాలేజీలలో డిబేటింగ్ సొసైటీలుండేవి. వాటిలో వివిధ సమస్యలపై విద్యార్థులు రెండు వర్గాలుగా ఏర్పడి, చర్చలు జరిపేవారు. చర్చ సందర్భంలో నాకు వ్యతిరేకంగా వాదించిన స్వరూపరాణి అనే విద్యార్థినిపై నేను చేసిన వ్యాఖ్యకు ఆమె కన్నీరు కార్చింది. ఆమె కన్నీళ్లు చూడగానే నేను తప్పు చేశానని ఎంతో బాధపడ్డాను. ఆ రోజు రాత్రి నాకు నిద్రపట్టలేదు. కన్నీరు కారుస్తున్న ఆమె వదనమే నాకు పదే పదే జ్ఞాపకం రావడంతో ఇక ఎప్పుడూ ఎవ్వరినీ నేనుగా నొప్పించకూడదని నాలోనేనే శపథం చేసుకున్నాను. మరునాడు క్లాసుకు వెళ్లగానే నేను ఆమెకు క్షమాపణ చెప్పాను. ఆ సున్నిత మనస్తత్వమే నన్ను ఇప్పటికీ నడిపిస్తున్నది!

రచనపట్ల, ప్రసంగాలపట్ల నాకు ఆసక్తి చిన్ననాటనే కలిగింది. ప్రముఖుల ప్రసంగాలు విన్నప్పుడు పరవశించిపోయేవాణ్ణి. వాళ్ళమాదిరి వక్తగా ఎదగాలని కాంక్షించేవాణ్ణి. ఒక విధంగా నా రచనా వ్యాసంగం, ప్రసంగ పరంపర సమాంతరంగా సాగాయని చెప్పవచ్చు. విద్యార్థి దశలోనే నా తొలి రచన ప్రచురణ అయింది. ఆ వ్యాసం 1947 మార్చిలో "మాతృభూమి" అనే పత్రికలో వచ్చింది. అప్పటికి నా వయస్సు 14 సంవత్సరాలు.

ఇక పత్రికలపై మక్కువ పెంచుకోవడానికి దారితీసిన పరిస్థితుల్ని స్థూలంగా చెప్పాలి. టైఫాయిడ్ జ్వరం వచ్చి మంచంపట్టాను. ఇప్పటి మాదిరి ఆనాడు వ్యాధిని వెంటనే తగ్గించే మందులు రాలేదు. అందులో టైఫాయిడ్ అంటే ఇంట్లోని వాళ్ళు, వైద్యులు ఎన్నో ఆంక్షలు పెట్టేవారు. ఆరు మాసాలపాటు మంచంపైనే విశ్రాంతి తీసుకోమన్నారు. పగలంతా ఎలా గడపాలి? అదో పెద్ద సమస్య! అప్పట్లో 'ఆంధ్రప్రభ' దినపత్రిక చెన్నైనుంచి వచ్చేది. నార్ల వెంకటేశ్వరరావుగారు సంపాదకులు. ఆ పత్రికను ప్రతిరోజూ ఆద్యంతం ఒక్క అక్షరం వదలకుండా చదివేవాణ్ణి. నార్ల సంపాదకీయాలు నన్ను విశేషంగా ప్రభావితుణ్ణి చేశాయి. ఆయన శైలి, విషయసమగ్రత, విశ్లేషణ నన్ను ఆకట్టుకునేవి. అలా నేను నార్లవారికి ఏకలవ్య శిష్యుణ్ణి అయ్యాను. పత్రికారంగం వైపు ఆకర్షితుణ్నయ్యాను.

14 సంవత్సరాల వయస్సులోనే పత్రికారంగంలో ప్రవేశించడం నాకే ఆశ్చర్యం కలిగింది. 1952లో 'ప్రతిభ' అనే వారపత్రికకు చలసాని రామారావుతో కలిసి, సంపాదకుడిగా పనిచేశాను. కృష్ణాజిల్లా ప్రముఖ నాయకుడుగా పేరుగాంచిన డా॥ టి.వి.ఎస్. చలపతిరావుగారు గొప్పరాజకీయవేత్త కూడా. ఆయన నా గురించి తెలుసుకుని తమ వారపత్రిక 'ప్రజాసేవ'కు నన్ను సంపాదకుడిగా నియమించారు. వ్యాసం నా కలంనుంచి శక్తిమంతంగా వెలువడేది. బాల్యంనుంచి వ్యాసప్రక్రియ నన్ను బాగా ఆకట్టుకుంది. నాదైన బాణీని ఏర్పరచుకోవడంచేత నా రచనలు అప్పటికే పెద్దల దృష్టికి వెళ్ళాయి.

"ఆంధ్రకేసరి" ప్రభావం

ఇప్పటికీ తుర్లపాటి పేరు చెబితే టంగుటూరి వారు, టంగుటూరి పేరు చెబితే తుర్లపాటి కుటుంబరావు గుర్తుకు రావడం సహజం. దీనికి కారణం లేకపోలేదు. నాకు "ఆంధ్రకేసరి" టంగుటూరి ప్రకాశంగారంటే చాలా అభిమానం. ఆయనపైన అప్పటికే ఎక్కువ వ్యాసాలు రాశాను. అవన్నీ రాజకీయ నేపథ్యం వున్న వ్యాసాలే. భావోద్వేగంతో

నిండివుండేవి. నాకు పుస్తకాలు విపరీతంగా చదివే అలవాటు. ఏ విషయం గురించైనా సమగ్రంగా అధ్యయనం చేయడం, విశ్లేషించి, సూటిగా జంకులేకుండా అవసరమైతే నిశితంగా రాయడం నా నైజం. అందుకే నా వ్యాసాలు పరిమాణంలో చిన్నవైనా, విషయసమగ్రత నింపుకుంటాయి. దాపరికం వాటిలో వుండదు. నా వ్యాసాలను గురించి ప్రకాశంగారు తెలుసుకున్నారు. నాకోసం కబురు చేశారట. కాని ఆ వర్తమానం నాకు చేరలేదు.

ప్రకాశంగారు, సి. రాజగోపాలాచారిగారు గొప్ప నాయకులు, దేశభక్తులు. అయితే వారి మధ్య భేదాభిప్రాయాలు పొడసూపాయి. ప్రకాశంగారి ఆధ్వర్యంలో నడిచే "ప్రజాపత్రిక"లో శ్రీ రాజగోపాలాచారిగారి వైఖరిపై విమర్శలు గుప్పిస్తుండేవారు. ఆ పత్రికకు సమర్థుడైన సహాయ సంపాదకుడికోసం అన్వేషిస్తున్నారు. ఆ దశలో నా గురించిన వివరాలు ఆయనకు చేరాయి.

గొప్పనాయకులు నా వ్యాసాలను గుర్తించి అభిమానించడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆచార్య డా॥ ఎన్.జి. రంగాగారి పత్రిక 'వాహిని'లో పనిచేసే అవకాశం లభించింది. ప్రకాశంగారిని నేను కలవకపోవడంతో ఆయన "తుర్లపాటి ఎక్కడున్నా వెంటనే వచ్చి 'ప్రజాపత్రిక'లో సహాయ సంపాదకుడిగా చేరాలి" అని శాసించినట్టు డా॥ టి.వి.ఎస్. చలపతిరావుగారికి ఆదేశం పంపారు. నాకది అందింది. వెంటనే వెళ్ళి ఆ పత్రికలో చేరాను. నిజంగా ఆనాటి జ్ఞాపకాలు తలపుకు వచ్చి మధురానుభూతుల్ని కలుగజేస్తున్నాయి. ఇది 1953 నాటి సంగతి.

నేను ప్రకాశంగారి కార్యదర్శిగా 9 నెలలపాటు పనిచేశాను. ఒకవైపు పత్రిక సహాయ సంపాదకత్వం, మరోవైపు కార్యదర్శి బాధ్యతలు ద్విముఖంగా ఏక కాలంలో సాగేవి. పత్రికారంగంలో నా ప్రస్థానం వేగంగా సాగుతోంది. నా రచనలు పెద్దలకు నచ్చడం నిజంగానే పురోగమనానికి దోహదం చేసిన ముఖ్యాంశం. రచనను కేవలం కాలక్షేపంగా నేనెన్నడూ భావించలేదు. సమాజాభివృద్ధికి, జాతిఔన్నత్యానికి, సామాన్యులు సైతం విజ్ఞానాన్ని అలవరచుకునేందుకు తోడ్పడే అంశాలనే నా రచనకు వస్తువుగా స్వీకరించాను. ఇది నా ప్రసంగాలకు కూడా వర్తిస్తుంది.

చలన చిత్రరంగానికి సేవలు

పత్రికారంగంతోపాటు చలనచిత్రాలు, కళలపై కూడా ఉత్తమాభిరుచి పెంచుకున్నాను. ఆ దిశగా కూడా నా రచనలు సాగాయి. ముఖ్యంగా చలన చిత్రాలలో

అశ్లీల సంభాషణలు, మితిమీరిన హింస, అసభ్య సన్నివేశాలపై నా పోరాటం అందరి మన్ననలందుకుంది. ఆంధ్రప్రదేశ్ ఫిలింఫాన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శిగా నా కృషి చలన చిత్రరంగంనుంచి ప్రశంసలు పొందింది. దీనికి డా॥ బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షులు. ప్రముఖ నర్తకి కృష్ణ కుమారితో నా వివాహం జరిగింది.

1960లో నార్లవెంకటేశ్వరరావుగారు విజయవాడ నుంచి వెలువడే 'ఆంధ్రజ్యోతి' సంపాదక బాధ్యతలు చేపట్టారు. నా రచనలు, పత్రికారంగంలో నా అనుభవం దృష్ట్యా ఆ పత్రికకి నన్ను ఆహ్వానించారు. ఆ పత్రికలో చేరినరోజు నా మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఇందుకు రెండు కారణాలు. నేనెంతో గౌరవించే నార్లవారి వద్ద పనిచేసే మహదవకాశం రావడం మొదటి కారణం. రెండోది పత్రికలో చేరిన 1960 మే 21న మా కుమార్తె జననం. 'ఆంధ్రజ్యోతి' పత్రికపై వున్న మక్కువతో మా అమ్మాయికి 'ప్రేమజ్యోతి' అని పేరు పెట్టాను. ఇంతకాలం నార్లవారికి ఏకలవ్య శిష్యుడిగా వుంటున్న నేను ఇప్పుడు ప్రత్యక్ష అనుచరుడిగా సంపాదక వర్గంలో చేరడం గొప్ప ఆనందానుభూతి కలిగించింది. నార్లవారు నాపై చూపిన అభిమానం, వుంచిన విశ్వాసం నేనెన్నటికీ మరువను. 'ఆంధ్రజ్యోతి' పత్రిక కార్యాలయంలో ఎవరికైనా యేదైనా సమాచారం కావలసివస్తే 'కుటుంబరావు వున్నాడుగా, ఆయన్ని అడగండి' అని చెప్పేవారు. ఆ స్థానం సంపాదించుకోవడం నా అదృష్టమని చెప్పక తప్పదు.

ప్రముఖుల సంగ్రహ జీవిత చరిత్ర రచనలో కొత్త ఒరవడి పెట్టడంతో నాకు ప్రజలలో ఎంతో ఖ్యాతిలభించింది. సభలకు ప్రసంగ కర్తగా అనేక సంస్థలు ఆహ్వానించసాగాయి. ఇంతవరకు 4,000కు పైగా జీవిత చరిత్రలు రచించాను. 12,000 పైబడి బహిరంగం సభలలో ప్రసంగించాను. నా ప్రసంగాలకుగాను 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో నాకు స్థానం లభించింది.

చలన చిత్రరంగంపట్ల నాకున్న అభిరుచిని పురస్కరించుకొని 'చిత్రజ్యోతి' బాధ్యతలు కూడా కొన్ని నాకు అప్పగించారు. పనిలో వైవిధ్యం నాకు మరింత ఉత్సాహాన్ని కలిగించింది. పాత్రికేయుడిగా, వక్తగా, గ్రంథకర్తగా ప్రజల ఆదరణ త్వరలోనే పొందగలిగాను. 'ఆంధ్రకేసరి జీవితంలో కొన్ని అద్భుతఘట్టాలు', 'జాతక కథలు', 'లాల్‌బహదూర్‌శాస్త్రి', 'జాతినిర్మాతలు', 'వార్తల్లోని వ్యక్తులు', 'మహానాయకులు', 'ఆంధ్రకేసరి', 'విప్లవవీరులు', 'ఉపన్యాసకళ', 'తెన్నేటి విశ్వనాథం', 'మహనీయుల జీవితాలు', 'వందేమాతరం' మొదలైన గ్రంథాలను పాఠకులు, సాహిత్యలోకం స్వాగతించింది. పరిశోధనంటే నాకు మొదటినుంచి ప్రత్యేకాభిరుచి. ఒక ఉదాహరణ

చెబుతాను. ఝాన్సీలక్ష్మీబాయి పుట్టిన నవంబరు 19నే శ్రీమతి ఇందిరాగాంధీ జన్మించిన సత్యాన్ని నేను ఒక లేఖద్వారా ఇందిరాగాంధీకి తెలియపరచినప్పుడు ఆమె నాకు కృతజ్ఞతలు చెబుతూ జవాబు రాశారు. ఆమె సంస్కారం అలాంటిది. ఇక్కడో విషయం ప్రస్తావించాలి. నాకు పండిట్ నెహ్రూ కుటుంబం పట్ల అపారమైన అభిమానం. నేను తరచు నెహ్రూకు, ఇందిరాగాంధీకి 31 మే 1951 నుంచి ఉత్తరాలు రాస్తుండేవాణ్ణి. వాటికి వెంటనే సమాధానాలు వచ్చేవి. నా కుమారుడికి 'జవహర్‌లాల్ నెహ్రూ' అని పేరు పెట్టాను. ఒక పర్యాయం రాజీవ్‌గాంధీ విజయవాడ వచ్చారు. వారి తల్లిగారితోనూ, తాతగారితోనూ నాకున్న పరిచయం గురించి తెలుసుకున్నారట. నాకు కబురుపంపారు. వెళ్ళి కలిసినప్పుడు ఆత్మీయంగా పలకరించి అభినందించారు.

ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఉపన్యాసాలే కాకుండా జగ్జీవన్‌రామ్, మొరార్జీదేశాయ్ వంటి జాతీయ నాయకులెందరివో ఉపన్యాసాలను తెలుగులో అప్పటికప్పుడు అనువదించే అరుదైన అవకాశాలు నాకు లభించాయి.

చలనచిత్రరంగంపట్ల నాకున్న అభిరుచి కారణంగా ప్రభుత్వం నన్ను ఏడుపర్యాయాలు నందిఫిలిం అవార్డు సంఘంలో సభ్యునిగా నియమించింది. అంతేకాదు ఫిలిం సబ్సిడీ సంఘం సభ్యునిగా కూడా నన్ను నియమించింది. 'ఫిలిం ఫాన్' పత్రికకు సంపాదక బాధ్యతలు వహించాను. కేంద్ర సెన్సార్‌బోర్డు, నేషనల్ ఫిలిం అవార్డుల కమిటీ, చిల్డ్రన్ ఫిలిం కమిటీలో సభ్యునిగా సేవలందించాను. కేంద్రప్రభుత్వం "ఆంధ్రకేసరి" టంగుటూరి ప్రకాశంపై నిర్మించిన డాక్యుమెంటరీ ఫిలింకు సంబంధించి నన్ను ప్రాజెక్టు సలహాదారుగా నియమించారు. "ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం శతజయంత్యుత్సవ సంఘం"లో, తమిళనాడులోని "భారతీదాసన్ విశ్వవిద్యాలయ ప్రణాళికా మండలి" సభ్యునిగా వ్యవహరించాను.

ఈ అంశాలు ప్రేక్షకుల్లో వున్న విద్యార్థులకు స్ఫూర్తిదాయకాలుగా వుంటాయని ప్రస్తావిస్తున్నాను. వాస్తవానికి ఈ జాబితా ఇంకా చాలావుంది. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘసభ్యునిగా, అంతర్జాతీయ తెలుగు సంస్థ పాలకమండలి సభ్యునిగా నా సేవలు అందరిమన్ననలకు పాత్రమయ్యాయి. నేను అధికారభాషా సంఘసభ్యునిగా వున్న సమయంలో సంఘకార్యదర్శిగా వ్యవహరించిన నా బాల్యమిత్రుడు శ్రీ గోవిందరాజు రామకృష్ణరావు ఈ సభలో వుండడం నాకు సంతోషం కలిగిస్తోంది.

నేను ప్రత్యక్ష రాజకీయాల్లో లేకపోయినా జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో ప్రముఖ రాజకీయ నాయకులతో నాకు సన్నిహిత పరిచయం ఏర్పడడం నా అదృష్టమని

భావిస్తున్నాను. టంగుటూరి ప్రకాశం, నీలం సంజీవరెడ్డి, ఎన్.జి. రంగా, భోగరాజు పట్టాభిసీతారామయ్య, మర్రిచెన్నారెడ్డి, గొట్టిపాటి బ్రహ్మయ్య, మండలి వెంకటకృష్ణారావు, కళా వెంకట్రావు, తెన్నేటి విశ్వనాథం, బెజవాడ గోపాలరెడ్డి ప్రభృతులు నాపట్ల ఎంతో ఆదరాభిమానాలు చూపేవారు. వారందరి స్ఫూర్తితో నాకు సేవారంగంపైన ప్రత్యేకాభిమానం పెరిగింది. పత్రికారంగం, బహిరంగసభలు, చిత్రపరిశ్రమ, గ్రంథరచనతో పాటు ప్రజాహిత కార్యక్రమాలలో పాల్గొనేవాణ్ణి.

ఈ సేవానిరతితోనే ఆనందం పొందేవాణ్ణి. జీవితంపట్ల నాకొక విలక్షణ దృక్పథం వుంది. అదేమంటే జీవితంలో ప్రతిఘటనా నేను ఉన్నత స్థానానికి ఎదగటానికి దోహదపడేదే అని భావిస్తానే తప్ప, అవి నాకు కలిగిన కష్టాలుగా, సమస్యలుగా ఎన్నడూ అన్వయించుకోలేదు. అసలు అలాంటి ఆలోచనే నా మనస్సులోకి రాదు కూడా. జీవితాన్ని సకారాత్మక దృష్టితో చూసే అలవాటు నాది. ఇరవై అయిదు సంవత్సరాల వరకు నేను ప్రజాహిత కార్యక్రమాలను గురించి పత్రికా రచన గురించి మాత్రమే ఆలోచించాను.

ప్రేమ వివాహం

ఇక్కడ ఒక సత్యం చెప్పాలి. ఎందుకంటే డా॥ నారాయణరెడ్డి గారు నా జీవితంలోని ముఖ్యఘట్టాలు కూడా చెప్పాలని ఆదేశించారు. బహుముఖీనంగా సాగుతున్న వ్యాపకాల మధ్య పెళ్ళికి ఆమడదూరంగా వుంటూ, ఇన్ని పనులమధ్య వైవాహిక జీవితంలో అడుగుపెట్టే ఆలోచనే లేదు. అసలు గృహస్థు అయ్యే తలపే లేదు. అయితే ఒక సన్నివేశం నన్ను వివాహబంధంలోకి దింపింది. ఈ సందర్భంలో దాన్నిసంగ్రహంగా తెలియజెప్పాలి. అది 1959వ సంవత్సరం. కోల్‌కతలో వున్న ఆంధ్ర సంఘంవారు ప్రముఖపాత్రికేయుడిగా నన్ను సత్కరిస్తామని ఆహ్వానించారు. ఇంకా ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు కూడా సన్మాన్యులుగా ఆహ్వానాలందుకున్నారు. ఆ సంఘానికి శ్రీ పర్వతనేని ఉపేంద్ర అధ్యక్షులుగా వున్నారు. నాట్యకళాకారిణి కృష్ణకుమారి కూడా సత్కారం పొందినవారిలో ఒకరు. నాతో సన్నిహిత పరిచయమున్న ఉపేంద్ర అక్కడ ఒక సూచన చేశారు. 'సాంస్కృతిక రంగంలో నాట్యకళారాణి అయిన కృష్ణకుమారి, సాహిత్య పరంగానే కాక ప్రజల పక్షంగా కలంరాతలో సేవలందిస్తున్న కుటుంబరావు వివాహం చేసుకుంటే వారి యింట పదరవళి, పాళీఝరి రెండూ మమేకమై ప్రకాశిస్తాయి'. ఇదీ వారి సలహా. నిండు హృదయంతో, అభిమానంతో పలికిన హితవు. అంతవరకు నాకు వివాహోద్దేశమేలేదు. ముందుగా కృష్ణకుమారి స్పందించింది. నాలుగు గంటల వ్యవధిలో ఆమె నా బసకు వచ్చి "ఉపేంద్ర చేసిన

సూచన" పైన అభిప్రాయం అడిగింది. నేను నిర్ఘాంతపోయాను! ఆమె ప్రసిద్ధ నర్తకి. నిక్కచ్చిగా, ముక్కుసూటిగా అడిగినతీరు, ఆమె వ్యక్తిత్వం నాకు బాగా నచ్చాయి. హృదయపూర్వకంగా అంగీకరించాను. మా వివాహం 1959 జూన్ 12న జరిగింది. వివాహం తర్వాత కూడా ఆమె నృత్యకార్యక్రమాలను ప్రోత్సహించాను. ఆమె నా వివిధ వ్యాపకాలను నిండు మనస్సుతో ప్రోత్సహించింది.

రెండు దశాబ్దాల మా వైవాహిక జీవితం ఆకస్మికంగా ముగిసింది. 1979లో ఆమె పరమపదించింది. అలా శాశ్వతంగా వెళ్ళిపోయేటప్పుడు నాతో ప్రతిజ్ఞ చేయించింది. నేను నిర్వహిస్తున్న అన్ని కార్యకలాపాలు యథాపూర్వంగా కొనసాగాలని ఆమె ప్రగాఢవాంఛ. ఒంటరితనంతో కుంగి పోవద్దని, లక్షలాది అభిమానులు, ప్రజాకోటి వెంటవున్నారని ధైర్య వచనాలు పలికి, నాలో నూతన సంకల్పానికి బీజవాపం చేసిందామె.


అందుకే నేను ఏడు దశాబ్దాలు దాటిన వయస్సులో కూడా వివిధ కార్యక్రమాలు నిర్వహించగలుగుతున్నాను. 'ఆంధ్రజ్యోతి' పత్రిక సంపాదక వర్గంనుంచి పదవీ విరమణ చేసినప్పటికీ నా రచనలో, నా పనుల్లో విరామంలేదు. ఈ గమనం ఇదే వేగంలో సాగాలని నా ఆకాంక్ష. వివిధ రంగాలకు నా సేవలను ప్రోత్సహిస్తూ అభినందిస్తూ ప్రభుత్వాలు, సంస్థలు నన్ను సత్కరించాయి, అవార్డులు ప్రదానం చేశాయి. సదస్యుల్లో నా ముందు ఎందరో పండితులు, మేధావులు, ప్రముఖులు కనుపిస్తున్నారు. అందుచేత ఆ పురస్కారాలను గురించి ప్రస్తావించడం స్వోత్కర్షగా వుంటుందేమోనని సందేహిస్తున్నాను. అయితే, పరిణతవాణి ప్రసంగంలో వక్త సాధించిన విజయాలను గురించి కూడా చెప్పాలని నిర్వాహకులు సూచించడం చేత నాకు లభించిన గౌరవాలతో కొన్నింటిని స్థాలీపులాకంగా పేర్కొంటున్నాను. ఇది నా వ్యక్తిగత ఘనవిజయంగా కంటే నేను చేపట్టిన వివిధ కార్యక్రమాల ఔన్నత్యంగా పరిగణిస్తున్నాను.

పాత్రికేయుడుగా రాష్ట్రంనుంచి తొలి "పద్మశ్రీ" గౌరవం భారత ప్రభుత్వంనుంచి అందుకున్నాను. ఆంధ్రవిశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు ప్రదానంచేసింది. డాక్టర్ శంకర్ దయాళ్‌శర్మ రాష్ట్రగవర్నరుగా వున్న కాలంలో ఆయన చేతుల మీదుగా పాత్రికేయుడిగా స్వర్ణపతకం అందుకున్నాను. వక్తగా నా ప్రసంగాలను, రచయితగా నా వ్యాసాలను అభినందిస్తూ ప్రముఖ సాహిత్య సాంస్కృతిక సంస్థలు నాకు 'ఉపన్యాస కేసరి', 'వ్యాసవిద్యావిశారద', 'కళాసరస్వతి', 'ఉపన్యాస సమ్రాట్', 'రమ్యరచనా ప్రవీణ' మొదలైన బిరుదులు ప్రదానం చేశాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నన్ను సాంస్కృతిక వ్యవహారాల గౌరవ ప్రసంగకర్తగా నియమించింది. ఉత్తమ సంపాదకునిగా నాకు ముట్నూరి కృష్ణారావు

అవార్డు లభించింది. పత్రికారంగం, కళలు, సంస్కృతి, సాహిత్య రంగాలకు నా కృషికి గుర్తింపుగా నాటి భారత ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావుగారు 'నేషనల్ సిటిజన్ అవార్డు' ప్రదానం చేశారు. అమెరికన్ బయోగ్రాఫికల్ ఇన్‌స్టిట్యూట్ వారు నాకు 'వరల్డ్ లైఫ్ టైమ్ ఎఛీవ్‌మెంట్ అవార్డు' ఇచ్చారు. కేంబ్రిడ్జిలోవున్న 'ఇంటర్నేషనల్ బయోగ్రాఫికల్ సెంటర్' వారు నన్ను గౌరవ సలహాదారుగా నియమించారు. తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారంతో నన్ను సత్కరించింది. విజయవాడలో నేను నివసిస్తున్న వీథికి నా గౌరవార్థం 'డాక్టర్ తుర్లపాటి కుటుంబరావు వీథి'గా నగరపాలక సంస్థ నామకరణం చేసింది.

ఉదాహరణ ప్రాయంగా చెప్పిన ఈ గౌరవాలు, పురస్కారాలు, బిరుదులు అన్నీ నేను ఎంచుకున్న రంగాల్లో నా కృషిని కొనసాగించాలని చేసిన ఆదేశాలుగా పరిగణిస్తున్నాను. నా బాధ్యతలు ఇనుమడించినట్లుగా భావిస్తున్నాను. నా లక్ష్యం వివిధ రంగాలకు సేవా కార్యక్రమాలను కొనసాగించాలని. ఇందుకు ప్రజల ఆదరాభిమానాలు, మీ వంటి పెద్దల ఆశీస్సులు లభిస్తాయని విశ్వసిస్తున్నాను.

ఈ 'పరిణతవాణి' కార్యక్రమంలో నా కృషిని మీ ముందుంచే మహత్తర అవకాశం కలిగించిన పరిషత్తు అధ్యక్షులు డా॥ సి. నారాయణరెడ్డిగారికి, తదితర కార్యవర్గ ప్రముఖులకు, నా ప్రసంగం విన్న విజ్ఞులైన ప్రేక్షక మహాశయులకు ధన్యవాదాలు.



ఆచార్య పేర్వారం జగన్నాథం

నా స్వగ్రామం వరంగల్లు జిల్లా జనగామ తాలూకాలోని ఖిలాషాపురం. అది సర్దార్ సర్వాయి పాపారాయుడు విజృంభించి అటు మొగలు పాదుషాలనూ, ఇటు గోల్కొండ నవాబులనూ గడగడలాడించిన వీరభూమి. మాది దిగువ మధ్య తరగతి రైతు కుటుంబం. నా తల్లి పేరు సయ్యమ్మ, తండ్రి పేరు సంతాజి. కొన్ని శతాబ్దాల క్రితం మహారాష్ట్ర నుండి తెలంగాణాకు వలస వచ్చిన మరాఠీలం మేము. మమ్మల్ని తెలంగాణంలో ఆరెవాల్లంటారు. ఆరెవాళ్లు తమ ఇండ్లల్లో మాట్లాడేది ఆరె భాష. అది మరాఠీకి వికృతి. కడప దాటితే మాట్లాడేది మాత్రం అచ్చమైన తెలాంగాణ యాసతో కూడిన తెలుగుబాస. ఆరెవాళ్లు శాకాహారులు. నేను నా తల్లిదండ్రులకు ఎనిమిదవ సంతానంగా 23 ఆగస్టు 1934 నాడు జన్మించాను. మొదటి సంతానమైన అగ్రజ, నేనూ తప్ప మధ్యలో ఆరుగురు పుట్టిన వెంటనే చనిపోయారు. నేను పుట్టిన ఐదారు సంవత్సరాలకు నా తల్లి గతించింది. మా నాయనగారు వీరమ్మను ద్వితీయ వివాహమాడినాడు. నాకు ఆరేడు సంవత్సరాల వయస్సున్నప్పుడు పోలియో సోకి కుడికాలు బలహీనపడింది. కుటుంబంలో అందరూ నన్ను అతి గారాబంగా పెంచినారు. మా నాయనమ్మ బుచ్చమ్మ వద్ద నాకు గారాబమెక్కువ. మొత్తానికి ఏ కష్టాలూ లేకుండా ప్రేమానురాగాల మధ్య పెరిగినాను.

మా ఊరు సర్ఫేఖాస్. అంటే మా ఊరి ఆదాయమంతా నిజాం సొంత ఖర్చులకోసం జమ అయ్యేదన్నమాట. లింగాల వెంకట రంగారెడ్డి గారు మా ఊరి దేశముఖ్. వారి వద్ద మా నాయనగారు గుమస్తా పోలీసు పటేలుగా సుమారు 40 సంవత్సరాలు పనిచేశాడు. మా ఊర్లో సాంస్కృతిక, ఆధ్యాత్మిక వాతావరణ మెక్కువగా ఉండేది. గ్రామాధికారులు తరచూ హరికథలూ, పురాణ కాలక్షేపాలు చెప్పించేవారు. శ్రీ వేంకటేశ్వరాలయంలో

ఎప్పుడూ ఏవేవో ఆధ్యాత్మిక భక్తి కార్యక్రమాలు జరుగుతూ ఉండేవి. అప్పుడప్పుడు సురభి నాటక సమాజాలవాళ్లు వచ్చి పౌరాణిక నాటకాల్ని ప్రదర్శించేవాళ్లు. జానపద కళాకారులు భాగోతాలాడేవాళ్లు.

తాడూరు లక్ష్మయ్య పంతులుగారు నాకు అక్షరాభ్యాసం చేసిన తొలి గురువు. నాకు సుమారు 11 సంవత్సరాలు వచ్చేదాకా గ్రామంలో ఖాన్గీ బళ్లల్లోనే చదివినాను. కొద్ది కాలం ధర్మ బడిలో చదివినాను. ఆనాటి అవసరాల నిమిత్తం ఖాన్గీ బళ్లల్లో బొట్లెర్సు, గిద్దెలర్సు నేర్చుకున్నాను. అమరం, ఆంధ్రనామసంగ్రహం, సుమతి శతకం, నరసింహ శతకం వంటి కొన్ని శతకాలూ కంఠస్థం చేయించినారు. మా నాయనగారు శ్రీ వైష్ణవ సంప్రదాయానికి చెందినవారు కనుక ప్రత్యేకంగా శ్రీ కృష్ణాష్టకం, గోదాచతుశ్లోకి, ముకుందమాల, ఆళ్వందారుస్తోత్రం వంటి శ్రీ వైష్ణవ స్తోత్రాలు కంఠస్థం చేయించినారు. వీటి వల్ల నాకు భాషపై మంచి పట్టు ఏర్పడింది. అప్పుడప్పుడు మా నాయనగారు భారత, భాగవత గ్రంథాల్లోనుంచి పద్యాలు చదివించేవారు. రాత్రిళ్లు ఆముదం దీపం ముందు కూర్చోబెట్టి పురాణ గాథల్ని రక్తి కట్టేట్లు చెప్పేవారు. ఇంతకూ మా నాయనగారిది శ్రుత పాండిత్యం. నాకు హనుమంతుని సాహసకృత్యాలన్నా, అర్జునుని వీరగాథలన్నా బాగా నచ్చేవి. ఇవన్నీ నాలో ఒక విధమైన సాహిత్య సంస్కారానికి బీజావాపన చేసినాయని భావిస్తాను.

రజాకార్ల దుండగాల కారణంగా జనగామలోని ఆంధ్రభాషాభివర్ధని పాఠశాలలో ఆరవ తరగతిలో ఉన్న మా ఊరివాళ్లమంతా చదువులు మానేసి మా స్వగ్రామం చేరుకున్నాం. రెండేండ్లు ఏ చదువూ సంధ్యలు లేక ఊర్లో ఆటపాటలతో గడిపినాను. ఈ సమయంలో తెలంగాణా రైతాంగ సాయుధపోరాటం ఉద్ధృతంగా సాగింది. ఆ క్రమంలో కమ్యూనిస్టు దళాలు మా ఊరికి వచ్చి "తెలుగు తల్లి బిడ్డలం, తెలంగాణ వీరులం" అంటూ పాట పాడుతూ ఊరేగింపు చేసేవాళ్లు. పిదప గ్రామ చావిడీ మీద నిలబడి బాగా పాడగలిగిన కొందరు కామ్రేడ్లు "ఖబర్దార్ ఖబర్దార్ నైజాం పాదుషాహే", "గద్దె దిగరా నైజాం రాజా వద్దోరీపోరా", "ప్రజలు పడెడు బాధ చూచి ఓర్వలేక పంతులయ్య పనికి స్వస్తి చెప్పొచ్చావు". వంటి పాటలు కొన్ని పాడి తదుపరి ఉపన్యాసాలిచ్చేవాళ్లు. ఆ పాటలకు ఆకర్షితుణ్ణై పాడినవాళ్లవద్దకు వెళ్లి పాటల్ని రాసుకొని కంఠస్థం చేసి పాడుకుంటూ ఉండేవాణ్ణి. ఈ ఉద్యమ గేయాలు తదనంతర కాలంలో నేను సామాజిక ప్రగతి మార్గంలో రచనలు చేయడానికి ప్రేరణ కలిగించాయని భావిస్తుంటాను. పైన ఉదాహరించిన గేయాల్లో "తెలుగుతల్లి బిడ్డలం" అనే దాన్ని కొండేపూడి లక్ష్మీనారాయణ, 'ఖబర్దార్

ఖబర్దార్' అనే గేయాన్ని ఆవంత్స సోమసుందర్, 'గద్దెదిగరా నైజాం రాజా' అనే గేయాన్ని వట్టికొండ రామకోటయ్య గారలు రచించారన్న సంగతి తరువాత చాలా కాలానికి తెలియవచ్చింది. ఇక "ప్రజలు పడెడు బాధ చూచి ఓర్వలేక" అన్న గేయాన్ని ఎవరు రచించారో తెలియదుకానీ అది కరుణరసాత్మకమైంది. నాకు జనగామలో పాఠాలు చెప్పిన పంతులయ్య గాన్లుపాటి నారాయణ రెడ్డి గారిని పట్ట పగలు రజాకార్లు సోలీపురం గ్రామంలో కాల్చి చంపినారు. ఆయన స్మృత్యర్థం ఒక అజ్ఞాత కవి రచించిన గేయమది. ఐతే కొన్ని ఉర్దూ పత్రికలప్పుడు రావి నారాయణ రెడ్డి గారినే కాల్చి చంపినట్లు ప్రచారం చేసినాయి. పోలీసు యాక్షన్ పిదప 1949లో మా ఊరికి చెందిన చొల్లేటి నృసింహశర్మ గారు దేవరుప్పుల గ్రామంలో ప్రప్రథమంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు పరీక్షల కేంద్రాన్ని నెలకొల్పి తరగతులు నిర్విహించేవాడు. ఈయన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయునిగా ఉంటూ ఉచితంగా ఈ తరగతుల్ని నిర్వహించేవాడు. మా ఊరి వాళ్లం కొంతమంది కలిసి దేవరుప్పులకు వెళ్లి పరీక్ష ఫీజులు కట్టి ఆ కేంద్రంలో చేరినాము. ఒక అద్దె ఇంట్లో వండుకుంటూ ఉత్తమ పరీక్షలకు తయార్థవుతూ ఉండేవాళ్లం. ఐతే ఆ తిండి నచ్చక ఎవరికి చెప్పాపెట్టకుండా అక్కడి నుండి పారిపోయి మా ఊరికి వచ్చినాను. పిదప మళ్లీ జనగామకు వెళ్లి అదే ఆంధ్ర భాషాభివర్ధనీ పాఠశాలలో ఏడవ తరగతిలో చేరినాను. అప్పటిదాకా ఉన్న ఉర్దూ మీడియం పోయి, తెలుగు మీడియం వచ్చింది. ఇప్పుడు సుప్రసిద్ధ పరిశోధకులుగా ఉన్న డా॥ పి.వి.పరబ్రహ్మశాస్త్రి, సుప్రసిద్ధ విద్యావేత్త డా॥ చుక్కా రామయ్యగారలు అప్పుడు ఆ పాఠశాలలో నాకు పాఠాలు చెప్పిన గురువర్యులు. అక్కడి నుంచి ఉన్నత విద్యాభ్యాసం దిశగా నా జాతకం మారింది.

నేను హనుమకొండలోని ప్రభుత్వ కాలేజియేట్ హైస్కూలులో చదువుతున్నప్పుడు విద్వాన్ తెన్నేటి సుబ్బారావుగారు మాకు కమ్మని కంఠంతో పద్యాలు పాడుతూ మూడు సంవత్సరాలు తెలుగు బోధించినారు. అప్పుడు కొన్ని చారిత్రక నవలలూ చదివినాను. అవి నాలో ఉత్తేజాన్నీ, దేశభక్తినీ రగుల్కొలిపేవి. పాఠశాలలో జరిగే వ్యాసరచన పోటీల్లో తెలుగులోనూ, హిందీలోనూ నాకు బహుమతులు వచ్చేవి. ఇవన్నీ నాకు తెలుగు సాహిత్యంపై ఆసక్తి పెరుగడానికి కారణమైనాయనుకుంటాను. వరంగల్లు ఇంటర్మీడియేట్ కళాశాలలో చదువుతున్నప్పుడు కళాశాల వార్షిక సంచిక సంపాదకుని ఎంపిక కోసం జరిగిన వ్యాసరచన పోటీలో నాకు రెండవస్థానం దక్కింది. ఐతే వ్యాసంలో వ్యావహారిక భాషను వాడినందున నాకు మొదటి స్థానం దక్కలేదని మా గురువర్యులు శిరోమణి శ్రీ చెలమచర్ల రంగాచార్యులు గారు మా క్లాసులోనే ప్రకటించినారు. నేను రెండవస్థానంలో నిలువడం కూడా నా కానందంగానే ఉండింది. ఇంటర్మీడియేట్‌లో వారే మాకు ఛందస్సు నేర్పినారు.

ఆ మార్గంలో కొన్ని పద్యాలు కూడ రాయడం ప్రారంభించినాను. నాకు మల్లంపల్లి సోమశేఖరశర్మ, పానుగంటి లక్ష్మీనరసింహారావు గారల వ్యాస రచనల శైలి బాగా నచ్చేది. వాటిలోని భాష, భావం నాకిష్టంగా ఉండేది. ఆ శైలిలో వ్యాసాలు రాస్తే కళాశాల వార్షిక సంచికలో అచ్చైనాయి. ఈ కళాశాలలో నాకు సంస్కృతం బోధించిన ఆచార్య ప్రమోద్ గణేశ్‌లాలె గారు కూడా నన్ను బాగా ప్రోత్సహించేవారు. ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరంలో ఉన్నప్పుడు కొన్ని ముఖ్యమైన సంఘటనలు జరిగినాయి.

అప్పటి "తెలుగు దేశం" పత్రికా సంపాదకురాలైన సూర్యదేవర రాజ్యలక్ష్మీ దేవి గారెందుకో ఒకసారి మా కళాశాలకు వచ్చినారు. మా ప్రిన్సిపాలు బి.వి. రామనర్సు గారిని కలిసి వెళ్లిపోతూ కళాశాల ఆవరణలో గుమిగూడి ఉన్న కొందరు మా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఏవైనా రచనలు పంపితే తమ పత్రికలో ప్రచురిస్తానని తెలిపినారు. అది మాకెంతో ప్రోత్సాహం కలిగించింది. దాన్ని అవకాశంగా తీసుకొని నేను నా కవితల్ని పంపించేవాణ్ణి. అవి క్రమంగా అచ్చయ్యేవి. ఇట్లా మొట్టమొదటిసారిగా పత్రికాముఖంగా నా రచనలు అచ్చైంది ఈ "తెలుగుదేశం" పత్రికలోనే. అప్పుడప్పుడు నేను కొన్ని వార్తలు కూడ పంపిస్తే పెద్ద అక్షరాలతో అవి ప్రకటింపబడుతుండేవి. ఇదే క్రమంలో మా ఊర్లో ఒక ఉపాధ్యాయుని అత్యాచార వార్తను ఇదే పత్రికలో ప్రకటిస్తే అప్పుడొక దుమారం చెలరేగింది. ఆ పత్రికలోనే ఉపాధ్యాయ సంఘ నాయకునికీ, నాకూ వాదోపవాదాలు కొంతకాలం సాగినాయి.

ఐదవ తరగతో లేక ఆరవ తరగతో చదువుతుండిన నా సోదరుడు రాములుకు మా నాయనగారు మేనరికం అమ్మాయితో బాల్య వివాహం చేయ నిశ్చయించినాడు. దీన్ని నేను గట్టిగా ప్రతిఘటించినాను. బంధువులతో వాదించి తగాదా పెట్టుకున్నాను. వాళ్లెవరూ నా మాటలు వినలేదు. కరీంనగర్ జిల్లాలోని మేనమామల ఊరు ముత్తారం గ్రామంలో వివాహం చేయడానికి ముహూర్తం పెట్టినారు. రెండు రోజుల్లో వివాహం జరుగబోతున్నది. చేసేది లేక చివరికి శారదాచట్టం ప్రకారం బాల్య వివాహాన్ని ఆపించవలసిందిగా కోరుతూ నేను జనగామ మునిసిఫ్ కోర్టు నాశ్రయించినాను. వివాహాన్ని ఆపివేయవలసిందిగా ఆజ్ఞాపిస్తూ కోర్టు నుండి ఇంజెంక్షన్ ఆర్డర్ మా నాయనగారికందింది. వివాహం ఆగిపోయింది. ఆ తరువాత ఆ అమ్మాయిని మరొకరికిచ్చి వివాహం చేసినారు. ఈ కోర్టు వ్యవహారంలో అప్పుడు యువ న్యాయవాదిగా ఉన్న కమాలొద్దీన్ గారు నాకు సహాయపడినారు. నాకొకపైస ఖర్చుకాలేదు. ఇప్పటికీ నేనెక్కడైనా కనిపిస్తే కమాలొద్దీన్ గారు నన్ను తన క్లయింట్‌గా మిత్రులకు పరిచయం చేస్తుంటారు. వీరు తరువాత కేంద్ర

మంత్రిగానూ పని చేసినారు. ఐతే బంధువులంతా నన్ను నిందించినారు. ఒక విధంగా నేను ఏకాకినైనాను. అప్పటి నా మానసిక స్థితిని వర్ణిస్తూ-

"ఆప్తులందరిబాసి అంధకారములోన
వెలుగు జాడలులేక ఏకాకినైపోతి
భయముతో నా ఒళ్లు వణికిపోతుంటేను
పెనుగాలి వీచింది దుమ్మెత్తిపోసింది"

అంటూ ఒక గేయం రచించి "తెలుగు దేశం" పత్రికకు పంపిస్తే అది అచ్చైంది. అట్లాగని నాకు మా నాయనగారితో ఏ విధమైన వైముఖ్యం లేదు. సరికదా నన్ను చిన్నప్పటినుండి అతిగారాబంగా పెంచి అప్పుల పాలై నన్ను చదివించినాడు.

ఈ కాలంలోనే పోతన జన్మించిన బమ్మెర గ్రామం(ఈ గ్రామం వరంగల్లు నుండి సుమారు 50 కి॥మీ.ల దూరంలో ఉంటుంది)లో ఓ రెండు రోజులు మహావైభవంగా పోతన ఉత్సవాలు జరిగినాయి. నేనూ నా సహాధ్యాయి కోవెల సుప్రసన్నాచార్య కలిసి బమ్మెరకు వెళ్లి రెండు రోజులూ ఆ సభల్ని తిలకించినాము. ఆ సభలకు నాకు తెలిసినంతవరకు చెలమచర్ల రంగాచార్యులు, పల్లా దుర్గయ్య వంటి పండితులూ, పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు, దూపాటి వెంకట రమణాచార్యులు, ఆదిరాజు వీరభద్రరావు వంటి చరిత్ర పరిశోధకులూ, సి.నా.రె వంటి సుప్రసిద్ధకవులెందరో వచ్చినారు. రెండవ రోజు మహాశివరాత్రి అయింది. ఆనాడు చెలమచర్ల రంగాచార్యులు గారి అధ్యక్షతన తెల్లగ తెల్లవార్లు కవి సమ్మేళనం జరిగింది. అంటే శివరాత్రి జాగరణ అన్నమాట. అందులో సి.నా.రె గారు తన కమ్మని కంఠంతో అప్పుడప్పుడే రచించిన "అజంతాసుందరి" కావ్యాన్ని పాడి వినిపించినారు. సభాసదుల కరతాళ ధ్వనులు మిన్నుముట్టినాయి. నేనూ నా గేయమొకదాన్ని చదువగా గురువర్యులు చెలమచర్ల రంగాచార్యులు గారు నా బుజం తట్టి మెచ్చుకున్నారు.

మా కళాశాల విద్యార్థులు కొందరం కలిసి "సాహితీ బంధు బృందం" అనే సంస్థను స్థాపించినాము. 'ప్రజాకవి' కాళోజీ నారాయణరావుగారు అధ్యక్షత వహించగా, కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు సంస్థను ప్రారంభించినారు. ఈ సంస్థకు కోవెల సుప్రసన్నాచార్యులు అధ్యక్షులుగానూ, నేను ఉపాధ్యక్షునిగానూ, ఏ. లక్ష్మణరావు కార్యదర్శిగానూ ఉంటిమి. ఈ సంస్థ పక్షాన యువ కవుల రచనలతో 'తొలికారు' అనే కవితా సంకలనం ప్రచురించినాము. ఇందులో నావి రెండు కవితలు అచ్చైనాయి. అప్పుడు యువ కవులుగా ఈ 'తొలికారు' లో ప్రవేశించిన వాళ్లు తదనంతర కాలంలో సుప్రసిద్ధ

కవులుగా రాణిస్తున్నారు. ఈ సంకలనం చేకూరి రామారావుగారు రచించిన "శ్రీయుత నామముతోనే చిరతర సంపదలబ్బవు" అనే గేయంతో ప్రారంభమవుతుంది. వట్టికోట ఆళ్వారు స్వామిగారు రచించిన ఏకైక గేయం "సాలార్జంగ్ కళానిలయం చాటిందొక శాశ్వత సత్యం" అనే గేయాన్ని కూడ ఇందులో ప్రచురించాము. ఈ సంస్థ కార్యకలాపాల్లో కోవెల సంపత్కుమారాచార్య గారి సహాయ సహకారాలందుతుండేవి. అట్లాగే కాళోజీ సోదరుల ఆశీస్సులుండేవి. ఇట్లా ఇంటర్మీడియేట్ చదువుతున్న కాలంలో నా సాహిత్య జీవితానికి గట్టి పునాదులు పడినాయని భావిస్తుంటాను.

ఇంటర్మీడియేట్‌లో నేను ఇంగ్లీషులో తప్పినాను కనుక ఆ సంవత్సరం మా ఊర్లోనే ఉండడం జరిగింది. అప్పుడు మా ఊర్లో మూతపడి ఉన్న జైహింద్ గ్రంథాలయాన్ని కొందరు గ్రామ యువకుల్ని సమీకరించి పునరుద్ధరించినాను. దానికి పెరుమాండ్ల యాదగిరి అధ్యక్షుడుగానూ, నేను కార్యదర్శిగానూ ఉంటిమి. పెరుమాండ్ల యాదగిరి తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొన్న కమ్యూనిస్టుయోధుడు. అందువల్ల ఆయన్ని కార్యవర్గం నుంచి తొలగించాలని జనగామ తాలూకా కాంగ్రెసు కమిటీ అధ్యక్షులైన ఎన్. యతిరాజారావు గారు గ్రామాధికారుల పైన, గ్రామ ప్రముఖుల పైన వత్తిడి చేసినారు. అందుకు మార్చేది లేదంటూ నేను బాహాటంగా ఎదురు తిరిగినాను. ఈ వ్యవహారంలో గ్రంథాలయ అధ్యక్షుడు, కోశాధికారితో కలిసి నేనూ జనగామ పోలీసు స్టేషనుకు పోవలసి వచ్చింది. విషయమంతా అమీన్‌సాబ్‌కు విన్నవించినాను. అమీన్‌సాబ్ మమ్మల్నే సమర్థించినాడు.

గ్రామయువకులం గ్రంథాలయాన్ని ఒక సంవత్సరం విజయవంతంగా నిర్వహించినాము, ఆయా సందర్భాల్లో సభలు సమావేశాలు జరిపి గ్రామ ప్రజల్లో చైతన్యం కలిగించినాము. పాఠశాల వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేసినాము. కొన్ని సాంస్కృతిక కార్యక్రమాల్ని నిర్వహించినాము. ఇట్లా ఒక సంవత్సరం నడిపిన పిదప రెండు రోజుల పాటు వార్షికోత్సవాల్ని ఘనంగా జరిపించినాము. సర్వాయి పాపన్న ఖిలాలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు వరంగల్లు నుండి పలువురు కవులూ, పండితులూ హాజరైనారు. అప్పుడు మా గ్రంథాలయానికి గ్రంథపాలకుడిగా ఉన్న పొన్నాల లక్ష్మయ్యగారు ఈనాడు రాష్ట్రమంత్రిగా రాణిస్తున్నాడు. ఈయనకు మేమప్పుడు నెలకు రూపాయి పావలా జీతమిచ్చే వాళ్లం. ఈ కాలంలో హైదరాబాదు రాష్ట్ర ప్రథమ ప్రజా ప్రభుత్వంలో మంత్రివర్యులుగా ఉన్న ఎం.ఎస్. రాజలింగం గారు మా ఊరికి వచ్చినారు. అప్పుడు కమ్యూనిస్టుగా ఉన్న గ్రంథాలయ అధ్యక్షుని చేత కాంగ్రెసు మంత్రిగారికి

పూలమాల వేయించి, నేను సన్మాన పత్రం చదివినాను. ఆ పిదప గ్రంథాలయ భవనానికి మంత్రిగారి చేత శంకుస్థాపన చేయించగా వారు గ్రంథాలయ భవన నిర్మాణం కోసం అక్కడికక్కడే రూ.500- లు మంజూరు చేసినారు. ఒక ప్రజా సంస్థలో బాధ్యతాయుత పదవిని నిర్వహించడం నాకిదే తొలి అనుభవం. ఇదే తరుణంలో ఒక వైపు విశాలాంధ్ర సదస్సులు జరుగుతూంటే మరొకవైపు ప్రత్యేక తెలంగాణావాదులు వాటిని భగ్నం చేస్తుండేవాళ్లు. ఆ క్రమంలో "వెలుగు" పత్రిక సంపాదకులు చౌడవరపు విశ్వనాథం గారి అధ్యక్షతన జనగామలో విశాలాంధ్ర సదస్సు జరిగింది. మా ఊరి కమ్యూనిస్టు మిత్రులతో కలిసి నేను ఆ సభకు హాజరై

"ఏడు కొండలా 'యెంకన్నా'
దూ దు దూ దూ 'బసవన్నా'

తెలంగాణమని బజారులన్నీ
'గోల'లు చేస్తూ 'కొండ' లెక్కుచూ
పాండు 'రంగ'ని భజనలు జేస్తూ
మొండిగ వాదం చేసేవారికి"

అంటూ ఒక గేయం పాడినాను. సభికులు కరతాళధ్వనులతో మళ్లీ నా చేత ఆ పాట పాడించినారు. సభాధ్యక్షులు నన్ను బాగా మెచ్చుకున్నారు.ఆ తరవాత వారు దాన్ని తమ "వెలుగు" పత్రికలో ప్రకటించినారు. ఐతే సభ నుంచి తిరిగి వస్తుంటే కొందరు ప్రత్యేక తెలంగాణావాదులు నా వెంటపడ్డారు. ఐతే నాకు తోడుగా ఉన్న కమ్యూనిస్టు మిత్రులు నన్ను ఒక హోటల్‌లో దాచి కాపాడినారు. ఈ కాలంలో నా కవితలు కొన్ని "వెలుగు" పత్రికలోనూ, జనగామ నుంచే వెలువడిన 'తెలుగు జ్యోతి' పత్రికలోనూ అచ్చవుతుండేవి.

పిదప నేను నా ఉన్నత విద్యాభ్యాసం హైదరాబాదు వెళ్లి ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజిలో బి.ఏ.లో చేరి, ఎం.ఏ దాకా అక్కడే చదువుకున్నాను. నాలుగు సంవత్సరాలూ హాస్టలు 'ఏ'లో ఉన్నాను. బి.ఏ. మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడు అంతర్ కళాశాల విద్యార్థుల కోసం కథానికల పోటీ జరిగింది. దానికి నేను "ప్రతీకారం" పేరుతో ఒక కథ రాసి పంపితే బహుమతి రాలేదు కాని "స్రవంతి" పత్రికలో అచ్చైంది. రాజకీయ పార్టీల వల్ల గ్రామీణ వాతావరణం ఎంతగా కలుషితమవుతున్నదో తెలుపడం ఆ కథలోని వస్తువు. ఒకసారి ఆంధ్రాభ్యుదయోత్సవాల సందర్భంలో దాశరథి గారి అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొని నా "ప్రసవవేదన" కవిత చదివితే సభలో

హర్షధ్వానాలు చెలరేగినాయి. దాన్ని మళ్లీ చదివించుకున్నారు. దాశరథిగారు నా బుజం తట్టి ప్రోత్సాహించినారు. అణువిచ్ఛేదం వల్ల జరిగే ప్రమాదాన్ని అందులో ధ్వనింపచేసినాను. ఆర్ట్సు కళాశాల తెలుగు భాషా సమితి కార్యదర్శి పదవికి పోటి చేసి ఓడిపోయినాను. ఇదే సందర్భంలో దేశంలో రెండవ సాధారణ ఎన్నికలు జరిగినాయి. అప్పుడు ప్రజాకంటకుడైన ఇస్నూరు రాపాక రామచంద్రారెడ్డికి కాంగ్రెసు పార్టీ తరఫున టిక్కెట్టు ఇస్తున్నట్లు వార్తలు వచ్చినాయి. అప్పుడు నేను వెంటనే స్పందించి "నీకు సీటెట్ల వస్తుందో చూస్తానుగా, అసలు ఓటెవరు వేస్తారో చూస్తానుగా" అంటూ ఒక గేయాన్ని, "బహురూపుల వేషాలతో బాగుపడగలేవురా, స్వ స్వరూపమేదో చూపి సరదారువు కావలెరా" అంటూ మరొక గేయాన్ని రాసి పత్రికలకు పంపితే అవి అచ్చైనాయి. ఎందుకోగానీ ఆయనకు టిక్కెట్టు ఇవ్వలేదు. ఎం.ఏ. మొదటి సంత్సరంలో ఉండగా నేను ఆర్ట్సు కళాశాల వార్షిక సంచిక "శోభ"కు సంపాదకునిగా ఎంపికైనాను. నా సంపాదకత్వాన వెలువడిన "శోభ"ను ప్రముఖ సాహితీవేత్త జువ్వాడి గౌతమరావుగారిచే ఆవిష్కరింపజేసి కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పినాను. గౌతమరావుగారప్పుడు సుల్తాన్‌బజారు నుండి "జయంతి" పత్రికను వెలువరిస్తుండేవారు. నేను తరచూ సుప్రసన్నాచార్య, మాదిరాజు రంగారావుగారలతో కలిసి వారి కార్యాలయానికి వెళ్తుండేవాణ్ణి. ఆ శోభ సంచికలో ప్రచురింపబడిన జె.బాపురెడ్డి గారి "ఎకానామిక్స్ సుందరి" అనే కవితకు ప్రథమ బహుమతి లభించింది. నా సహాధ్యాయి మూల మల్లారెడ్డి కోరికపై "రైల్వేగేటు" అనే పేరుతో నేనే ఒక కథ రాసి అతని పేర ప్రచురించినాను. ప్రజా శ్రేయస్సు కోసం చేసిన చట్టాలను విచక్షణారహితంగా ప్రయోగిస్తే, అవే ప్రజలకు ప్రాణాంతకంగా మారుతాయన్నది ఆ కథలోని వస్తువు. దీని తరువాత మళ్లీ నేను కథలు రాయలేదు.

ఎం.ఏ. రెండవ సంవత్సరంలో ఉండగా నేను "తెలుగు భాషాసమితి" అధ్యక్ష పదవికి పోటీ చేసి గెలుపొందినాను. దాని ప్రారంభోత్సవానికి త్రిపురనేని గోపీచంద్, డా॥ సి. నారాయణరెడ్డి గారలను ఆహ్వానించగా వచ్చి ప్రసంగించినారు. ఆవంత్స సోమసుందర్ గారు నగరానికి వచ్చినారని తెలిసి వారిని మా కళాశాలకు ఆహ్వానించినాను. నా చిన్ననాడు కంఠస్థం చేసిన వారి "ఖబర్దార్ ఖబర్దార్ నైజాం పాదుషాహే" అనే గేయాన్ని నేను మొత్తం పాడి వారిని సభకు పరిచయం చేస్తే వారు నన్ను ఆనందంతో కౌగిలించుకున్నారు. విశ్వనాథవారి రామాయణ కల్ప వృక్ష కావ్య గానాన్ని నగరంలో రెండు రోజులు ఏర్పాటు చేసినాను. సభకు అశేషమైన ప్రజలు హాజరైనారు. ఆ సభలు నగరంలో బాగా సంచలనాన్ని కలిగించినాయి. ఇప్పుడు సుప్రసిద్ధ రచయితలుగా పేరుగాంచిన మంజుశ్రీ ఉరఫ్ అక్కిరాజు రమాపతిరావు, ఆనందారామం ఉరఫ్

సి.ఆనందలక్ష్మి, గాదేపల్లి కుక్కుటేశ్వరరావు, వల్లపు రెడ్డి బుచ్చారెడ్డిలాంటి వాళ్లు అప్పుడు నాకు సహాధ్యాయులు. కొద్ది రోజులు చేకూరి రామారావుగారు కూడ సహాధ్యాయిగా ఉన్నాడు. ఈ సంవత్సరంలో నేను హాస్టల్ 'ఏ'కు అసిస్టెంట్ సీనియర్ హౌజ్ మానిటరుగా ఎన్నుకోబడి వివిధ కార్యక్రమాలుచేపట్టినాము. సాహితీమిత్రుల్ని కలువడానికి మా హాస్టలుకు తరచూ కేతవరపు రామకోటిశాస్త్రి, మొదలి నాగభూషణశర్మ గారలు వస్తుండేవాళ్లు. వాళ్లతో నాకు మంచి స్నేహం ఏర్పడింది. ఈ నాలుగు సంవత్సరాలూ శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాంగణాల్లో జరిగిన పలు సాహిత్య సభలకు హాజరవుతుండేవాణ్ణి. అప్పుడే కొత్తగా వెలిసిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ సభలకు కూడా హాజరవుతుండేవాణ్ణి. ఈ క్రమంలో దేవులపల్లి రామానుజరావు, దాశరథి, డా॥ సి. నారాయణరెడ్డి, బోయి భీమన్న, పోతుకూచి సాంబశివరావు, జె.బాపురెడ్డి, కుందుర్తి వంటి ప్రముఖులతో నాకు పరిచయాలేర్పడినాయి. కుందుర్తి ఫ్రీవర్స్‌ఫ్రంట్ తరపున వచన కవితాగోష్ఠుల్ని నిర్వహించేవాడు. వాటికీ హాజరవుతుండేవాణ్ణి. అక్కడికి అప్పటికింకా దిగంబర కవులుగా అవతారమెత్తని నగ్నముని, జ్వాలాముఖి వంటి వాళ్లు వస్తుండేవాళ్లు. ఈ కాలంలో పండితారాధ్యుల నాగేశ్వర రావు గారు హైదరాబాదుకు వచ్చి "సంజయ" అనే వార పత్రికను కొత్తగా ప్రారంభించినాడు. అందులో కూడ నా కవితలు అచ్చయ్యేవి. ఈయనే పిదప "తెలుగు ప్రభ" అనే దినపత్రికను కూడ ప్రారంభించినాడు. ఇందులోనూ నా రచనలు కొన్ని ప్రచురింపబడినాయి.

నా ఎం.ఏ. పూర్తి అయిన పిదప నిజాం కళాశాలలో పనిచేస్తుండిన సి.నారాయణరెడ్డి గారు తన పరిశోధన నిమిత్తం సెలవుపెట్టగా ఆ స్థానంలో నన్ను వేసినారు. ఆ సమయంలో నేను విద్యార్థిగా ఉన్న కాలంలో రచించిన కవితలనన్నింటిని కలిపి 'సాగర సంగీతం' పేరుతో ప్రచురించినాను. దానికి సి.నారాయణరెడ్డి గారు చక్కని పీఠిక రాస్తూ "అధిక్షేప గేయాల్లో ఈయన విశిష్టత చూపాడు" అంటూ నా రచనల్లో సహజంగా ఉండే అధిక్షేప గుణాన్ని మొదటిసారిగా పసికట్టి చూపినారు. ఈ కావ్యావిష్కరణ సభ శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో తాపీ ధర్మారావుగారి అధ్యక్షతన జరగ్గా, దాశరథి గారు కావ్యాన్ని ఆవిష్కరించినారు. ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారు కావ్య సమీక్ష చేసి ఆశీర్వదించినారు. కార్యక్రమంలో లేకున్నా ఆ సభకు ఈయుణ్ణి వెంకటవీర రాఘవాచార్యులు, చెలమచర్ల రంగాచార్యులు, సి.నారాయణ రెడ్డి వంటి పలువురు ప్రముఖ విద్వాంసులు వచ్చి నన్ను అభినందించారు. ఈ "సాగర సంగీతం" కావ్యాన్ని దివంగతురాలైన నా తల్లి సయ్యమ్మకు అంకితం చేసినాను. సభకు మా స్వగ్రామం నుండి మా నాయనగారు వచ్చి ఎంతో ఆనందించినారు. కావ్యాన్ని "నవ్యసాహితీ సమితి"

పక్షాన ప్రచురించగా బోయి భీమన్నగారు, పోతుకూచి సాంబశివరావుగారూ నన్ను అభినందిస్తూ ముందుమాట రాసినారు. ఈ కావ్యావిష్కరణ సభకు ఏర్పాటు చేయించడంలో మిత్రులు జె. బాపురెడ్డిగారు సహకరించినారు.

1961లో ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరావుగారు, జస్టిస్ గోపాలరావు ఎక్బోటే గారు ఉస్మానియా తెలుగు శాఖాధిపతి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారల ఆశీస్సులతో వరంగల్లు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆంధ్రోపన్యాసకునిగా నియమింపబడి అక్కడికి వెళ్లినాను.

అక్కడ పనిచేస్తుండిన కాలంలో పూర్వం మేము స్థాపించిన "సాహితీ బంధు బృందం"ను పునరుద్ధరించి వివిధ సాహిత్య కార్యక్రమాల్ని నిర్వహింపజేసినాను. కోవెల సుప్రసన్నాచార్యుల సహాయ సహకారాలు నాకు లభిస్తుండేవి. ఆ సమయంలో దిగంబర కవులుద్భవించి తమ మొదటి సంపుటాన్ని వెలువరించినారు. అందులో వాళ్లు వ్యక్తం చేసిన సామాజికపరమైన ఆర్తి సరైందేకాని అభివ్యక్తి, భాష నాకు నచ్చలేదు.

వాళ్ల ఈ వైఖరిని ఖండిస్తూ నేనొక గేయం–

"సవ్ ఆ మ్ఈ!
అయాంసారీ!
స్పెల్లింగ్ పొద్దైందనుకోకు
'SIN' అయ్యచచ్చిపోయాడెన్నడో
ఆంధ్ర జాతిని అమాంతంగా
అడవుల్లో వదిలేసి
"వాగుడుశాసన' బిరుదు తగిలించుకున్న
బ్రహ్మశ్రీ వేదమూర్తులైన 'NON' అయ్యగారు
చిరకాలం బ్రతుకుతాననుకున్నాడు పాపం'

అంటూ కృష్ణా పత్రికకు పంపిస్తే దాన్ని ప్రచురించినారు. అంతటితో ఆగక దిగంబర కవుల్ని ప్రతిఘటిస్తూ ఒక కవితా సంకలనాన్ని కూడా వెలువరిస్తే బాగుంటుందనినేను సుప్రసన్నగారితో సంప్రదించినాను. వారందుకు అంగీకరించినారు. ఆ పిదప నేను వే. నరసింహారెడ్డి గారినీ, కోవెల సంపత్కుమారాచార్య గారినీ సంప్రదించగా వాళ్లు వెంటనే సమ్మతించినారు. 'చేతనావర్తం' అన్న పేరును సుప్రసన్నగారు సూచించగా దాన్ని ఖరారు చేసినాము. నలుగురి కవితలతో సుప్రసన్నగారి సంపాదకత్వంతో మొదటి

సంపుటాన్ని వెలువరించి ప్రముఖులకు పంపితే అందరూ మమ్మల్ని శ్లాఘిస్తూ ఉత్తరాలు రాసినారు. పత్రికల్లో సమీక్షలు మమ్మల్ని సమర్థిస్తూ వచ్చినాయి. సాహిత్య విలువల్ని పరిరక్షించడం, సంస్కారహితమైన భాషను ప్రయోగించడం "చేతనావర్తం" లక్ష్యం. దిగంబర కవులు మొత్తం మూడు సంపుటాల్ని వెలువరించినారు. వీటిలో ఉన్న మరో విచిత్రమేమంటే వాళ్ల పేర్లను మార్చుకున్నట్లే వారాల పేర్లనూ, సంవత్సరాల పేర్లనూ అన్నింటినీ మార్చినారు. ఈ వికృత వైఖరులను ఖండిస్తూ మేము మరో సంపుటాన్ని కోవెల సంపత్కుమార సంపాదకత్వాన వెలువరించినాము. ఆ తరువాత కొద్ది రోజులకు వే.నరసింహారెడ్డి అకాలమరణానికి గురైనాడు. ఆ తరువాత దిగంబర కవులవి కాని మావి కాని సంపుటాలు వెలువడలేదు.

సుమారు 150 సంవత్సరాల క్రితం మా ఊర్లో రంగరాజు కేశవరావు గారనే కరణం దేశముఖు ఉండేవాడు. ఆయన నాలుగైదు భాషలలో పండితుడు. సంస్కృతాంధ్ర భాషల్లో గొప్ప రచనలు చేసినాడు. ఆయన సంగీత విద్వాంసుడే కాక మంచి కళాకారుడు. ఇంకా పలుశాస్త్రాల్లో ప్రవీణుడు. ఐతే ఆయన తన రచనలనేవి అచ్చువేసుకోకుండానే పరమపదించినారు. ఆ రాత ప్రతులన్నీ అతని వద్ద ఉద్యోగించిన పెరుమాండ్ల రామయ్యగారి వద్ద ఉండగా సేకరించినాను. మొదటగా "ఇంద్రద్యుమ్నీయము" అనే ఒక ప్రౌఢ ప్రబంధాన్ని పరిష్కరించి ప్రచురించినాను. దాని ఆవిష్కరణ మహోత్సవం కూడా మా ఊర్లో ఘనంగా రెండురోజులు నిర్వహించినాను. దేవులపల్లి రామానుజరావు, కాళోజి నారాయణ రావు, బి.రామరాజు, కె.గోపాలకృష్ణారావు, అమరేశం రాజేశ్వర శర్మ, సుప్రసన్నాచార్య, నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యులు, శ్రీ భాష్యం విజయసారథి వంటి ఉద్దండ పండితులంతా ఆ ఉత్సవాల్లో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్ని ఏర్పాటు చేసినాము. ఈ ఉత్సవాల్ని దర్శించడానికి మా ఊరి ప్రజలే కాక చుట్టు పట్ల గ్రామ ప్రజలూ వచ్చినారు. ఈ ఉత్సవాల నిర్వహణలో మా నాయనగారు నిర్విరామంగా కృషిచేసినారు. నేను కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతిగా ఉన్నప్పుడు కేశవరావుగారి లఘుకృతులనీ, కీర్తనల రూపంలో వున్న ఆధ్యాత్మరామాయణాన్నీ ప్రచురింపచేసినాను. ఐతే ఇక్కడొక విషయాన్ని ఉటంకిస్తున్నాను. ఏదో ఒక సందర్భంలో రంగరాజు కేశవరావు గారిని ఎదిరించినందువల్ల మా తాతగారైన దావోజిని రావు గారు కొంత కాలం జైలుకు పంపించినారు. రావుగారు ఒక స్త్రీ వ్యామోహంలో పడి అట్లా చేసినాడని చెప్పగా విన్నాను. ఇనుగుర్తి గ్రామానికి దేశముఖులుగా వున్న వద్దిరాజుసోదరులలో ఒకరు వద్దిరాజు సీతారామచంద్రరావుగారు రచించిన "సౌదామినీ

పరిణయము" అనే ప్రబంధాన్ని తెలుగు శాఖ పక్షాన ప్రచురింపచేసినాను. నేను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి 10 సంవత్సరాలు సాధారణ సభ్యునిగాను, 5 సంవత్సరాలు సంయుక్త కార్యదర్శిగానూ వున్నందున పలువురు సుప్రసిద్ధ కవులూ పండితుల్ని కలిసి మాట్లాడే భాగ్యం కలిగింది. నన్ను దేవులపల్లి రామానుజరావుగారు బాగా ప్రోత్సాహించే వారు. వారే నన్ను ఆంధ్రసారస్వత పరిషత్‌లో పదవికి ఎంపిక చేసినారు.

నేను ఆయా పత్రికలలో ప్రచురించిన కొన్ని వ్యాసాల్ని సంకలితం చేసి 'సాహిత్యావలోకనం' పేరుతో అచ్చువేసి 'ఆంధ్రపితామహ' మాడపాటి హనుమంతరావు గారికంకితం ఇచ్చినాను. అప్పటికే వారు పరమపదించినారు. అట్లాగే అప్పటిదాకా ఆయా పత్రికల్లో ప్రచురింపబడిన నా కవితల్ని సంకలితం చేసి 'వృషభ పురాణం' పేరుతో ప్రచురించి తెలంగాణా రైతాంగ సాయుధ సమరయోధుడు రావి నారాయణరెడ్డి గారికంకితం ఇచ్చినాను. వారినే స్వయంగా సభకు ఆహ్వానించి ఈ గ్రంథాన్ని అంకితం చేసినాను. ఈ ఇద్దరి మార్గాలు వేరయినా ఇద్దర్ని నేను ఆధునిక తెలంగాణా నిర్మాతలుగా, వైతాళికులుగా ఆరాధిస్తుంటాను. ఈ ఇద్దరూ తెలంగాణా ప్రజల్ని జాగృతపర్చినారు. ఈ రెండు గ్రంథాలూ శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలోనే ఆవిష్కరింపబడినాయి. "వృషభ పురాణం" మైసూరు విశ్వవిద్యాలయంలో బి. ఎడ్. కోర్సుకున్నూ, కాకతీయ విశ్వవిద్యాలయం ఎం. ఏ. కోర్సుకున్నూ పాఠ్యగ్రంథంగా నిర్ణయింపబడింది. దీనికి రెండు సాహిత్య సంస్థలు అవార్డులు ప్రకటించినాయి. దీనిపై ఇద్దరు తమ తమ ఎం. ఫిల్. డిగ్రీ కోసం పరిశోధన చేసినారు. సామాజిక, రాజకీయ రంగాలలో జరుగుతున్న అన్యాయాల్ని, అక్రమాల్ని అధిక్షేపాత్మకంగా ఖండించడం ఈ కావ్యంలోని ప్రత్యేకత.

ఆధునిక తెలుగు కవితాధోరణుల్ని విశ్లేషణాత్మకంగా విశదపరచాలన్న తలంపుతో 18 మంది పండితుల చేత వ్యాసాలు రాయించి నా సంపాదకత్వంలో 'అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు' అనే పేర ఒక గ్రంథాన్ని ప్రచురించినాను. దాన్ని స్వామి వివేకానందునికి అంకితం చేసినాను. ఇది ఆంధ్ర సారస్వత పరిషత్ హాలులో ఆవిష్కరింపబడింది. దేవులపల్లి రామానుజరావు గారు అధ్యక్షత వహించిన ఆ సభలో గ్రంథాన్ని శ్రీ రామకృష్ణ మిషన్ అధిపతులు స్వామి రంగనాథానంద గారు ఆవిష్కరించినారు. డా॥ సి. నారాయణరెడ్డి గారు విశిష్ట అతిథిగా సభలో పాల్గొన్నార. ఈ గ్రంథం సాహిత్యలోకంలో కొంత అలజడి కలిగించింది. అభ్యుదయ కవితాయుగం ఆగిపోయిందా అని కొందరు ఆందోళన చెందినారు. భీమవరంలో జరిగిన అభ్యుదయ రచయితల సమావేశాల్లో ఈ అంశమే చర్చనీయాంశం అయింది. మొత్తానికి దీనికి పండిత లోకంలో

మంచి గుర్తింపు వచ్చింది. 15 సంవత్సరాల తరువాత మళ్లీ ఇదే తరహాలో "తెలుగులో దేశీయ కవితా ప్రస్థానం" అనే పేరుతో 18 మంది సుప్రసిద్ధ పండితుల వ్యాసాలతో నా సంపాదకత్వాన ఒక గ్రంథం ప్రచురించినాను. దీనిని విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్‌కు అంకితం చేసినాను. దీనిని తెలుగు విశ్వవిద్యాలయంలో మాజీ ప్రధాని మాన్యులు పి.వి. నరసింహారావు గారు ఆవిష్కరించినారు. యుగకవి గుంటూరు శేషేంద్రశర్మగారు ఆ సభలో పాల్గొన్నారు. దీనికి పండిత లోకంలో మంచి ఆదరణ లభించింది.

మేము ఆరె వాళ్లం. మేము ఇంట్లో మాట్లాడేది ఆరె భాష అని ముందే తెలిపినాను. ఇది మౌఖిక భాషేగాని దీనికి లిపి లేదు. ఐతే ఎన్నో పాటలూ, కథలూ వ్యాప్తిలో ఉన్నాయి. ఈ భాష గురించి డాక్టరేట్ పట్టాకోసం పరిశోధన చేయవలసిందిగా గురువులు ఆచార్య బిరుదురాజు రామరాజుగారు సూచించినారు. వారు సూచించినట్లే, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్య రామరాజుగారూ, మరాఠి శాఖాధిపతి ఆచార్య ఎస్.ఆర్.కులకర్ణి గార్ల పర్యవేక్షణలో నా పరిశోధన పూర్తి చేసినాను. ఆరె భాష మరాఠి జన్యం కనుక ఆచార్య కులకర్ణి గారు సహ పర్యవేక్షకులుగా ఉండవలసి వచ్చింది. ఆచార్య రామరాజుగారి ఊరు దేవునూరులో ఆరెవాళ్లు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వారికి ఆరెవాళ్ల ఆచార వ్యవహారాలు బాగా తెలుసు. అందువల్ల వారు ఈ విషయంలో బాగా ప్రోత్సాహించినారు. నా సిద్ధాంత గ్రంథాన్ని ప్రచురించి మా నాయన గారైన సంతాజీకి అంకితమిచ్చినాను. ఈ సిద్ధాంత గ్రంథ రచన కోసం సేకరించిన ఆరె పాటల్ని గ్రంథంగా ముద్రించి మా నాయనమ్మ బుచ్చమ్మకంకితం చేసినాను. అట్లాగే ఆరె భాషకు నిఘంటువును రూపొందించి నా భార్య అమృతమ్మకంకితం చేసినాను. ఈ నిఘంటువుకు వ్యాకరణ విశ్లేషణ చేసిన ఆచార్య రవ్వా శ్రీహరి గారు సహసమీకర్తగా ఉన్నారు. ఈ రంగంలో నాదే మొట్టమొదటి కృషే కాక చిట్టచివరిది కూడా.

నేను 1992 చివరలో తెలుగు విశ్వవిద్యాలయానికి ఆచార్య డా॥ సి.నారాయణ రెడ్డిగారి తరువాత మూడవ వైస్-ఛాన్స్‌లర్‌గా నియమితుణ్ణైనాను. విశ్వవిద్యాలయ సదస్సులు సమావేశాల్ని కేవలం రాజధాని నగరంలోనే కాక రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరిపించినాను. ముఖ్యంగా పాల్కుర్కి సోమనాథుని జన్మస్థానమైన పాలకుర్తి గ్రామంలో రెండు రోజులు మహా వైభవంగా పాల్కుర్కి సోమనాథుని అష్ట శతజయంత్యుత్సవాల్ని జరపించినాను. ఆ సభలు ఆ ప్రాంతంలో గొప్ప సంచలనాన్ని కలిగించినాయి. ప్రముఖ పండితులు, కవులు పాల్గొని సాహిత్య చైతన్యాన్ని కలిగించినారు. అలభ్య అముద్రిత గ్రంథాల్ని సుమారు 60కి పైగా ముద్రింపజేసినాను. వరంగల్లులో జానపద గిరిజన

విజ్ఞానపీఠాన్ని నెలకొల్పినాను. ఇప్పుడది మూడంతస్తుల భవనం కలిగి ఆ రంగంలో విశేషమైన కృషి చేస్తున్నది. జానపద వస్తు ప్రదర్శనశాలను (Folk Museum) నెలకొల్పింది. ఈ భవననిర్మాణం కోసం డా॥ సి. నారాయణరెడ్డిగారు తమ ఎంపిల్యాడ్స్ నిధుల నుండి రూ.30 లక్షలు మంజూరు చేసినారు. ఖిలాషాపురంలో సర్దార్ సర్వాయి పాపారాయుని, పాలకుర్తిలో పాల్కుర్కి సోమనాథుని శిలా విగ్రహాల్ని తెలుగు విశ్వవిద్యాలయం పక్షాన ప్రతిష్ఠింపజేసినాను. పాపారాయుడు సామాజిక రాజకీయ విప్లవవీరుడు కాగా, సోమనాథుడు సాహిత్య రంగంలో విప్లవ కవి. ఈ కారణాలతో ఈ విగ్రహాల్ని ప్రతిష్ఠించడం జరిగింది. నేను వైస్-ఛాన్సలర్గా ఉన్న సమయంలోనే నా షష్టిపూర్తి ఉత్సవాన్ని అప్పుడు సాంస్కృతిక శాఖ డైరెక్టరుగా ఉన్న మిత్రులు కె.వి.రమణాచార్యులు ఐ.ఏ.ఎస్ గారు రవీంద్రభారతిలో ఘనంగా జరిపించినారు. ఆయన నాకు కాకతీయ విశ్వవిద్యాలయంలో కొంతకాలం సహాధ్యాపకుడిగా ఉన్నారు. నా పదవీ కాలం ముగుస్తున్న తరుణంలో "గరుడ పురాణం" పేరుతో ఒక కవితా సంకలనం ప్రచురించి నా చిన్ననాటి మిత్రుడు చింతకుంట్ల వెంకటరమారెడ్డి దంపతులకంకితం చేసినాను. రాజకీయపరమైన అక్రమాల్ని, వక్రమార్గాల్నీ అధిక్షేపాత్మకంగా విమర్శించడం నా కవితలకున్న ఏకైక లక్ష్యం.


నా పదవీ విరమణానంతరం కొద్దికాలం పిదప నా అర్ధాంగి అమృతమ్మ పరమపదించింది. ఆ సందర్భంలో ఆమె స్మృత్యర్థ్యం ప్రముఖ విద్వాంసుల చేత ధార్మిక, ఆధ్యాత్మిక వ్యాసాలు రాయించి ఒక సంకలనంగా ప్రకటించడం ఈ గ్రంథానికున్న ప్రత్యేకత. ఆంధ్రసారస్వత పరిషత్తు వజ్రోత్సవాల్ని వరంగల్లులో 2004 లో స్థానికి తెలుగు భాషోద్యయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించినాను. ముఖ్య అతిధిగా పరిషత్తు అధ్యక్షులైన డా॥ సి. నారాయణరెడ్డిగారు వచ్చినారు. 60 సంవత్సరాల క్రితం ఈ పరిషత్తు వార్షికోత్సవాలు వరంగల్లులోనే జరిగినాయి. ఆసందర్భంలో వరంగల్లు కోటలో కవి సమ్మేళనం కోసం ఏర్పాటు చేసిన వేదికను కొందరు దుండగులు కాల్చివేసినారు. కాల్చి వేసిన బూడిదను ఎత్తివేసి అదే స్థలంలో అప్పుడు పెద్దలు కవి సమ్మేళనం నిర్వహించినారు. మళ్లీ అదే స్థలంలో ఈ వజ్రోత్సవాల సందర్భంగా కవి సమ్మేళనం ఏర్పాటు చేసినాము. అదొక చెప్పరాని అనుభూతి.

కేంద్ర సాహిత్య అకాడెమీ వారి కోరికపై 'ప్రజాకవి' కాళోజీ నారాయణరావు గారిని గూర్చి సంక్షిప్త జీవిత చరిత్ర రాయగా అది ప్రచురితమైంది. మన రాష్ట్ర ప్రభుత్వానికి, నక్సలైట్లకు జరిగిన చర్చల సందర్భంలో పలువురు మేధావుల వ్యాసాల్ని సమీకరించి నా సంపాదకత్వాన "శాంతియజ్ఞం" పేరుతో ఒక సంకలనం ప్రచురించినాను. ఈ గ్రంథాన్ని ప్రచురించడానికి ప్రోత్సహించినవారు మాజీ మంత్రివర్యులు టి.పురుషోత్తమరావు గారు.

దీనికి ప్రజల ఆమోదం బాగా లభించింది. ఇరుపక్షాల్లో ఉన్న మంచి చెడులను విశ్లేషించి పరిష్కారమార్గాల్ని సూచించడం ఈ గ్రంథానికున్న లక్ష్యం.

మత ప్రాతిపదికపై ప్రభుత్వాలు రిజర్వేషన్లు కల్పించడాన్ని ఖండిస్తూ 80 మంది సుప్రసిద్ధ కవుల రచనలతో ఇటీవల "మోర్దోపుదున్న" పేరుతో ఒక కవితా సంకలనం నా సంపాదకత్వాన ప్రచురించినాను. దీనికి జనాదరణ బాగా లభించింది. దీన్ని దేశభక్తుడు, అమరవీరుడు షోయబ్ ఉల్లాఖాన్‌కు అంకితం చేసి, ఘనంగా పుస్తక ఆవిష్కరణ మహోత్సవం జరిపించినాను. మతప్రాతిపదిక పై రిజర్వేషన్లు కల్పించడం మత మార్పిడులకూ, మరోసారి దేశ విభజనకూ దారి తీస్తుందని హెచ్చరించడం ఈ గ్రంథం ప్రత్యేకత.

నా సమగ్ర సాహిత్యం పై శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో ఒకరు పరిశోధన చేసి, డాక్టరేట్ పట్టా పొందినారు. మరొకరిప్పుడు హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పట్టాకోసం పరిశోధన చేస్తున్నారు. ప్రస్తుతం వరంగల్లులో జరిగే సాహిత్య సభలకు మిత్రుల ఆహ్వానం పై వెళ్లుతూ విశ్రాంతి జీవితాన్ని గడుపుతున్నాను. నాకు భగవంతునితో ఏ రకమైన షికాయతు లేదు. నా అర్హతకు మించిన అవకాశాలే నాకు దక్కినాయి. జీవితంలో ఎన్నడూ ఏ కష్టాలూ అనుభవించలేదు. అందుకు సహకరించిన నా కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, బంధుమిత్రుల సౌజన్యాన్నీ మరువలేను. నేనీ ప్రసంగం చేయడానికి అవకాశం కల్పించిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥సి. నారాయణరెడ్డి గారికీ, చిరకాల మిత్రుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారికీ, డా॥జె. చెన్నయ్యగారికీ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ బ్రతికి ఉన్నవాటి నుంచీ మిత్రుడైన పాండురంగయ్య గారికీ నా ధన్యవాదాలు.



ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య

'తామేనాం పరిభావయంత్వభినయైః విన్యస్తరూపాం బుధాః
శబ్ద బ్రహ్మవిదఃకవేః పరిణతాం ప్రాజ్ఞస్య వాణీమిమామ్'

బహుశః ఈ భవభూతి మహాకవి సూక్తిస్ఫూర్తితో కావచ్చునేమో – ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠపురస్కార గ్రహీత, ఆంధ్రసారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య సి. నారాయణరెడ్డి గారు భావించి, రూపకల్పన చేసిన ప్రసంగ పరంపరా కార్యక్రమం 'పరిణతవాణి'. ఆయన దిశా దర్శనంలోనే పరిషత్తు పలువురు పరిణతుల ప్రసంగాలు నిర్వహించింది. ఆ వరుసలో నన్నూ ఆహ్వానించింది. ఈ ప్రసంగాలు 'ఆత్మకథా' ప్రసంగాలని కూడా సూచించింది. ఆ విధంగా నన్ను నేను సింహావలోకనం చేసుకొనే అవకాశం నాకు కల్గించినందుకు ఈ నిర్వాహకులను నా కృతజ్ఞతలు. అయితే, 'ఆత్మకథ' అంటూ చెప్పుకోదగినంతటి అసామాన్య 'కథ' అంటూ నాకేమీ ఉన్నదనుకోవటం లేదు. సాహిత్యంలో నా ప్రవృత్తి, కృషి విషయాలట్లా ప్రక్కకు పెట్టితే నాది చాలా సాదాసీదా సామాన్య జీవితం. కాగా, నా సాహిత్య పరిశ్రమా, అది సాగిన తీరూ తెన్నూ, లభించిన ప్రేరణలూ, ఏర్పడిన పరిసరాలు, పరిస్థితుల వంటివాటి సాగుదలే నా కథ. ఆ కథను మొదలు పెట్టింది వరంగల్లు.

1

వరంగల్లు అంటేనే నా మనస్సు, శరీరం పులకిస్తయి. అది నా జన్మస్థానం కావటం అట్లా ఉంచి, విలక్షణమూ, అద్భుతమయిన ప్రాచీన– ఆధునిక చరిత్ర దానిది. అలనాటి నుంచీ అది వివిధ విద్యలకూ, కళలకూ ఆటపట్టు. తొలినాళ్లలో అది 'ఓరుగల్లు'–

ఏకశిలానగరం. విద్యానాథుడు పేర్కొన్న 'ఆంధ్రనగరం'. క్రమంగా ఓరుగల్లు, వరంగల్లు. నాటినుండి నేటిదాకా ఉద్యమాలకూ ఉద్వేగాలకూ, ఉద్రేకాలకూ సాహసౌదార్య వీర్యాలకూ ప్రతీకగా, ప్రతి తెలుగువాడూ గర్వించదగిన నగరంగా ప్రసిద్ధి కెక్కింది.

కాలం నిత్య క్రమణ శీలమయింది. రాజ్యాలు మారినయి. అన్ని రకాల ఆనాటి వ్యవస్థలూ, ప్రవృత్తులూ మననాటికి మారినయి. రకరకాలుగా కలవరాలూ, కల్లోలాలూ చెలరేగినయి. ఈనాటి భారతదేశానికి వరంగల్లు ఒక నమూనా. ఆధునికమయిన రకరకాల ఉద్యమాలూ, భావనలూ, భావజాలాలూ, మత సంప్రదాయ సాంస్కృతిక సాహిత్య వ్యవస్థలూ వర్తనలూ, కళా ప్రవృత్తులు మొదలయిన వాటికి నాటి వరంగల్లు పుట్టినిల్లు కాకపోవచ్చునేమోగాని అన్నింటినీ వరంగల్లు ఒంటబట్టించు కొన్నది. ఇక్కడ ఘర్షణలూ, సామరస్యాలూ చెట్టాపట్టాలేసుకుని తిరిగినయి. సహజీవనం సాగించినయి. అయితే, అధర్మాన్నీ, అన్యాయాన్నీ, థార్ష్ట్యాన్నీ ఎప్పుడూ వరంగల్లు నిరసిస్తూ ఎదిరిస్తూనే ఉంది. అట్లాంటి మహానగరం నాకు జన్మస్థానం కావటం 'మత్పురాకృత శుభాధిక్యం'. శ్రీముఖ ఆషాఢశుక్ల చతుర్థి జయవారం (26జూన్,1933) నాడు నా అస్తిత్వం వరంగల్లు మట్టినుంచి మొలకెత్తింది.

2

ఒక వ్యక్తి ఎదుగుదలకూ, పరిణామ రీతికీ బాల్యమే దిశా దర్శనం చేస్తుందంటారు. బాల్యంలో ఏర్పడిన కుటుంబ వాతావరణం, పరిసరాలు, తారసపడిన వ్యక్తులు, ఏర్పడిన మిత్రులు, అప్పుడు అందిన చదువూ, దాని తీరూ, నాటి దేశీయ సామాజిక, ఆర్థిక, సామాజిక సాంస్కృతిక పరిస్థితులూ మొదలయినవనేకం ఆ వ్యక్తి బాల్యాన్ని ప్రభావితం చేస్తాయనేది ఒక సామాన్య సూత్రం. అయితే, ఏయే దాని ప్రభావానికి ఏ విధంగా, ఎంతెంతగా సాంద్రంగానో, సాధారణంగానో ఆ వ్యక్తిలోను కావటానికి ఎప్పటికప్పుడు అతని జీవలక్షణం నియంత్రిస్తూనే ఉంటుంది. హనోపాదానాలు కూడా తెలియకుండానే అప్పుడే మొదలవుతూ ఉంటాయి.

నా బాల్యంలో నన్ను ప్రభావితం చేసిన వారిద్దరు. ఒకరు మా నాయనగారు, రెండు ఎం.ఎస్. (ముదిగొండ సిద్ధ) రాజలింగంగారు. నాయనగారి విషయం ప్రస్తుతానికి అట్లా ఉంచితే, నాదేశం, నా సమాజమంటూ ఒక విధమయిన తెలివిడి నాలో [illegible] తెలివిడి ఎదిగేందుకు ఆలంబనమందించిన వ్యక్తి రాజలింగంగారు. ఆయన [illegible]పేట (వరంగల్లులోని ఒకవాడ)లో మా ఇంటిదగ్గర

ఉండేవారు. ఆయన కాంగ్రెసు. ఆయన తండ్రిగారు ప్రభుత్వోద్యోగి. అందుకని తన మామగారింటిలో ఉండేవాడు. సతీసమేతంగా వార్ధా వెళ్లి గాంధీగారి సాంగత్యంలో ఉండి తిరిగి వరంగల్లు వచ్చిన క్రొత్త దినాలవి. 1943 ప్రాంతంలో ఆయన తన మామగారి పెద్ద ఇంటిలో 'సుభాను చేతి పరిశ్రమశాల' ఏర్పాటు చేశారు. నా వంటి పిల్లవాళ్లందరిని ఆయన ఆకర్షించి అందులో చేర్చుకొన్నారు. కాగితం, తేనె తయారు చేయటం, నవారునేత, చరఖా (రాట్నం) మీద దారం తీయటం, కండెలు చుట్టటం వంటివి అక్కడ నేర్చుకొన్నాను. ఇది గాంధీగారి 'బేసిక్ విద్యా' విధానానికి చెందినతీరు. 'పనిలో విద్య' అనేది ఆ విధానసూత్రం. ఆయాపనులు నేర్పుతూ, ఆయా వస్తువుల నెపంగా చరిత్ర, భూగోళం, పంటలు మొదలయిన వాటిని గూర్చి చెప్పేవారు. అంతేకాదు, సమకాలీన జాతీయోద్యమ, స్వాతంత్ర్యోద్యమయోధులు, ఆయా నాయకులను గూర్చి చెప్పేవారు. నాటి బ్రిటిష వారి పాలన స్వభావం, దోపిడీ స్వభావం, దేశీయ విద్యలకు జరుగుతున్న హానివంటి అంశాలు అనేకం ముచ్చట్లుగా చెప్పేవారు. ఇందులో ఆయన భార్య లలితమ్మగారు కూడా పాల్గొనేవారు. ఆమె నాకు తొలి హిందీగురువు. దినపత్రికలు చదివే అలవాటు ఆ 'శాల'లోనే మొదలయింది.

రాజలింగంగారు వారంవారం 'చర్చాగోష్ఠులు' ఏర్పాటుచేసి మా వంటి పిల్లలకు వివిధ విషయాలపై ఉపన్యాసాలు చేయటం అభ్యాసం చేశారు. ఒక విషయం గూర్చి ఒకసారి అనుకూలంగానూ, ప్రతికూలంగానూ మాట్లాడవలసి వచ్చేది. ఆ కారణంగా ఒక విషయాన్ని వివిధకోణాలనుంచి అనుశీలించే తీరుకు ఆనాడే ప్రాతిపదిక ఏర్పడింది. తరువాతి కాలంలో నా సాహిత్యకృషికి అది ఎంతో ఉపకారం చేసింది. ఆ రోజుల్లో గణేశ, హయగ్రీవ, దేవీ నవరాత్రులు, వివిధ పాఠశాలల వార్షికోత్సవాలు, విశేష సందర్భాలలో వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించేవారు. విద్యార్థులం వాటిలో పాల్గొనేవాళ్లం. ఆ పోటీల్లో పాల్గొనటంవల్ల పలు పుస్తకాలు నాకు బహుమతులుగా లభించేవి. రాయప్రోలు 'ఆంధ్రావళి', శివాజి చరిత్ర, ఉత్తర రామాయణం, రాజస్థాన్ కథావళి వంటవి అట్లా లభించి నన్ను 'చదువరి'ని చేశాయి. ఆనాటికి ఆ గ్రంథాల ముద్రణ, బైండింగ్ చాలాముచ్చటగా ఉండేవి.

ఆ రోజుల్లో ఆర్యసమాజం వరంగల్లులో చాలాబలంగా ఉండేది. దానిలో అంతర్లీనంగా రాష్ట్రీయ స్వయం సేవకసంఘం కూడా ఉండేది. సనాతనధర్మ ప్రచారిణీ సభకూడా శక్తిమంతంగా పనిచేస్తుండేది. ఆర్యసమాజ–సనాతనధర్మ సభలు పోటాపోటీగా సాగుతుండేవి. రెండు పక్షాల సభలకూ వెళ్లేవాడిని. సనాతనధర్మ ప్రచారసభ భావాలు

నాకు సహజంగా నా కుటుంబ సంస్కారాలకు సన్నిహితంగావున్నాయి. ఆసంస్కారాలు, ఆర్యసమాజభావాల సంస్కారాలు. రా.స్వ.సే. సంఘభావాల సంస్కారాలు – ఈ వివిధ సంస్కారాల సంపుటిగా నా ఊహాలూ, ఆలోచనలూ దారి వెతుక్కుంటూ ఉండేవనుకుంటాను. ఈ భావాలలోని ఏకసూత్రత స్వదేశం, స్వసమాజం అనే భావాలు ఏర్పడ్డాయి. 'దేశీయత' సహజంగానే నా జీవన సూత్రమయింది.

ఆ రోజుల్లో దేశస్వాతంత్ర్యంకోసం పాటుపడే, ఉద్యమించే ఒకానొక రహస్య సంస్థ వరంగల్లులో ఒకశాఖ ఏర్పాటు చేసింది. ఆ సంస్థ పేరు ('నవభారత్'?) సరిగా గుర్తులేదు కాని చంద్రశేఖర ఆజాద్, భగత్‌సింగ్, యశపాల్ వంటి క్రాంతికారులకు సంబంధించిదని గుర్తు. మా రెండవ వదినగారి తమ్ముడు ఎం.ఎస్. ఆచార్య (అనంతరకాలాన 'జనధర్మ' పత్రికా వ్యవస్థాపక సంపాదకుడుగా 'జనధర్మాచార్య'గా సుప్రసిద్ధులు) ద్వారా ఆ సంస్థతో పరిచయం కలిగింది. బొటనవ్రేలును సూదిలో గ్రుచ్చగా వచ్చిన రక్తంతో సంతకమూ, వేలిముద్రావేసి ఆ సంస్థలో సభ్యుడినయ్యాను కాని, బహుశః నా వయస్సు (10–12)ను బట్టి, రహస్య గోపనశక్తి ఉండదని కావచ్చు నాకు ఏవేవో పైపైపనులు చెప్పేవారుగాని, అంతర్వలయంలోకి రానీయలేదనుకుంటాను. ఒక రహస్య సంస్థకు వివిధ వలయాలుంటాయని గూడా నా కా నాటికి తెలియదు. ఆ తరువాత నాకు తెలియని ఏ కారణంవల్లనో ఆ సంస్థ నాకు తెలియకుండానే అంతర్ధానమయింది. నేను వెనుకటి 'నేను'గానే మిగిలిపోయాను. ఈ నా విషయం రాజలింగంగారికి తెలియకుండా జాగ్రత్తపడ్డాను. ఆయన ఇట్లాంటి 'రహస్య' విషయాలకు వ్యతిరేకి. ఆయనది గాంధీమార్గం. ఆయన 'శిష్యుడి' నయినాగూడా, గాంధీ గారంటే గాఢమయిన అభిమానం ఉన్నాగూడా ఆయనమీద నాకు ప్రామాణ్యాపత్తి ఆ నాటికీ నాలోకలుగకపోవడం ఒక విచిత్ర స్థితి. ఒక విరోధాభాసం.

ఆ నాళ్లలో నన్ను అమితంగా ఆకర్షించి, ఈనాటికీ నా మనస్సునూ ఆలోచనలనూ, ఆశయాలనూ వదిలిపెట్టని మహానుభావులు – సుభాష్ చంద్రబోసు, వినాయక దామోదర సావర్కార్, జయప్రకాశ్ నారాయణ – వీరందరికీ 'ఆలవాల'మని నాకనిపించిన వివేకానందుడు. నా హిందీ మలిగురువు, దక్షిణభారత హిందీ ప్రచారసభ పరీక్షలు నాచే ఇప్పించిన వ్యక్తి భండారు నాగభూషణరావు. ఆయన వద్దనుంచి సుభాష్ మొదలయిన వారిని గురించిన, వారు రచించిన పుస్తకాలు – తెలుగు హిందీ – తెచ్చుకొని చదివే వాడిని. వారి వారి చిత్రాలు సేకరించేవాడిని. అదో ఉత్సాహం.

నాగభూషణరావుగారి తమ్ముడు సదాశివరావుగారు. వరంగల్లులో భండారు వారి కుటుంబం మొదటినుంచీ సాంప్రదాయికమయిన కాంగ్రెసు. కాని సదాశివరావుగారు నెమ్మదిగా రా.స్వ.సే. సంఘంలోకి వచ్చారు. 'జాగృతి' వారపత్రిక వ్యవస్థాపక వర్గంలోవున్నారు. ఆ రోజుల్లో ఆయన విశాఖ ప్రాంత ప్రచారక్‌గా ఉండి వరంగల్ వస్తూపోతూ ఉన్నప్పుడు వారి సంసర్గం నాకు కలిగింది. ఉభయుల సంస్కారాలు, జీవలక్షణాలనుబట్టి ఆయనతో ఒక ఆత్మీయతా, ఐక్యభావన కలిగనయి. ఆయన మంచి రచయిత. హిందీ, ఆంగ్ల, తెలుగుల్లోనూ మంచివక్త. కె.ఎం.మున్షీగారి 'జై సోమనాథ్' తెలుగులోకి ఆయన చేసిన అనువాదం చదివి ఉత్తేజితుడినయ్యాను.

3

'శబ్దానుశాసనాంధ్ర భాషానిలయం' వరంగల్లులోని పెద్ద గ్రంథాలయం. జాతీయోద్యమంలో భాగంగా తెలంగాణాలో వెలసిన గ్రంథాలయాల్లో బహుశః అది మూడవదనుకుంటాను. దానికి చాలా కాలం దేవులపల్లి రామానుజరావుగారూ, ఆ తరువాత దేవులపల్లి దామోదరరావుగారూ కార్యదర్శులు. ప్రజల నెలసరి చందాలతో నడిచే ప్రజాగ్రంథాలయమది. అందులో అనేకానేక ప్రాచీనాధునిక గ్రంథాలు, వివిధ విషయాలు, ప్రక్రియలకూ చెందినవి ఉండేవి. మా మూడవ అన్నయ్య– అప్పలాచార్యులు అందులో పావలా సభ్యుడు. ఆయన నన్ను పంపి నవలలు తెప్పించుకొనేవాడు (మా ఇద్దరిమధ్య తొమ్మిదేండ్ల వార). ఆయనతోపాటు ఆ నవలలు– ఎక్కువశాతం 'డిటెక్టివ్' నవలలు – నేనూ చదివేవాడిని. వాడేవీడు, దొంగలరాణి, చండశాసని, వైరానలము, పాతాళగృహం, జాగిలం వంటివవి. అట్లాంటివి చదివి చదివి నేనూ నాలుగయిదు నవలలు రాయటానికి ప్రారంభించాను. అయితే, అవన్నీ ఆరంభంలోనే పరిసమాప్తమయినయి. కాగా, నా ఈ తరహా 'కాలక్షేపం' నవలాదిగ్రంథాల 'చదువరి'తనాన్ని ఒక ఆరోగ్యకరమయిన మలుపుతిప్పిన సామాన్యుడు – నా వరకు నాకు మహానుభావుడు ఆ గ్రంథాలయాన్ని నెలసరి చందాలు వసూలు చేస్తూ కష్టంగా నిర్వహించే 'రామన్న' (ఆయన ఇంటిపేరు నాటికీ నేటికీ నాకు తెలియదు. లైబ్రరీ రామన్న అనే వాళ్లం). 'ఈ పిచ్చి పిచ్చి పుస్తకాలేం చదువుతావు! బాగుపడాలంటే ఇట్లాంటివి చదువు' అంటూ 'మా బాబు' నవల ఇచ్చాడు. అది విశ్వనాథ సత్యనారాయణగారి రచన. అది మొదలు పెట్టితే, చివరిదాకా ఆగకుండా చదివించింది. తొలినుంచి చివరిదాకా కంటివెంట నీళ్లే. జీవితంలో కష్టాలూ, దుఃఖాలూ ఇన్నిన్ని విధాలుగా ఉంటాయన్న దానితో పరిచయం కలిగింది. అప్పటినుంచి చెలియలికట్ట, జేబుదొంగలు, ఏకవీర, బద్దన్నసేనాని, కిన్నెరసాని పాటలు వంటివి చేతికందినంతగా

చదివాను. రుచికలిగినట్లయింది. అవన్నీ విశ్వనాథ రచించినవని కాక వాటిని రచించినాయన విశ్వనాథ అనే అభిజ్ఞ కలిగింది. 'వేయి పడగలు' ఒక అద్భుతమయిన జీవితాన్ని, ప్రపంచాన్ని ఆవిష్కరించిందనిపించింది. మనస్సరస్సులో ఆవర్తాల కదలిక మొదలయింది.

వీటితోపాటు మరొకవైపు జాతీయోద్యమ నేపథ్యంలో ఉన్న నవలలు, బాపిరాజు 'నరుడు', 'నారాయణరావు', ఉన్నవ 'మాలపల్లి', వేంకట పార్వతీశ్వర కవుల 'మాతృమందిరం' మరికొన్ని నవలలు, ఏకాంతసేవ, భావసంకీర్తనం, కృష్ణశాస్త్రి, వేదుల వారి కవితలూ - ఇట్లా అనేకం ఆ గ్రంథాలయాలలోనే చదివాను. శరత్ నవలల అనువాదాలు - నీలకంఠం అనువదించినవి చదివాను. విమలాదేవి వంటి చారిత్రక నవలలు, చిలుకమర్తి, కందుకూరి రచనలూ దొరికినంతవరకు చదివాను. ఇవన్నీ దేశంలోకి, స్వరాజ్యంలోకి కొత్తగా నడిపించినవి. మా చిన్నన్న (రెండవ అన్న) గారి ద్వారా జాషువా, కరుణశ్రీ వంటి వారి ఖండకావ్యాల పరిచయమయింది. ఇద్దరి పద్యాల్లో ఏదో తేడా వున్నట్టు అన్పించేదిగాని అదేమిటో అప్పటికర్థమయ్యేది కాదు.

ఈ బాల్యానికి సమాంతరంగా -

4

మాది పెద్ద సమష్టి కుటుంబం. నలుగురు అన్నదమ్ములం. మా మధ్య అయిదునుంచి తొమ్మిదేండ్లదాకా ఎడం. మా పెద్దన్నగారి కుమారుడు సుప్రసన్న నా కన్న రెండున్నరేండ్లకు కొంత ఎక్కువే చిన్న. మా నాన్నగారు శ్రీ మాన్ కోయిల్ కందాడై రంగాచార్యులుగారు గొప్ప విద్వాంసులు. మంచి వక్త. తెలుగునాట ఇంచుమించు ఆయన ఉపన్యసించని పెద్దనగరం లేదంటే, అది అతిశయోక్తికాదు. రాజమండ్రి పండితపౌరులు ఆనాళ్లలో 'ఉపన్యాసకేసరి', 'సుబోధక సుధామణి' అనే బిరుదులు చెక్కిన బంగారు పతకాలతో ఊరేగించి సన్మానించారు. శ్రీరంగం, కంచి, తిరునారాయణపురం, శ్రీ పెరుంబుదూరు వంటి తమిళనగరాల్లో మణి ప్రవాళశైలి తమిళంలో ఉపన్యసించి గౌరవాలు పొందారు. రామాయణ భారత భాగవతాలు, శ్రీ వైష్ణవ సంప్రదాయ గ్రంథాల ప్రవచనం ఆయన నిత్యవిధి. తర్కశాస్త్రం ఆయన అభిమాన విషయం. వేదాంత శాస్త్రం ఆయన బహిః ప్రాణం.

నా అక్షరాభ్యాసా (అయిదవయేడు) నికి ముందునుంచే ఆయన నా గురువు. వారిదంతా జిహ్వాగ్రవిద్య. విద్యకోసం ఆయన నానా అవస్థలు పడ్డారు. పలుచోట్లు తిరిగారు.

అదంతా ఒక పెద్దగాథ. కాగా, తన పిల్లలు తనలా కష్టపడకూడదని ఆయనకుండేది.
అందుకని ఆయన నన్ను తన వెంట ఉంచుకొని తను చదువు చెప్పారు. గ్రంథప్రవచనాలకని మూడు నాలుగు నెలలపాటు వేరే ఊళ్లకు వెళ్తూ ఉండేవారు. నా ఉపనయనం ఏడవ (గర్భాష్టమం) ఏట అయినప్పటినుంచీ వారి వెంట ఉండి పంచకావ్యాలదాకా చదివాను. కొంత వేదం, ఉపనిషత్తులు, వైష్ణవ సంప్రదాయ 'నిత్యానుసంధానాలు' సంత చెప్పించుకొన్నాను. నాన్నగారు బుదగరించి నాతో చదివించారు తప్ప చదువుకోసం నన్ను 'శిక్షించి'న గుర్తు నాకు లేదు. తన కొడుకులు ఏదైనా, కనీసం ఒక శాస్త్రంలోనైనా ప్రావీణ్యం సంపాదించాలని వారికుండేది.

వరంగల్లులో ముదిగొండ శంకరశాస్త్రిగారని ఒక క్రియాశీలి ఉండేవారు. తన జీవితమంతా సంస్కృత ప్రచారానికి అంకితం చేశారు. సంస్కృతాంధ్ర కళాశాల నెలకొల్పారు. వరంగల్లులో ఉన్నప్పుడు అక్కడ చదివేవాడిని. బ్రహ్మశ్రీ జయంతి భాస్కర శాస్త్రిగారు (సాహిత్యం), జుబ్బూరు నరసింహశాస్త్రిగారు (వేదం, వ్యాకరణం), శ్రీమాన్ గుదిమెళ్ల వరదాచార్యులుగారు (తర్కం) – ఒకరి తరువాత ఒకరుగా మా ఉపాధ్యాయులు. కారణాలు తెలియవుగాని, ఎవరూ నిలుకడగా, ఏడాదిపాటు గూడా లేరు. అందరివద్దా చదివించారు. అయితే, ప్రాథమిక దశలోనే నా శాస్త్రప్రావీణ్యం ఆగిపోయేది.

ఆ నాళ్లలో వివిధ ప్రాంతాల పండితులు – ఆ.చి. శ్రీమన్నారాయణాచార్యులు (అనంతర కాలాన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి), తెలికచర్ల కందాళై గోపాలాచార్యులుగారు, కందాడై శేషాచార్యులుగారు, తిరుక్కండూరు రామానుజాచార్యులు గారు మొదలయిన వారు నాన్నగారిని కలుసుకొనేందుకు వచ్చేవారు. వివిధ సాహిత్య, శాస్త్ర సంప్రదాయ విషయాలు చర్చించుకొంటూ ఉండేవారు. మా నాన్నగారు శ్రీ వైష్ణవ సంప్రదాయ నిష్ఠులు. విశిష్టాద్వైత సిద్ధాంతులు. ఉభయవేదాంత ప్రవర్తకులు. అయితే వీరిలో వివిధ సంప్రదాయాల సమన్వయ లక్షణం అధికంగా ఉండేది. ఇతర సంప్రదాయ దూషణ, నిందవంటివి ఏ కోశానా ఉండేవి కాదు. వారు ద్వైతాద్వైత విశిష్టాద్వైతాలను నేరుగా అధ్యయనం చేశారు. వారి గ్రంథసంచయం పెద్దది, మా ఇంటికి శ్రీ వైష్ణవపత్రిక, రామానుజ పత్రిక (కంచి ప్రతివాది భయంకర అణ్ణంగరాచార్యులు గారి సంపాదకత్వం. వారు నాన్నగారికి అత్యంతాప్తులు), ఇతర సంప్రదాయ పత్రికలూ వస్తుండేవి. 'నటన' మదరాసునుండి వచ్చేది. అర్థమయినా కాకున్నా వాటిని అంతో ఇంతో చదివే అలవాటు ఏర్పడింది. నాన్నగారి గ్రంథసంచయంలో సాహిత్యగ్రంథాలూ (కావ్యనాటకాదులు), పురాణేతిహాసాలు, వివిధ సంప్రదాయ గ్రంథాలు, ఛందోవ్యాకరణాలంకార శాస్త్రగ్రంథాలూ

మొదలయిన వనేకం ఉండేవి. ఆ సంచయంలోనే, 'లూకాసువార్త', గాంధీదేవుడే, భగవద్గీత కమ్యూనిజమేవంటివి ఉండేవి. అవీ చదివాను.

మా నాన్నగారు మమ్మల్నెవరినీ సర్కారీ స్కూళ్లకు పంపలేదు. మా రెండవ అన్నగారు మాత్రం ఎట్లాగో తనతోటివారితో సర్కారీబడిలో చేరారు. మెట్రిక్యులేషన్ దాకా చదివివారు. ఆయనకు చదువుమీద అధిక శ్రద్ధ. మా నాన్నగారి తరువాత నా చదువు విషయం పట్టించుకొన్నదాయనే. నాకేమయిన ఇంగ్లీషు వచ్చిందంటే అది ఆయన చలవే. రజాకార్ల అల్లర్లలో (ఆ అనుభవాలు వేరే కథ) మా కుటుంబం బెజవాడ (విజయవాడ) చేరింది. అక్కడ అందరమూ ఒకచోటలేము. మా చిన్నన్న (రెండవ అన్న - లక్ష్మీనరసింహాచార్యులు) గుంటూరు జిల్లా రేపల్లె దగ్గరి నల్లూరి పాలెంలో పిల్లల బడినడిపించారు. ఆయనవెంట నేను. అక్కడ ఆ బడిలో హిందీ చెప్పటంలో ఒక పంతులుగారుగా సహాయపడేవాడిని. తరుచూ ఏవో సామాన్లు తెచ్చుకొనేందుకు రేపల్లె వెళ్లవలసి వచ్చేది. అట్లా పొలాలగట్లా వెంట వెళ్తూ వస్తూ చిన్నన్నగారు నాకు ఇంగ్లీషు చెప్పేవారు. హిందీ నేర్చుకొనే ఒక యువ విద్యార్థి నాకు ప్రతిదినం వారింట్లో పాలు ఇచ్చేవాడు. పాలకుబదులు ఒక పుస్తకం కొని ఇమ్మన్నాను. అతడంగీకరించాడు. రేపల్లె వెళ్లి గాంధీగారి సంక్షిప్త ఆత్మకథ (హిందీ) కొనుక్కున్నాను. చదివాను.

పోలీసు యాక్షన్ తరువాత వరంగల్లు చేరాం. ఒక మిత్రుడి ప్రోత్సాహంతో ప్రాచ్యవిద్యాకోర్సులు చదివేందుకు వీలుగా మదరాసు విశ్వవిద్యాలయం నిర్వహించే 'ఎంట్రెన్స్' పరీక్ష తెనాలి వెళ్లి వ్రాశాను. ఆ పరీక్ష రెండు భాగాలు - సంస్కృతం ఎక్కువ, తెలుగులో 100 మార్కులకు ఒక వ్యాసం రాయవలసి ఉండేది. తెలుగు భాగంలో ఫేలయ్యాను అయినా 'విద్యాప్రవీణ' చదువవచ్చు. కాని భాషాప్రవీణ (తెలుగు) చదివేందుకు తెలుగులో కూడా ఉత్తీర్ణత అవసరం. అందులోని రెండవసారి తెలుగు పాసయ్యాను. తరువాత ఎక్కడికి వెళ్లాలి? అప్పటికి తెలంగాణాలో విశ్వవిద్యాలయం గుర్తింపుగల ప్రాచ్యవిద్యా కళాశాల ఏదీ లేదు. కొవ్వూరు వెళ్దామనుకున్నాను గాని, మా శంకరశాస్త్రిగారి సలహామేరకు నాన్నగారు నన్ను చిట్టిగూడూరుకు పంపించారు.

5

శ్రీమత్తిరుమల గుదిమెళ్ల వరదాచార్యులుగారనే ఒకమహానుభావుడు తన చిన్న గ్రామం - చిట్టిగూడూరులో తమ తండ్రిగారి పేరిట 'నారసింహ సంస్కృత కళాశాల' నెలకొల్పారు. అంతకుముందు ఆయన కొవ్వూరు కళాశాలకు ప్రిన్సిపల్‌గా ఉండేవారట.

కారణాలు నాకు సరిగా తెలియవుగాని, 'అక్కడి మేనేజిమెంటుతో సరిపడక' అని వినికిడి – అక్కడినుంచి వచ్చి ఈ కళాశాల స్థాపించారు. ఆయన పరమ స్వతంత్రుడు. ఆ కళాశాలలో చదువుకున్న వారెందరో వివిధ రంగాల్లో సుప్రసిద్ధులు. నాకీక్షణంలో గుర్తుకొస్తున్నవారు – కాట్రగడ్డ రాజగోపాలరావు, జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి, కొత్తసత్యనారాయణ చౌదరి, కొండవీటి వెంకటకవి, వేదాంతం రామకృష్ణమాచార్యులు, జాస్తి సూర్యనారాయణ మొదలయినవారు. అక్కడ అధ్యాపకులుగా పనిచేసిన మహానుభావులు బ్రహ్మశ్రీ దువ్వూరి వేంకట రమణశాస్త్రిగారు, శ్రీమాన్ కరి రామానుజా చార్యులుగారు, వేదాల తిరువేంగళాచార్యులుగారు మొదలయిన మహామహులు. నేను వెళ్లిన నాటికి (1949) కరి రామానుజాచార్యులుగారు రెండవసారి అధ్యాపకులుగా వచ్చారు. బ్రహ్మశ్రీ మల్లంపల్లి వీరేశ్వరశర్మగారే తెలుగు చెప్పేవారు. శర్మగారి తమ్ములు శరభయ్యగారు భాషాప్రవీణ మొదటి సంవత్సరం కావ్యాలు, బాలవ్యాకరణం చెప్పారు. శ్రీమాన్ తట్టా రంగాచార్యులుగారూ, కరివారూ సిద్ధాంత కౌముది, తట్టా నరసింహా చార్యులుగారు సంస్కృత కావ్యనాటకాలు చెప్పారు.

పాఠాలు చెప్పటం ఒక ఎత్తు కాగా, అందరూ విద్యార్థులయెడ చూపించే ఆప్యాయత మరో ఎత్తు. మా ప్రిన్సిపల్‌గారి కుటుంబం మొత్తం ఆప్యాయతే. విద్యార్థులు ఒక్కరుగా గాని, కొందరుగా కానీ తామే వంట చేసుకొని భోజనం చేయాలని ఆయన పెట్టిన ఒక నియమం. అందుకు తగిన వసతి, వస్తువులు ఆయనే సమకూర్చేవారు. ఆయన భార్య లక్ష్మమ్మగారు మాకు తల్లికి దూరంగా ఉన్నామేనన్నభావం కలక్కుండా ఆదరించేది. కోడలూ అంతే. కూరలు, పచ్చళ్లు, చిక్కని మజ్జిగ ఎప్పుడడిగితే అప్పుడిచ్చేవారు. ఎట్లా ఏం వండుకోవాలో చెప్పేవారు. వారి వాత్సల్యం గూర్చి ఏమి చెప్పినా అతిశయోక్తి అనిపిస్తుంది కాని, అది నిజం.

అక్కడ ఉన్న కాలమంతా సాహిత్యవ్యాసంగమే. మరో ధ్యాస లేదు. కంఠస్థంగా పద్యాలు చదువటం, పోటీపడి పద్యాలు రాయటం, గుణదోషాలు చర్చించటం, వ్యాకరణాలు 'చింతన' చేయటం.

కళాశాలా విద్యార్థుల వ్రాతపత్రిక (మాస) ఒకటి ఉండేదిట. అది కొంతకాలంగా ఆగిపోయింది. దాన్ని పునఃప్రారంభించాను. అందరూ సహకరించారు. కొందరు కథలు, కవితలు రాసేవారు. యడవల్లి ఆంజనేయశాస్త్రి ధారావాహిక నవల రాసేవాడు. ఎవరి రచనలు వారే వ్రాసేవారు. సెలవుల్లో వరంగల్ వచ్చినప్పుడు సుప్రసన్న (మా పెద్దన్నగారు వేంకటనరసింహాచార్యులుగారి కుమారుడు. అప్పుడు వరంగల్లులోని ఎ.వి. హైస్కూలులో

చదువుతూ ఉండేవాడు. యద్దనపూడి కోదండరామశాస్త్రి హెడ్‌మాస్టర్. విశ్వనాథ వెంకటేశ్వర్లుగారు, హరి రాధాకృష్ణమూర్తి, దూపాటి రమణాచార్యులు మొదలయినవారు అక్కడ ఉపాధ్యాయులు) తో నా సాహిత్యవ్యాసంగం సాగేది. వరంగల్‌లోని వేయిస్తంభాల గుడివంటి చారిత్రక ప్రదేశాలకు ఉదయం వెళ్లి సాయంత్రం దాకా అక్కడ అతని హైస్కూలు, మా కళాశాల విశేషాలు, అనుభవాలు కలబోసుకుంటూ, ప్రాచీనాధునిక కావ్యాలు చదువుకొంటూ గడిపేవాళ్లం. అది వికృతి సంవత్సరం 'సుకృతి' అనే మాస వ్రాతపత్రిక నిర్వహించాం. మొదటి సంచిక కందుకూరి వీరేశలింగం స్మృత్యంకం.

6

చిట్టి గూడూరులో ఉన్నప్పుడే నా రచనా విషయంగా ఒక చెప్పుకోవలసిన సన్నివేశం సంఘటించింది. శ్రీ నండూరి రామకృష్ణమాచార్యులు ఆనాటికే ప్రసిద్ధకవి. కరుణశ్రీ, ధనకుధరం, బృందావనం రంగాచార్య వంటి వారందరూ ఒక కోవ కవులు. కరుణశ్రీ సంపాదకత్వంలో 'సుభాషిణి' అనే ఒక సాహిత్య మాసపత్రిక ఆ రోజుల్లో వస్తూండేది. కరుణశ్రీ పద్యాలతో అప్పటికే – చి.గూ. వచ్చేనాటికే బాగా పరిచయం. ఆ రోజుల్లో నండూరివారి 'తారాతోరణం' అనే కవితా సంకలనం నా కందుబాటులోకి వచ్చింది. అది చదివిన ఉత్సాహంతో కొంచెం విస్తృతంగానే ఒక వ్యాసంరాసి 'కృష్ణా పత్రిక' (బందరు)కు పంపించాను. అదే గుర్తించవలసిన నా తొలి 'విమర్శ' వ్యాసం (కళాశాల, సుకృత వ్రాత పత్రికల్లో రాసిన వ్యాసాలు కాక) అనుకుంటాను. ఆ సంకలనంలోని వివిధ ఖండికల కవితా విశేషాలను, అందచందాలనూ వివరిస్తూనే; 'శీర్ణమేఖల' అనే ఖండికను గూర్చి మాత్రం తీవ్రంగా అభిశంసించాను. ఆ ఖండికలో కర్ణ దుర్యోధనుల గాఢమైత్రిని ఉదాత్తీకరించేందుకు దుర్యోధనుని భార్య భానుమతిని కించపరచటం, దేశీయ సంప్రదాయాలను పట్టించుకోకపోవటం వంటివి నా మనస్సును తీవ్రంగా కలతపెట్టటమే అందుకు కారణం. ఒక లబ్ధ ప్రతిష్ఠితుని రచనను గురించి అట్లా రాయటం సాహసమే కావచ్చు. అప్పటికి నా వయస్సు ఇరవయికిలోపే (ఆ వ్యాసం వ్రాసిన తేదీలు గుర్తులేవు. దాని కాపీకూడా ఉంచుకోలేదు. పత్రికలకు పంపే వ్యాసానికి కాపీ ఉంచుకోవాలన్న తెలివిడికూడా ఆ నాటికి లేదు. అది అనుభవరాహిత్య ఫలంకావచ్చు). ఇంతకూ ఆ వ్యాసాన్ని 'కృష్ణాపత్రిక' ప్రచురించనే లేదు.

ఆ నాళ్లలోనే కరుణశ్రీ 'కుంతీకుమారి'ని గూర్చిన రెండు ఖండికలూ, నండూరి 'శీర్ణమేఖలా' కలపి 'నవభారతం' పేర ఒక సంకలనం గుంటూరి నుంచో, తెనాలినుంచో

వెలువడింది. దాన్ని కృష్ణాపత్రికలో 'సవ్యసాచి' సమీక్షిస్తూ 'శీర్ణమేఖల' గూర్చి నా అభిప్రాయాలకు దగ్గరగా వ్రాశారు. దానికి పురాణపండ దీక్షితులు 'సవ్యసాచికి సమాధానం' అంటూ శీర్ణమేఖలను సమర్థిస్తూ, ఆ కథ కన్నడ భారతంలో ఉందని వ్రాశారు. అదీ 'కృష్ణాపత్రిక'లో వచ్చింది. అది చదివి 'సవ్యసాచికి సమాధానం: ఒక పరికింపు' అంటూ, ఆ కథ ఎక్కడ ఉన్నా అది అనుచితమయిందేననీ, భారతీయ / తెలుగు జీవన విధానానికి అది తగింది కాదని కొంచెం ఘాటుగానే రాశాను. దాన్ని కృష్ణాపత్రిక ప్రచురించింది (సవ్యసాచి అంటే విన్నకోట మాధవరావు గారనీ, ఆయన కాటూరి వేంకటేశ్వరరావుగారి వియ్యంకుడనీ, పురాణపండ దీక్షితులు ఉషశ్రీ అనీ ఆ తరువాత – బహుశః శరభయ్యగారనుకుంటాను – చెప్పారు). ఆ సన్నివేశం నాకొక ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది. నా రాతను మా గురువులు 'బాగుంది' అన్నారు మరి.

వరంగల్లు నుంచి చిట్టిగూడూరు వస్తూ బెజవాడ బస్స్టాండ్లో పుస్తకాలు పత్రికలూ కొని ప్రయాణంలో చదివేవాడిని. అప్పుడు పటమట నాస్తిక కేంద్రం నుంచి గోరా సంపాదకత్వంలో వచ్చే 'నాస్తిక' వారపత్రిక, రెంటాల గోపాలకృష్ణ 'సర్పయాగం' వంటివి అట్లా చదివినవాటిలో ఉండేవి. బందరు వెళ్లి 'త్రివేణి' పుస్తకాల షాపులో 'వైతాళికులు' కొన్నాను. అప్పటికి చాలా అందమైన గ్రంథం. 'ఆధునిక' కవులు ఇంచుమించుగా అందరూ పరిచయమయ్యారు. పింగళి, కాటూరి 'సౌందరనందం' ఆ రోజుల్లోనే చదివాను. అదొక మల్లెల వానగా మనసుపై కురిసింది. మా శరభయ్యగారి మేనల్లుడు కాశీనాథుని శ్రీశైలపతి మదరాసు (ఆంధ్రపత్రికలో పనిచేసేవారు) నుండి వస్తూ పోతూ ఉండే సున్నితమైన భావుకుడు. ఆయనా, శరభయ్యగారు కవితాధ్యయనం గూర్చిన దారులు కొన్ని విశదం చేసేవారు. మనస్సు సాహిత్య వివేచన పరంగా వరిపిళ్లు పొందింది. నానాటికి భావకవితా కాలం గడిచింది. 'అభ్యుదయ' సాహిత్యం ఉరవడిలో ఉంది. ఆ రోజుల్లోనే కృష్ణాపత్రికలో విశ్వనాథ 'కుణాలుని శాపం' ధారావాహికగా నవల వచ్చేది. అది ఒక దుఃఖస్రవంతి, అధికారాహంకారాలకు – ఆప్యాయతలకు సాగిన సంఘర్షణ. విశ్వనాథ 'రామాయణ కల్పవృక్షం' బాల, అయోధ్యకాండల అనుభవం చిట్టిగూడూరు నాటిదే. బందరుకు సత్యనారాయణగారు వచ్చిన సందర్భంలో తప్పక వెళ్లి దర్శించుకొని వచ్చేవాడిని.

7

విశ్వనాథ సత్యనారాయణగారి ప్రథమ దర్శనం, పరిచయం జరిగిన సన్నివేశం నా వరకు నాకు ఒక మధుర ఘట్టం. చిట్టిగూడూరు వెళ్లేందుకు వరంగల్లో ఉదయం

రైలులో బయలుదేరి మధ్యాహ్నానికి బెజవాడ చేరి అక్కడ తెలిసిన వారింటిలో ఆరోజు ఉండి తెల్లవారి బందరు బస్సులో చిట్టిగూడూరు చేరేవాడిని (అప్పుడు చాలావరకు బొగ్గు బస్సులే). 1950లో ననుకుంటాను – ఒకనాడు ఈ ప్రయాణంలో విజయవాడ సామ రంగం చౌక్‌లోని ఒక పెద్ద బుక్‌స్టాల్‌కు వెళ్లి సత్యనారాయణగారి 'అనార్కలీ' నాటకం కావాలన్నాను. ఊటుకూరు సత్యనారాయణగారి 'అనార్కలీ' ఇచ్చాడు. ఇది కాదు, విశ్వనాథ సత్యనారాయణగారిది కావాలన్నాను. ఆయనది గూడా ఉందా? మాకు తెలియదన్నారు. ఉన్నది, నాకు తెలుసన్నాను. మా దగ్గిర మాత్రం లేదు. ఆయనది ఈ ఊరేగదా, వెళ్లి ఆయన్నే అడగమన్నారు. సత్యనారాయణపురంలో ఉంటారన్నారు. వెంటనే వెతుక్కుంటూ వెళ్లాను. అక్కడ ఒకాయన కలిసి, మారుతీనగర్‌లో కాలేజి ప్రక్కన ఉంటారని గుర్తులతో దారి చెప్పాడు. మొత్తంమీద వెళ్లాను. గేటుదాటి లోపలికి వెళ్తే ఎడంప్రక్క ఒక గుండ్రని గుడిసె, కుడిప్రక్క కొంచెం లోపలగా దీర్ఘ చతురస్రం గుడిసె. ఒక కుర్రాడు నన్ను గుండ్రని గుడిసె (అది అతిథులు వస్తే కూర్చోనేదన్నమాట)లో కూర్చోమని, ఎక్కడినుంచి వచ్చారని అడిగారు. వరంగల్లునుంచి అన్నాను. అతను వెళ్లిన కొద్దిసేపటికి ఒక పొడవాటి వ్యక్తి, మోకాళ్లదాకా పైకి చెక్కిన ధోతితో చొక్కా లేకుండా వచ్చారు. ఆయనే సత్యనారాయణగారనిపించింది. పాదాభివందనం చేశాను. బండబెంచిమీద కూర్చొని, వరంగల్ నుంచి వచ్చావా? మా వెంకటేశ్వర్లు తెలుసా? అన్నారు. తెలుసన్నాను. చిట్టిగూడూరులో భాషాప్రవీణ చదువుతున్నానన్నాను. శరభయ్య తెలుసా? అన్నారు. వారే నాకు తెలుగు వ్యాకరణం చెబుతారని, ఆయనా, వీరేశ్వరశర్మగారూ నాగురువులన్నాను. ఎందుకొచ్చావు? అన్నారు. అనార్కలీ విషయం, పుస్తకాల షాపతను చెప్పిందీ చెప్పాను. ఆయన నవ్వి – 'అవును, ఆ గ్రంథం ప్రతులన్నీ ఎప్పుడో అయిపోయాయి. అందుకని వాళ్లట్లా అని ఉంటారు' అంటూ ఆయన ఇంట్లోకి వెళ్లి మూడుపుస్తకాలతో వచ్చి కూర్చుంటూ 'పుస్తకాలు కొనుక్కోగలవా?' అన్నారు. ఏమనాలో తోచలేదు. 'పుస్తకాలు కొనుక్కోలేనంత స్థితిలో లేను' అన్నాను. ఆయన నవ్వి, ఇదుగో ఈ రామాయణం బాలకాండ నాలుగు రూపాయలు ఇవ్వు, ఈ త్రిశూలం, నర్తనశాల నాటకాలు ఊరికే ఇస్తున్నా. తీసుకో చదువు అన్నారు. అట్లాగే చేశాను. సెలవు తీసుకొని వచ్చాను. అప్పటినుంచి ఎప్పుడు బెజవాడ వెళ్లినా ఆయన్ను దర్శించుకోవటం ఒక తప్పనిసరి విధి అయింది. అట్లా సాగిన పరిచయంలో క్రమక్రమంగా ఆయన కాళిదాస భవభూతుల గురించీ, ఇంకా సాహిత్య కావ్య మర్యాదగురించీ చెప్పినవి మనస్సు కెక్కించుకోవటం మొదలయింది. తన రచనల గురించి 'ఇట్లా' ఆయన చెప్పిన గుర్తు లేదు. కాని ఆయన చెప్పిన విషయాలు సాహిత్యాధ్యయనంలో – ఆయన సాహిత్యాధ్యయనంలోనూ

మార్గదర్శకాలయి నన్ను ముందుకు నడిపించినయి. ప్రాచీనాధునిక వర్తమాన సాహిత్యాని కన్వయించి అవగతం చేసుకోవటం అలవాటయింది. ఇప్పటికీ అంతే.

8

1953 మార్చి-ఏప్రిల్ నెలల్లో భాషాప్రవీణ పూర్తి చేసుకొని చిట్టిగూడూరునుంచి వరంగల్లుకు వచ్చిన కొత్త రోజుల్లోనే సిద్ధిపేటలో ప్రభుత్వ హైస్కూల్లో ఉపాధ్యాయుడుగా ప్రవేశించాను. ఆ రోజుల్లోనే అనిసెట్టి, అవసరాల, బెల్లంకొండ, రెంటాల సంపాదకత్వంలో వచ్చిన 'కల్పన' వరంగల్‌లోని 'వెంకటరామా అండ్ కో'లో చేతికందింది. అది చదివితే మండుటెండల్లో ప్రయాణిస్తున్నట్టనిపించింది. పేరుకే అది 'కల్పన', నిజానికది ఒక 'జ్వలన' అన్పించింది. అదట్లా ఉంచి 'కవిత్వ', 'అకవిత్వ' పార్శ్వాలు రెండూ అందులో ప్రదర్శితమయ్యాయనిపించిందానాళ్లలో. 'వైతాళికులు' అనుభవం వేరు, 'కల్పన' అనుభవం వేరు.

అప్పటికీ తిక్కన కావ్యరచనతో యువకునిగా పేరొందిన వేముగంటి నరసింహాచార్య, అనంతర కాలాన జానపదచిత్ర కళాకారుడుగా సుప్రసిద్ధుడయిన కాపురాజయ్యలు సిద్ధపేటవారే. వారితోనూ, స్థానికులయిన యువ కవులు, రచయితలతోనూ పరిచయం విస్తరించింది. తెలంగాణా రచయితల సంఘం ఊరూరా శాఖలుగా వ్యాపిస్తున్న రోజులవి. సంఘం అధ్యక్షుడు దాశరథి. కార్యదర్శి సి. నారాయణరెడ్డి, అప్పటికే వారిద్దరూ కవులుగా దేశంలో సుప్రసిద్ధులు. వారు తెలంగాణాలో యువకవులను రచయితలను ఉత్సాహపరస్తూ సంఘశాఖలు నెలకొల్పుతూ జిల్లా, తాలూకా నగరాలు పర్యటిస్తూ ఉండేవారు. (ప్రాచీన) కావ్య పఠనగోష్ఠులు, కవి సమ్మేళనాలు, చర్చాగోష్ఠులు, అవధాన ప్రదర్శనలు వంటివి సంఘకార్యక్రమాలు. నేను సిద్ధిపేటలో ఉన్నప్పుడు (ఉన్నది మూడు నాల్గు నెలలు. అంతలోనే భువనగిరికి వచ్చాను). సి.నా.రె. ఒక సమావేశానికి వచ్చారు. కావ్యపఠన గోష్ఠిలో ఆయన పాల్గొని 'లలనాజనాపాంగ –' వంటి 'వసుచరిత్ర'లోని సీసపద్యాలను గేయాలవలె పాడి వాటిని గూర్చి మాట్లాడాడు. ఆనాటి ఆయన మధుర గళనాదం ఈనాటికీ భావనలో పారవశ్యం కలిగిస్తుంది. అప్పుడాయనతో కలిగిన పరిచయం క్రమంగా గాఢమవుతూ ఈనాటికీ చెక్కు చెదరలేదు.

ఆ రోజుల్లో 'ఉదధి' అనే గుప్తనామంతో తెలంగాణా యువరచయితలను పరిచయం చేసేనెపంగా, సినారె (సి. నారాయణరెడ్డి నాటికీ నేటికీ సి.నా.రె.గా అందరికీ ఆత్మీయుడు. ఆ పిలుపు విద్యార్థిలోకంనుండి ఆనాడు ఆయనకు సిద్ధించింది. ఆనాడాయన ఉస్మానియా

విశ్వవిద్యాలయంలో తెలుగు ఎం.ఏ. విద్యార్థి) 'విశ్వగీతి' అనే ఒక చిన్నగేయకావ్యాన్ని విమర్శిస్తూ వ్రాశాడు. దాన్ని చదివి ఆ కావ్యంలోని వస్తుగతమైన ఆధునికతను, కావ్యసౌందర్యాన్ని విశ్లేషిస్తూ ఒక వ్యాసం రాశాను. అది 'గోలుకొండ పత్రిక'లో వచ్చింది. సి.నా.రె. కావ్యం గురించి వెలువడిన విశ్లేషణాత్మకమైన తొలి వ్యాసం బహుశః అదేననుకుంటాను.

1953లోనే తెలంగాణా రచయితల సంఘం తొలి వార్షికోత్సవం పరమవైభవంగా జరిగింది. ఈనాటి రాజకీయ 'సభ'లకు లారీలలో తోలుక రాబడే జనం వలే కాక, స్వచ్ఛందంగా జనం వచ్చారు (ఆ నాళ్లలో సాహిత్య సభలు కలిగించిన ఉత్సాహం అంతటిది). ఆ సభలకు శ్రీశ్రీ, ఆరుద్ర, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు మొదలయిన ప్రముఖులు వచ్చారు. కాళోజీ నారాయణరావు, వట్టికోట ఆళ్వారు స్వామి, వానమామలై వరదాచార్యులుగారు వంటి వారందరూ సభలను నిర్వహించారు. అందరిలోకి సి.నా.రె. ఒక గొప్ప ఆకర్షణ. ఆయన 'నవ్వని పువ్వు' గేయనాటిక గిడుతూరి సూర్యం దర్శకత్వంలో గొప్పగా ఆ సభలలో ప్రదర్శింపబడింది. ఆ సభలలో 'కవి సమ్మేళనం'లో నేనూ పాల్గొన్నాను. దానికి అధ్యక్షుడు కాళోజి నారాయణరావు, ఆయన సభ నిర్వహణ అదొక విలక్షణమయింది.

గిట్టనివారు కొందరు తెలంగాణా రచయితల సంఘాన్ని 'తెర సంఘం' అంటూ వెక్కిరించేవారు. కాని తెర సంఘం తెలంగాణాలో ఆధునికంగా ఉదీయమాన సృజన శీలురందరినీ తెరయెత్తి రంగంమీదికి తెచ్చింది.

'దక్షిణభారత హిందీ ప్రచార సభ' హైదరాబాదులో ఒక శాఖ నెలకొల్పింది ఆ రోజుల్లోనే. దాని పక్షాన శాఖానిర్వాహకుడు వేమూరి ఆంజనేయశర్మ సంపాదకత్వంలో 'స్రవంతి' అనే సాహిత్య మాసపత్రిక మొదలయింది. దానికి వెన్నుబలం తెలంగాణా రచయితల సంఘమే. దాని సంపాదకవర్గంలో సి.నా.రె. ఒకరు. అప్పటికే నేను ద.భా.హి.ప్ర. సభవారి పరీక్షలలో 'విశారద' దాకా ఉత్తీర్ణుడనయి ఉండటం వల్ల, హిందీ సాహిత్యంతోనూ పరిచయం ఉండింది. రామచంద్రశుక్ల, నామ్‌వరసింగ్‌వంటి వేరు వేరు తరాలు, స్తరాలకు చెందిన విమర్శకుల, కవుల – జయశంకర ప్రసాద్ 'కామాయని', మైథిలీ శరణగుప్త 'సాకేత్', 'యశోధర' వంటి కావ్యాలు, 'ఆర్యావర్త్' వంటి సాహసకావ్యాలు, నవలలు చాలా చదివి ఉండటంవల్ల కావచ్చు 'స్రవంతి'తో, వేమూరి వారితో సాన్నిహిత్యం కుదిరింది. తెలుగు స్వతంత్ర, కృష్ణాపత్రిక, తెలుగు విద్యార్థివంటి పత్రికలతోపాటు

స్రవంతిలోనూ నా కవితలు, సమీక్షలు, వ్యాసాలు విరివిగా వచ్చినయి. 'ప్రణయ కవితారథ్య' అనే ప్రధాన శీర్షికతో కృష్ణశాస్త్రి, నాయని, వేదుల, రాయప్రోలు, విశ్వనాథల ప్రణయకవితా స్వరూపాన్ని విశ్లేషిస్తూ 1956 డిసెంబరు –57 జనవరిదాకా అయిదు వ్యాసాలు స్రవంతిలో వచ్చినయి. వీటికి గుర్తింపువచ్చింది. నాయనివారు కొత్తగా వెలువడిన తమ 'సౌభద్రుని ప్రణయయాత్ర - ఇతరకవితలు' సంకలనాన్ని 'ప్రణయకవితా రథసారథి'కి అంటూ ఆశీః పూర్వకంగా నాకు ఇవ్వటం, కేతవరపు రామకోటిశాస్త్రి నా 'కృష్ణశాస్త్రి' వ్యాసంలోని నా వ్యాఖ్యానం ఆక్షేపించటం ఈ గుర్తింపుకు ఒక గుర్తు.

1957లో 'రామాయణ కల్పవృక్షచ్ఛాయలో ఊర్మిళ' అన్న వ్యాసం 'సాకేత్'లోని ఊర్మిళతో తులనాత్మకంగా వ్రాస్తే 'జాగృతి' ప్రచురించింది. ఈ వ్యాసం పునాదిగా 'రామాయణ కల్పవృక్షము - తులనాత్మక పరిశీలన' అనే ప్రసంగంవ్యాసం 1958లో 'రసధుని' పక్షాన నిర్వహింపబడిన 'విశ్వనాథ సాహిత్య సమాలోచన' సభలో చదివాను. అది స్రవంతిలో (58 నవం) వెలువడింది. తులసీ, కంబ, భాస్కరాది తెలుగు రామాయణాలతోనూ తులనాత్మక విచారణ ఈ వ్యాసం. కల్పవృక్షం గూర్చి ఇంత విస్తృతంగా తులనాత్మక పరిశీలన చేసిన తొలి వ్యాసం బహుశః ఇదే ననుకుంటాను. అప్పటికి నేను వ్రాసిన వ్యాసాల్లోనూ తొలి పెద్ద వ్యాసం కూడా ఇదే. అప్పటికి రామాయణ కల్పవృక్షం సుందరాకాండ వరకే వెలువడిందనుకుంటాను. యుద్ధకాండ వెలువడిన చాలా కాలం తరువాత స్మృత్యంకంగా వెలువడిన 'విశ్వనాథ శారద–1' (1982) వ్యాస సంకలనం కోసం 'యుద్ధకాండ శిల్పావతారిక' అన్న వ్యాసం రాశాను. విశ్వనాథ సాహిత్యం గూర్చి రాసిన వివిధ వ్యాసాల్లో 14 ఎన్నిక చేసి 'విశ్వనాథ సాహిత్య దర్శనం' (వ్యాస సంకలనం) 2004లో వెలువరించటమయింది.

విశ్వనాథ విషయం అట్లా ఉంచి, 'చలం: పురూరవ' అని ఒక విస్తృతవ్యాసం 'జయంతి' (సంపా. జువ్వాడి గౌతమరావు - 1959 నవం) పత్రికలో వచ్చింది. మళ్లీ 'సృజన' (సంపా. వరవరరావు 1969) చలం విశేష సంచికలో పునర్ముద్రితమయింది. చలం రచనలు–శశాంక, మ్యూజింగ్స్, ఉత్తరాలు వంటి వాటిని భూమికగా చేసుకుని – ప్రేమ సౌందర్యాల ఆధ్యాత్మికత ఈశ్వరీయతను చిత్రించిందీ వ్యాసం. సృజన సంచికను 'సంవేదన' సంపా. రాచమల్లు రామచంద్రారెడ్డి సమీక్షిస్తూ (1969 జూలై) తన సహజమయిన దురుసుతనంతో దుడుకుగా ఆక్షేపించాడు. ఆయన చలాన్ని పురూరవను కూడా వదిలిపెట్టలేదు. ఆయన ఆక్షేపణలకేంగాని, ఈ కోణంలో చలాన్ని– పురూరవను గూర్చిన తొలి వ్యాసమది.

9

భువనగిరి నుంచి మానుకోట (మహబూబాద్– వరంగల్ జిల్లా) హనుమకొండలకు బదిలీలమీద వచ్చాను. హనుమకొండ (వరంగల్) 1959లో మల్టీపర్పస్ స్కూల్లో అధ్యాపకత్వం. నేను భువనగిరి (నల్లగొండ జిల్లా)లో ఉన్నప్పుడే జనగామ (వరంగల్ జిల్లా) లో ఉరుపుటూరి రాఘవాచార్యులుగారి నిర్వహణలో తెలంగాణా రచయితల సంఘం (రెండవ?) వార్షికోత్సవం వైభవంగా జరిగింది. దానికి శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యులుగారు వచ్చారు. ఆ ఉత్సవంలోనే కాళోజీ సంఘం అధ్యక్షులుగా ఎన్నుకోబడినట్టు గుర్తు (నిజానికి తెలంగాణా రచయితల సంఘం చరిత్ర తెలంగాణంలో అది సాధించిన సాహిత్య సాఫల్యాలను, రచయితలకు అందించిన ప్రోత్సాహాలు, ప్రచురణలు మొదలయిన వాటిని గూర్చి ప్రత్యేకంగా ఒక గ్రంథం వెలువడటం అవసరం. దానివల్ల నాటి నేటి సాహిత్యోద్యమాలను పోల్చిచూసుకోవచ్చు. అది కేవలం రచయితల సంఘం మాత్రమే కాదు. చిత్ర, శిల్ప, నృత్య కళాకారులు గూడా అందులో భాగస్థులయ్యారు. అదంతా చెప్పటానికి ఇక్కడ స్థలమూ చాలదు. కాలమూ చాలదు).

నేను ఉద్యోగం (సిద్ధిపేట)లో ప్రవేశించినప్పటినుంచే State Teachers Union (STU) లో కార్యకర్తృ సంబంధాలు నెలకొన్నయి. అవి క్రమంగా గాఢమయి మానుకోటలో మానుకోట తాలూకా STU అధ్యక్షుడిని చేసినయి. ఆ రోజుల్లో ఉరుపుటూరి రాఘవా చార్యులుగారి అధ్యక్షతలో STU అనేక రకాల ఉపాధ్యాయోద్యమాలు నిర్వహించటంవల్ల STU ఒక ప్రధాన ప్రబల సంస్థగా ఎదిగింది. తాలూకాస్థాయిలో రెండు రోజుల విద్యోత్సవాలు ఇంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి వంటి సహోపాధ్యాయులతో వైభవంగా నిర్వహించబడినయి. ముత్తారెడ్డి, జయశంకర్, సి. రామచంద్రయ్య, ఏ. రామచంద్రయ్య మొదలయినవారు మా నాయకులు. ఆనాటి ఉపాధ్యాయుల, పాఠశాలల సమస్యలను గూర్చి 'జనధర్మ' పత్రికలో పలు వ్యాసాలు రాయటమయింది. STU తో బాటు సమాంతరంగా స్థానిక గ్రంథాలయాలతోనూ సాన్నిహిత్యం, వాటి విస్తృతికి ప్రయత్నించటం కూడా సాగింది.

STU కారణంగా తాలూకాలోని గ్రామాల్లో పర్యటించవలసి వచ్చింది. అప్పుడు పలువురు కవులు రచయితలు పండితులతో పరిచయమయింది. ఉన్నచోటినుంచి బయటకి రాకుండా 'అపరిచితులు'గా ఉన్నవారిని దర్శించాక (ఆ సందర్భంలోనే ఇనుగుర్తిలో ఒద్దిరాజు రాఘవరంగారావుగారిని దర్శించుకొన్నాను. ఆయన సోదరుడు సీతారామచంద్రా

రావుగారు. ఆ ఒద్దిరాజు సోదరులు వారినాళ్లలో సాహిత్య సామాజికపరంగా ఎంతో గొప్ప కృషిచేసిన మహానుభావులు) – అట్లాంటి వారిని దర్శించుకొన్నాక నా కొక ఆలోచన కలిగింది. వరంగల్లు జిల్లా ఒక పరిధిగా అప్పట్నించి ఒక వందేళ్ల కాలపరిమితిని పెట్టుకొని కవిపండితులను గూర్చి వీరి కృషి పరిచయ వ్యాసాలు రాయాలనిపించింది. వరంగల్లులోని 'జనధర్మ' (వార) పత్రికా సంపాదకులు ఎం. ఎస్. ఆచార్య (మాడభూషణం శ్రీనివాసాచార్య) గారితో సంప్రదించాను. ఆయన ఎంతో ప్రోత్సహించారు. పత్రికలో ఆ వ్యాసాలు ప్రచురిస్తామన్నారు. అప్పుడు 'మన పండితులు, కవులు, రచయితలు' అనే ప్రధాన శీర్షికతో దాదాపు నలభయిమందిని గూర్చి వ్యాసాలు ధారావాహికంగా 'జనధర్మ'లో రాశాను. ఒక్కొక్కరిని గూర్చి వరసగా రెండునుంచి నాలుగు వారాల దాకా కూడా ఆ వ్యాసాలు సాగినయి. వారి జీవిత పరిచయం, ఆయా రంగాల్లో వారి కృషి, వారి రచనలు వాటిని గూర్చిన విశ్లేషణాత్మక వివేచన – ఈ విధంగా ఆ వ్యాసాలుండేవి. సమాచారం దొరికినంత వరకు, సంపాదించినంత వరకు ఆ వ్యాసాలు సాగినయి. ఆ తరువాత ఆగిపోయినవి. ఆ పరిచితుల్లో పండరీనాథరావు, రంగరాజు కేశవరావు, ఫణికుండలుడు, తూము రామదాసు, అంబటి లక్ష్మీనరసింహరాజు, మరింగంటి లక్ష్మణదేశికులు, మాడభూషణం రంగాచార్యులు మొదలయిన వారు. ప్రచురితమయిన వాటిలో ఇరవయ్యయిదు వ్యాసాలు ఒక సంకలనంగా 'మన పండితులు, కవులు, రచయితలు' అని 'జనధర్మ' ప్రచురణగా వెలువడింది (వానమామలై సోదరులు, కాళోజీ సోదరులు, దూపాటి వేంకటరమణాచార్యులు, దాశరథి, రామరాజు, పల్లా దుర్గయ్య వంటివారిని గూర్చిన వ్యాసాలు ఈనాటికీ గ్రంథంగా వెలువడలేదు). కాకతీయ విశ్వవిద్యాలయంలో కవి జీవిత సాహిత్య విమర్శగా ఒక పరిశోధన పద్ధతి సాగటానికి ఈ వ్యాసాలు పరోక్ష ప్రేరణ కలిగించాయనవచ్చు. ఈ వ్యాసాల నేపథ్యంలో కా.యు. అనంతర కాలాన దూపాటి వేంకటరమణాచార్యులవారి 'స్వీయచరిత్ర' రామకోటిశాస్త్రి, నేను, సుప్రసన్న సంపాదకులుగా వెలువరించింది (అదో కథ). కవిత్వమంటే?, కవిత్వం చదువటం ఎలా? వంటి వ్యాసాలు కూడా జనధర్మలో 'అంతర్వలయం' అన్న ప్రధాన శీర్షికలో ధారావాహికంగా రాయటమయింది. 'నాక్కూడా ఒక బిరుదివ్వరూ?' అంటూ ఒక అధిక్షేపాత్మక వ్యాసమూ (వ్యంగ్యరచనా) జనధర్మలోనే వచ్చింది.

భాషా శాస్త్రీయ నేపథ్యంలో రాసిన వ్యాసం 'తెలుగులో సంస్కృత ప్రత్యయాలు', ఆంధ్రప్రభలో వెలువడింది. తేదీ గుర్తులేదు, వ్యాసం ప్రతీలేదు. 'బానిసత్వం' వంటి వాటిలోని భావార్థకాది ప్రత్యయాలు తెలుగు పదాలను చేరటం, చేరినప్పుడు కలిగే మార్పులు మొదలయినవి ఇందులో విచారించబడినయి. ఈ రోజుల్లోనే, 'జానుతెనుగు'

స్వరూపంగూర్చి, వ్యావహారిక భాషకు వ్యాకరణం రచించటంలో ప్రయోజనం లేదంటూ వద్లమూడి గోపాలకృష్ణయ్యతో పేచీపడటమయింది. జాను తెనుగు అంటే 'తేట తెలుగు' అనీ, వ్యావహారిక భాషకు బాలవ్యాకరణం వంటి వ్యాకరణాలకన్నా కోరాడవారి 'సంధి' వంటివి ప్రయోజనకరాలని నా వాదం. ఆంధ్రభూమి, ఆంధ్రప్రభలలో ఈ వాదాలు సాగినయి. కాని వద్లమూడి వారు వ్యక్తిదూషణకు దిగటంతో నా వైపునుంచి చర్చ ఆపేశాను. పలు విషయాల గురించి భిన్నాభిప్రాయాలుండటం సహజమే. అభిప్రాయాలలోని యుక్తియుక్తాలను పరిశీలించవలసిందే గాని, వ్యక్తిదూషణకు దిగటం సాహిత్య చర్చలకు ఆరోగ్యకరం కాదని తొలినుంచీ అనుకొని ఆచరణలో పెట్టిన వాడిని నేను. ఇప్పటికీ నాది అదే తరహా. అందుకే నాతో అనేక విషయాలలో విభేదించేవారు కూడా నాకు చాలా మంది మిత్రులు. అట్లాంటి మిత్రులు లభించటం నా అదృష్టం.

10

1960లో ఆనాటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి 'తెలుగులో ఛందోరీతులు' అనే అంశంపై బహుమతి ప్రకటించి పోటీ గ్రంథాలను ఆహ్వానించింది. అప్పటివరకు పద్యరచనలో ప్రయోగాలు చేస్తూనే ఉన్నాను గాని శాస్త్ర కృషి అంతగా లేదు. హైదరాబాదులో ఉన్న సుప్రసన్న నన్ను గ్రంథ రచన చేయమని ప్రోత్సహించాడు అనటం కన్నా వత్తిడి చేశాడనటం యథార్థం. మాదిరాజు రంగారావు దానికి వత్తాసు. మొత్తంమీద ఛందస్సులో దిగాను. శాస్త్రంలో చొచ్చుకుపోయినా కొద్ది రుచి పెరిగింది. తీవ్రంగా కృషి చేశాను. ప్రణాళిక ఒకటి తయారు చేసుకొన్నాను. కావలసిన గ్రంథాలు, వ్యాసాలు కొన్ని హైదరాబాదు నుంచి సుప్రసన్న పంపించాడు. ఒక సంవత్సరం సాగిన తీవ్ర ప్రయత్న ఫలితంగా 'తెలుగు ఛందోవికాసం' నిష్పన్నమయింది. అకాడమీకి సమర్పించాను. బహుమతి గిడుగు సీతాపతిగారి గ్రంథానికి – కారణాలేమయితేనేం గాని లభించింది. పోటీకి వచ్చిన మూడింటిలో నాది, రావూరి దొరసామిశర్మగారిది మిగతా రెండు. ఆది నుంచి 1960 దాకా తెలుగు ఛందస్సులో, ఛందోగ్రంథాల్లో వచ్చిన పరిణామాలను చారిత్రాత్మకంగా మంచి ప్రణాళికతో వచ్చిన గ్రంథం నాది. బహుమతి నిర్ణాయకులలో ఒకరయిన అబ్బూరి రామకృష్ణరావుగారికి నా గ్రంథం 'సమగ్రం'గా అనిపించింది. ఆయన అకాడమీతో 'పోట్లాడి' నా గ్రంథానికి వెయ్యిరూపాయలు ప్రచురణకు సహాయం చేయించారు (నిడుదవోలు వారి ప్రయత్నంలో రావూరివారికీ వెయ్యి రూపాయల సాయం అందింది. అసలు బహుమతి రెండు వేల రూపాయలు). అజంతా ప్రెస్ (శ్రీనివాస సోదరులు) సహకరించటంవల్ల నా 'ఛందోవికాసం' 1962లో 'కులపతి సమితి' (వరంగల్)

ద్వారా వెలువడింది. దీనికి విశ్వనాథ సత్యనారాయణగారి 'ప్రస్తావన' ఎంతో అమూల్యమయింది. విశ్వనాథ అధ్యక్షతన 1962 జులై 17న ఆంధ్ర సారస్వత పరిషత్తులో ఆనాటి ఉత్తర ప్రదేశ్ గవర్నరు బూర్గుల రామకృష్ణారావుగారు 'ఛందోవికాసం' ఆవిష్కరించారు. అబ్బూరి వారు, ఖండవల్లి లక్ష్మీరంజనంగారు గ్రంథం గూర్చి ప్రసంగించారు. ఈ సమావేశానికి నేపథ్యంలో మాదిరాజు రంగారావు సూత్రధారి. ఈ సన్నివేశం నా సాహిత్య జీవితంలో అత్యంత మధురమయిన జ్ఞాపకం. ఇంతటి సమావేశంలో మరింత మధుర జ్ఞాపకం ఆ సమావేశానికి వచ్చి, చివరిదాకా ఉండి గిడుగు సీతాపతిగారు ఆశీఃపూర్వకంగా తమ అప్పటికే అచ్చయిన 'తెలుగు భాషలో ఛందోరీతులు' గ్రంథాన్ని తమ సంతకంతో బహూకరించటం. అది నన్ను మూలమట్టంగా పులకింప జేసింది. నా అనంతర ఛందస్సు కృషిని ఆ నాటి వారి ఆశీస్సులు పోషిస్తూ నా వెంట ఉన్నట్లే ఇప్పటికీ నా కనిపిస్తుంటుంది.

ఛందోవికాసం రచనా సందర్భంలో తారసపడిన కూచిమంచి తిమ్మకవి 'లక్షణసారసంగ్రహం' పరిష్కరించి విపుల పీఠిక రచించాను. అకాడమీకి సమర్పించాను. దాన్ని అకాడమి 1971లో ప్రచురించింది. జి. కృష్ణ (ప్రఖ్యాత పాత్రికేయులు) ద్వారా తనకు లభించిన కూచిమంచి వెంకటరాయని రచన 'సుకవి జనరంజకం' తాళపత్ర ప్రతికి కాగితం ప్రతి తయారు చేసేపని నాకు అప్పగించింది అకాడమి. ఆ తరువాత దాన్ని పరిష్కరించి విపుల పీఠిక రచించాను. దాన్ని అకాడమీ 1976లో వెలువరించింది. తెలుగు అకాడమీ శ్రీ దువ్వూరి వెంకట రమణశాస్త్రిగారు ప్రధాన సంపాదకులుగా నాకు అప్పగించిన ఛందః పదకోశం 1977లో వెలువరించింది.

ఆధునిక కవితారంగంలో స్థిరపడ్డ వచనకవితా ప్రక్రియలో ఛందోవిభాగంలోకే వస్తుందనీ, దాన్ని 'వచనపద్యం' అనాలని నా ప్రతిపాదన. 'ఆధునిక' ఛ్ఛందస్సు అంటే వచన పద్యమేనని నా 'ఛందోవికాసం'లో ప్రతిపాదిస్తూ దాన్ని గూర్చి లక్షణ నిరూపణ ధోరణిలో వ్రాయటమే కాక (1963?లో) రాజమండ్రిలో జరిగిన అఖిలభారత తెలుగు రచయితల ద్వితీయ మహాసభల ప్రత్యేక సంచికలో ఒక వ్యాసం కూడా రాశాను. అంతటితో ఆగక 'వచనపద్యం: దానిపేరు' అని జనధర్మ ప్రత్యేక సంచికలోనూ, ఫ్రీవర్స్ ఫ్రంట్‌వారి 'వచన కవిత' సంచికలోనూ, ఇతరత్రా వివిధ వ్యాసాలలోనూ 'వచనపద్యా'న్ని ఛందోవిభాగంలో ప్రతిష్ఠాపించాను. ఆ రోజుల్లో వచనపద్య లక్షణాలు చెప్పటానికి కుందుర్తి, అరిపిరాల విశ్వం ప్రయత్నిస్తూనే ఉన్నారు. విశ్వం 'భావలయ'ను ప్రతిపాదించాడు. నా వ్యాసాల్లో 'భావగణ' ప్రతిపాదనలో లక్షణం నిరూపించాను. ఈ స్థితిలో–

'వచనపద్యం: ఆభాస లక్షణ నిరాకరణం' అంటూ 1972 ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో చేకూరి రామారావు (చేరా) – 'కుందుర్తి, సి.నా.రె. మొదలయినవారు వచన కవితను గూర్చి చెప్పిన అంశాలలోని అస్పష్టతను, అశాస్త్రీయతనూ ప్రదర్శించి వాటిని నిరాకరిస్తూ సంపత్కుమార ఒక్కరె ఈ కవితా స్వరూపానికి లక్షణాలు చెప్పటానికి సీరియస్‌గా ప్రయత్నించారు. ఆయన అభిప్రాయాలనే ప్రధానంగా, సవిమర్శకంగా ప్రస్తావించదలచుకున్నాను గనుక, ఆయనకు నచ్చిన పేరే (వచనపద్యం) గ్రహించదలచుకున్నాను' అంటూ నేను చెప్పిన భావగణాలు, పాదబద్ధత అనే అంశాలను చర్చించి అవి ఆభాస లక్షణాలే తప్ప యథార్థంగా లక్షణాలు కావని ఒక విపుల చర్చా వ్యాసం రాశారు. ఇందుకు ప్రతి స్పందనగా 'వచనపద్యం: లక్షణ నిరూపణం' అంటూ భారతి (జులై72)లో నా వ్యాసం వెలువడింది. అక్కడి నుంచి వచనపద్యం ఛందోవిభాగంలో చేరదని ఆయనా, వచనపద్యం 'పద్యమే'నని నేనూ భారతిలో వాదించుకొన్నాము. చర్చించుకొన్నాము. ఆ చర్చలో కేవలం వచన పద్యానికి సంబంధించి మాత్రమే కాక ఛందస్సులో గణ వ్యవస్థ, పాదవ్యవస్థ, పాదంయొక్క అంతర్బహిర్నిర్మాణాలూ – ఛందస్సుకు సంబంధించి భాష–వ్యాకరణం – అలంకార శాస్త్రాల భూమికపయి అనేకాంశాలు వెలుగులోకి వచ్చినయి. పద్యం గద్యం, వచనపద్యం వగైరాల వివిధత్వాన్ని ఆయన వివరించాక ఆ నేపథ్యంలోనే ఆయా అంశాలను విశ్లేషించి చివరకు టెంటేటివ్‌గా వచన పద్యానికి ఆరు అంశాల లక్షణ నిరూపణతో 'వాదసమాపన' చేశాను.

ఎవరివాదనలోవారు ఎంత సీరియస్‌గా ఉన్నా ఎక్కడా వైయక్తికంగా దూషణ, నింద, ఎదుటివారిని కించపరిచే తీరు ఏ మాత్రం కూడా ఈ చర్చలను స్పృశించనయినా స్పృశించకపోవటం ఈ 'వాద ప్రతివాద చర్చల' ప్రత్యేకత. ఈ చర్చ సాగినతీరు అందరినీ ఆకట్టుకొన్నది. ఆలోచింపజేసింది. రంధి నాగరాజు వంటివారు గూడా తమ అభిప్రాయాలను ఈ చర్చల సందర్భంలోనే వెలువరించారు. కాగా వచన పద్య లక్షణ విషయంగా సాహిత్యరంగంలో ఆసక్తి విస్తరించింది. అయితే, ఇంత చర్చ సాగినా ఇద్దరమూ ఏకాభిప్రాయానికి మౌలిక విషయంలో రాలేకపోయాంగాని, సహృదయ విమర్శకులుగా ఎంతో దగ్గరయ్యాం. ఆత్మీయులమయ్యాం. కాగా, చివరకు మా చర్చలను – వచనపద్యం గురించి మరిన్ని ఆలోచనలకు వీలుగా 'వచనపద్యం: లక్షణచర్చ' అనేపేరుతో ఒక పుస్తకంగా ప్రచురించి, మా ఇద్దరికీ అభిమానంగల నాయని సుబ్బారావు (ఆయన వచనపద్యం కవికాదు, ప్రసిద్ధ పద్యకవి) గారి ఎనభయ్యో పుట్టినరోజు కాన్కగా సాహిత్య

లోకానికి సమర్పించాం. ఇట్లాంటి ప్రచురణ సాహిత్య చరిత్రలో ఒక అపూర్వమయిన సందర్భంగా సాహిత్య లోకం అభినందించి, ఆదరించింది.

ఇక్కడ ప్రధానంగా గమనించవలసిన అంశం – మాకు తెలిసినంతలో 'వచనపద్యం' ఛందస్స్వంవిషయంగా ఏ భాషా సాహిత్యాల్లోను ఇంత గాఢమయిన కృషి జరగకపోవటం – ఆ ఛందస్సం నా కృషి ఫలితం కావటం.

'లక్షణచర్చ' ప్రచురణ తరువాతగూడా మా ఆలోచనలూ, వ్యాసాలూ సాగుతూనే వున్నాయి. ఈ మధ్యలోనే వచనపద్యం గూర్చిన చర్చల సమగ్ర గ్రంథంగా కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు ఎన్.ఎస్. రాజుగారు విపుల పీఠికతో వెలువరించారు (వచనకవిత : రూప పరిశీలన' డిసెం. 2006).

ఆ తరువాత గూడా చేరాతో పేచీ పడటం ఆగలేదు. గురజాడ ముత్యాలసరం గూర్చి ఇప్పటికీ పేచీ పడుతూనే ఉన్నాం. ఆరుద్ర 'వాక్య కవిత' విషయంగానూ పేచీ తప్పలేదు. వీటివల్ల అధ్యయనంలో గాంభీర్యమూ, విస్తృతీ కలుగుతూనే ఉన్నాయి. అందుకు ఉపలక్షకంగా, నా షష్టిపూర్తి (1993) సందర్భంగా 'తెలుగు ఛందస్సుపై కొన్ని వెలుగులు' అనే నా ఛందోవ్యాస సంకలనాన్ని చేరాకు అంకితంగా అందించాను. తన సహృదయతను గుర్తించగా, చేరానూ తన ఛందోవ్యాస సంకలనం 'ముత్యాలసరం ముచ్చట్లు' అంకితం చేసి నన్ను గౌరవించారు.

11

భారతీయాలంకార శాస్త్రం ఎవరివద్ద అధ్యయనం చేసే అవకాశం నాకు కలుగలేదు. కాకపోతే తొలినుంచీ సాహిత్య విమర్శతో నాకు ఆసక్తి. హిందీలో ఎక్కువగా సాహిత్య విమర్శవ్యాసాలూ, సాహిత్య చరిత్రా, ఆ తరువాత తెలుగులో కట్టమంచి, రాళ్లపల్లి, విశ్వనాథ, శ్రీశ్రీల విమర్శరచనలూ, ఆంగ్లంలోనూ కొన్ని చదువటంవల్ల కావచ్చు నాకు అలంకార శాస్త్రంమీద గురి ఏర్పడింది. మా నాన్నగారి గ్రంథసంచయంలో కావ్యప్రకాశ, ప్రతాప రుద్రీయం నాకు లభించినయి. ప్రతాపరుద్రీయం రచించిన విద్యానాథుడు మా వరంగల్లు వాడు. ప్రతాపరుద్రీయం మా నాన్నగారి వద్దనే చదివాను. భట్టుమూర్తి 'కావ్యాలంకార సంగ్రహ'నికి సన్నిధానం వారి వ్యాఖ్యానం, పాతపుస్తకాల షాపులో దొరికిన వెల్లాల సదాశివశాస్త్రిగారి తృతీయాశ్వాస వ్యాఖ్య అలంకార శాస్త్రంలోని పలు విషయాలను ప్రస్తావించినయి. ఈ రెండూ భట్టుమూర్తి గ్రంథానికి ఖండనరూపాలే. వెల్లాల వారిది

మరీన్నూ - కాగా ఈ రెండూ మూలగ్రంథాలను చదువాలన్న కోర్కెను తీవ్రతరం చేసినాయనుకుంటాను. హిందీ వ్యాఖ్యానాలతో భరతుడు మొదలు జగన్నాథ పండిత రాయలదాకా అధ్యయనం చేయటం మొదలయింది. కట్టమంచివారు అలంకారశాస్త్రాన్ని తూస్కారించటం మనస్సును కలత పరచింది. ఈ నేపథ్యంతో పిహెచ్.డి. కోసం 'ఆధునిక సాహిత్య విమర్శ : సాంప్రదాయికరీతి'ని ఎన్నుకొనటమయింది. కట్టమంచి మొదలుగా పలువురు ఆధునిక తెలుగు విమర్శకులు చెప్పిన పలు అంశాలు అలంకారశాస్త్ర గ్రంథాల్లో స్పష్టంగానూ, సూత్రప్రాయంగానూ సూచనలుగానూ ఉన్నాయని స్పష్టపడింది. ఆధునికులు కొందరివి అపోహలనీ తెలిసింది. కాగా, తెలుగులో పూర్వకవులు నన్నయ, తిక్కన నాచన సోమన, పాల్కురికి సోమన, శ్రీనాథుడు, పెద్దన, సూరన వంటివారి కావ్య దృక్పథాలను పూర్వరంగంగా వివరించి, ఆధునికులయిన పి. దక్షిణామూర్తి, కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి, తెన్నేటి రామచంద్రరావు, వింజమూరి రంగాచార్యుల వంటి తొలితరం విమర్శకులను పరామర్శించి, కట్టమంచి, రాళ్లపల్లి, దువ్వూరి రామిరెడ్డి, బసవరాజు అప్పారావు, పురాణం సూరిశాస్త్రి, అక్కిరాజు ఉమాకాంతం, నండూరి బంగారయ్య, రాయప్రోలు, విశ్వనాథ, శ్రీశ్రీలు ఆధునికతా లక్షణాల లక్షితమయిన సాహిత్య విమర్శలో భారతీయాలంకారికుల ఆలోచనలు, ప్రతిపాదనలు, సిద్ధాంతాల తీరులు విశ్లేషించటంగా నా పరిశోధన గ్రంథం రూపొందింది. వీరిలో కట్టమంచి, రాళ్లపల్లి, విశ్వనాథలకు తప్ప మిగిలిన వారికి 'విమర్శకులు'గా ప్రసిద్ధి ఉన్నట్టు లేదు. వీరందరి విమర్శక వ్యక్తిత్వాన్ని వెలుగులోకి తెచ్చి, ఆధునికంగా తెలుగు సాహిత్య విమర్శలో సంప్రదాయం యొక్క అవిచ్ఛిన్న క్రమానుస్యూతిని విచారించటం ఈ పరిశోధనగ్రంథ విశిష్టత. ఉపసంహారంగా మార్క్సిస్టు విమర్శవంటి వాటి స్వరూపం వివరించబడింది.

ఈ గ్రంథం (1982) వెలువడిన తరువాత 'పూర్వకవుల కావ్య దృక్పథాలు' (నన్నయ, తిక్కన, సోమన, పోతన) గ్రంథం 1990లో అనుబంధ ప్రాయంగా వెలువరించట మయింది. ఈ రెండూ తెలుగు సాహిత్య విమర్శ క్రమపరిణామావగాహనకు ఉపకరించినాయని పలువురు సహృదయులు భావించారు.

ఈ పరిశోధనా, ఆలోచనలూ సాగుతూ ఉండగా, సమాంతరంగా ప్రాచీనాధునిక సాహిత్యాల గూర్చి, వ్యక్తులు, గ్రంథాలూ, వివిధ విషయాలను గూర్చిన వ్యాసాలు పలుసెమినార్ల, ప్రత్యేక సంచికలు, సందర్భాలు నెపంగా చాలా వ్యాసాల రచనసాగుతూనే ఉంది. వీటిలో కొన్ని వాదవివాదాలకు గురయినయి. అట్లాంటి వాటిలో ప్రత్యేకంగా చెప్పవలసింది 'భాషకు కులమానాలుంటాయా?' (ఆంధ్రప్రభ) అన్న వ్యాసం ఒకటి.

అట్లాగే 1993లో ఆంధ్రప్రభలోనే 'కన్యాశుల్కం - మరోవైపు' అంటూ వ్రాసిన తొమ్మిది వ్యాసాలు. ఈ వాదవివాదాల్లో ఆర్.ఎస్. సుదర్శనం, కాకరాల, బేతవోలు రామబ్రహ్మం, ముదిగొండ వీరభద్రయ్య, చలసాని ప్రసాదరావు వంటివారు పాల్గొన్నారు. దాదాపు సగం అనుకూలం, సగం ప్రతికూలం. కాగా, కన్యాశుల్కం గూర్చిన వ్యాసాలూ, వాటి మీద వచ్చిన ప్రతివిమర్శ వ్యాసాలూ, వాటికి సమాధానం, గురజాడ రచనతో పడిన పేచీలు. కన్యాశుల్కం గూర్చిన చర్చనీయాంశాలూ అన్నీ కలిపి 'కన్యాశుల్కం మరో వైపు' అనే గ్రంథం వెలువరించుట (26 జూన్ 2000) మయింది. ఈ గ్రంథం కీ.శే. అబ్బూరి రామకృష్ణారావుగారి స్మృతికి అంకితం చేయనయింది ('కన్యాశుల్కం' విషయంగా అబ్బూరి వారి కృషి అవిస్మరణీయం).

ఈ వ్యాసాలూ ఇట్లా ఉండగా, పత్రికలలో అప్పుడప్పుడు దేశాన్ని, దేశీయ సంప్రదాయాలనూ, వ్యక్తులనూ కించపరిచే అంశాలు వెలువడినప్పుడు, వాటికి వెంటనే ప్రతిస్పందించి ఖండిస్తూ నిరసిస్తూ 'సమాధానాలు' వ్రాస్తూ ఉండటానికి కారణం తొలినాళ్ల నుంచీ నాలో అనవరతంగా ఎదుగుతూ వచ్చిన 'దేశీయతా భావన'. తొలినాళ్లనుంచి ఇటు నా 'విమర్శ'లోనూ, కవితా రచనలోనూ ఈ భావనాగాఢతను గమనించవచ్చు. దేశీయతాభావన కేవలం ఒక దృక్పథం కాదు. నా జీవిత - సాహిత్య మౌలిక సూత్రం.

12

తొలినుంచీ నా కవితా సాధన పద్యరూపంలోనే అయినా క్రమంగా గేయం, వచన పద్యానికీ వ్యాపించింది. కవిత్వానికి ఫలానా రూపమే పరిగ్రాహ్యం, లేదా త్యాజ్యమనే అభిప్రాయం మొదటినుంచీ లేదు. సుప్రసన్న నేనూ జంటకవులుగా ఉందామనుకొన్నాం. 'సర్వేశ్వర' మకుటంతో మేం రచించిన వందపద్యాల 'హృద్గీత'కు విశ్వనాథవారు పీఠిక అనుగ్రహించారు. ఆ తరువాత 'ఆనందలహరి' (శబరి కావ్య విషయంగా) - చిరు 'కావ్యం' సత్యనారాయణగారికి అంకితం చేశాం. 1955లో కృష్ణదేవరాయ భాషానిలయంలో 'యువకవులకు సన్మానం' అంటూ తెలంగాణా రచయితల సంఘం - మా 'అపర్ణ' గేయకావ్య పఠనం చేయించి నన్నూ, సుప్రసన్ననూ సన్మానించింది. ఆ తరువాత - బహుశః విద్యా - ఉద్యోగప్రవృత్తులూ వేరు వేరు స్థలాల్లో ఉండటం వంటివి కారణాలయి ఉండవచ్చు - సుప్రసన్నా నేనూ 'జంటకవులు'గా సాగటం కుదురలేదు. 'జంటకవులు'గా కాదుగాని, ఇప్పటికీ 'జంట'గానే ఉన్నాం. ఎప్పటికీ ఇంతే.

1967 ప్రాంతంలో తెలుగు సాహిత్యరంగాన దిగంబరకవులు చేసిన అల్లరి సందర్భంగా సుప్రసన్న, పేర్వారం జగన్నాథం, కే. నరసింహారెడ్డి, నేనూ – నల్గురం ఆ అల్లరికెదురు తిరిగి 'చేతనావర్తం' రెండు కవితా సంకలనాలు వెలువరించాం. వాటికి నాటి సహృదయలోకం హర్షామోదాలు ప్రకటించింది. ఆ రెండింటిలో అన్నీ వచనపద్య కవితలే. రెండింటిలో కలిసి దాదాపుగా 40 దాకా ఉన్న నా కవితలు సమకాలీన సామాజికాంశాలపై కురిపించిన అధిక్షేప, వ్యంగ్యాస్త్రాలు అదంతా ఒక ఉద్యమావేశం అనవచ్చు. అదట్లా ఉంచి –

నా జీవితంలో శ్రీశ్రీశ్రీ లక్ష్మణయతీంద్రుల (పెదముత్తేవి కృష్ణాజిల్లా) తోడి సాన్నిహిత్యం ఒక ప్రేమజల్లు. ఆ జల్లు సాంద్రమయి ఒక ఆరాధనా భావాన్ని పెంచింది. యతీంద్రుల 62వ జన్మదినోత్సవం విజయవాడలో వైభవంగా జరిగినప్పుడూ, మరోసారీ వెళ్లలేకపోయాను. 'ఒకసారేమో అహంకృతిక, మరియు నింకోసారి వ్యర్థక్రియాత్మకతన్' యతీంద్ర సన్నిధికి వెళ్లవలసి ఉండి కూడా వెళ్లకపోవటం నా వల్ల జరిగిన అపరాధమన్న స్వయంకల్పిత భావన మనస్సును తీవ్రంగా కలత పరచటం నుండి సాగిన శతక కావ్యం 'అంతర్మథనం'. 'యతీంద్రా! వ్యాజరామానుజా!' అన్న మకుటంతో రూపుదిద్దుకొన్న 'ఆర్తి ప్రబంధ' మిది (1992). ఆ తరువాత గోదాదేవి ఆవేశించినట్లుగా, ఆమె మాటలుగా వెలువడిన 'ఆముక్త' (1998) పదమూడు సర్గల కావ్యంగూడా 'ఆర్తి ప్రబంధ'మే. గోదాదేవి రంగనాథుడిని వివాహం చేసుకోనాలని పడిన తపన జీవుని వేదనగా ఈ కావ్యంలో ఆవిష్కృతమయింది.

13

ఇప్పటికి 75 ఏండ్లు గడిచినయి. భగవంతుడు అనుగ్రహిస్తే మన తెలుగు కవులు కావ్యాన్ని గూర్చి వెలువరించిన అంశాల ఆధారంగా 'పద్యవిద్య' – తెలుగువారి అలంకార శాస్త్రం రూపొందించాలని ఉంది. కవితా మార్గన ఒక కావ్యం గూడా రూపుదిద్దాలని ఉంది. పెద్దల, సహృదయుల ఆశీస్సులు కూడా ఉంటే నా ఈ ఆలోచనలు తప్పక ఫలిస్తాయి.

నా సాహిత్య జీవితాన్ని, మధ్యవ్యవధానాలు ఎన్నో ఉన్నా గూడా పర్యాలోచించుకొనే అవకాశం కలిగించిన నారాయణరెడ్డిగారికి, సారస్వత పరిషత్తువారికీ కృతజ్ఞతలతో –

సెలవు



డా॥ వి.ఎస్. రమాదేవి

"తెలుగు సాహితీ రంగంలోని వివిధ రచనా ప్రక్రియల్లో ప్రత్యేక స్థానం వహించిన మిమ్మల్ని ప్రసంగకర్తగా ఆహ్వానించాలని పరిషత్తు అధ్యక్షులు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డా. సి. నారాయణరెడ్డి గారు సూచించారు" అంటూ పరిషత్తు ప్రధాన కార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారు రాశారు.

డా. సి. నారాయణరెడ్డి గారు "పరిణతవాణి" ప్రసంగ పరంపరకు ఒక విలక్షణ స్వరూపాన్ని నిర్దేశించారు. అటు జీవిత విశేషాలను, ఇటు సాహితీ వ్యాసంగాన్ని మేళవిస్తూ ఒక విధంగా లఘు ఆత్మకథగా నడిపించాలని వారి భావన. అయితే ప్రసంగకర్త తనను గురించి తాను చెప్పుకోవడం కొంత యిబ్బంది కలిగించే సందర్భం అయినా ఇది అనివార్యం.

సామాన్యంగా ప్రముఖ స్థానం, విశిష్ట స్థానం అంటారు. అయితే శివారెడ్డి గారు నా పట్ల ఉపయోగించిన ప్రత్యేక స్థానం అన్నది నాకు సరిగా సరిపడుతుంది. వారికి నా ధన్యవాదాలు. జీవిత విశేషాలు సంగ్రహంగా తెలియజేస్తాను.

మా తండ్రి వి.వి. సుబ్బయ్య, తల్లి వెంకటరత్నమ్మ. నా అధికారిక జననం 1934, జనవరి,15. ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లల తరువాత నేను పుట్టాను. అప్పటి పద్ధతి ప్రకారం పురిటికి పుట్టింటికే వెళ్లేది మా అమ్మ. అలా నేను మా నాన్నగారి ఊరు కొవ్వలిలో కాకుండ పశ్చిమ గోదావరి జిల్లాలోని చేబ్రోలులో పుట్టాను. పుట్టిన కొద్దిరోజులకే సర్పి వచ్చింది. మా ఇంటి దొడ్డిలో తరచూ ఒక పాము వస్తుండేదట. ఆ పాము ఏ రాత్రో లోపలికి వచ్చి నన్ను ఊదిందేమోనన్న అనుమానం వచ్చిందట. సరిగ్గా ఆ రోజుకి

నేను నెలరోజుల పిల్లనట. ఇక అయిపోయిందని, అరిటాకులో ఆముదం రాసి దాని మీద బయట పడుకోబెట్టారట. చుట్టుపక్కల వాళ్ళు వచ్చి చూస్తున్నారట. ఇంతలో రాములు అన్న ఒక దళిత కూలీ వచ్చి పరీక్షగా చూసి, "ఇంకా ప్రాణం వుంది. నేను అయిదు నిముషాలలో ఒక పసరు తీసుకొచ్చి రాస్తాను" అన్నాడట. నా మేనమామలు సరేనన్నారట. అలాగే అతను పసరు రాసిన తరవాత తేరుకున్నానట. అలా ఆనాడు రాములు పుణ్యమా అని చచ్చి బతికాను.

నాలుగేళ్ళ వయసు వచ్చేవరకు నేను మా అమ్మమ్మ గారితో పొలంలోని ఇంట్లో ఉండేదానిని. పెద్ద పశువుల పాకలో ఎన్నో ఎద్దులు, గేదెలు, ఆవులు ఉండేవి. పది అరకలు కట్టేవారట. మరి ఎద్దులు ఎక్కువే ఉంటాయి కదా! కాలువ పక్కనే మా పొలం 60 ఎకరాల మాగాణి ఇంకా ఇరవై ఎకరాల పచ్చిక బీడు. నేను పుట్టిన వారం రోజులకే మా అమ్మగారి సలహా మీద ఆవిడ నగలు అమ్మి ఆ పొలం, ఆ బీడు బుక్క రాములమ్మ గారి దగ్గర కొన్నారట మా నాన్నగారు. అందుచేత చిన్నప్పుడు కూడా మా పాలేర్లు నన్ను 'రాములమ్మ' అనేవారు.

మా నాన్నగారికి, అమ్మగారికి చదువు, సంగీతం అంటే మహా ప్రీతి. నాకు ఐదేళ్ళు వచ్చేసరికి దగ్గరలోనే ఉన్న ఏలూరుకు మకాం మార్చారు మా చదువుల కోసం. అక్కడ మరో ముగ్గురు పుట్టారు మా అమ్మకి. మనిషి పొడవుగా, పచ్చగా, పల్చగా, తమలపాకులా ఉంటారని మా చుట్టుపక్కల ఉన్న మహిళలు అనేవారు. ఆ రోజుల్లో రైతుల ఇళ్ళ నుంచి పాలు, పొలంలో పండిన కూరగాయలు చుట్టుపక్కల వాళ్ళు తీసుకువెళ్ళడం అనవాయితీ. డబ్బుకు అమ్ముకోవడం ఉండేది కాదు. మా పొలం అక్కడికి ఏడు మైళ్ళ దూరంలో ఉండేది. అందుచేత అక్కడి నుంచి వచ్చిన కూరగాయల్ని, మా అమ్మమ్మ సీమ వెండి కుండల నిండా చేయించి పెట్టిన బెల్లం మిఠాయిని మా స్కూలు టీచర్లకు ఇచ్చేదానిని. అందుకనే కాదు, స్వతహాగా నాకు వారిపట్ల ఉన్న భక్తిని గ్రహించి కాబోలు వారు నన్నెంతో ప్రేమగా చూసేవారు.

ఎనిమిదవ తరగతి వరకు ఈదర వెంకట్రావు మాధ్యమిక పాఠశాలలో చదివి సెయింట్ థెరిసా కాన్వెంటులో చేరాను. అక్కడ సామవేదం జానకిరామశర్మ గారు మాకు తెలుగు చెప్పేవారు. అప్పటికే నాకు సాహిత్యం మీద ఆసక్తి పెరిగింది. ఒకరోజున ఆయన మీకు తెలిసిన కథని చక్కటి తెలుగులో క్రమబద్ధంగా చెప్పండి అన్నారు. నా దగ్గరికి వచ్చేటప్పటికి నా నోటికి వచ్చిన కథ చెప్పాను. 'ఎక్కడ చదివావు ఈ కథని' అని అడిగారు. 'ఎక్కడా చదవలేదు, నా నోటికి వచ్చింది చెప్పాను' అన్నాను. ఆయన ఎంతో

సంతోషించి 'నువ్విప్పుడే కథకురాలివయి పోయావు. నీకు మంచి భవిష్యత్తు ఉంది' అని దీవించారు. ఆ సంవత్సరం స్కూలు ఫైనలుకి వయసు నిబంధన వచ్చింది. నాకు రెండేళ్ళు తక్కువ. నేను బిక్క మొహం వేశాను. 'రేపు మీ నాన్న గారిని తీసుకురమ్మన్నారు'. మా నాన్న రాగానే 'మీరు కాని పని అనుకోకుండా అమ్మాయి భవిష్యత్తు కోసం మేజిస్ట్రేట్ దగ్గర పుట్టిన తేదీ 1934, జనవరి 15వ తేదీ' అని సర్టిఫికెట్టు తెచ్చి ఆంధ్రా మెట్రిక్‌కు ప్రయివేట్‌గా కట్టించండి' అన్నారు. సిలబస్ ఆంధ్రా మెట్రిక్‌కు, ఎస్. ఎస్. ఎల్. సి. కి ఒక్కటే. అందుచేత నాకు ఇబ్బంది లేకపోయింది. అలా నాతో చదివినవారు నాకు జూనియర్లయ్యారు. ఒక్క గంతులో నా సీనియర్లని అందుకున్నాను. ఆవిధంగా స్కూలు ఫైనలుకు ముందుగా 9వ తరగతిలోనే వయసు నిబంధనలకనుకూలంగా విద్యార్థులను చేర్చుకోవాలన్నారు. అదే నా పాలిట భాగ్యమయింది.

తన 36వ యేట మా అమ్మ క్షయ వ్యాధితో పోవడంతో ఇంట్లో బిలబిలా అంటూ వుండే ఎక్కడ లేని బంధువుల జాడ లేదు. తొమ్మండుగురు పిల్లల వల్ల వారికి సదుపాయాలు జరగడం కుదరవని అనుకొని వుంటారు. మా నాన్న గారికి మా అమ్మ పోవడంతో వెన్నెముక విరిగినట్టయింది. నాలుగేళ్ళు పొలం చూడలేదు. బీడు పెట్టేశాడు. మా ఇంట్లోనే వుంటూ వుండిన మా చిన్నాన్న గారు జైలులో ఉండిపోయారు రాజకీయంగా. మమ్మల్ని పట్టించుకున్నవాళ్ళు లేరు. మా నాన్నగారికి వట్టి బంగారపు నగలు ఇష్టం ఉండేది కాదు. అందుకే కాబోలు బంగారంతో కెంపులు, నీలాలు, వజ్రాలు పొదిగి నగలు చేయించేవారు. మా అమ్మగారికి కూడా పెద్దగా నగల మీద వ్యామోహం ఉండేది కాదు. ఆ రోజుల్లో ఆనవాయితీ ప్రకారం మా అమ్మకి పెళ్ళిలో 500 తులాల బంగారం పెట్టారు మా అమ్మమ్మ, తాతయ్య. బంగారం అమ్మి పొలం కొన్నారు కదా! ఇక మిగిలిన వివిధ రకాల రాళ్ళు పొదిగిన నగలే మిగిలినాయి. అవి ఒక్కొక్కటి మా కంసాలి బత్తు అమ్మి పెట్టేవాడు. మా నాన్నగారు ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ జాతక పుస్తకాలు, క్షయకు హోమియోపతి వైద్యంలో మందులున్నాయా అని హోమియోపతి పుస్తకాలు చదవడం ఇదే కాలక్షేపం. మమ్మల్నందర్నీ మా చిన్నక్క లక్ష్మీదేవి చూసుకున్నారు. మా పెద్దక్కకి మా అమ్మ వుండగానే పెళ్ళయి వెళ్ళిపోయింది. ఒకరోజున మా యింటికి మాకు దూరపు బంధువయిన శశిరేఖమ్మగారు ఒక నడి వయసు స్త్రీని తీసుకువచ్చారు 'ఈవిడ రాజకీయాల్లో జైలుకు వెళ్ళి ఇప్పుడే బయటకు వచ్చారు' అంటూ ఆవిడ్ని చూసి నేను అమ్మన్న రాజాగారనుకున్నాను. మమ్మల్నందరిని అలా చూసి ఆవిడ మనసు వికలమయిందట. ఆవిడ బాలవితంతువు. ఆవిడ జైలులో ఉండగా ఆమె అన్న ఆవిడ

ఆస్తంతా పేకాటలో పెట్టేశాడట. మా అమ్మగారు పోయేటప్పటికి మా నాన్న గారికి నలభైఏళ్లు. పిల్లల కోసమైనా మళ్ళీ పెళ్ళి చేసుకోమన్నారు కొందరు. కాదన్నారాయన. ఆయన చివరికి విసిగి నాకు భార్య పోయింది, భర్త పోయిన స్త్రీనే చేసుకుంటానని తప్పించుకున్నారు. ఆ రోజుల్లో వితంతు వివాహాలు అరుదు గదా! మా అన్నయ్య, మా చిన్నక్క శశిరేఖమ్మగారితో ఆ రోజు మా యింటికి వచ్చిన బాల వితంతువు కౌసల్యాదేవి కి మా నాన్నగారిని చేసుకుంటారేమో కనుక్కోమన్నారు. పిల్లలందర్నీ నేను చూసుకుంటాను, నిన్ను కూడా చూడాలంటే కష్టం నాన్నా, కౌసల్యాదేవి గారికి వయసు కూడా ఇంచుమించు మా అమ్మ వయసే కనుక ఆవిడ్ని చేసుకోమని చిన్నక్క ఒప్పించి నాన్నగారికి పెళ్ళి చేసింది. అలా నాన్నకు ఏదో సినిమాలో చూపించినట్టుగా పిల్లలు పెళ్ళిచేశారు. మా చిన్నక్క మా నాన్నగారిని, మా కొత్త అమ్మ గారిని ఎంతో ప్రేమతో చూసుకునేది. ఆవిడ మాకు అక్క కాదు తల్లి కంటే ఎక్కువ. ఇలా నా బాల్యం సిరిసంపదలు, కాక అవి కరిగిపోయిన రోజుల మధ్యా గడిచింది.

ఆ తర్వాత ముందుచూపుగా ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడుతుంది, దానికి హైదరాబాద్ రాజధాని అవుతుందని, 1950లోనే మా నాన్నగారు మమ్మల్నందర్నీ పై చదువులకు, చిన్నక్కను హై కోర్టులో న్యాయవాదినిగా నమోదు చేయించేటందుకు హైదరాబాదు తీసుకువచ్చారు. అక్కడే బి.ఏ., ఎం. ఏ., ఎల్. ఎల్.బి., ఎల్. ఎల్.ఎం. చదివాను. 'ఆంధ్రజ్యోతి'లో నార్లగారి కోరిక మీద స్త్రీల శీర్షికను ఏడాది పైగా నడిపాను. 'ఆంధ్రభూమి'లో గోరా శాస్త్రి గారి ప్రోద్బలంతో తెలుగు దిన పత్రికలో మొదటిసారిగా మొదలుపెట్టిన 'మిడిల్'లో 'విపులాచపృథ్వీ' శీర్షిక కింద వ్యాసాలు రాశాను. 1954 నుంచి 1960 వరకు చదువుకుంటూనే అనుకోకుండా వచ్చిన ఆలిండియా రేడియో ఉద్యోగాలలో వివిధ కార్యక్రమాలు నడిపే దానిని. 'గోల్కొండ పత్రిక' 'యువ' మొదలైన ఆనాటి దినపత్రికల్లోను, మాస పత్రికలలోను విరివిగా రాస్తూ ఉండేదానిని. 1954లో వి.ఎస్. రామావతార్ గారితో పెళ్ళయింది. నా పెళ్ళయిన రోజునే నా బి.ఏ. ఫలితాలు వచ్చాయి. తరువాత నా చదువు, ఉద్యోగం అన్నీ పెళ్ళి తర్వాతే. పెళ్ళినాటికి ఇంజనీరుగా పని చేస్తున్నారు మా వారు. ఆయన ప్రోద్బలంతోనే నా పై చదువులు, హైదరాబాద్‌లోను, ఢిల్లీలోను ఉద్యోగాలు. ఒక అబ్బాయి, ఇద్దరమ్మాయిలు పుట్టుకలు అడ్డురాకుండానే కొనసాగాయి.

ఇక నేను వహించిన పదవుల గురించి సంగ్రహంగానైనా చెప్పాలని ఆచార్య శివారెడ్డి గారు లేఖలో స్పష్టంగా కోరారు. ప్రధానంగా ఇది సాహిత్య సభ కాబట్టి వివరాలలోకి

వెళ్ళడం అంత అవసరమనిపించడం లేదు. ఎల్ ఎల్.ఎం. చదువు పూర్తికాగానే ముందు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదిగా ఉద్యోగ జీవితం ఆరంభమైంది.

తర్వాత కేంద్ర ప్రభుత్వ న్యాయశాఖలో గ్రూపు-ఎ క్రింద అధికారిగా చేరాను. కేంద్రంలో శాసన నిర్మాణశాఖలో కార్యదర్శిగా, లా కమిషను సభ్యురాలిగా, కార్యదర్శిగా, స్వల్ప కాలం ప్రధాన ఎన్నికల కమిషనరుగా, జాతీయ మహిళా కమిషను గౌరవ సలహాదారుగా పని చేశాను. 1993 నుంచి నాలుగు సంవత్సరాలకు పైగా రాజ్యసభ సెక్రటరీ జనరలు పదవి నిర్వహించాను. ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన అప్పిల్లేటు ట్రిబ్యునల్ సభ్యురాలిగా కూడా వ్యవహరించాను.కర్నాటక, హిమాచల్ ప్రదేశ్‌లకు గవర్నరుగా బాధ్యతలు నిర్వహించాను. పెక్కు అంతర్జాతీయ సదస్సుల్లో, సభల్లో పాల్గొన్నాను. ప్రస్తుతం అడ్మినిస్ట్రేటివ్ కాలేజి పాలక మండలి సభ్యురాలిగా ఉన్నాను. బెంగుళూరులో ఒక ప్రముఖ ఇంటర్నేషనల్ స్కూలుకు గౌరవ అధ్యక్షురాలిగా తోడ్పాటు అందిస్తున్నాను.

దక్షిణ కొరియాలోని కుయాంగ్ హీ విశ్వవిద్యాలయం నన్ను అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పతకంతో సత్కరించింది. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు ప్రదానం చేసింది. నా సాహిత్య సేవ గురించి చెప్పేముందు నాటకాలలో పాత్రధారణ గురించి కొన్ని విషయాలు ప్రస్తావిస్తాను.

డాక్టరు సి. నారాయణరెడ్డి గారు అధ్యక్షులుగా తమ తుది పలుకుల్లో 1954లో నేనూ, ఆయనా కాలేజీలో చదువుతున్న రోజుల్లో ఆంధ్రాభ్యుదయోత్సవాల్లో పోటీగా వేసిన నాటకాల్ని గురించి గుర్తు చేస్తూ ఆ నటనానుభవాన్ని ప్రసంగంలో చేర్చలేదు, కనుక కనీసం అచ్చు వేయడం కోసం ఆ అంశం కూడా రాసి పంపాలన్నారు. ప్రసంగం కేవలం సాహిత్యానికి సంబంధించినదే కనుక నేను ఆ సంగతి ఎత్తలేదు. నారాయణరెడ్డి గారు నా కంటే అయిదారేళ్ళు పెద్ద. ఆయన యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో బహుశా ఎం.ఏ. ఆఖరి సంవత్సరం చదువుతున్నట్టున్నారు. నేను ఉమెన్స్ కాలేజీలో బి. ఏ. మొదటి సంవత్సరం చదువుతున్నాను. ఆయన భావకవి వేషంలో తనే రాసిన నాటకంలో స్టేజి మీదకి వచ్చారు. నేను మా కాలేజీ నుంచి మౌర్య చంద్రగుప్తుడి వేషంలో స్టేజి ఎక్కాను. కాలేజీలో చదివేటప్పుడు స్టేజీ ఎక్కడం మామూలు విషయమే. ఆ తర్వాత ఒక సారి కీ.శే. కె. ఎల్. నరసింహారావు గారు రాసిన 'క్రీనీడలు' నాటకం చూసి, 'నటన మాట ఎలా ఉన్నా నాయిక ఆహార్యం మాత్రం మహా ఎబ్బెట్టుగా ఉంది' అని రాశాను 'ఆంధ్రభూమి'లో. ఆ రోజుల్లో నేను నిజాం కాలేజీలో ఎం.ఏ. చదువుతూ ఉండగా అనుకోకుండా వచ్చిన మొదటి ఉద్యోగంలో అంటే రేడియో ఎనౌన్సరు, ఆర్టిస్టుగా

పనిచూస్తూ ఉండేదానిని. నరసింహారావు గారు అప్పుడు రేడియోలో ఎక్కువగా గ్రామస్థుల కార్యక్రమంలో పాల్గొంటూ ఉండేవారు. మిగతా కార్యక్రమాలతో పాటు నేను రాసినది చదివి ఖిన్నులయ్యారు. "మీరు రాసింది అక్షరాల నిజమే. అవిడ్ని అతి కష్టం మీద పిఠాపురం నుంచి తీసుకువచ్చాం.' నా దగ్గర నాలుగు మంచి చీరలున్నాయి. అవి కట్టుకుంటే నదరుగా కనపడతాను. నిద్ర నుంచి ప్రొద్దుటే లేచి నలిగిన చీరతో కనపడటం నాకిష్టం లేదు. నేను కాస్త పొట్టి. అందుచేత పెద్ద మడమల చెప్పులే వేసుకుని, నలగని చీర, వడలని పూలతోనే స్టేజిమీద కొస్తాను.' అని ఆవిడ పట్టుపట్టింది. మేమేం చేయలేకపోయాం. మామూలు కుటుంబాల నుంచి అమ్మాయిలెవరూ నాటకాలు వేయరు కదా! మీరు వేసి చూపించగలరా" అని సవాలు విసిరారాయన. వెంటనే నలుగురం కలిసి 'జీవేమ' అన్న పేరు పెట్టి ఆ సంస్థ క్రింద వారం రోజుల్లో ఆ నాటకం వేశాం. రాజేశ్వరరావు, రతన్ ప్రసాద్, టి.వి.ఆర్ కె.సుబ్బారావు ఇంకా కొందరు (పేర్లు గుర్తు లేవు) పాత్రలు వేశారు. టిక్కెట్టు కొనుక్కుని వచ్చి మరీ చూశారు నాటక ప్రియులు. ఆ తర్వాత బుచ్చిబాబు గారి 'ఆత్మ వంచన' నాటకం వేశాం. అందులో నా చెల్లెలుగా యద్దనపూడి సులోచనారాణి, ఆనందమోహన్ ఇలా ఇంకా కొందరు వేశారు. "పెద్ద పెద్ద సినిమా నటీమణులు వేశారు, ఈ నాటకాన్ని. కాని ఇంత చక్కగా పాత్రను అర్థం చేసుకొని వేసిన నాటకం ఈ రోజే చూశాను" అని సంతోషపడ్డారు బుచ్చిబాబు గారు. గోపిచంద్‌గారి 'అభాగిని' నాటకం వేశాం. డాక్టరు శ్రీదేవి గారి 'కాలాతీతవ్యక్తులు' ఆధారంగా సినిమా తీయబోతున్నామని, దానికి నన్ను సంభాషణలు రాయమని దుక్కిపాటి మధుసూదనరావు గారు అడిగారు. నాకిష్టమయితే తన మిగతా సినిమాలకు కూడా సంభాషణలు రాయొచ్చును అంటూ "మేం కొన్ని సినిమాలలోని సన్నివేశాలు చూపిస్తాం. వాటిని కలుపుకుంటూ సంభాషణలు రాస్తూ ఉండాలి రచయితలు. ఒక్కొక్కసారి ఏ మూలకథనో తీసుకుని మార్చి రాస్తూ ఉండాలి" అంటూ చెప్పుకొచ్చారు. 'అమ్మో ఇలాంటి సంభాషణలు నా వల్ల కాదు. ఇది రచయితల పని కాదు' అనుకుని అప్పుడే నాకు వచ్చిన ఉద్యోగ రీత్యా ఢిల్లీ వెళ్ళిపోయాను. ఢిల్లీకి వెళ్ళబోయే ముందు అంధ, మూగ, చెవిటి పిల్లల సహాయార్థం 'యశోధర' నాటకం వేశాం. మాటలు నావి, పాటలు దాశరథి గారివి. అందులో తురగా జానకీరాణి గారు రెండు పాటల మీద డాన్సు చేశారు. ఆ తర్వాత ఢిల్లీలో బుర్రా సుబ్రహ్మణ్యం గారు (మన రాష్ట్ర ఎడ్వకేట్ జనరల్‌గా చేశారాయన), కల్పకం (సిపిఎం యువ నాయకుడు ఏచూరి సీతారాం తల్లి) ఇలా మేము నలుగురయిదుగురం కలిసి రెండు నాటకాలు కాబోలు వేయించాం.

అసలు నా పన్నెండేళ్ళ వయసులోనే మా చెల్లెళ్ళు, వాళ్ళ స్నేహితుల చేత చిన్న చిన్న నాటకాలు మా వరండాలో వేయించేదానిని. ఇంతకీ నా నటనానుభవం అపరిణతవాణికి సరిపడుతుంది.

ఆరోజుల్లోనే నాకు మెరిట్ స్కాలర్‌షిప్పులో వచ్చిన డబ్బుతో నేను, నా స్నేహితురాలు సత్యవతి కలిసి కొవ్వలి, జంపన వారి నవలలు కొని, చిన్నపాటి గ్రంథాలయం నడిపాం. చుట్టుపక్కల ఎరుకల పిల్లల్ని తీసుకువచ్చి, స్నానాలు చేయించి, పరిశుభ్రత నేర్పే ప్రయత్నం చేసేదానిని.

పూర్తిగా తెలవారక ముందే భిక్షగాళ్ళు మొదలయ్యేవారు. వాళ్ళకి భిక్షం వేసే డ్యూటీ నాది. ఒక రోజున బియ్యం బస్తా పక్కనే ఆ క్రితం రోజు తెచ్చి పెట్టిన పంచదార బస్తా వుంది. పెద్ద డబ్బాలో అవసరానికి కావలసినంత తీసుకుని మళ్ళీ కుట్టు వేసేవారు. పని మనిషి కుట్టు వేయకుండా అలాగే వదిలేశాడు. అదీ బియ్యం బస్తాయే అనుకుని నిద్రకళ్ళతో గుప్పెట నిండా పంచదార తీసి అందరికీ భిక్ష వేసేశాను. మరుసటి రోజు ఒక భిక్షగత్తె "నీ పున్నెమా అని పరమాన్నం చేసుకు తిన్నాం తల్లీ" అంటూ దీవించింది. అంటే అంతకు పూర్వం వాళ్ళకు భిక్షంగా దొరికిన బియ్యంలో పంచదార కలిసిపోయింది. మరి పరమాన్నం చేసుకోక ఎలా బియ్యాన్ని, పంచదారని వేరు చేయగలరు!

ఇలా చిన్నతనంలో నేను చేసిన తెలివి తక్కువ పనుల్ని గుర్తు చేసి మా పెద్దక్క నవ్వుతుండేది.

నా రచనల గురించి నేనేమి చెప్పాలి? రచయిత పని రాయడం వరకే. దానిని గురించి ఇతరులు చెప్పాలి. అయితే ఆ రచనలకు ప్రేరణ ఏమిటి అంటే అంతవరకు రచయిత చెప్పవచ్చును. ప్రేరణకు ఏ చిన్న సంఘటనో చాలు. కాని దాని చుట్టూ అల్లే కథ కాని, నవల కాని అది రచయిత సృజనాత్మక శక్తి మీద ఆధారపడి ఉంటుంది.

ఈ సందర్భంగా నాకు అవసరాల రామకృష్ణా రావు గారు నా నాలుగు నవలలు– నారాయణరెడ్డి గారి మాటల్లో నవలా మాలికను–సమీక్షించి అన్నమాటలు గుర్తుకొస్తున్నాయి. "ఈ మధ్య పుస్తక రూపంలో వచ్చిన రమాదేవి వరుస నవలలు పేర్లు రాజీ, మలుపులు, మజిలీ, అనంతం అనేవి తెలుగు పాఠకులకు అంతగా పరిచయం లేని కొత్త ప్రపంచాన్ని కళ్ళ ముందుంచడం ఈ నవలా చతురస్ర సామాన్యధర్మం" అన్నారు. రాజీని సమీక్షిస్తూ "ఇది అపూర్వ సృష్టి. సోమర్‌సెట్‌మామ్ లాంటి రచనా కోవిదుల దరిదాపులకు తీసుకువెళుతుంది" అని ఆకాశానికెత్తేశారాయన. ఆచార్య ముదిగొండ

శివప్రసాద్ గారు "ఇది ఒక రాజకీయ సాంఘిక నవల" అన్నారు. మలుపులు, సమీక్షిస్తూ "సాహితీర్ఝురిలో కొత్త మలుపు అన్నారు" రామకృష్ణారావుగారు.

రాజీని ఎమర్జెన్సీ రోజుల నేపథ్యంలో రాశాను. అప్పుడు ఎమెస్కో అధినేత దివంగత ఎం.ఎన్. రావుగారు ఢిల్లీ వచ్చినప్పుడు 'మీరు రాసిన నవల ఇవ్వండి అచ్చు వేస్తాను' అన్నారు. నా 'రాజీ' రాతప్రతిని ఇచ్చాను. దానిని శ్రీపతి గారు చూసి నాదేనని గుర్తించారు. అలా అది రాసింది నేనేనని కొద్దిమందికి తెలిసింది. అయితే దానిని మా న్యాయశాఖ సెక్రటరీ గారి సలహాతో నా పూర్వపు పెన్‌నేమ్ 'నిశ'తో రాశాను. అది అచ్చయ్యాక ఎం.ఎన్. రావు గారు అమెరికన్ ఎంబసీ వారు రాసిన ఉత్తరం నాకు పంపారు. 'రచయిత అనుమతిస్తే దానిని ఇంగ్లీషులో తర్జుమా చేయించుకుంటాం' అని. అప్పటి మన దేశం, అమెరికాల మధ్య నెలకొన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా దానిని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం నాకిష్టం లేకపోయింది. అనుమతి ఇవ్వలేదు. ఇప్పుడు దానిని విజయశ్రీ గారు ఇంగ్లీషులో అనువదించారు.

నేను పదవీ విరమణ చేసి హైదరాబాద్ వచ్చాక ఉద్యోగరీత్యా కలిగిన అనుభవంతో 'రాజీ' రాశాను. అలాగే రాజ్యసభ సెక్రటరీ జనరల్‌గాను, కేంద్ర న్యాయశాఖలోని ఉద్యోగినిగా చూసిన పార్లమెంటు నేపథ్యంలో ఎందుకు రాయకూడదు అనుకున్నాను. అదే 'మలుపులు' నవలగా రూపొందింది. ఆ తర్వాత గవర్నరుగా, హిమాచల్ నలుమూలలా చూశాను. మంత్రివర్గం విషయంలో సంచలనాత్మక నిర్ణయాన్ని తీసుకోవలసి వచ్చింది. అది రాజ్యాంగబద్ధం గాను, న్యాయ నిర్ణయాల నేపథ్యంలో తీసుకున్నాను. ఆ పద్ధతిలోనే ఆ తర్వాత కొద్దిరోజుల్లో కేంద్ర ప్రభుత్వ మంత్రివర్గం విషయంలో అప్పటి రాష్ట్రపతి కె.ఆర్. నారాయణ్ గారు నిర్ణయం తీసుకున్నారు. ఆయన ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ అధ్యక్షులుగా ఉన్నప్పుడు ఆయనకు సహాయకారిగా పని చేశాను. నాలుగేళ్ళకు పైగా ఆయనెప్పుడూ నన్ను తన సలహాదారుగా ఉదాహరించేవారు. అది ఆయన గొప్పతనం. ఇంతకీ హిమాచల్ నేపథ్యంలో రాసిన నవల 'మజిలీ'. అక్కడి కళ్ళు తిప్పుకోలేని ప్రకృతి అందచందాలు, ప్రజల అమాయకత నన్ను నిజంగా కట్టిపడేశాయి. ఆ తర్వాత కర్ణాటకకు బదిలీ అయింది. మన దక్షిణాది సంస్కృతిని పుణికిపుచ్చుకొన్న ఆ రాష్ట్రంలోని నా అనుభవాలతో రాసిన నవల 'అనంతం'.

నాకు తెలిసినంతవరకు తెలుగులో రాజ్యాంగపరమై అనుభవాల నేపథ్యంలో రాసిన నవలలు ఉన్నట్టు కనపడలేదు. అయితే మామూలు చదువరులను అవి అంతగా ఆకర్షించవని తెలుసు. కొద్దిమందికయినా ఆ విషయాలు తెలియజేయాలనిపించింది.

"రాజీ నవలను చదివి ముగించిన తరవాత ఛార్లెస్ డికెన్సు, టాల్‌స్టాయ్, దోస్తవిస్కి వంటి మహా రచయితల రచనలు చదివిన అనుభూతి కలుగుతుంది" అంటారు శ్రీపతి. ఆచార్య ఐ.వి.చలపతిరావు గారు అనంతం, మిగతావి చదివితే ఆర్థర్ హెయిలీ, ఇర్వింగ్‌వేలస్ గుర్తుకొస్తారన్నారు.

'మజిలీ'కి అభినందన చందనం రాసిన దివంగత వాసిరెడ్డి సీతాదేవి గారి మాటల్లో "ప్రఖ్యాత రష్యన్ రచయిత ఇలా ఎహ్రిన్ బర్గ్ అంటారు కదా- రచయిత దేనిపైన బడితే దానిపైన, ఎవరిపైన బడితే వారిపైన రాయలేడు. విషయాన్ని ఎన్నుకోవడంలో ప్రతి రచయితకూ ఒక పరిమితి వుంటుంది. ప్రతి రచయితకూ ఎంత గొప్పవాడైనా, కొన్ని అడ్డుగోడలుంటాయి. నవలా రచయిత యొక్క రచన, అతను నివసించే సమాజం చేత నిశ్చయింపబడుతుంది. ఈ విషయం అందరికీ తెలిసిందే. కాని రచయిత స్వీయ చరిత్ర, తన అనుభవం, తన ప్రవర్తన చేత కూడా ప్రభావితుడై తన రచన సాగిస్తాడు. అందుకు తార్కాణంగా నిలిచే నవల మజిలీ".

"రమాదేవి నవలా 'చతురస్రం' మామూలు పాఠకులకు పరిచయం లేని కొత్త ప్రపంచాన్ని కళ్ళకు కట్టిస్తుంది. ఉన్నత స్థానాల్లో, పెద్ద రాజకీయ స్థాయిల్లో, గొప్ప రాజ్యాంగ వ్యవస్థల్లో వ్యవహారాలు ఎలా నడుస్తాయో, ఆయా రంగాల్లో మెసిలేవారి జీవితాలు పై స్థాయిల్లో తెర వెనక భాగోతాలు ఎలా ఉంటాయో ఈ గ్రంథ పరంపరలో రచయిత్రి సమర్థంగా, సాధికారికంగా చిత్రించారు. తనకు బాగా తెలిసిన విషయాలను మాత్రమే ఎంచుకొని ఒడుపుగా కథ అల్లడం రమాదేవి ప్రత్యేకత. తెలుగులో గొప్ప నవలలు రాసిన వారెందరో ఉన్నారు. కాని రమాదేవి గారు రాసిన నవలల లాంటివి మాత్రం మరొకరు రాయలేదు. ఎందుకంటే రాజ్యసభ సెక్రటరీ జనరల్‌గా, గవర్నరుగా ఆమెకు గల అనుభవం, విషయ పరిజ్ఞానం ఇతరులకు ఊహిస్తే పట్టుబడేది కాదు" అన్నారు శ్రీ ఎం.వి.ఆర్. శాస్త్రిగారు.

బహుశా ఆచార్య శివారెడ్డి గారన్న ప్రత్యేక స్థానం అంటే ఇదేనేమో! అయితే కొందరు 'రాజీ'లో ఉన్నంత నాటకీయత మిగతా మూడింటిలో లేదు అని కూడా అన్నారని విన్నాను. అయివుండవచ్చు కూడా. ప్రతీసారీ ఎమర్జెన్సీ రాదు కదా! రాకూడదు కూడా.

వీటి తర్వాత 'కాలచక్రం', 'సంసార సాగరాలు' రాశాను. కాలచక్రంలో భూస్వామ్య వ్యవస్థలో విరివిగా కొనసాగుతూ ఉండిన వివాహేతర సంబంధాలు, వారికి పుట్టిన పిల్లలు, అలాగే అనాథలు, అవివాహిత మహిళలకు పుట్టే బిడ్డలు, గృహపరంగా జరిగే అవాంఛిత లైంగిక సంబంధాలు – ఇలాంటి సంఘటనలతో కూడిన నవల 'కాలచక్రం'.

ఇక 'సంసార సాగరాలు' ఈ నాటి కార్పొరేట్ సంస్కృతితో, దిగువ, మధ్య తరగతి కుటుంబాలలో చోటుచేసుకునే సంచలనాలు, భార్యాభర్తల మధ్య ఎన్ని వ్యత్యాసాలున్నా సాగిపోయే సంసారాలు వీటి నేపథ్యంలో రాసిన నవల. ప్రస్తుతం ధారావాహికంగా వెలువడుతున్న 'అనుబంధాలు' అన్న నవలకు ఆధారం ఆనాటి హైదరాబాద్, కోస్తా ఇతర జిల్లాల జమీందారీ భవనాల్లో దాగిన రహస్యాలు, మారుతున్న కాలంలో విదేశాలకు పోయి అక్కడ అవలక్షణాలకు లోనైన ఘరానా వ్యక్తుల నేపథ్యంలో రాశాను. ఆనాటి రాజకీయ విధ్వంస కాండకు బలైన కొన్ని సంఘటనలు, వీటన్నింటిని మించి మతాలకు అతీతంగా మానవత్వంతో, స్నేహంతో పెనవేసుకొన్న రెండు హిందూ, ముస్లిమ్ కుటుంబాల మధ్య అనుబంధాలు వీటన్నింటినీ పొదువుకొని రూపొందిన నవల 'అనుబంధాలు'.

1961,62లలో నార్ల వెంకటేశ్వరరావు గారు తాము ప్రారంభించిన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ఏడాదికి పైగా స్త్రీలు, బాలల సాహిత్యంపైన కాలమ్ నడపమన్నారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారితో కలిసివచ్చిన నార్ల వారితో నా పరిచయం అదే. ఆ తర్వాత ఢిల్లీ వెళ్ళిపోయాక అక్కడ ఆయన పార్లమెంటు సభ్యుడిగా వున్నపుడు సాహిత్య అకాడమీ సమావేశాలలో కలుసుకుంటూ ఉండేదాన్ని. నేను 'ఆంధ్రజ్యోతి'కి రాస్తూ ఉన్న రోజుల్లోనే గోరా శాస్త్రి గారు 'ఆంధ్రభూమి' సంపాదకులుగా ఉన్నారు. అప్పుడు 'హిందూ' దినపత్రికలో శాంతా రంగాచారి గారు మిడిల్ రాస్తూ ఉండేవారు. అప్పటికి తెలుగు పత్రికల్లో మిడిల్స్ రాలేదు. గోరా శాస్త్రి గారు మొట్టమొదట 'ఆంధ్రభూమి'లో మొదలు పెట్టించారు నాతో. దానికి శీర్షిక కూడా ఆయనే ఇచ్చారు 'విపులాచ పృథ్వీ' అని. 1963 జులైలో నేను ఢిల్లీ వెళ్లిపోయాను. ఆ తర్వాత ఆ శీర్షిక కింద ఎవరితోనూ రాయించినట్టు లేదు గోరా శాస్త్రిగారు కాని, ఆయన తరువాత వచ్చిన సంపాదకులు కాని. నేను హైదరాబాదు వచ్చేశానని తెలిసి ప్రస్తుతం సంపాదకులుగా ఉన్న ఎం.వి.ఆర్. శాస్త్రి గారు తిరిగి ఆ శీర్షిక క్రింద రాయమని అడిగారు. అలా నాలుగేళ్ళకు పైగా ఆ శీర్షిక క్రింద రాస్తున్నాను. మధ్యలో 'కష్టం-సుఖం' శీర్షిక క్రింద మహిళలడిగిన ప్రశ్నలకు జవాబులిచ్చాను. రెండు మూడేళ్ళు ప్రశ్నలు ఒకే మోస్తరుగా వుండి, కొత్తదనం కరువవుతుందని ఆ శీర్షిక క్రింద జవాబులివ్వటం మానేశాను. ప్రశ్నలు స్కూళ్ళలో చదువుకుంటున్న పిల్లలు ప్రేమ అంటూ దానికి తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదు కనుక లేచిపోమా అంటూ ఇలా అమాయకంగాను, ఉద్రేకంగా రాసేవారు. కొందరు గృహిణులు తమ వైవాహిక జీవితంలో ఆనందం కొరవడిందని జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసుకొనే ధోరణిలో కొన్ని ఉత్తరాలు, ఇక లెక్కకు మిక్కిలిగా ఆస్తిలో భాగం గురించి ఉత్తరాలు వచ్చేవి. ముఖ్యంగా ఉత్తరాలు

గ్రామాలు, టౌన్లనుంచి వచ్చేవి. కొందరు జవాబులు చదివి సంసారం బాగు చేసుకున్నామని, కొందరు ప్రేమా దోమా గొడవ మాని చదువు మీద శ్రద్ధ పెట్టుకున్నామని రాసేవారు. కోర్టు లెక్కకుండా ఆస్తి పంపకాలు పరస్పర ఒప్పందాలతో సర్దుబాటు చేసుకున్నామని మరికొందరు రాసేవారు. తృప్తికరంగా సాగినా ఒకే మోస్తారు ప్రశ్నలకు జవాలివ్వడం అనవసరం అని మానేశాను. జవాబుల కంటే వారు తమ కష్ట సుఖం నాతో పంచుకొంటున్నట్టుగా తృప్తి పడేవారనిపించేది.

ఎ.ఎస్. లక్ష్మి గారు అడిగితే మూడేళ్లుగా 'ఆంధ్రభూమి' వార పత్రికలో'ఆలోకనం' (మొదట్లో అది 'ఇదీసమస్య' శీర్షిక) క్రింద ముఖ్యంగా మహిళలను ఉద్దేశించి వ్యాసాలు రాస్తున్నాను. అయితే పురుషులే ఎక్కువగా చదువుతున్నారు. ఇకపోతే అడపాదడపా ఎవరయినా అడిగితే కథో, వ్యాసమో రాయడం, ఇలా సాహితీ వ్యాసంగం సాగుతోంది.

ఆ మధ్య ఒక రచయిత్రి సీతాదేవి గారి దగ్గర ఒక మాట అన్నారట. "ఇటీవలే రాస్తున్న రమాదేవి గారికి సుశీలా నారాయణరెడ్డి అవార్డు ఇచ్చారేమిటి" అని. "మీరు, నేనూ రాయక ముందు నుంచీ ఆవిడ రాసేవారు. అది మీకు తెలియదు. మధ్యలో ఉద్యోగరీత్యా రాయకపోవడం వల్ల" అన్నారట. అది నిజమే. ఈనాటి వారికి ఒకప్పుడు నేను ఎక్కువగా రాస్తూ ఉండేదానినన్న విషయం తెలియదు. అసలు నేను నా పధ్నాలుగేళ్ళ వయసు నుంచే రాయడం మొదలుపెట్టాను అనుకోకుండా.

ఆ రోజుల్లో అంటే 1942 నుంచి 1950 వరకు నేను ఏలూరులో ఉన్నాను. మా చదువుల కోసం మా కుటుంబం కొవ్వలి నుంచి పక్కనే ఉన్న ఏలూరుకు వచ్చేసింది. అక్కడే ఇంటర్మీడియట్ వరకు చదివాను. నా మొట్టమొదటి కథ 1951లో 'ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక'లో అచ్చయింది. ఈనాటికీ స్నేహితులు ఆనందారామం లాంటి వారు కలిసినప్పుడు ఇప్పటికీ నాకు గుర్తు చేస్తుంటారు. "అది మీ ఇంటి ముందు గుడిసె వేసుకొని జీవిస్తూ ఉండిన ఎరుకలవాళ్ళని దృష్టిలో పెట్టుకుని రాసిన కథ కదా" అంటూ. ఇదెందుకు చెబుతున్నానంటే నాకు తెలిసిన వాతావరణాన్ని దృష్టిలో ఏర్పరచుకొని, అనుభవాల నేపథ్యంలో ఇతివృత్తం, పాత్రలను కల్పించి రాయడం నా అలవాటు. నేల విడిచి సాము చేయలేదు.

అలాగే 'దేవుడికి ఉత్తరం' కథ. 'మీ చిన్న చెల్లెల్ని మనసులో పెట్టుకు రాసిన కథలా ఉంది' అని ఈ మధ్య టీ.వి.లో దానికి చిత్రీకరణ చూసి, నాటి ఒక స్నేహితురాలు కూడా అడిగింది. మా చెల్లెలికి రెండు నెలలప్పుడే మా అమ్మగారు పోయారు. ఒకరోజు

నేను కాలేజీ నుంచి ఇంటికి వస్తుండగా దూరంగా మా ఇంటి గడప మీద ఒంటరిగా కూర్చునివున్న మా నాలుగేళ్ళ చెల్లెలు కనపడింది. ఒంటరిగా, దిగులుగా కూర్చునే వయసు కాదది. దాని మీదే కథ అల్లాను. అలాగే ఎరుకల పిల్ల చనిపోయిన మరుసటి రోజే దుఃఖం దిగమింగుకొని ఆ పిల్ల తల్లి పనిలోకి వెళ్ళడం చూడగానే దారిద్ర్యం కన్నతల్లిని ఏడవనీయదు, పొట్టకూటికి పనికి పోవలసిందే అనిపించి నా మొదటి కథ రాశాను. అలాగే అప్పుడప్పుడు కథలు రాస్తూ ఉండడం, కొన్ని పేలవంగా కూడా వుండొచ్చు రావూరి భరద్వాజ గారన్నట్టు. ఇటీవలే ప్రచురితమైన 'నాయనమ్మ మురుగులు' కథకు పలువురి ప్రశంసలు అందాయని సీతాదేవిగారన్నారు. మొట్టమొదటి మినీ నవల 'పంకజం'. ఏలూరు, చుట్టుప్రక్కల మోతుబరి గ్రామస్థులు వెలయాళ్ళ ఇళ్ళకు వెళ్ళడం ఆ రోజుల్లో ఆనవాయితీగా ఉండేది. కొందరు ఏ ఒక్కరి దగ్గరో నికరంగా ఉండేవారు. అలాంటి వ్యక్తిని మనసులో పెట్టుకొని ఆవిడ చుట్టూ కథ అల్లాను. ఈ మధ్యనే ఎవరో కాకినాడ నుంచి ఉత్తరం రాశారు. 'ఆనాడే అంటే 1960లోనే వేశ్యకీ మనసు ఉంటుందని, అది ప్రేమకు చలిస్తుందని ఎలా రాశారు' అంటూ.

ఆ తర్వాత 'తల్లీబిడ్డలు' నవల. ఈ మధ్య అనిల్ ఎప్పుడో ఫోన్ చేసి ఆ నవల తనకెంతో నచ్చిందని, దానిని మరాఠీలో, ఇంగ్లీషులో అనువాదం చేశానని చెప్పాడు. బాల వితంతువులకు ఒకళ్ళో ఇద్దరో పిల్లలు కూడా ఉండి ఎవరి పంచనో పడి వుండవలసి వచ్చినప్పుడు వారు ఎదుర్కోవలసి వచ్చే సంఘటనలు, వాటిని నిలదొక్కుకొని పిల్లల్ని వెంటతీసుకుని ధైర్యంగా పెంచి పెద్ద చేసుకునే ఒక తల్లి కథ. ఆవిడకు ఆసరాగా ఉన్న ఒక వ్యక్తిని గురించి కొడుకు తల్లికి దూరంగాపోతే, కూతురు తల్లి పరిస్థితిని అర్థం చేసుకొని ఎలా అన్న మనసును కూడా మారుస్తుందో అన్నది ఆ నవల ఇతివృత్తం. ముఖ్యంగా యాభై ఏళ్ళక్రితం చిన్నపిల్లల్ని రెండవ పెళ్ళి, మూడవ పెళ్ళి ముసలివాడికి ఇచ్చి చేయడం వల్ల వారు చనిపోయాక బాల వితంతువులు పడే అగచాట్ల నేపథ్యంలో రాసిన నవల ఇది.

తర్వాత రాసిన 'అందరూ మనుషులే', 'దారి తప్పిన మానవుడు', హైదరాబాద్ వంటి టౌన్లను దృష్టిలో పెట్టుకొని రాసినవే. "తెలుగు సినిమాని హైదరాబాద్‌కు మార్చే 1960ల నాటి వాతావరణం, చదువుసంధ్యలున్న నటీనటులను చిత్రాలలోకి తీసుకురావాలనే కొందరు నిర్మాతలు, దర్శకులు నాడు చేసిన ప్రయత్నాల కారణంగా సామాన్య కుటుంబాలు కొన్నింటిలో సంభవించిన పరిణామాలు, ఇటు తెలంగాణ అటు కోస్తా జిల్లాల జీవనసరళి పాత్రల ముఖతః అభివ్యక్తం చేశారు. చెప్పదలచుకున్న దేదయినా

విస్తరించి చెప్పడం రచయిత్రి కలం బలం తప్ప మరేమీ కాదు" అంటారు సుధామ తమ సమీక్షలో.

ఇక 'దారి తప్పిన మానవుడు' నవలలో నాకు పత్రికా రచనా వ్యాసంగంలో కలిగిన అనుభవంతోనూ, రాజకీయ వాతావరణంలో వస్తున్న మార్పుల అవగాహనతోనూ రాసిన నవల.

ఇక రేడియోలో పనిచేస్తున్న రోజుల్లో రాసిన నాటికలు చాలా వరకు పోయాయి. దొరికిన కొద్ది నాటికలను 'లేడీస్ కంపార్ట్‌మెంట్' అన్నపేరుతో అచ్చు వేయించడం జరిగింది. పిల్లల కార్యక్రమం, మహిళల కార్యక్రమం జరిపినప్పుడు రాసిన వ్యాసాలు, కథలు, కబుర్లు 'మనం, మన సంసారాలు', 'మీరూ నేనూ జట్టు' (పిల్లల పుస్తకం) అన్న టైటిల్స్‌తో అచ్చయ్యాయి. ఆనాటి ఈ పుస్తకాలన్నింటినీ ఆదర్శ గ్రంథమండలి గద్దె లింగయ్యగారు అప్పటికప్పుడు దబ్బిచ్చి తీసుకువెళ్ళి అచ్చు వేశారు. ఏరీ అలాంటి ప్రచురణ కర్తలు ఈనాడు?

ఆనాటి 'యువ' మాస పత్రికలో నా కథలు, వ్యాసాలు వచ్చేవి. పెద్ద కథలు 'ఆ తండ్రి కొడుకు కాదు' అన్న టైటిలు క్రింద, వ్యాసాలు 'చింతన' అన్న టైటిలు క్రింద అచ్చయ్యాయి. 'విపులాచ పృథ్వీ' లోని కొన్ని రచనలు కూడా ఒక పుస్తకంగా వెలువడ్డాయి.

నేను ఉద్యోగం చేస్తున్న కాలంలో వృత్తిరీత్యా ఇంగ్లీషులో Rajyasabha at work, How India Votes అన్న రెండు పుస్తకాలకు సహ రచయితగా ఉన్నాను. రాజ్యసభ విషయంలోనూ, ఎన్నికల విషయంలోనూ కూలంకషంగా వెలువడిన పుస్తకాలు ఈ రెండూనూ. ఎన్నికలను గురించి 'భారత ప్రజాస్వామ్యం – పూర్వాపరాలు' అంటూ తెలుగులో కూడా విద్యార్థులకు తెలుగు అకాడమీ అచ్చువేశారు. అలాగే 'సంక్షేమ రాజ్యం – సమస్యలు' అని నేనప్పుడప్పుడు ఇచ్చిన ప్రసంగాలను కొన్నింటిని తెలుగులో తెలుగు అకాడమి విద్యార్థులకోసం అచ్చు వేసింది. ఇలా చిన్నా చితకా పుస్తకాలు అచ్చయ్యాయి.

చివరగా ఒక సంగతి ఒకప్పుడు సంచలనం కలిగించిన నా రచన'నా కరిగిపోయేకలలు'.కాటూరి వెంకటేశ్వరరావు గారు ఆ పుస్తకాన్ని చదివాక కలలమ్మాయిని చూడాలనిపించి వచ్చారు రేడియో స్టేషనుకు. ఆచంట జానకిరాంగారు ఆ పుస్తకాన్ని చలం గారికి పంపితే ఆయన 'ఈవిడ వేచి చూడవలసిన రచయిత్రి' అని ఆయనకు రాసిన ఉత్తరం ప్రతి పంపారు. 1958 నాటి మాట. ఆ రోజుల్లో ఇంత మంది రచయిత్రులు లేరు. కవిత్వం రాసేవారు, కథలు, వ్యాసాలు రాసేవారు, నవలలు రాసేవారు కొద్దిమందే. అప్పుడచ్చయిన'నా కరిగిపోయే కలలు' వచనము, వచన కవిత్వము అని దానికొక పేరు

పెట్టడానికి ప్రయత్నించారు ఈ మధ్య మాట్లడుతూ నారాయణ రెడ్డిగారు 'భావ వీచికలు' అన్నారు. "రమాదేవి 'కరిగిపోయే కలలు' చదివిన పాఠకుడికి మనసు జ్వలించడం అంటే ఏమిటి? భావావేశం అంటే ఏమిటో అనుభూతికి అందుతుంది. నిజానికి ఇది మ్యూజింగ్స్ వంటి రచనే నిజానికి ఈ భావుకత, అన్వేషణా శీలం ఆమెను ఒక కవయిత్రిగా నిలబెట్టేవి. తనను తాను గుర్తించుకునే ప్రయత్నంలోని ఒంటరి క్షణాలు ఈ ఖండికలు. అయితే పూర్తిగా బహుశా వచనం వైపున, అందునా కథలు నవలల వైపు మొగ్గు చూపడం వల్ల రమాదేవిలోని గొప్ప కవయిత్రి 'బోసి కుర్చీగా' పరిణమించిందేమో" అంటారు సుధామ.

నా రచనల్లో శిల్పం వుందో లేదో నాకు తెలియదు. రచయిత తాను చెప్పదలచుకున్న దానిని చెప్పే విధానమే శిల్పం అనుకుంటాను. ఆ విధంగా ఎవరి విధానం వారిదే. దానిని శైలి అనవచ్చును. అసలు ఏ రచన అయినా చదివింప చేసేదిగా ఉండాలి. నిజాయితీగా, మనసు పెట్టి రాస్తే ఏ రచనైనా చదువరుల మనసును తాకుతుంది, మేధస్సును లేపుతుంది.

'పరిణతవాణి' ప్రసంగం చేసే అవకాశం కల్పించిన ఆంధ్రసారస్వత పరిషత్తు అధ్యక్షులు డా॥ సి. నారాయణరెడ్డిగారికి, ప్రధానకార్యదర్శి అచార్య ఎల్లూరి శివారెడ్డిగారికి కృతజ్ఞతలు.



ఆచార్య ఎం. కులశేఖరరావు

రంగారెడ్డిజిల్లా, ఇబ్రహీంపట్నం తాలూకాలో, హైదరాబాదుకు దాదాపు యాభై కిలోమీటర్ల దూరంలో నక్కర్త అనే గ్రామం ఉన్నది. ఆ గ్రామం, మా కుటుంబానికి వంశపారంపర్యంగా వచ్చిన మక్తా అంటే చిన్నజాగీరు. ఆ గ్రామంలో నేను 1932వ సంవత్సరంలో 14 నవంబరు నాడు పుట్టినానట. మా తండ్రిగారు శ్రీ మడుపు పరాంకుశరావుగారు. మా తల్లిగారు శ్రీమతి జానకమ్మగారు.

నక్కర్త గ్రామంలో మా నాయనగారు ఒక ప్రాథమిక పాఠశాలా భవనం నిర్మించి, దానిలో విద్యార్థులు చదువుకొనే అవకాశం కలిగించినారు. నేను, నా నలుగురు అన్నగార్లు ప్రాథమిక విద్య ఆ స్కూలులోనే అభ్యసించినాము. మా ముగ్గురు అక్కయ్యలకు మాత్రం స్కూలుకు వెళ్లే అవకాశం లేకపోయింది. వారి విద్యాభ్యాసమంతా ఇంటిలోనే మాస్టర్ల శిక్షణలో జరిగింది.

మా నాయనగారు తెలుగు, సంస్కృతం, ఉర్దూ, పార్శీభాషల్లో చక్కని ప్రవేశం ఉన్నవారు. మా అమ్మగారు భారతభాగవతాలు ధారాళంగా చదివేవారు. వారు, చిన్నతనంలో ఇంగ్లీషుకూడా అభ్యసించినారు. ఈ కారణంచేత మా ఇంట్లో ఎప్పుడూ మంచి సాహిత్య వాతావరణం ఉండేది. మా నాయనగారు, తాను స్వయంగా గ్రంథాలు చదువుకోవడమే కాక, మా చేత చదివి వినిపించుకొనేవారు. నేను దాదాపు 12 సంవత్సరాల లోపుగానే రామాయణం వారి సమక్షంలో చదివినాను. ఆ వచన రామాయణాన్ని దేవరాజసుధి అనే పండితుడు వ్రాసినాడు. అట్లే మహాభారతం వచన గ్రంథం కూడా మా యింట్లో ఉండేది. ఆంధ్రభాగవతంలో గజేంద్రమోక్షం, రుక్మిణీ కల్యాణం, ప్రహ్లాద చరిత్ర మొదలైన

ఘట్టాలు చదివించుకొని తప్పులు పోతే సరిచేసి, అర్థాలు చెప్పేవారు మా నాయనగారు. ఇదికాక, సాయం సమయాల్లో ఊరిలోని పెద్దలు కొందరు మా కోట (పెద్దయిల్లు) కచ్చేరీలో సమావేశం అయ్యేవారు. శ్రీరంగారెడ్డిగారు భాగవతం, కంకంటి పాపరాజు ఉత్తరరామ చరిత్ర మొదలైన గ్రంథాల్లోని పద్యాలు శ్రావ్యంగా చదువుతూ ఉంటే, మా నాయనగారు విడమర్చి చెప్పేవారు. గ్రామంలో ఆదాయం ఉండేది కాబట్టి ఇటువంటి వారికి ఉద్యోగ సద్యోగాలు చేయవలసిన అవసరం ఉండేది కాదు.

మా మూడవ అన్నగారు శ్రీ మదుపు శేషారావుగారు, చిన్నతనంలోనే కవిత్వం వ్రాయడం నేర్చుకొన్నారు. అప్పుడు కవిత్వం అంటే పద్యాలు వ్రాయడమే. ఆయన ఇంటర్మీడియట్ చదువుతూ, సెలవుల్లో వచ్చినప్పుడు తారాశశాంక అనే పద్యకావ్యం వ్రాసినారు. ఇంకా అనేక ఖండకావ్యాలు వ్రాసి; సుజాత, గోలకొండ పత్రిక మొదలైన వాటిల్లో ప్రచురించినారు. తరువాత వారు విజయరామ చరిత్ర అనే పద్యకావ్యం వ్రాసినారు. దానికి మహాకవి శ్రీ దాశరథిగారు మంచి పీఠిక వ్రాసి పెట్టినారు.

మా ఇంట్లో ఏర్పడి ఉన్న ఇటువంటి సాహిత్య వాతావరణంలో పెరిగినవాణ్ణి నేను. అందుచేత, చిన్నతనంలోనే నాకు సాహిత్యం మీద అభిమానం ఏర్పడింది. మా గ్రామానికి వచ్చి మా యింట్లో బసచేసిన మరింగంటి వంశంలోని పండితులు విరాటపర్వంలోని ఘట్టాలను పురాణ ప్రవచనం చేస్తూ ఉంటే శ్రద్ధగా వినేవాణ్ణి.

మా గ్రామంలో ప్రాథమిక విద్య అభ్యసించిన తరువాత, హైదరాబాదులో రిఫాయె ఆమ్ అనే పాఠశాలలో మాధ్యమిక విద్య, ముఫీదుల్లానామ్ అనే స్కూల్లో పదవతరగతి దాకా చదువు పూర్తిచేసినాను. తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంటర్మీడియట్‌లో చేరినాను (అప్పుడు ఆ కోర్సు విశ్వవిద్యాలయంలోనే ఉండేది). అక్కడ చదువుతున్నప్పుడు, ఆ ఉన్నత విద్యాలయం వాతావరణం, అక్కడి బోధకులైన ప్రొఫెసర్లు నన్ను బాగా ఆకర్షించినారు. విద్యాభ్యాసం చేస్తే ఇక్కడ చేయవలె, ఉద్యోగం చేస్తే ఇక్కడ చేయవలె అనే ఒక ఆకాంక్ష నాలో బయలుదేరింది. మా ఇంటరు క్లాసుకు ఒక ప్రొఫెసరు బాటనీ బోధించేవారు. ఆయనపేరు షాఆలం. ఇంగ్లాండులో పిహెచ్.డి. చదివి వచ్చినాడట. అందరి టీచర్లలాగ కాక, బక్కపలుచగా పొట్టికాక పొడుగు కాక ఉండేవారు. కాని పాఠం ధారాళంగా చెప్పేవారు. అతన్ని చూచి పెద్ద పర్సనాలిటీ లేనివారు కూడా మంచి టీచరు కావచ్చును కదా అనిపించింది. బహుశా అప్పటినుండే, నేను కూడా యూనివర్సిటీలో అధ్యాపక వృత్తి చేయవలెననే కోరిక ఏర్పడింది. ఇంటరు, బి.ఏ., ఎం.ఏ., పిహెచ్.డి. చేసి నేను కూడా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అధ్యాపకుణ్ణి అయినాను.

ఎం.ఏ. పరీక్ష అయిపోగానే వెంటనే యూనివర్సిటీలో ఉద్యోగ అవకాశం కనిపించలేదు కాబట్టి, పరిశోధనలో, అంటే పిహెచ్.డి.లో చేరవలెననే సంకల్పం కలిగింది. అవకాశం కూడా వెంటనే లభించింది. 1957వ సంవత్సరంలో ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారి మార్గదర్శకత్వంలో 'ఆంధ్రవచన వాఙ్మయము: ఉత్పత్తి వికాసములు' అనే విషయంమీద పరిశోధనకు అవకాశం కల్పించినారు విశ్వవిద్యాలయం వారు. ఇంక అక్కడినుండి పరిశోధన ప్రారంభం అయింది.

నేను పిహెచ్.డి.లో చేరేనాటికి నన్నయ కవిత్వం, జానపద సాహిత్యం, ఆధునిక సాహిత్యం, ప్రబంధ సాహిత్యం వంటి విషయాలమీద పండిత పరిశోధకులు కృషిచేస్తూ ఉండినారు. ఈ పరిశోధకుల దృష్టి తెలుగు వచనశాఖపై ప్రసరించి ఉండలేదు. అందుచేత, తెలుగు వచన వాఙ్మయం గురించి పరిశీలిస్తే నూతనంగా ఉంటుంది అనే భావం కూడా నాకు కలిగింది.

మేము ఎం.ఏ. చదువుకొనే సమయంలో తాళ్లపాక పెద తిరుమలాచార్యులు రచించిన శ్రీ వేంకటేశ్వర వచనాలు అనే గ్రంథం మాకు పాఠ్యంగా ఉండేది. ఆ వచనాల రచన సుందరంగా సాగింది. ఆ వచనాలకు పరిచయ పీఠిక వ్రాసిన శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు తెలుగు వచనంలోని వైవిధ్యాన్ని, సొగసును దిఙ్మాత్రంగా ప్రదర్శించినారు. చిన్న పీఠికలో వివరాలు చెప్పే అవకాశం కాని, అవసరం కాని వారికి లేకపోయింది. అయినా, ఆ పీఠిక నన్ను బాగా ఆకర్షించి, ఒక సిద్ధాంత వ్యాసం వ్రాయడానికి ప్రోత్సహించింది.

పిహెచ్.డి. లో చేరడానికి వెళ్లినప్పుడు నీవు ఏమైనా రచనలు చేసినావా? అని కమిటీ సభ్యులు ప్రశ్నించినారు. అంతకుముందు ఆచార్య సి. నారాయణరెడ్డిగారిని కవిత్వమే వినిపించమన్నారట. అదృష్టవశాన నేను, శ్రీమతి యశోదారెడ్డిగారు కలిసి ప్రచురించిన కావ్యానుశీలనం అనే వ్యాస సంపుటి వచ్చి ఉండింది. అది కమిటీ సభ్యులముందు పెడితే, దానిలోని నా వ్యాసాలు వారిని సంతృప్తిపరచినాయి. అయినా, ఆనాటి వైస్ చాన్సలరు డాక్టరు సూరిభగవంతంగారు, నీవు కవిత్వం వ్రాయవా? అని అడిగితే, నన్ను రక్షించడానికి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు, He writes a good prose అని కమిటీ సభ్యుల ముందు చెప్పడం, నాకు పిహెచ్.డి.లో సీటు రావడం సంభవించింది.

నా మొదట రచనల సంపుటి కావ్యానుశీలనం కావడంచేత, ఆ పుస్తకాన్ని గురించి కొద్దిగా మనవి చేస్తాను. ఆ సంపుటిలో విజయ విలాసం అనే ప్రబంధంమీద మూడు

వ్యాసాలు, నన్నెచోడుని గురించి మరొక వ్యాసం ఉన్నవి. ఈ వ్యాసాలు ఇదివరకే స్రవంతి అనే సాహిత్య సంచికలో ప్రచురితమైనాయి. ఈ వ్యాసాలు ప్రచురించిన కొద్దికాలంలోనే, తెలంగాణాలో అప్పుడప్పుడే ప్రారంభించిన ప్రాచ్యవిద్యాతరగతులకు పాఠ్యగ్రంథంగా నిర్ణయించినారు. దాని కారణంగానే, మా ప్రచురణ చెల్లిపోగానే, ఆంధ్రరచయితల సంఘంవారు తిరిగి ప్రచురించినారు. చాలాకాలం ప్రాచ్య విద్యార్థులకు ఆ సంపుటి పాఠ్య గ్రంథంగా కొనసాగింది.

'ఆంధ్రవచనము: ఉత్పత్తి వికాసాలు' అనే పరిశోధన ప్రారంభించినాను కదా! కొద్దికాలానికే నాకు ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు మార్గదర్శకులైనారు. వారి దగ్గర నేను ప్రథమ పరిశోధక విద్యార్థిని కావడంచేత నా పనిమీద శ్రద్ధ చూపించి ప్రోత్సహించేవారు. ప్రప్రథమంలోనే ఒక సమస్యవచ్చి దాన్ని పరిష్కరించే అవసరం ఏర్పడింది. అదేమంటే మన వచనానికి, వచనంతో బాటు గద్యం అనే పేరు కూడా ఉండడమే. ఈ రెండు పేర్లు న్యాయానికి సంస్కృతం నుండి వచ్చినవే. మన గ్రంథాల్లో, మహాభారతంలో, ప్రబంధాల్లోనూ, పద్యాల మధ్య వచనం వచ్చినప్పుడు వ. అంటే వచనం అని ఉంటుంది. ఆశ్వాసాంతాల్లో మాత్రం ఆశ్వాసాంత గద్య అని ఉంటుంది. ఈ రెండు యథార్థానికి ఛందోరహితమైన రచనలే. వచనానికి నిఘంటుకారులు Spoken word మాటాడబడింది, Prose అని అర్థాలు వ్రాసినారు. గద్యం అంటే ప్రోజ్ అని ఉన్నది. అయితే, మనకు ప్రాచీన రచయితలు ఛందోరహితమైన రచనను వచనం అనడం ఎందుకు అనే పరిశీలన చేస్తే, అప్పటికే కన్నడభాషలో బసవేశ్వర వచనాలు వెలువడినాయి. వాటి ప్రభావంచేత, మనవారు గద్యాన్ని వచనం అన్నారు అని నిర్ధారణ చేసినాను. తిక్కనగారు నిర్వచనోత్తర రామాయణం వ్రాసినారు కదా. ఈ నిర్ణయం పండితులకు అంగీకారం అయింది.దానిమీద వ్యాసాలు వ్రాసి, సాహిత్య సభల్లో ప్రస్తావించినాను. ఎవరూ వ్యతిరేకించలేదు.

వచనాలను గురించి పరిశీలన మొదలు పెట్టినప్పుడు, ఆ పరిశీలన మూడు దిశలుగా నడిచింది. తెలుగు వచనం ప్రప్రథమంగా మనకు వివిధమైన ప్రదేశాల్లో వెలువడిన దానశాసనాల్లో కనిపిస్తుంది. శాసనాల్లో ప్రధానంగా చెప్పదగినవి రేనాటిచోళ శాసనాలు, చాళుక్యుల శాసనాలు, కాకతీయ శాసనాలు, రెడ్డిరాజుల శాసనాలు, విజయనగర రాజుల శాసనాలు, తంజావూరు రాజుల శాసనాలు. వీటిలో ప్రారంభంలో కేవలం వచనశాసనాలు కనిపిస్తాయి. తరువాత గద్య పద్యాత్మక శాసనాలున్నాయి. కేవల పద్యశాసనాలు చాలా స్వల్పం. ఇదివరకు చారిత్రికులు, విమర్శకులు పద్యశాసనాలు,

వాటిలో ఉండే ఛందస్సు, ఇతర విషయాలను గురించిన చర్చచేసినారు. వచనాల్లో ఉండే శాసనాల చారిత్రక విషయాలను పరిశీలించడం జరిగింది. కాని, భాషాపరంగా, కాలక్రమంగా వాటిలో ఏర్పడ్డ పరిణామం గురించిన ఆలోచన పూర్వులకు అంతగా పట్టలేదు. నేను మనకు లభించిన ప్రథమ దశలోని రేనాటి చాళుక్యుల శాసనాలు మొదలుకొని, తంజావూరు విజయరాఘవ నాయకుని శాసనం వరకు, శాసనంలో వచన రచనకు కలిగిన క్రమపరిణామాన్ని చూపించినాను.

రేనాటి చోళుల శాసనాల్లో భావ వ్యక్తీకరణ చాలా ప్రాథమికంగా ఉంటుంది. 6వ శతాబ్దం (క్రీ.శ.)లో కలమళ్ల శాసనంలో 'వక్రమ్బువచ్చువారు' 'ఇచ్చినదత్తి' వంటి మాటలు, అసంపూర్ణ వాక్యాలవంటివి కనిపిస్తాయి. 7, 8 శతాబ్దుల్లో వెలువడిన ఈ ప్రాథమిక దశ అట్లాగే కొనసాగినా, కొంత భావం వ్యక్తమై కొంత స్పష్టత కనిపిస్తుంది. యథార్థానికి ఆనాటి వ్యావహారిక భాషకు, Documentary (రాజపత్ర) భాషకు ఇది ఉదాహరణగా చెప్పవచ్చును. ఉదా:ఎరిగల్ ముత్తు రాజు ఇచ్చిన సన్నస – దీనికి వక్రంబు వచ్చినవారు పంచమహాపాతకు –(ఇందుకూరు, ఉరుటూరు శా.) చాళుక్య రాజుల శాసనాల్లో పరిణామం స్పష్టంగా కాన్పిస్తుంది. శ్రీమత్ సకల లోకాశ్రయ జయసింహ వల్లభ మహారాజులకున్ (విస్పర్లనా) ఎణుంబోది అన్నేణ్ణి. ఆమన్ పూర్ణిమనాడు, (విస్పర్ల) కొమరవోలు కొండయ్య ఘనరాత మణివిజేతస్య (కుణప్రకాశం) (బుడమ నారాయణులపాడు శాసనం, విష్ణువర్ధన) 9వ శతాబ్దంలో వెలువడిన కొరవి శాసనంలో (చాళుక్య భీముడు) మంచి పరిణత వచనమున్నది. 'శ్రీ విక్రమాదిత్య తనయుణ్ణయిన్న, చాళుక్య భీమునకు, శౌచకందర్పనకు, కాశీశ్వరునకు, 'రసమర్దన శ్రీమదన భుజవీయన్ బలపరాక్రమమున నిరవద్యుండనేక సమర సంఘట్టన భుజాసి భాసురుణ్డై' చాళుక్యులనాటికి భాషా ప్రచారం బాగా జరిగిందనే విషయాన్ని ఈ శాసనాలు వ్యక్తం చేస్తాయి. చాళుక్యుల కాలంలోనే పద్యశాసనాలు, మహాభారతంలాంటి పద్యకావ్యాలు వెలువడినాయని ఇక్కడ గమనించవలె.

ఇంక రెడ్డిరాజుల శాసనాలు చాలావరకు, సలక్షణ భాషలో వెలసినాయి. క్రీ.శ. 13, 14 శతాబ్దం నాటికి తెలుగులో సాహిత్య వికాసం జరిగి, పురాణాలు వెలువడి తెలుగు భాష ఒక ప్రామాణిక స్థితికి వచ్చింది. అందుచేత డాక్యుమెంట్లు కూడా మంచి భాషలో వ్రాసి ఉండవచ్చును.

'అనవరత పురోహిత కృత సోమపాన, శ్రీ పర్వత అహోబల నిర్మిత సోపాన, దిక్కాంతా మనోహర కీర్తి కుసుమామోద, కుండిప్ర భా సహ్యాణ గౌతమీ జలక్రీడా వినోద,

విరోధి నృపదానవ నరసింహ, పాండ్యరాయ గజసింహ, నిత్యపరిపాలిత సత్య, పల్లవాదిత్య, వరపురహరణ మృత్యుంజయి సంగ్రామధనంజయ (అమరావతి శా.) రెడ్డిరాజుల సభల్లో పండితులు ఉండడంచేత వారిచేత ఈ శాసన రచన జరిగి ఉండవచ్చును.

విజయనగర రాజుల శాసనాలు, వచనంలో అనేకం ఉన్నాయి. వాటిలో కూడా భాష, వాక్య రచన సమగ్రంగా కనిపిస్తుంది. సాహిత్య వికాసమే దానికి కారణంగా భావించవలె. ఈ శాసనం చూడవలె: స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శకవర్షాలు ౧౪౩౪ ను నడిచే అంగిరస సంవత్సర ఫాల్గుణ శు....లు శ్రీమన్ మహారాజ రాజపరమేశ్వర శ్రీ వీర ప్రతాప శ్రీ వీర కృష్ణరాయమహారాయల దేవులు చిన్నాజి అమ్మవారు తిరువెంగళనాథ దేవునికి ఆనవాల నైవేద్యం అవసరానకు, గిన్నె ఒక్కంటికి తూకాలు ౩౨౪ పైడి గిన్నె సమర్పించ నవధరించిరి' ఈ కాలంలో ఇటువంటి శాసనాలే అధికం.

ఇంక తంజావూరు కాలంలో మనకు ఒకే ఒక శాసనం కనిపిస్తుంది. అది విజయరాఘవనాయకుడు పోర్చుగీసు వ్యాపారియైన 'కులాప్పంగును అమరాల్కు' ఇచ్చిన కౌలు నమ్మిక శాసనం.

'ఇది కాక తాము నాగపట్నం రేవున ఎక్కించే సరుకు నప్పట్లకొంక దాకలు దివస ధాన్యాదులకున్ను, దించేసరుకు నప్పట్లో ఎగుమతి దిగుమతి తీరున సర్వమానంగా కట్టడి చేసినాము. తమ కంపెనీ ఓడలు అరిసాలమురిసాల లేకుండా తమదిగానే కట్టడి చేసినాము. తమ వర్తకులేమి, మనుష్య మాత్రులేమి, నిలవసాలువలు, సొమ్ము సంబంధాలు ఎట్లాగొని నగరి గ్రామాంతరాలు పారివచ్చినట్లాయెనా, వార్ని నీ వారి సొమ్మునన్ను తమకే నప్పగించగలవారము. '.......' ఈ శాసనాన్ని గురించిన మరి ఒక విశేషం ఏమంటే, ఈ శాసనం వెండిరేకుపై చెక్కబడి ఉన్నది. ఈ రాజపత్రం ఇండోనేషియాలోని బటేవియా మ్యూజియంలో ఉన్నది. నేను దాన్ని ప్రత్యక్షంగా చూచే అవకాశం కలుగలేదు. భవిష్యత్ పరిశోధకులు దాన్ని సంపాదించి మనదేశానికి తీసికొని రాగలిగితే అది ఒక నిధిగా మనం భావించవచ్చు.

క్రీ.శ. పదునొకొండవ శతాబ్దంలో నన్నయ వ్రాసిన ఆంధ్ర మహాభారతమే మనకు ప్రథమ కావ్యం. ఇది గద్య పద్యాత్మకమైన చంపూ కావ్యం. ఇదివరకు విమర్శకులు నన్నయగారి పద్యవిద్యనే విమర్శించి సంభావించినారు కాని, ఆయన వచన రచనను గురించి అంతగా పట్టించుకొన్నవారు కారు. నన్నయ్యగారు మొత్తం తన రెండున్నర పర్వాల్లో 4014 గద్యపద్యాలు వ్రాసినారు. వాటిలో 1431 వచనాలున్నవి. వీటిలో కొన్ని

ఏక పంక్తిమాత్రములైన చిన్న వచనాలను వదలితే దాదాపు తన రచనలో 3వ భాగం నన్నయ కూర్చినారు. పూర్వవిమర్శకులు భావించినట్లు శైలీ వైవిధ్యం కొరకు ఈ వచనాలను ఉపయోగించడమే కాక, కొన్ని ప్రత్యేక సందర్భాలకు వచనాలను ఉపయోగించినట్లుగా తెలియవస్తుంది. అందులో మొదటిది సంక్షిప్తీకరణం, అనగా అవసరం కాని సందర్భాలలో కథను క్లుప్తం చేయడం. వసుమహారాజు కథను చెప్పవలసి వస్తే దాన్ని కేవలం ఆరు పంక్తుల వచనంలో చెప్పినాడీ మహాకవి. ఇదికాక, ఏదైనా విషయ కథనం చేయవలసి వచ్చినా తప్పక వచనమే వాడుతాడు నన్నయ. ఇది కాక, సంభాషణలు సహజంగా ఉండడానికి వచనాలనే ఉపయోగించడం ఆయన పద్ధతి. ఈ మాటలు చూడండి - కద్రువ వినతంజూచి, చూడవె, యతి ధవళంబైన యశ్వంబునందలి చంద్రునందు నల్లయుంబోలె వాలప్రదేశంబునల్ల నైయున్నది'. 'నీవే కన్నులం జూచితే యక్క మెక్కడిది నల్ల, యీయశ్వమూర్తి మహాపురుషకీర్తియుంబోలె నతి నిర్మలంబై యొప్పుచున్నది'. దీనివలన కథా కథనానికి ఒక సహజత్వం ఏర్పడి, ఆయన ప్రసన్న కథానైపుణి ప్రదర్శించింది. చాలా సందర్భాలలో వర్ణనచేయవలసి వచ్చినప్పుడు కూడా ఈ మహాకవి వచనాలనే ఉపయోగిస్తాడు. ఇవికాక వంశానుచరితలు, వ్యక్తుల జీవితాలు చెప్పవలసి వచ్చినప్పుడు వచనం బాగా ఉపయోగించింది. కావ్య శిల్పానికి ఈ ప్రయోగాలు చాలా ఉపయోగ పడినాయి.

ఇంక అక్షర రమ్యతకు ఒక ఉదాహరణ చూడవలె. 'కరిమకరి నికరాఘాత వాతోద్ధూత తరంగాగ్ర సముజ్జ్వల కణాసారాచ్ఛాదిత గగనతలం బైనదాని, ఉద్యాన వనంబునుంబోలె బహువిద్రుమలతాలంకృతంబైనదాని, నాటక ప్రయోగంబునుంబోలె ఘనరసపాత్ర రంగరమ్యంబైనదాని, దివంబునుంబోలె అహిమకరభరితంబైనదాని'. ఈ వచనాన్ని అక్షర రమ్యత కలిగిన ఏ పద్యంతోనైనా బోల్చవచ్చును. ఇంక నానారుచిరార్థ సూక్తులు చూడండి. అంగాదంగత్సంభవసి, 'బుద్ధి గలవానికి క్రోధంబు కొనియాడ దగదు. పతి నియోగించినదాని చేయనినాడు భార్యకు పాతకంబగు'. ఇటువంటివి చాలా ఉన్నాయి.

ఇట్టి మంచి ప్రయోజనాలుగల వచనాలను నన్నయ ఉపయోగిస్తే తిక్కన, ఎఱ్ఱన ఆయనను అనుసరించినారు. తిక్కనగారికి చాలాచోట్ల వ్యూహరచన, యుద్ధవర్ణన చెప్పవలసి వచ్చింది. అప్పుడు ఆయన విధిగా వచనాన్నే ఉపయోగించుకొని తన స్వాతంత్ర్యాన్ని ప్రదర్శించినాడు. కవిత్రయంవారి వచనరచనలో చూర్ణికలు, ఉత్కలికాప్రాయాలు, పద్యగంధులు అనేకం మనకు దర్శనమిస్తాయి. పురాణయుగంలో పోతన, శ్రీనాథుడు

తమ కావ్యాల్లో వచన భాగాన్ని నాల్గవ వంతు భాగానికి తగ్గించినారు. కాని, ప్రయోజనాలను కవిత్రయం వారివలెనే గ్రహించినారని చెప్పవలె. అక్కడక్కడ రీతిమీద శ్రద్ధ చూపించడం తప్ప.

ఇంక 16వ శతాబ్దంలోని ప్రబంధయుగంలోనికి ప్రవేశిస్తే, పద్యరచనలో, కథాశిల్పంలో, కథనంలో మార్పులు కనిపించినట్లుగానే, వచన రచనలోను మార్పు తెచ్చి ప్రబంధకవులు స్వతంత్రంగా ప్రవర్తించినారు. మొదట పరిమాణం చూస్తే వచనాలు వారి రచనల్లో కేవలం పదిశాతం మాత్రమే. వారు సాధ్యమైనంత ఎక్కువగా పద్యాలు వ్రాయవలెననే కుతూహలం కలవారు. అయినా, ప్రబంధాలు కూడా చంపూ కావ్యాలే. వారు స్వయంగా వచన రచన చేసినప్పటికి ఆ రచన పట్ల వారికి శ్రద్ధ ఎక్కువ. చూర్ణికలనే సరళ రచనలు వీరికి పట్టవు. పద్యగంధులు కూడా అంతే. ఇక వారు ప్రదర్శించే ఆసక్తి అంతా ఉత్కలికాప్రాయాలనే వచనాలమీదనే. ఇవి సమాసాఢ్యమై, కవుల పాండిత్యాన్ని వ్యక్తం చేసేవిగా ఉంటాయి. ఆంధ్రకవితా పితామహుడు అల్లసాని పెద్దన వ్రాసిన ఈ వచనశైలి అన్ని ప్రబంధ వచనాల్లోను ప్రతినిధి ప్రాయంగా ఉంటుంది:

> "లంబమాన రవి రథతురంగ శృంగార చామర చామరచ్ఛటా ప్రేక్షణ
> క్షణోద్గీవ చమర సముదయంబగు నుదయనంబు నంగల విశేషంబులు
> శేషఫణికినైన లెక్కింప శక్యంబె? అంధకరిపుకంధణవాస వాసుకి
> వియోగభవ దుర్వ్యథా భోగభోగినీ భోగభాగ పరివేష్ఠిత విటపి
> వాటికా వేల్ల దేలాలతావలయంబగు మలయంబు నంగలుగు
> చలువకు విలువ యెయ్యది. అక్కటకట! వికట కూట కొడ విటంక
> శృంగాటకామాన శరదిందుబింబ గళ దమృతబిందు దుర్ది నార్ద్రీకృత
> సల్లకీపల్లవ ప్రభంజన పరాంజన హసిహస్తంబగు మ మణిపుస్త
> రంబుల విశ్రాంతి చింతించిన మేనంబుల కలిప్పుడు బాండమెదు.."

ఇట్టి వచనాలను చూస్తుంటే ప్రబంధకవుల పద్యాలే తేలిక అనిపించేటట్లు ఉంటుంది. 'కేదారేశు భజించితిన్ శిరమున్ గీలించితిన్ హింగుళా పాదాం భోరుహముల్, ప్రయాగ నిలయున్ పద్మాక్షు సేవించితిన్, యాదోనాథు సుతాకళత్రు, బదరీ నారాయణుంగంటి ఈ యాదేశంబననేల చూచితి సమస్తాశావకాశంబులన్'

ప్రబంధకవులు వచన రచనల విషయంలో పరిమాణంకంటే, ప్రమాణానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి ఇటువంటి ఉత్కలికాప్రాయ రచనలు చేసినారని చెప్పవలె. అనంతర

ప్రబంధ కవులకు కూడ ఈ దిశలో పెద్దనాదులే ఆదర్శమైనారు.

ఇంక ముఖ్య భాగం వచన సాహిత్యంలో వచనైక రచనలు. క్రీ.శ. పదునాల్గవ శతాబ్దం దాకా మనకు వచనైక రచనలు రానేలేదు. ఈ శతాబ్దంలో కాకతీయ ఓరుగంటి ప్రతాపరుద్రుని కాలంలో జీవించిన కాంత కృష్ణమాచార్యులు రచించిన సింహగిరి నరహరి రచనలే మనకు ప్రథమ వచనైక రచనలు. ఈ వచనాలను అందుకోవడంలో నాకు బాగానే శ్రమ అయింది. మదరాసు ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీలో ప్రతి ఉన్నదంటే అది క్యాటలాగులోనే ఉన్నది కాని గ్రంథం లేదు. ఇంక సరస్వతీ మహలు లైబ్రరీలో తంజావూరులో ఉన్నదని తెలిస్తే అక్కడికి వెళ్లినాను. అక్కడ క్యాటలాగులోనే దీనిపేరు లేదు. అయినా తాళపత్ర గ్రంథాలు పట్టుదలతో గాలించగా ఒక తాళపత్ర గ్రంథంపై విష్ణునామ సంకీర్తన ఫలం అని వ్రాసి ఉన్నది. అదేమో చూస్తామని తీయగా మరేమీ కాదు. సింహగిరి వచనాలే. కృష్ణమాచార్యుల రచనలే. కేవలం అరవైరెండు మాత్రమే ఉన్నవి. వాటిని ఎత్తి వ్రాసి, విశేషాలు నా పరిశోధనలో చేర్చి, తరువాత ఆంధ్రరచయితల సంఘం పక్షాన విపులమైన పీఠికతో ప్రచురించినాను. విద్వల్లోకాన్ని ఆ గ్రంథం చాలా ఆకర్షించింది. కృష్ణమాచార్యులు చెప్పిన ప్రకారంగా ఆయన వ్రాసిన చాతుర్లక్ష వచనాలను ప్రతాపరుద్రుని సాహాయ్యంతో రాగిరేకులమీద వ్రాయించి, బండ్లకెత్తించి శ్రీరంగ క్షేత్రంలో స్వామికి సమర్పించినాడు. అక్కడ వాటిని చూద్దామని ఆ క్షేత్రానికి వెళ్లినాను. కాని ఈ రాగి పత్రాలు లేవు. అక్కడి వారలను కనుగొనగా Protected Documents విభాగంలో కొన్ని పెట్టెల్లో రాగి రేకులున్నాయని, వాటిని తీయడానికి మద్రాసులోని అర్కియాలాజికల్ డైరెక్టరుగారి అనుమతి కావలసి ఉంటుందని తెలిసింది. ఆ అనుమతి నాకు అనేక కారణాలచేత లభించలేదు. సింహాచలక్షేత్రం వారికి చెబితే, అక్కడినుండి ఒక పండితుడు వెళ్లగా, శ్రీరంగేశ్వరుని దర్శనమైంది కాని, రాగిరేకులు కనపడలేదు. ఇప్పుడు నాకు శక్తికాని, వనరులుకాని లేవు. భావిపరిశోధకులు వీటిని పరిశోధించవలె. మనసాహిత్య సంపదను సంపాదించవలె.

కృష్ణమాచార్యుల స్తుతి వచనాలను అనుసరించి తరువాత అనేక రచయితలు ఈ వచనాలను వ్రాసినారు. వేంకటేశ్వర వచనాలు, భవానీ మనోహర వచనాలు, శంకరవచనాలు, శఠకోపవిన్నపాలు, శ్రీమన్నారాయణ వచనాలు, శ్రీరామానుజ విన్నపాలు, శ్రీ సాయి విన్నపాలు మొ॥ వీటన్నిటి పరిశీలన నాగ్రంథంలో చేర్చినాను.

సాహిత్య పరిణామంలో దాక్షిణాత్యయుగం తెలుగు వచన రచనకు వెన్నెల కాలం అని చెప్పవలె. మొదటి చారిత్రక కావ్యం విశ్వనాథ నాయకుని స్థానాపతి వ్రాసిన

రాయవాచకం, కళువెవీరరాజు భారతము, తుపాకుల అనంతభూపాలుని సుందరకాండ, శ్యామరాయకవి వచన రామాయణము, స.వెం.కృష్ణప్పనాయకుని జైమినిభారతం, నంజరాజు హాలాస్యమాహాత్మ్యం మొదలైనవి మంచి వచన కావ్యాలు. సరళవచనం వ్రాయడం వీరందరికి ఇష్టమే. ప్రచారంకూడా అధికమే. ఈ కాలంలోనే యక్షగానాలు వెలువడినాయి. ఈ రచయితలు కూడా సంగీత రచనలైన దరువులు, కీర్తనలు, కందార్థాలు వ్రాస్తూ మధ్య మధ్యన వచనాలు కూర్చినారు. సంభాషణలకు ఈ దేశీయ నాటకాల్లో వచనాలు చాలా ఔచిత్య భరితంగా కనిపిస్తాయి. ఈ సిద్ధాంత గ్రంథంలో నేను దాదాపు ముప్పై అముద్రిత గ్రంథాలను గురించి చర్చచేసి వాటి విశేషాలు ప్రదర్శించాను. ఎప్పుడు సెలవు దొరికితే అప్పుడే మదరాసు, తంజావూరు, తిరుపతి వెళ్లవలసివచ్చింది. అప్పుడు మనకు వ్రాతప్రతుల గ్రంథాలయం లేదు. మంత్రి మండలి వెంకటకృష్ణారావుగారికి పరిస్థితి చెప్పి ఆయనకు ఒక అర్జీ సమర్పించి, హైదరాబాదుకు ఆ పుస్తకాలను మన రాజధానికి తరలించవలసిందిగా కోరినాను. జరిగిన ప్రయత్నమూ, ఫలితమూ అందరికి తెలిసిందే.

పిహెచ్.డి. డిగ్రీ, దానితోపాటు ఉద్యోగం రావడంతోబాటు నా పరిశోధన ఆగిపోలేదు. అప్పటికి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు ఆంధ్రమహాభారత సంశోధిత ముద్రణం కృషిని ప్రారంభించినారు. వారు ఆదేశిస్తే నేను ఆ ప్రాజెక్టులోచేరి, ఏడు సంవత్సరాలు పనిచేసినాను. దాదాపు నలభై వ్రాత ముద్రిత ప్రతులు సంపాదించి వాటిని, వావిళ్ల ప్రతితో (Volgate) తులనాత్మకంగా పరిశీలిస్తే ఇప్పుడు మనకున్న సంశోధిత ముద్రణం వచ్చింది. ఇదివరకు లోకానికి తెలియని ప్రతులు పరిశీలించినాము. Prince of wales Museum లండనులో మహాభారత ప్రతి ఉన్నదని తెలిసి ఆచార్య ఖండవల్లివారు దాన్ని సంపాదించడానికి ఎంతో కృషి చేసినారు. ఇది ముద్రిత ప్రతి. ఆలూరి ఏకామ్ర జోస్యులు అనే పండితుడు దీన్ని ముద్రించినాడు. ఇది 1851లో వచ్చింది. దీన్ని లండను ప్రతి అంటారు. మరొకటి కరాలపాటి రంగయ్యగారు తమ ముద్రాక్షరశాలలో వేయించిన ప్రతి. దీన్ని 1852లో ప్రచురించినారు. మాకు లభించిన ముద్రిత ప్రతుల్లో ఇవే ప్రాచీనమైనవి. ఇవి కాక భారతం లక్ష్మీపతి ఒక ప్రతికి వ్యాఖ్యానం వ్రాసినారని తెలిసింది. కాని అది లభించనే లేదు. ఇక కందుకూరి వారి ప్రతి, బ్రౌనుప్రతి మొదలైనవి ఈ పరిశీలనలో చేరినవి. ఇవన్ని కలిసి ఉస్మానియా ప్రతికి మంచి ప్రాచుర్యం వచ్చింది. ఇటీవలి తిరుపతి దేవస్థానంవారు, ఈ సంశోధిత ముద్రణకే, సరళ వ్యాఖ్యానం వ్రాయించి విడుదల చేసినారు. పండితుల ఆమోదానికి ఇదే నిదర్శనం కదా. ఇక్కడ ఒక్కమాట

చెప్పవలె. పరిశోధన ఈ విధంగా కొనసాగగా, నేను సంస్కృత భాష అభ్యసించవలెనని, సంస్కృతం ఎం.ఏ. చదవవలెనని మనస్సులో ఉండిన కోర్కె నెరవేరనే లేదు.

సంచికల్లో అక్కడక్కడ వెలువడిన విమర్శనాత్మక వ్యాసాలు కూర్చి 'రుచిరాలోకనం' అనే పేరుతో ఒక సంపుటి ప్రచురించినాను. ఈ పుస్తకానికి కూడ ప్రాచుర్యం వచ్చింది. మన విశ్వవిద్యాలయం వాళ్లు, నాగార్జున విశ్వవిద్యాలయం వాళ్లు డిగ్రీకోర్సులకు పాఠ్య గ్రంథంగా నిర్ణయించుకొన్నారు. రెండుమూడు ప్రచురణలు వెలువడినాయి. మహాభారతంలో ఉండే ఉపాఖ్యానాలను గురించిన వ్యాసం, ప్రబంధాలలో శృంగారానికి, ఫ్రాయిడ్ సిద్ధాంతానికి అన్వయించి వ్రాసిన వ్యాసం పండితులమన్ననలను అందుకొన్నాయి. కావ్యానుశీలనం ఇదివరకు వచ్చింది కూడా విమర్శనాత్మక వ్యాసాలే అని మనవి చేసినాను కదా.

నేను ఉస్మానియ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నప్పుడు, తెలుగు సాహిత్యంమీద జరిగిన పరిణామాన్ని గురించి Pre-Ph.D., M.Phil విద్యార్థులకు పాఠాలు చెప్పవలసి వచ్చింది. కాని ఆ విషయానికి సంబంధించి ఒక గ్రంథం కూడా లేదు. అప్పుడు 'తెలుగు సాహిత్యము – పరిశోధన' అనే గ్రంథం తయారు చేసినాను. బ్రౌను, మెకంజీ, బాయిల్స్‌వంటి పాశ్చాత్యుల సేవనుగురించి, వీరేశలింగం, వేటూరి ప్రభాకరశాస్త్రి, మొదలైన పూర్వపండితుల కృషిని గురించి, విశ్వవిద్యాలయాలలో జరిగిన పరిశోధన గురించి ఆధునికుల పరిశ్రమగురించి, అనేక పరిశోధన విషయాలు, గ్రంథాలు దీనిలో వచ్చినాయి. ఈ గ్రంథం పరిశోధక విద్యార్థులకు చాలా ఉపయోగపడినట్లున్నది. కొద్ది కాలంలోనే ప్రతులన్ని చెల్లిపోయినాయి. ఇప్పుడు ఒక కాపీకూడా నా దగ్గరలేదు. ఇటువంటిదే 'పరిశోధన పద్ధతులు' అనే పుస్తకం. ఇంగ్లీషులో ఉంటే Research Methodology పుస్తకాలనుచూసి పరిశోధక విద్యార్థులకు పాఠాలు బోధించవలసి వచ్చేది. ఈ లోటు తీరడానికి అనేక రిఫరెన్సు గ్రంథాలను ఉపయోగించి, తాళపత్ర సంపాదనలో నా అనుభవాన్ని జోడించి, పరిశోధన పద్ధతులు అనే పుస్తకం వ్రాసినాను. తెలుగులో నాకు తెలిసినంత వరకు ఇదే ప్రథమ ప్రయత్నం. మన విద్యార్థులే కాక ఇతర విశ్వవిద్యాలయాల్లో పరిశోధక విద్యార్థులు దీన్ని బాగా ఉపయోగించుకొన్నారు. అధ్యాపకులు ఆదరించడం సరేసరి.

1985వ సం॥ ప్రాంతంలో ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. నాకు వచ్చే ఉత్తరాల్లో ఒక విదేశీ జాబు కనిపించింది. ఎవరు వ్రాసి ఉంటారా నాదా కాదా అని చూస్తే దానిమీద Mr. or Mrs. కులశేఖరరావు అని ఉన్నది. విశ్వవిద్యాలయం అడ్రసుకే.

విప్పిచూస్తే దాన్ని జర్మనీ దేశంలోని ఫ్రాంకుఫర్టు నగరం నుండి ఒక జర్మను విద్వాంసుడు ఫ్రెడరిక్ అనే అతడు వ్రాసినాడు. రెండు పేజీల ఆ ఉత్తరంలోని సారాంశ మేమంటే- ఆయన హైదరాబాదులో రెండు సంవత్సరాలు మాక్సుముల్లర్ భవనంలో పనిచేసినాడట. అప్పుడు ఈ నగరంలో మంచి వక్తలు (డా॥ అవధానిగారు కావచ్చు) తెలుగు ఉపన్యాసాలు, ఉత్తమ కవుల (ఆచార్య నారాయణరెడ్డిగారు కావచ్చు) కావ్యగానాలు తెలుగులో విన్నాడట. ఆయనకు మన భాషమీద చాలా అభిమానం ఏర్పడింది. తెలుగు నేర్చుకోవాలని ప్రయత్నాలు కూడా చేసినాడు. కాని, ఉద్యోగ వ్యగ్రతలో అది సాధ్యం కాలేదు. తిరిగి జర్మను దేశం వెళ్లిపోయినాడు. ఇప్పుడు తాను ఆ భాష నేర్చుకోవడం సాధ్యం కాదు కాబట్టి మన భాషా సాహిత్యాలను గురించి సమగ్రంగా తెలిపే ఇంగ్లీషు గ్రంథాలుంటే పంపించమని వ్రాసినారు. అప్పుడు నేను మన సాహిత్యాన్ని గురించిన ఆంగ్ల పుస్తకాల కొరకు అన్వేషణ సాగిస్తే, 'Telugu language and literature' అనే గిడుగు సీతాపతిగారి పుస్తకం లభించింది. కాని చిన్నపుస్తకంలో 100 పేజీలకు పైగా ఆయన ద్రావిడ భాషలను గురించి, వాటితో మన భాషకు సంబంధం గురించి, వ్యావహారిక భాషోద్యమం గురించి చర్చ చేసినాడు. మిగిలిన 75 పేజీలలో సాహిత్య విశేషాలున్నాయి. కవిత్రయాన్ని గురించి 20 పేజీలు, ప్రబంధాలను గురించి 10 పేజీలు, ఆధునికులను గురించి కొన్ని పేజీలతో ఈ గ్రంథం ముగిసింది. ఇది కాక, శ్రీ శ్రీ కవిత్వాన్ని గురించి కొన్ని వ్యాసాలు ఇంగ్లీషులో లభించినాయి. శ్రీ ఆచంట జానకిరాంగారు వ్రాసిన 'Glimpses of Classical poetry in Telugu' అనే గ్రంథం దొరికింది. దానిలో ఆయన ప్రబంధంలో ఉండే మంచి పద్యాలు ఏరుకొని వాటికి ఇంగ్లీషు అనువాదం చేసినాడు. ఇవికాక 'త్రివేణి' పత్రికల్లో పడిన వ్యాసాలు రెండో మూడో లభించినాయి. వీటన్నింటిని సంపాదించి నేను ఫ్రెడరిక్ గారికి పంపించినాను. కాని, ఒక సమగ్రగ్రంథం మనసాహిత్యాన్ని గురించి చెప్పేది ఇంగ్లీషులోలేక పోయింది కదా అనే భావం కలిగింది. అప్పుడు నేనే వ్రాయవచ్చు అనే సాహసం చేసినాను. మొదట తెనుగు, తెలుగు, ఆంధ్ర మాటలను గురించి, ఒక వ్యాసం ఇంగ్లీషులో వ్రాసి పూజ్యులు ఆచార్య రామరాజుగారికి చూపించినాను. వారు సంతృప్తి చెంది కొన్ని సూచనలు చేసి నా గ్రంథరచన సంకల్పానికి ప్రోత్సాహం కలిగించినారు. అప్పటినుండి ప్రారంభించి, నన్నయగారు మొదలు ఆధునిక పద్ధతుల్లో విషయ విభజన చేసి, నేటి మినీ కవిత్వాల వరకు 'A History of Telugu literature' అనే పుస్తకం వ్రాసినాను. నాకు ఈ రచనకు దాదాపు రెండున్నర సంవత్సరాలు పట్టింది. U.G.C. వారు కొంత ద్రవ్యసాహాయ్యం చేయగా, తెలుగు యూనివర్సిటీ మొదలైనవారి సాహాయ్యంతోను, నా సొంత ఖర్చుతోను ఈ గ్రంథం ప్రకటితమైంది. ఆచార్య శివరామకృష్ణ గారు నా రచనలో నాకు చేదోడు

వాదోడుగా ఉండినారు. ఈ గ్రంథాన్ని మంచి ప్రయత్నమని, అందరు మెచ్చుకోవడమే కాక, ఆచార్య సి. నారాయణరెడ్డిగారు దీన్ని పండితుల సమక్షంలో ఆవిష్కరించినారు. తరువాత, మనదేశంలోని 80 విశ్వవిద్యాలయాలు ఈ గ్రంథాన్ని తమ గ్రంథాలయాలకు సరఫరా చేయించుకొన్నారు. వివిధ విశ్వవిద్యాలయాల అధ్యాపక మిత్రులు ఈ పుస్తకం తీసికొని ఆదరించినారు. ఆచార్య వేల్చేరు నారాయణరావుగారు చాలా కాపీలు తీసికొని వెళ్లి అమెరికన్ విశ్వవిద్యాలయాలలో పంచినారు. 1, 2, సంవత్సరాలలో కాపీలు ముగిసి పోయాయి. ప్రచురణ వెంటనే ఒక కాపీ ఫ్రెడరిక్ గారికి పంపించినాను. కాని వారి నుండి జవాబు రాలేదు. వారు అడ్రెసు మారినారో, మరేదైనా అయినదో తెలియరాలేదు. ఇది విచారకరమే.

ఇంకొక ఇంగ్లీషు పుస్తకం నేను వ్రాసింది. Jnanpith Awardee Prof. C. Narayana Reddy A Literary Profile అనేది. ఈ గ్రంథ రచనకు కూడా ఒక నేపథ్యం ఉన్నది. 1988లో నేను జయపూరు విశ్వవిద్యాలయంలో ఆధునిక భారతీయ సాహిత్యాలపై జరిగిన ఒక సెమినారుకు హాజరైనాను. అక్కడ తెలుగు సాహిత్యంలోని ఆధునిక కవిపండితులను గురించి చర్చ వచ్చింది. సహజంగా ఇతరులతో పాటు ఆచార్య సి. నారాయణరెడ్డిగారిని గురించిన ప్రస్తావన వచ్చింది. కొంతమంది, హిందీ అధ్యాపకులు, కన్నడ దేశంనుంచి వచ్చినవారు, ఇతరులు సి.నారాయణరెడ్డిగారిని కేవలం సినిమా కవిగా గుర్తించి మాట్లాడినారు. నా వ్యాసంలో నేను వారు అప్పట్లో వ్రాసిన 45 గ్రంథాలను ప్రస్తావించినాను. ఆధునిక సాహిత్యంలో వారి సుస్థిరస్థానాన్ని స్థాపించి చెప్పినాను. అప్పుడు నాకు తోచింది, ఇంగ్లీషులో ఒక పుస్తకం ఈ కవిని గురించి ఉంటే, ఆంధ్రేతరులకు మన నారాయణరెడ్డిగారిని గురించి తెలిసి ఉండేదని. వెంటనే ఆ ప్రయత్నం ప్రారంభించి ఆరునెలల్లో పూర్తి చేసినాను. అప్పటికే ఆచార్య నారాయణరెడ్డిగారిని గురించి రెండు మూడు సిద్ధాంత వ్యాసాలు వచ్చి ఉండినాయి. వారి కవితా సంపుటాలన్ని నాకు అందుబాటులో ఉన్నాయి. అందుచేత నా పని సులభమైంది. ఈ ఇంగ్లీషు పుస్తకాన్ని మారుతి ప్రచురణకర్తలు ప్రచురించినారు. ఈ గ్రంథాన్ని పండితులు, విద్యార్థులు చాలా ఆదరించినారు. మన విశ్వవిద్యాలయంలోని Audio-Visual Dept. (జర్నలిజం) వారు దీని ఆధారంగా ఒక డాక్యుమెంటరీని నిర్మించి విడుదలచేసినారు. నేను ఢిల్లీకి వెళ్లినప్పుడు అప్పటి U.G.C. ఛైర్మను ఆచార్య జి. రామిరెడ్డిగారికి ఈ గ్రంథం బహూకరిస్తే ఆయన ఎంత సంతోషించినారో చెప్పలేను. ఆచార్య సి. నారాయణరెడ్డిగారు ఈ పుస్తకం చూసి

దీన్ని ఎట్లా వ్రాసినావు అని ప్రశ్నించినారు. ఆ ప్రశంస నాకు చాలు.

ఈ రెండు ఇంగ్లీషు పుస్తకాలు వచ్చిన తరువాత, విజయవాడలోని ఒక ప్రకాశకుడు, కవిత్రయంవారి మహాభారతాన్ని అనుసరించి, ఇంగ్లీషులో మహాభారతాన్ని సంగ్రహంగా వ్రాయమని కోరినాడు. ముఖ్యంగా విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని రచన ప్రారంభించినప్పుడు బాగానే జరిగింది. దాదాపు 400 పేజీల పుస్తకం వేస్తారని నేను భావిస్తే వారు దాన్ని ఒక్కొక్క పర్వంగా 18 పుస్తకాలుగా వేసినారు. సరళమైన భాషలో ఉండడంచేత కాబోలు బాగానే ప్రచారం జరిగింది. ఆ ప్రకాశకులు ప్రయత్నించి, ఈ పుస్తకం అన్ని పాఠశాలలు తప్పక కొనవలసిందని రాయితీలు ఇచ్చినారు. కొద్ది కాలంలోనే పుస్తకాలు వెళ్ళిపోయినాయి.

1985 ప్రాంతంలో ఏదైనా కవిత వ్రాయవలెనని కోరిక కలిగింది. మాత్రా ఛందస్సులో మొదట ప్రారంభించినాను. శ్రీనివాస శతి. శ్రీనివాసా అనే మకుటంతోని దీన్ని ప్రారంభించినాను. చాలా గోష్ఠుల్లో వినిపిస్తే అందరూ సంతోషించినారు. ప్రచురించమని పూజ్యులు ఆచార్య గోపాలకృష్ణరావుగారు ప్రోత్సహించడమే కాక, దానికి చక్కని పీఠిక వ్రాసినారు. 'మందిరమ్మున నిన్ను చూచుట – మంచి మాటయె కాని స్వామీ, మనసు మందిరాన గనుట – మహాభాగ్యము శ్రీనివాసా' అని, 'అరసమెందుకు, విరసమెందుకు? అసలు కవులకు సంఘమెందుకు? సరసమైన కవిత చాలదా, సారసాక్షా శ్రీనివాసా' ఇట్లా నూరు గేయాలున్నాయి. తరువాత అక్కడితో ఊరుకోక ఒక కథాకావ్యం వ్రాయాలనిపించింది. దానికి 'శ్రీకృష్ణ చరిత్ర' అని పేరు. వచన రచయిత కాంత కృష్ణమాచార్యుల భక్తి, శృంగార, వైరాగ్య చరిత్ర. అందలి కథానాయిక మోహనాంగి 'మోహనరూపము ముగ్ధ వయస్సు మోహనాంగ్యాఖ్యతో ముదముననుండె. వాసంతవేళలో వాసిగనామె చేసెను నాట్యము సేవరూపమున. కృష్ణమాచార్యుల కృతులను నామె, విష్ణువు ముందర విందులుచేసె'. దానికి ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు ప్రశంసా పూర్వక పీఠిక వ్రాసి ప్రోత్సహించినారు. ప్రాచ్య విద్యా తరగతులకు చాలా కాలం పాఠ్యగ్రంథంగా నిర్ణయించుకొన్నారు.

విద్యార్థి దశలో గాంధీగారి జీవిత చరిత్ర మొదలైన గ్రంథాలు చదివిన వాణ్ణి. అహింసా సిద్ధాంతం మీద నాకు అభిమానం. సీతాదేవిని సంబోధిస్తూ నేను వ్రాసిన నూరు పద్యాలలో చాలాచోట్ల అహింసను గురించి, దాని ప్రాధాన్యాన్ని గురించి చెప్పినాను. 'రాజకీయమున్న రాజ్యాల మధ్యన, మంతనమ్ము చేయ శాంతికలుగు – సంగరమ్ము చేసి సాధించు నదియేమి వినుత సుగుణశీల వినుమ సీత' – 'అణువు బాంబువేసి అందరి

ప్రజల - అంతమందజేయ అపుడు వాడు - బ్రదికి యేమిచేయు? వనమున తిరుగునా?'

కారు బాంబువేసి కాల్తురు కొందరు - ప్లేను బాంబువేసి పేల్చివేతు - రిట్టి పనులు చేయ నెట్టు చేతులు వచ్చు? 'హరివిల్లు' అనే కవితా సంకలనంలో కొన్ని గేయాలు, అధికంగా పద్యాలున్నాయి. సుమతి తాతగారు, బాలకృష్ణారెడ్డిగారు ఈ కవితలు విని ప్రచురణ భారం వహించినారు. ఆచార్య నాయని కృష్ణకుమారిగారు దీనికి చక్కని పీఠిక కూర్చినారు. 'సన్నజాజులు పరిమళించి, ఎన్నిరోజులు గడచెనో, చిన్ని చిలుక పలికి కులికి ఎన్ని ఏడులుగడచెనో' ఇట్లా వెళ్లినాయి కొన్ని గేయాలు. మా అమ్మగారు పోయిన తరువాత కొంత కాలం మనసు చాలా వికలం అయింది. అప్పుడు 'మాతృ నివేదనం' అనే కవితల పుస్తకం వచ్చింది. మొదట కొన్ని పద్యాలలో ఆమె గుణగణాలున్నాయి. 'కన్నబిడ్డల మీదను ఘనముగాను, ప్రేమకల్గుట లోకాన వింత కాదు, పెంచియుండిన పెరవారి బిడ్డలందు అధికమైనట్టి కరుణయే ఆమెకుండు'. తరువాతి పద్యాల్లో భరతమాత, ఆమెను సంబోధించుట ఉంటుంది. 'చిన్నతనమునుండి నిన్ను నే చూచితి, మాతృమూర్తి నిలిచె మనసునందు, భరతదేశమిపుడు భావమ్మునందున, నీ స్వరూపమట్లు నిలిచెనమ్మ'.

విద్యార్థి దశనుండి హైదరాబాదులోనే నివాసం కాబట్టి, ఈ నగరాన్ని గురించి, ఏదైనా వ్రాయాలని కోర్కె కలిగింది. దాని పరిణామమే 'భాగ్యనగరం' - అన్నీ పద్యాలే. ఈ నగరం అన్ని జాతులకు, అన్ని భాషలకు ఆట పట్టు. ఒకచోట, 'పాంచాల సుందరీ సంచారములు చూడు, కేరళ యువతుల కేక వినుము - ద్రావిడ వనితల తైతక్కలను చూడు - కర్నాటముగుదల కాంతిగనుము, ఆంధ్రపురంధ్రుల అందాల పరికించు, కాశ్మీర ప్రౌఢల రశ్మిగాంచు, గుజరాతుకాంతల గజగమనమ్ముల, వింతలు చూడుము వీలు చూచి' - ఇట్లా ఉంటుంది. ఈ సంపుటిలోనే, కులీకుతుబ్షా భాగమతి ప్రేమగాథ కూడా నిక్షిప్తమైంది. సమకాలీన భారతీయ జీవితంమీద ఒక వ్యాఖ్యలాంటిది 'లోకగీత'. 'అన్యధాటియందు అత్యాశ ఒకరికి - పేకముక్కలందు ప్రేమకలదు - మద్యపానమనిన మహితమ్ము కోరిక, పనులికెట్లు జరుగు పద్మనాభ', 'రాజకీయవాది లాలించి పలికిన - ప్రజలు నమ్ముచుంద్రు నిజమునను, విద్య, వారియందు విజ్ఞత కలిగించ, మోసపోవుటగుకె వాసుదేవ!' డాక్టరు జి.వి. సుబ్రహ్మణ్యంగారు ఈ పుస్తకానికి సోదాహరణమైన పీఠిక వ్రాసినారు. 1999లో అమెరికా వెళ్లినప్పుడు దాదాపు ఐదు మాసాలుండవలసి వచ్చింది. చాలా ప్రదేశాలు చూచినాను కూడా. అప్పుడు కొన్ని పద్యాలు డైరీలో వ్రాసుకొని, వాటిని 'పశ్చిమము' అనే పేరుతో పుస్తకం వేయించినాను. ఆచార్య పేర్వారం జగన్నాథంగారు దీన్ని పద్యాల్లో యాత్రా చరిత్ర అని తమ ముందు మాటలో

చెప్పినారు. 'కల్రతోడియిండ్లు - గరగరచప్పుళ్లు - స్నానగదులు నీరు పోనిచోట్లు - పిజ్జ బర్గరనెడు బ్రెడ్డుల చిరుదిండ్లు- అదియె జాతిగుణము అమెరికనులు' వంటి పద్యాలు వచ్చినాయి. 'జన్మభూమి - వైదేశికము' అనే పద్యాల సంపుటిలో, మా ఊరిని గురించి వ్రాయగా, అది తెలంగాణంలోని ఏ వూరికైనా వర్తించే విధంగా వచ్చింది. 'బార్లు తీరినట్టి బతుకమ్మలన్నింట - ఒక్కచోట చేర్చి చక్కచేసి, పాట పాడి పాడి పాదాల కదుపుచు నాట్యమాడుచుంద్రు నారులచట'. కెనడాలోని డౌనుటౌను - 'గగన చుంబియైన ఘనమగు భవనాలు, మెరిసిపోవుచుండు మేరువట్లు - ఒకటి రెండు కాదు, ఒకకొన్ని డజనులు డౌను టౌను మనకు కానిపించు'

కృష్ణమాచార్యులను గురించి, (ఒక వైష్ణవ భక్తుని గురించి) ఒక సీరియల్ వ్రాయమని, వి.పి. రాఘవాచార్యులు కోరినారు. వారు 'నృసింహ ప్రియ' అనే పత్రికను నిర్వహించేవారు. వారి కోరికను అనుసరించి 'శ్రీ కృష్ణ విలాసము' అనే నవల ధారావాహికంగా వ్రాసినాను. సింహగిరి వచనాల విశేషాలు, ఆచార్య సూక్తి ముక్తావళిలోని విషయాలు, ప్రతాపచరిత్ర, సిద్ధేశ్వర చరిత్రలో వచ్చిన అంశాలు దీనిలో చేరినాయి. సీరియల్ ముగిసిన తరువాత, అదే పేరుతో పుస్తకం నవలగా ప్రచురితమైంది. నేను వ్రాసిన ఒకే ఒక చారిత్రక నవలయిది. సీరియల్ వస్తున్నప్పుడే, కొందరు పాఠకులు శ్రద్ధగా చదివి దాచుకొన్నారట. ఒక వైష్ణవుడు, నేను పుస్తకంగా వేసేటప్పుడు ఆ పత్రికల్లో కటింగులన్ని నాకు తెచ్చి యిచ్చి సాహాయ్యం చేసినాడు. ఈ పుస్తకం ఆచార్య సి. నారాయణరెడ్డిగారి చేతుల మీదుగా ఆవిష్కృతమైంది. వారు దీన్ని బాగానే ప్రశంసించినారు. దీన్ని పరిశోధక నవల అని అన్నారు.

నేను శ్రమించి వ్రాసిన ఇంకొక రచన దాశరథి శతకానికి మానసోల్లాసవ్యాఖ్య. పావని సేవాసమితివారు దానిని స్పాన్సరు చేసినారు. ఈ వ్యాఖ్యానంలో ఉపనిషత్తులు, వేదాలు, భాగవతాదిపురాణాలు, విశిష్టాద్వైత గ్రంథాలు, ముకుందమాల మొదలైన స్తుతికావ్యాలు విస్తృతంగా పరిశీలించవలసి వచ్చింది. గ్రంథం పెద్దదైనా, ప్రామాణికంగా వచ్చిందని చదివినవారన్నారు. ఈ గ్రంథాన్ని ఆచార్య సి. నారాయణరెడ్డిగారే ఆవిష్కరించి అనేక ఉదాహరణలతో మెచ్చుకొన్నారు. ఆచార్య దేవళ్ల చిన్ని కృష్ణయ్యగారు దీనికి పీఠిక సమకూర్చినారు.

2006లో, వంగ రచయిత బంకించంద్ర చటర్జీ వందేమాతరం గీతం వ్రాసి నూరు సంవత్సరాలైందని పత్రికలో చదివినప్పుడు, దాన్ని గురించి వ్రాద్దామని కోరిక కలిగింది. 'వందేమాతరం' అనే పద్యకావ్యం వచ్చింది. దీనిలో ఆ సంస్కృతగీత ప్రాశస్త్యమే

కాక, 'ఆనందమఠం' ముఖ్య కథా విశేషాలు కూడా ఉల్లేఖింపబడినాయి. రాజారామ్ మోహనరాయలు, సురేంద్రనాథ బెనర్జీ మొదలైనవారి సంస్కారోద్యమాలు, మనదేశంలో వాటి ప్రభావం కూడా స్పృశించడమైంది.

గీతమొకటి జాతిగీతయే మార్చెను – గీతమొకటి ప్రజల నేతయయ్యె
గీతమొకటితాను ఘీంకారమొనరింప – పశ్చిమమ్ము వణకి పరుగులెత్తె

ఆ గీతాన్ని అనాటి ప్రజలు ఇట్లా భావించినారట.


వందె మాతరమ్ము వంద్యము మాకెప్డు – వందెమాతరమ్ము ప్రాణమయ్య
మాత గొల్చుచుండి మా భారతమ్మును – వదల చేతుమేము బంధనాల.

ఇటీవల వచ్చిన పద్యసంపుటి 'సంభవామి' అనేది. విష్ణుమూర్తి లోకాన్ని సంరక్షించడానికి వహించిన దశావతారాల వృత్తం ఉంటుంది దీనిలో. దీన్ని విష్ణునామ సంకీర్తనం అనవచ్చును. జీవితం చివరి దశలో దైవస్తుతి చేయడమే నా ధ్యేయం.

మేము వేరు కాదు, మీరును మాతోడి – అన్నదమ్ములగుట అదియె
నిజము.
కలసి పనులు చేయ ఘనమైన కార్యాలు సాధ్యమగుట మనకు సత్యమయ్య

వంటి నిత్య సత్యాలు దీనిలో అక్కడక్కడ కనిపిస్తాయి.

కాలిఫోర్నియా యూనివర్సిటీలోని సౌత్ ఏషియా డిపార్టుమెంటువారు ఆహ్వానిస్తే 1986లో అమెరికాకువెళ్లి, అక్కడ భారత సంస్కృతిని గురించి ఉపన్యసించినాను. తరువాత అమెరికా వెళ్లినప్పుడు, తెలుగు భాషా సంఘాలు పిలువగా తెలుగు సాహిత్య సంస్కృతులను గురించి మాటాడినాను. కెనడా, ఓమాన్ దేశాల్లోనూ ఈ విధమైన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఆంధ్ర సారస్వత పరిషత్తువారు ముఖ్యంగా అధ్యక్షులు జ్ఞానపీఠ అధిష్ఠాత, ఆచార్య సి. నారాయణరెడ్డిగారు, ఈ ఉపన్యాసం ఏర్పాటు చేయడం నాకు గౌరవంగా భావిస్తున్నాను. వారందరికి నా కృతజ్ఞతలు. సభ్యులకు నా నమస్కారాలు. సెలవు.



ఆచార్య కొలకలూరి ఇనాక్

నేను పుట్టింది, పెరిగింది, బాల్యమంతా గడిపింది, మూడో తరగతి దాకా చదువుకొంది వేజండ్లలో. గుంటూరు తాలూకా అప్పట్లో. చేబ్రోలు మండలం ఇప్పుడు. పుట్టిన తేదీ 1.7.1939.

మా అమ్మగారి ఊరు వేజండ్ల. ఇంటిపేరు వేజండ్ల. ఆమె తల్లిదండ్రులు తాతముత్తాలు పూర్వికులది వేజండ్ల. వాళ్లే వేజండ్ల గ్రామమూల వాసులు. తర్వాత పెద్ద గ్రామం ఏర్పడింది. వీళ్ల ఆవాసం పేరు మాదిగ పల్లె. అమ్మ పేరు పుట్టినప్పుడు వీరమ్మ. ఈరమ్మ అని పిలిచే వాళ్లు.

మా నాన్నగారి ఊరు వేటపాలెం. చేబ్రోలు దగ్గర. ఇంటి పేరు కొలకలూరి వారు. మా తాతగారు మొదటి భార్య చనిపోగా రెండో పెళ్లి చేసుకున్నారు. మా నాన్నా, మా అత్తా, అరేడేళ్ల పిల్లలు. వీళ్లను మేనమామలు పెంచారు. కొండముది వాళ్లు. అలా అంగలకుదురు చేరారు మా నాన్న. అక్కడే జీతానికి. నాన్న పేరు రామయ్య.

మా అమ్మకు అన్నదమ్ములు అక్కాచెల్లెళ్లు 14 మంది. మా అమ్మ 13వ సంతానం. అమ్మ తమ్ముడు, చివరివాడు చిట్టి మామయ్య. ఇల్లరికం వచ్చే అల్లుడి కోసం తాతయ్యా చూస్తున్నప్పుడు మా తండ్రి కనిపించాడు. పెళ్లి జరిగింది. పెళ్లిలో వీళ్ల పేర్లు మార్చారు. అమ్మపేరు విశ్రాంతమ్మ, నాన్న పేరు శాంసన్. ఈరమ్మా అంటే పలికేది కాదు, విశ్రాంతమ్మా అంటే మాట్లాడేది. ఇసెరాంతమ్మ అయినా ఫరవాలేదు. అమ్మ పేరు విశ్రాంతమ్మగా నాన్న పేరు రామయ్యగా స్థిర పడింది. నా స్కూలు రికార్డులో మాత్రం నాన్న పేరు శాంసన్.

గుంటూరు నుంచి వచ్చిన ఫాదిరీ నాకు పేరు పెట్టాడు. అది ఇనాక్, ఈనాక్, ఈనక్, హానోకుగా బైబిలు తెలిసిన వాళ్లు అంటే ఏనోకు, ఆనోకు, యోనాకు, యోనోకు అనీ అనే వాళ్లు. నేను చాలా కాలం నా పుస్తకాల మీద యోనోకు అనే రాసుకునే వాణ్ణి. స్కూలు ఫైనల్ దాకా నా పేరు ఇంగ్లీషులో ఎట్టా రాస్తారో తెలిసేది కాదు. క్లాసు టీచరు అటెండెన్స్ రిజిష్టరు తెమ్మంటే తెస్తూ నెంబరు ఎనిమిది K. Enoch అని చూచి, ఇదీ నా పేరు అనుకున్నాను. నన్ను ఏడిపించాలని సరదా పడే వాళ్లు నన్ను యూనక్ అనికూడా పిలచే వాళ్లు. ఆ పిలుపుకు అర్థం తెలిసేది కాదు, అప్పట్లో. తెలిశాక ఏడవ లేదు. నవ్వాను.

చిన్నప్పుడు చాలామంది నూకలు, నూకలు గాదు, అటిక తలకాయోడు అని పిలిచే వాళ్లు. మా పెద్ద మేనత్త నూకలూ అని పిలిస్తే ఎంతముద్దుగానో ఉండేది. ఏనూకలూ అంటారు చాలా మంది. ఇప్పటికీ నా పేరు ఇంగ్లీషులో రకరకాలుగా రాస్తారు. దాన్ని చూచి తెలుగులో చిత్ర విచిత్రంగా రాస్తారు. ఇంగ్లీషులో పేరు చూచి తెలుగులో, తెలుగులోచూచి ఇంగ్లీషులో రాసే వాళ్ల రాతను ఎవరు మారుస్తారు. నా రాత మారలేదు.

నేను స్కూలు ఫైనల్ తర్వాత నా పేరు ఇంగ్లీషులోనే రాసుకొనే వాణ్ణి, తెలుగులో ఎలా రాయాలో తెలియక. అప్పట్లో నా పేరు నాకు ఇష్టమయ్యేదికాదు. "కొలకలూరి" ఇష్టమయ్యేది. మొదటి 15 సంవత్సరాలలో రచనలన్నీ కొలకలూరి పేరుతోనే వచ్చేవి. ఎమెస్కో 'ఎక్కడుంది ప్రశాంతి' ప్రచురిస్తూ పూర్తి పేరు వ్రాసుకోమన్నారు. ఆ పేరు ఎవరికీ లేదు కాబట్టి గుర్తింపు బాగుంటుందన్నారు. కొలకలూరి పేరుతో కూడా అప్పట్లో ఎవరూ రచయితలు, కవులు లేరు. అదే అన్నాను. కొలకలూరి ఇనాక్ అయితే మరీ బాగుంటుందని అన్నారు. పోనీ అనుకొన్నాను. ఇంగ్లీషు Enoch ఇనాక్ గా స్థిరపడింది. అదే సరయింది అనలేను. నా పేరు ప్రఖ్యాతుల కింత గోల ఉంది.

కొలకలూరి వాళ్లు చాలా గొప్ప వాళ్లని చాలా గర్వంగా జనం చెప్పేవాళ్లు. అందువల్ల కొలకలూరి ఇష్టం. ఇనాక్ పదం భిన్న సంకోచ వ్యాకోచాల కూడలి. అందువల్ల ఇష్టం. లేదు. కొలకలూరి తెలుగు, ఇనాక్ ఇంగ్లీషు. కొలకలూరు మా పక్క వూరు. మా పూర్వికుల సొంత గడ్డ. నా పేరు మీద కోపంతో మతం మీద ఇష్టం తగ్గేది. నేను లెక్చరరు అయ్యాక కులమతాతీత జీవితం ఇష్టమయ్యాక, నాకు క్రైస్తవ మతం వద్దను కొన్నాను. మార్చమన్నాను. తతంగం చాలా చెప్పారు చేశాను. మతం మార్చుకొన్నాను. హిందువుగా జీవిస్తూ గర్వపడాలని కాదు. ఇనాక్‌గా అవమాన పడకూడని మాదిగమహాశయులు ఎక్కడున్నా అవమానం తప్పదని తెలిసి, పేరులో, మతంలో కంటె కులంలో రోగముందని,

దానికి మందులేదని, నేను జీవించి ఉన్నంత కాలం ఈ జబ్బుతో కాలం గడపక తప్పదని గుర్తించి. మాదిగల ప్రాచీనత, వైశిష్ట్యం, ఆధిక్యం తెలిశాక గర్వపడ సాగాను. ఇప్పుడా మాదిగనయినందుకు అతిశయిస్తుంటాను. కులం వల్ల ఎవరినీ తక్కువగా చూడను, ఎవరిని ఎక్కువగా చూడను. నేనెవరికంటే తక్కువ కాదు. ఎవరికంటే ఎక్కువ కాదు. నాకంటే ఎవరూ ఎక్కువ కాదు. ఎవరూ తక్కువ కాదు, దాన్ని స్వాభి మానమని అంటారు. గర్వమనో, అతిశయమనో ఎవరయినా అనుకోవచ్చు. నేను అందరినీ ప్రేమిస్తాను, ఎవరినీ ద్వేషించను. నా కెవరూ శత్రువులు లేరు. నేను శత్రువునని ఎవరైనా అనుకొంటే అది వాళ్ల అదృష్టం.

అందరికీ సాహిత్యం ఆనందం కలిగించవచ్చు. అంతకంటే ఏమయినా నాకు కావాలి. నవ్వునుంచి నా సాహిత్యం పుట్టలేదు. ఏడుపునుంచి పుట్టింది. నా సాహిత్యం నా కన్నీళ్లు. నా మొదటి కథ 'ఉత్తరం' 1954 లో, మునసబు కొడితే చనిపోయిన మా తాతను గూర్చి వచ్చిన ఉత్తరం ఆధారంగా రాసిన కథ. 'గాసట బీసటగానున్న భాషకు దారి చూపిన మహోద్ధారులేరి?' పద్యం 1954. ఇప్పుడు దొరకటం లేదు. సీసపద్యం. ఐదు పద్యాలు. ఇంటర్ మీడియేట్. ఏ.సి కాలేజి మేగజైను దొరికితే బాగుణ్ణు.

మూడో తరగతి చదువు. సంవత్సరం గొడ్లకాడ జీతం. స్వాతంత్ర్యం రాకపూర్వం చదువు మానేశాను. వస్తుండగానే స్కూలులో చేరాను. 1954 స్కూలు ఫైనల్. 1956 ఇంటర్. 1959 ఆనర్సు. జూన్‌లో లెక్చరరు, ఇంకా ఇరవై ఏళ్లు నిండలేదు.

నేను మూడో తరగతి చదువు మానేసి జీతానికి కుదిరాక బర్రె వీపుమీద స్వారీ గొప్పగా ఉండేది. గొడ్లు మేపుకు రావటం సరదాగా ఉండేది.

మా సారు 'మీ వాణ్ణి చదివించండని' మా అమ్మతో చెబుతూ ఉండేవాడు. మా అమ్మ కన్నీరు పెట్టుకొనేది.

తగరం దేవదాసు గారు అనే బి.ఏ చదివే సారు మాదిగపల్లె పిల్లలకి ట్యూషన్ చెప్పి, గుంటూరులో చేర్పించటానికి సంకల్పించుకొన్నారు.

గొడ్లు గాసే ఉబలాటం తీరి, నేనూ ట్యూషన్‌కి వస్తానని సారుతో చెప్పాను. 'అప్పొ ఆణ్ణి పంపు. తెలివైనోడు' అని మా అమ్మతో చెప్పాడు. జీతం మాన్పించటం మా నాన్నకు ఇష్టంలేదు. చదివిద్దామని మా అమ్మకిష్టం. మా అమ్మ పట్టుదల నెగ్గింది. నా కోరిక తీరింది.

ఎంట్రన్సు పరీక్ష మొదటి రోజు బాగా రాశాను. పాసయితే ఫష్టు ఫారంలో చేరవచ్చు. రెండో రోజు పరీక్షకు పోవాలి. రైలులో ప్రయాణం. టికెట్టు లేదు. స్క్వాడ్ వచ్చింది.

టికెట్టుకు డబ్బులేదు. రైలు వెళ్లిపోయింది. రైలు కట్ట పట్టుకొని, ఉదయం ఏడింటికి పరుగు తీశాను. ఎనిమిది మైళ్లు ఎనిమిదేళ్ల వాణ్ణి గుంటూరు స్టేషన్ దాకా రైలు కట్టతోవ, స్టేషన్ నుంచి రోడ్డు తోవ తెలుసు. ఫష్టు బెల్‌కి స్కూలుకు చేరాను. 'వచ్చేవంటరా' అని సారు వాటేసుకొని 'ఎట్టా వచ్చావురా' అన్నాడు. నా రూం నాకు తెలుసు నిన్నటిదే. బోర్డు మీద సారు లెక్కల ప్రశ్నలు వ్రాస్తున్నారు. కూర్చున్నాను.

నేను ఫోర్తు ఫారం పాసయినప్పుడు మానాన్న చనిపోయాడు. నేను, అమ్మడు, తమ్ముడు, మా మధ్య నాలుగేళ్లు ఎడం. అమ్మకు ముప్పై ఏళ్లు లేవు. మా కోసం మళ్లీ పెళ్లి చేసుకోలేదు. కష్టజీవి. కూలీ నాలీ జీవనం. పిల్లలు చదవాలి. ఉద్యోగాలు చేయాలి. అదీ అమె పట్టుదల. ఆమె మమ్మల్ని అన్నం వడ్డించి పెంచలేదు. పట్టుదల వడ్డించి పెంచింది. ఆమె పిల్లల పెరుగుదల, పిల్లల పిల్లల పెరుగుదల చూచింది. తృప్తిగా జీవించింది. కష్టాలు ఆమె నేమీ చేయలేదు. ఆమె పట్టుదల ముందు మేం ప్రణమిల్లాం.

1954 నుంచి కథానికలు, పద్యాలు, గేయాలు చాలా విరివిగా వ్రాశాను. వాణి, జాగృతి,తెలుగు విద్యార్థి, వాహిని పత్రికల్లో ప్రతివారం ఏదో ఒకటి ఉండేది. గుంటూరులో గుర్రం జాషువా గారు, ఏసి కాలేజిలో కరుణశ్రీ గారు ఉండేవారు. వాళ్ళంటే ఇష్టం. పత్రికలు, ప్రభలు, బాల, పాపాయి, చందమామ, బాలమిత్ర పాతవి, అర్ధణాకి ఒక్కటి చదివిస్తే. జిన్నాటవర్ దగ్గర. అన్ని పాత పత్రికలూ చదివాను.

వేజండ్ల నుంచి గుంటూరు స్కూలుకు రాకపోకలు. జంపన, కొవ్వలి నవలలు రైల్లో అమ్మే అన్న చదువు కోవడానికి ఒకటి ఇచ్చేవాడు. వాళ్ల నవలలన్నీ చదివేశాను. అన్నదాసు జాషువా పద్యాలు పాడుతూ, పుస్తకాలు అమ్ముతూ రైల్లో వస్తూ పోతూ ఉండేవాడు. పద్యం అద్భుతంగా పాడేవాడు. క్లాసు పుస్తకాల పద్యాలకు అర్థతాత్పర్యాలు కావాలి. జాషువా పద్యాలకు అదేం అక్కరలేదు. అర్థమయ్యేవి. ఇంటర్‌లో మనుచరిత్ర, వసుచరిత్ర కొంత తెలిశాయి. ఆముక్తమాల్యద అంతా తెలియలేదు. యెంకి పాటలు, కృష్ణ పక్షం, బసవరాజు అప్పారావు గీతాలు, పేర్లు తెలియని పెద్దవాళ్ల పుస్తకాలు చాలా చదివాను. తిమ్మిరిగా ఉండేది. విశాలాంధ్ర పుస్తకాల జోరు పెరిగింది. కనపడ్డదల్లా చదివాను. మహాప్రస్థానం తీవ్రంగా చదివాను. తిక్కబుట్టింది.

ఆనర్సు చదువుతున్నప్పుడు (1956- 59) ఊపిరి ఆడుతున్నట్లుండేది కాదు. గుండెలు పట్టేసేది. 'మీ కెందుకోయ్ తెలుగు?' అనే వాడొక మేష్టరు, 'ఈ నక్కా' అని మరో సారు పిలిచేవాడు. క్లాసురూం సొంతంలా అనిపించేది కాదు. అయ్యవార్లు పరాయి వాళ్లలాగా ఉండేవాళ్లు. ఆరోగ్యమయిన శరీరం. వయస్సు పెరుగుతూ ఉంది. ఆకర్షణలూ పెరగసాగాయి. స్నేహాలు, ప్రేమలు, విరహాల గోల కూడా మొదలైంది.

ఆ రోజుల్లో లైబ్రరీలో ఒక అమ్మాయి ఎవరో తెలియదు, చాలా అందంగా ఉంది. దీక్షగా చదువుకొంటూ ఉంది. ఎదురుగా కూర్చున్నాను, నేను చదవటంలేదు, ఆమెనే చూస్తూ ఉన్నాను. మంచి రంగు, మంచి మెరుపు, మంచి పొందిక. కళ్ల జోడు షోడా బుడ్డి గ్లాసులు. చాలామందం. గుండె కలుక్కు మంది. ఆమె నన్ను చూడలేదు. ఇంత అందమైన అమ్మాయికి చూపు పోతే పెళ్ళవుతుందా? ఇదీ బాధ. వారం రోజులు ఇదే గుర్రు . అదే ఆలోచన నాటికగా మారింది. నా మొదటి నాటిక 'దృష్టి' (1957). ఆలిండియా రేడియో భారతీయ భాషల్లో యూనివర్సిటీ విద్యార్థులకు గంట నాటిక రచన పోటీ ప్రకటించింది. దృష్టి పంపాను. తెలుగులో ఒక ద్వితీయ బహుమతి, ఒక తృతీయ బహుమతి వచ్చాయి. నాకు ద్వితీయ బహుమతి. మొత్తం 5 ప్రథమ, 8 ద్వితీయ, 16 తృతీయ బహుమతులు భారతీయ భాషలన్నింటికి కలిపి ప్రకటించారు. స్థానం నరసింహా రావు గారు దర్శకత్వం. బుచ్చిబాబు గారు నిర్వహణ. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు నా అయిదు నిమిషాల ప్రసంగానికి – రేడియోలో మొదటి ప్రసంగం– గొంతులేని తాను నాకు గొంతిచ్చారు, నాటికలో తురగా జానకీరాణి గారు హేమలత పాత్రధారిణి. నాటినుంచి నేటిదాకా ఆత్మీయురాలు.

మళయాళంలో, బెంగాలీలో ఇటువంటి కథలున్నాయని, ఇది వాటికి అనుసరణ అనీ తురగా కృష్ణమోహన్ విమర్శలు పత్రికల్లో వచ్చాయి. నేనే పాపం ఎరగను. అప్పటికింకా నా వయస్సు నిండా పదహారే. 'మారిన విలువలు' నాటిక వి.యస్ రమాదేవి గారు రేడియోకి వ్రాస్తే, జయంతి పత్రికలో సమదర్శి అనే విశ్వనాథ సత్యనారాయణ గారు ఇది 'దృష్టి'కి కాపీ అని రాశారు. గొల్లపూడి మారుతీరావు 'కళ్లు' నాటకం వ్రాస్తే అది దృష్టికి కాపీ అని పలువురు పెద్దలు ప్రస్తావించారు. పోలికలు ఉండవచ్చు కాపీ కాకపోవచ్చు. కేసులు పెట్టవచ్చు. గెలవ్వచ్చు. ఎందుకొచ్చిన గోల? ఈ లోపల ఏమయినా రాసుకోవచ్చు.

సాహిత్య వనవాటి చక్కగా పుష్పింప
    విలసిల్లు విరజాజి విరులుదెచ్చి,
సంగీత రసవార్ధి బంగారు కెరటాల
    మదిలోన వ్యధజెందు మణులుదెచ్చి,
శిల్పలోకమ్ములో చెలువమ్ము లెగబ్రోయు
    చిరుకొమ్మ చిగురాకు చిదిమి తెచ్చి

నాట్య ప్రపంచాన నవనవో న్మేషమ్ము
సుమియించు మధుర భంగిమలు దెచ్చి

తగిన యన్నింటి దెచ్చి స్వతంత్ర వీధి
చలువ సంస్కృతి పందిళ్ళ వెలుగు దిశల
కుతుక ముప్పొంగ కూర్మితో కూర్చి పేర్చి
పూనిరత్నాలు వెలగించు మానవుడను.

ఇదీ మానవత – ఇందులో డాబుసరి – మా నవత. మానవత 1956లో వ్రాసింది. చాలాకవిత్వం రాశాను. కొన్ని పద్యాలలో కొందరు కవుల పోకడలు, ఎత్తుగడలు కనిపిస్తుంటే వాటిని అవతల పెట్టాను. నా గొంతే అనుకొన్న వాటిని ఉంచాను. జాషువా, కరుణశ్రీ ప్రభావం పద్యాలలో బాగా కనిపించేది. అది తప్పించుకోవటానికి పద్యాలు రాయటం మానేశాను. కానీ చాలా పద్యాలు 1954 –1966 మధ్య కాలంలో రాసినవి మళ్లీ మళ్లీ గుర్తుకు రాసాగాయి. వాటిలో ఇదొకటి. వీటన్నిటిని కలిపి పోయినేడు 'కలల కార్ఖానా'గా ప్రచురించాను. వాటిని చదివాక (1966)– పద్యరచన ఆపి ఉండకుండా ఉండాల్సింది అనిపించింది. కథానికలు, నవలలు, నాటకాలు, వచనకవిత్వం, విమర్శనం, పరిశోధనం, పఠన పాఠనాలు చేస్తూ ఉండటం వల్లకూడా పద్య రచన జోలికి పోయి ఉండను. నా ప్రసిద్ధమయిన ఊరబావి కథానికల్లాగా, మునివాహనుడువంటి నాటకాలు రాశా. కులం–ధనం కవితల్లాగా, వసుచరిత్ర వైశిష్ట్యం వంటి విమర్శనాలులాగా, ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం వంటి పరిశోధనల్లాగా, అనంత జీవనం వంటి నవలల్లాగా పట్టుబట్టి ఇప్పుడు రాసిన 'ఆది ఆంధ్రుడు' పద్య కావ్యం నా మరో పార్శ్వానికి నిదర్శనంగా నిలుస్తుంది.

1958 లో భారతిలో నవసంధ్య పద్య కవిత, దృష్టి నాటిక, మంచుశిఖరం, నిశీధినీశంఖారావం కథానికలు ప్రచురణం పొంది ఎంతో ఆనందాన్ని కలిగించాయి. భారతిలో ఆరోజుల్లో ఒక్క రచన పడితే మహా పండితులు పరవశులవుతారు. ఒక్క సంవత్సరం నాలుగు రచనలు 18 ఏళ్ళ ఆనర్సు విద్యార్థివి ముద్రితం కావటం, ఇప్పటికీ ఆశ్చర్యంగా ఉంటుంది. అప్పటినుంచి భారతి ప్రోత్సాహం అద్భుతవరం. భారతి సబెడిటర్ ఉద్యోగం వచ్చింది. లెక్చరరు ఉద్యోగం మోజు. పోలేదు.

1956 తెలుగు విద్యార్థిలో ప్రచురించిన గేయం 'ఎడారి'.

గుండె లోతుల కొత్త వెల్గులు
కుమిలి కుమిలి కృశించి యేద్చే
రాత్రి నర్తకి రంగు రంగుల
ధాత్రి చుక్కలు చిదిమిరాల్చే.

ముత్యాలసరంలో ఒక మాత్ర రెండు నాలుగు పాదాలలో తగ్గించి రాసే ప్రయోగం. మానసిక సిద్ధి మాత్రం మళ్ళీ గుర్తుకువచ్చింది.

అప్పుడే రాసిన వాణిలోని నిజమే అనే వచన కవిత్వంలో
సముద్రాలు దాగి ఉండే కళ్ళల్లో
సూర్యుళ్ళు చంద్రుళ్ళు పుడతారు.

పాదాలు మళ్ళీ మళ్ళీ ఆనందంగా గుర్తుకు వస్తాయి. నా సాహిత్యం నా కన్నీళ్ళే అన్నమాట మీకు గుర్తే కదా!

నేను మానసికంగా ఒంటరి వాణ్ణి అయినప్పుడు ఎవతి సానుభూతి నాకు వద్దంటూ 'నీడ' (1960) ఆంధ్రప్రభవారపత్రికలో

నాకోసం
లక్ష కంచు నగారాల
లక్ష్యం చెడవద్దు.

నాకోసం
ఆకాశం కన్నీటితో
కేక పెట్టవద్దు.

6+12+9 మాత్రలతో వచన కవిత్వం లాగా మొత్తం రచన సాగింది.

1960 డిసెంబరో, 1961 జనవరి లోనో ఉగాది నవలల పోటీ మొదటి సారిగా ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ప్రకటించింది. నేను అంతకు ముందు 'సమత' అనే పేరుతో నవల వ్రాశాను. అందులో కథానాయకుడు రాజారావు. వాసిరెడ్డి సీతాదేవి గారికీ నవల చాలా ఇష్టం. ఆమె నవలపేరు సమత. హీరో పేరు రాజారావు. పోలికలు ఏదేనా ఉంటే ఎవరైనా చూస్తారు. ఇది కులాంతర వివాహాలు జరగాలన్న ఆసక్తి ప్రచారం చేసిన నవల. నా వచన శైలికి అది అందమైన ప్రతిబింబం.

నవలల పోటికి 'అనాథ' అనే నవల వ్రాశాను. ఇది రెండోనవల. బహుమతి వచ్చింది. సీరియల్ 16 వారాలు ప్రచురించారు. అతి ప్రాచీనాంధ్రులు మాదిగలు. అతి దరిద్రస్థితి అనుభవిస్తుంటారు. అతి అనాదరణకు గురి అవుతారు. మాదిగ స్త్రీ ద్విధా అనాదరణ పొందుతుంది. గూనితో, వంకరకాళ్లతో, నల్లగా, సొట్ట మూతితో, చిన్నికళ్లతో పుట్టిన 'పోలి' ని దెయ్యప్పిల్ల అంటారు. ఈమె అనాథ కథానాయిక. మా వూర్లో నా చిన్నతనంలో చూచిన జాతరతో నవల ప్రారంభమవుతుంది. జంతు బలి చేసే మాదిగ పూజారికి ఆ రాత్రి పోలి పుట్టింది. ఆ అమ్మాయి పెరిగి, నాలాగే చదువుకొని, జీవితంలో స్థిరపడటంతో నవల ముగుస్తుంది. నవల చివరలో పోలి ఎంత సౌందర్యవతిగానో కనిపిస్తుంది. శారీరకంగా కాదు. కష్టాలు తింటూ సుఖాలు పంచటం, ఏడ్పును కళ్లలో ఖైదీని చేసి, నవ్వును పెదాలమీద పూయించటం పోలికే సాధ్యమయింది.

నాలుగు సీరియల్ నవల్లు, నాలుగు డైరెక్టు నవల్లు 1972కు ముందే రాయటంవల్ల ఇప్పుడు ఎవరైనా మీరు నవలలు ఏమైనా వ్రాశారా అని అడిగే పరిస్థితిలో పడ్డాను. ఈ మధ్య ముప్పై ఏళ్ళ విరామంలో వచ్చిన నవలలు సర్కారు గడ్డి, అనంత జీవనం చూచి ఈ ప్రశ్న మార్చి మీరు నవలలు కూడా రాస్తారా అని అడుగుతున్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం కథానికల పోటిల్లో రెండేళ్లూ ప్రథయ బహుమతులు పొందిన మంచు శిఖరం, నిశీధినీ శంఖారావం భారతి, ఆంధ్రపత్రిక ఉగాది సంచికల్లో వచ్చాయి. కృష్ణా పత్రిక వజ్రోత్సవ సంచికకు కథ కావాలని అడిగితే 'జీవనం' రాశాను. అప్పుడే (1962) అనంతపురం చేరాను. క్షామ పరిస్థితులు తెలుసుకున్నాను. తిండిలేక ఊరొదిలి, పట్టణం వస్తున్న యువ భార్యాభర్తలు అలిసిపోయి ఉంటారు. పురిటి గుడ్డు చనిపోయి, పడ్డ పాల సేపులు తట్టుకోలేక భార్య ఉంటుంది. గంజికేంద్రం గంజి అంతా భార్యకే ఇస్తాడు భర్త. ఆకలి, దాహం, నడక, శ్రమ, భర్త స్పృహ కోల్పోతే పాలుపడి సేపులువస్తున్న భార్య భర్తకు తన పాలు తాగిస్తుంది. సామాన్యులు సంతోషించారు. పవిత్రులు కోపించారు. రష్యా జైలులో మగ్గుతున్న తండ్రిని, అన్నం నీళ్లు లేకుండా చేసిన తండ్రిని, ప్రతిరోజూ చూడటానికి పోయి వస్తూ వచ్చిన నిండు బాలింత పాలిచ్చి బ్రతికించిన సందర్భం శిల్పంగా రూపొందిస్తే ప్రపంచం పరవశించటంకంటే ఇది అద్భుతమైన కథ అని కమ్యూనిస్టులు భావించారు. నేను అద్భుతాలు వ్రాసే వాణ్ణి అవుతున్నాని నాకు గుర్తింపు వస్తూ ఉంది.

పిల్లలకు పాలు లేకుండా నువ్వు తాగుతున్నావా అని అడిగినవాళ్లు లేకపోలేదు. శృంగారం, ప్రేమ,విరహం జీవితంలో ఏమో కాని సాహిత్యంలోకి నేను తేలేకపోయాను.

నా కన్నీళ్ళకే సమయం చాలకుండా వచ్చింది. ఇంక శృంగారం ఎక్కడ? జీవనం దుఃఖమే. శృంగారం కాదు.

నా భార్య శ్రీమతి భాగీరథిగారు అద్భుతమైన స్త్రీమూర్తి. అంతటి ఉదాత్తమూర్తి నన్ను కోరుకోవటం నా అదృష్టం. ఆమె నా నలుగురు పిల్లలకే కాదు, నాకూ తల్లి. మౌనం ఆమె వ్యక్తిత్వం. మౌనమహర్షి. ఏది అడిగినా అవును తప్ప మరోమాట లేదు. నవ్వు తప్ప కన్నీరు కనబడనీయలేదు. ప్రేమ. దౌర్జన్యపరుణ్ణయిన నాకు భార్యగా ఉండటమే ఎక్కువ. నలుగురు పిల్లల్ని పెంచటం కష్టం. నన్ను నా యిష్టంవచ్చిన పనిచేయనీయటం అందరికీ చేతకాదు. అన్నింటితో పాటు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారిణిగా ప్రేమ పంచి ప్రేమ పొందారామె. ఇన్ని పనులు చేస్తూ అలిసిపోయేది కాదు. అలా కనిపించేది కూడా కాదు. ఆమె నవ్వు చెదిరేది కాదు. జీతం అంతా నాకు ఇచ్చేసేది. వద్దన్నా ఇచ్చేది. పైన ఉంచుకొనేది కాదు. ఇప్పుడు ఒంటరివాణ్ణి చేసింది. స్వర్గంలో ఉంది. మధురమైన జ్ఞాపకాలు కన్నీరు తెప్పిస్తాయి. కన్నీటి మసకలో కూడా ఆమె రూపం, హృదయం దయ ప్రేమ మసకబారి పోవు.

మాకు నలుగురు పిల్లలు. బెంగుళూరు విశ్వవిద్యాలయంలో పెద్ద తల్లి ఆశాజ్యోతి అసోసియేట్ ప్రొఫెసరు. భర్త ప్రొఫెసరు. ఇద్దరు పిల్లలు. సొంతయిల్లు. రెండో సంతానం కొడుకు శ్రీ కిరణ్. విశాఖ స్టీలు ప్లాంటు హైద్రాబాదు ఆఫీసులో ఉన్నతోద్యోగి. భార్య డియల్ ఆర్ యల్‌లో సైంటిస్టు –ఇద్దరు పిల్లలు. సొంతయిల్లు. నాకు వాళ్లే పెంపుడు తల్లి దండ్రులు. రెండో తల్లి మధు జ్యోతి. మహిళావిశ్వవిద్యాలయంలో అసోసియేటు ప్రొఫెసరు. అల్లుడు సీనియర్ లెక్చరరు. ఇద్దరు పిల్లలు సొంతయిల్లు. చివరివాడు ముద్దుల తండ్రి సుమకిరణ్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో, భార్య యూనివర్సిటి ఇంజనీరింగు కాలేజిలో ఉపన్యాసకులు. ఇద్దరు పిల్లలు సొంత అపార్టుమెంటు. వీళ్ల అభివృద్ధి మా కందరికీ తల్లి అయిన భాగీరథి గారు చూచి, తృప్తిగా రెండేళ్ళ క్రితం స్వర్గానికి చేరారు. నేను నా భార్యను 'అమ్మా' అని పిలిచే వాణ్ణి. అందరికీ అసహనం. మాపిల్లలకు ఆనందం.

నా కొక చిన్న గర్వం. మీరు అనుమతి ఇస్తే చెబుతాను. తెలుగు కవులయిన మా దళితులు గుర్రం జాషువా గారికి, బోయి భీమన్న గారికి, జ్ఞానానందకవి గారికి ముగ్గురికి ఒక్కొక్క కుమార్తె తెలుగులో ప్రఖ్యాతి పొందారు. తెలుగు ఆచార్యులయిన దివాకర్ల వేంకటావ ధాని గారికి, బిరుదురాజు రామరాజు గారికి, కేతవరపు రామకోటి శాస్త్రి గారికి ఒక్కొక్క కూతురు విశ్వవిద్యాలయ తెలుగుశాఖలో ఆచార్యులుగా ఉన్నారు. తెలుగు కవుల, రచయితల కోవలో దళితుడుగా ఉన్న నాకు, విశ్వవిద్యాలయ ఆచార్యుల క్రమంలో ప్రసిద్ధుడిగా

ఉన్న నాకు ఒక్క కూతురు కాదు ఇద్దరు కూతుళ్ళు. తెలుగు సాహిత్యంలో, విశ్వవిద్యాలయాలలో రాటు దేలి ఉన్నారు. పెద్ద వాళ్ళకు కూతుళ్లంటే గర్వముంటే నాది రెండింతల గర్వం.

ఆంగ్లం హిస్టరీ, పొలిటికల్ సైన్సు సీట్లు ఆనర్సులో వదులుకొని ఆనాటి బ్రాహ్మణుల చదువులో తెలుగులో ప్రవేశించి ఊపిరాడక పోయినా బ్రతికి బట్ట కట్టటమే కాకుండా, ఇద్ధరు కూతుళ్ళను తెలుగులో ఎం.ఏ., పిహెచ్. డి చేయించి విశ్వవిద్యాలయ విద్యా సముద్రంలో వదిలితే వాళ్ళు ఈదుతున్న దూరాలు, చేరుతున్న తీరాలు చూస్తుంటే నాకు గర్వం కలగమంటే కలగదూ! నా కంటే తెలుగును ప్రేమించే మహోత్తముల్ని మీరు చూస్తున్నారు కదా! నేనేం తక్కువ తిన్లేదు. అసలు తెలుగు మాదని గర్వించే మనుషుల్లో నేనూ ఒకణ్ణి. సంస్కృతం తెలుగో, ఇంగ్లీషు తెలుగో వచ్చినవాళ్ళు చాలామంది ఉంటారు. అసలు తెలుగు వచ్చిన వాళ్లలోని వాణ్ణి నేను.

యూనివర్సిటీలో, తెలుగు డిపార్టు మెంటులో మాదిగ మహాశయుడు మొదటి సారిగా లెక్చరరుగా చేరాలంటే ఎంతకష్టమో నాకు తెలుసు. మీకెవరికీ తెలియదు. ఎం. ఏ. తెలుగు చదవటమే నాకు ఎంత కష్టం! అందరికీ తెలియదు. యూనివర్సిటిలో దళితుడు మొదటగా రిజర్వేషన్లు లేని చోట చేరటం ఆ రోజుల్లో చాలా కష్టం. తెలివైన దళితులు రిజర్వేషన్లు వెతుక్కొంటూ పోయేవాళ్లు. మొండి వాళ్లు నాలాగా కాలుపు బండలకు తలలు కొట్టుకొంటూ ఉండే వాళ్లు. అట్లాగే మళ్లీ మెట్టు రీడరు, మళ్ళీ మెట్టు ప్రొఫెసరు, చాలా వేగంగా చాలా దూకుడుగా సాధించటం ఇప్పటికీ నాకు అసాధారణంగానే కనిపిస్తుంది. నేను పరుగు పందేల్లో బహుమతులు చాలా సంపాదించాను. ఆ పరుగు విశ్వవిద్యాలయంలో ప్రవేశించాక మరింత పెరిగింది. చాలా మంది సీనియర్లు జూనియర్లు అయ్యారు. పై నుంచి చేయూత ఇచ్చే తన కులం వాళ్లూ, మతం వాళ్లూ, లేకుండా పైకిరావటం యూనివర్సిటిల్లో చాలా కష్టం. ఆ కష్టం ఇష్టపడ్డాను. పోటీలో నిలిచాను. ఒంటరి పోరాటం. ఓడిపోలేదు సాధించాను.

నేను పిహెచ్.డి చేయటానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు రేపు మాపంటూ మూడేళ్లు గడిపారు. ముఖ్యమంత్రి సంజీవయ్యగారు బోయి భీమన్నగారి ద్వారా చెప్పిస్తే దివాకర్ల వేంకటావధానిగారు అదుగో ఇదిగో అంటూ అరి చేతిలో స్వర్గం చూపించారు. నన్ను ఆదరంగా చూసే కాకర్ల వెంకట రామనరసింహంగారు ఆంధ్ర యూనివర్సిటీపై ఆశ పెట్టుకోవద్దన్నారు. రామరాజుగారు ఉస్మానియా చుట్టు తిరగవద్దన్నారు. వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 1962 ప్రాంతంలో పింగళి లక్ష్మీ కాంతంగారు “లెక్చరరుగా ఉన్నావు

ఉద్యోగం చేసుకో. డాక్టరేటు గోల వద్ద”న్నారు. మర్యాదగా చెప్పారు. అప్పటికిక యూనివర్సిటీలు లేవు. పెళ్ళయి పిల్లలు కలగసాగారు. జి.యన్ రెడ్డిగారు ప్రొఫెసరు, హెడ్ అయ్యాక అబ్రాహ్మణులకు పిహెచ్.డి సీట్లు రాసాగాయి. వెళ్లి అడిగాను. ప్రకటన రాగా వెళ్ళాను. అప్లికేషన్ ఫారం కొనిపించి, తెప్పించి ఉంచారు. “ఆరునెలలు ఆగితే నా దగ్గరే చేరవచ్చు. ఇప్పుడే చేరాలంటే మహాదేవ శాస్త్రి గారి దగ్గర చేరాలి” అన్నారు.

తొమ్మిదేళ్లుగా విశ్వవిద్యాలయాల చుట్టూ తిరుగుతూ వచ్చాను. ఇక ఆలస్యం వద్దను కొన్నాను. వెంటనే చేరాను. ఇద్దరూ పుణ్యాత్ములు. ప్రోత్సాహం అంతింతనరాదు. నేనప్పుడు ఆంధ్రోపన్యాసకుణ్ణి. యన్.సి.సి ఆఫీసరు. రచయిత. విమర్శకుడు సమీక్షకుడు, పరిశోధకుడు. భర్త. నలుగురికి తండ్రి. సమయం చాలదంటారు అందరూ. నాకు మిగిలిపోయేది. దేనికీ లోపం లేకుండా ఏదీ ఆగకుండా సక్రమంగా జరిగిపోయేది. కనీ పెంచే స్థితిలో ఉన్న భాగీరథి గారిని ఎనిమిదేళ్లు సెలవు పెట్టించాను, ఆనందంగా ఆమె సెలవులో వుంది. అందరూ సంపాదన పోతుందని తిట్టారు. గొప్ప సంపాదన నలుగురు పిల్లలు. చక్కగా తయారయ్యే పునాది ఆమె సెలవు. తల్లిదండ్రుల ప్రేమ, సాన్నిహిత్యం, స్నేహం, ఆత్మీయత, చదువు మా పిల్లలు పుష్కలంగా పొందారు. ఇంకా పొందుతున్నారు. మేం వాళ్ళకు సంపద ఇవ్వలేదు కాని గొప్ప ఐశ్వర్యం ఇచ్చాం. గొప్ప గుండెబలం ఇచ్చాం. వీళ్ళు ఎక్కడైనా పోరాడగలరు. ఏ కొండలైనా ఎక్కగలరు. వాళ్ళ ఆత్మ విశ్వాసం అద్భుత వారసత్వం తల్లిదండ్రుల సంపద.

లెక్చరరుగా పనిచేసే వాళ్ళు 4-7 సంవత్సరాల మధ్య కాలంలో పిహెచ్. డి పూర్తి చేయవచ్చు. నేను మూడేళ్లకు ముగించాను. సిద్ధాంత గ్రంథం వ్యావహారికంలో వ్రాసిన రెండో వాణ్ణి. నా థీసీస్ సబ్మిట్ చేయకముందే నన్ను సహరచయితగా తెలుగు భాషా చరిత్ర రచనకు కోరాడ మహాదేవశాస్త్రి గారు తీసుకొన్నారు. మరుసటి ఏడు డాక్టరేటు వచ్చింది. సహరచయిత పోష్టు, డాక్టరల్ కృషి ముగిసింది. వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో లెక్చరరు పోష్టు పడింది. అప్లై చేశాను. సెలెక్ట్ అయ్యాను. అది విశ్వవిద్యాలయం ప్రవేశం.

దీనికి ముందొక సంగతి వివరించాలి. నా సిద్ధాంత గ్రంథ పరీక్షలు కాకర్ల వెంకట రామనరసింహంగారు, తూమాటి దొణప్పగారు, సి. నారాయణ రెడ్డిగారు. నా సిద్ధాంత గ్రంథం పేరు తెలుగు వ్యాసపరిణామం. తెలుగు నాటకం, కవిత్వం, నవల మీద ముందే పరిశోధనలు వచ్చాయి. రాని ప్రక్రియలు వ్యాసం, కథానిక. వ్యాసం మీద పరిశోధన చేస్తానన్నాను. 1968 నాటిమాట: కథానిక మీద ఎందుకు వద్దు? “కథానిక మీద నాకు చాలా విషయాలు తెలుసు” ఆ పొగరు చూడండి! “వ్యాసం నాకు తెలియదు

తెలుసుకొంటాను," తెలిసిందాని మీదనా? తెలియనిదానిమీదనా? "తెలియని దానిమీదే". రసహీనంగా ఉంటుంది. "అయినా! సరే." పుణ్యాత్ములు ఇద్దరూ అంగీకరించారు. సంతకాలు నాకంటే ముందు నా కాగితాల మీద పెట్టేవాళ్లు.

జి.యన్ రెడ్డిగారు, సి. నారాయణరెడ్డి గారు సాహిత్య అకాడమీ సభ్యులు. బెజవాడ గోపాల్ రెడ్డిగారు అధ్యక్షులు. కార్యదర్శి రామానుజరావు గారు. ఆ ఏటి ప్రసంగాంశం తెలుగు వ్యాసం. ముగ్గురు వక్తలు. తిరుమల రామచంద్ర గారు, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు, నేను. స్వాతంత్ర్యం తరువాత వ్యాస పరిణామం గూర్చి నేను పత్రం చదవాలి. అంగీకరించాను. పత్రం రాసుకొన్నాను.

థీసీస్ వైవా అనంతపురంలో కాని, తిరుపతిలో కానీ జరగాలి. ముగ్గురు పరీక్షకులు అక్కడికే రావాలి. ఈ ముగ్గురు సాహిత్య అకాడమీలో సభ్యులుగా కలుస్తారు. వైవా హైద్రాబాదు అని నిర్ణయించారు. ఉదయం వైవా అయింది. రిపోర్టు సీలు చేసి నన్నే పోస్టు చేయమన్నారు. సాయంకాలం ఉపన్యాస కార్యక్రమం. తిరుమల రామచంద్రగారు కళ్ళజోడు సర్దుకుంటూ కష్టపడి పత్రం చదివారు. శాస్త్రి గారు బాగానే చదివారు. వ్యాసం నీరసం అన్నమాట అర్థమయింది.సభలో ఎవరిమాటలు వాళ్లవి. నాకు భయం కలిగింది. పత్రం చదవటం మానేశాను. ప్రసంగించటం ప్రారంభించాను. నా సమయం ఇరవై నిమిషాలు. అర్ధగంట అయింది. మాట్లాడమన్నారు. గోపాల్‌రెడ్డి గారు తన పూలమాల నాకు వేశారు. తన టిఏ, డిఏ నాకు ఇచ్చారు. మర్నాడు సాహిత్య అకాడమీ ఆధునిక సాహిత్యం ఎడ్వయిజరీ కమిటిలో సభ్యుడిగా చేశారు. ఇంతా చేసింది. సి. నారాయణ రెడ్డి గారు, జియస్ రెడ్డిగారు, బెజవాడ గోపాల్‌రెడ్డి గారు కలిసి. ఎవరి పాత్ర ఎంతో ఊహించుకోవటమే. సి. నారాయణ రెడ్డి గారిని నేను మరువలేను.

అప్పటినుంచి 15 సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీలో ఉన్నాను. అయిదేళ్లు జనరల్ బాడీ, పదేళ్లు ఎడ్వయిజరీ బోర్డులో. సభ్యుడుగా నేను కేంద్ర సాహిత్య అకాడమీలో ఉండే అదృష్టం కలిగింది. నేను కేంద్ర సాహిత్య అకాడమీ ప్రవేశం వెనుక భద్రిరాజు కృష్ణమూర్తి గారి ప్రమేయం ఉంది. మూలం నాయని కృష్ణకుమారిగారు.

నాకు ఆరో తరగతిలో లెక్కలంటే ఇష్టం. ఇంగ్లీషు అంటే భయం. సంస్కృతం అంటే బెదురు. తెలుగు అంటే ఇష్టం. వీటితో కలిసిన తెలుగు నాకు ఇబ్బందిగా ఉండేది. "నీకు నోరు తిరగదురా" అని ఒకటో తరగతిలో అయ్యవారు, "గొడ్డు మాంసం కంపు నోరు, తెలుగెట్లా వస్తుంది" అని ఆరో తరగతి ఆచార్యులు చెవిపిండి వేలికి అయిన మురికి నా చొక్కాకు రాసేవాడు. భయమో, సందేహమో, అశక్తతతో, నేను రాయగలిగే వాణ్ణి కానీ పలకలేక పోయే వాణ్ణి.

'పంతులుగారి పాఠం', నా కథానికలో అన్నీ వచ్చి ఏమీ చెప్పలేకపోతున్న రెండో తరగతి పిల్లవాణ్ణి, ప్రేమగా లాలించిన సారుతో అన్ని పాఠాలు గడగడా అప్ప చెప్పిన పిల్లవాణ్ణి నిజానికి నేనే! బెత్తమంటే భయం. ప్రేమలేని చోట చదువు. ఎవరికీ అక్కరలేని వాణ్ణి. ఎవరికీ సొంతం వాణ్ణి కాని వాణ్ణి. ప్రేమ పొందలేని విద్యార్థిని.

ఆనర్సులో పంచకావ్యాలు ముంతమామిడి చెట్లకింద చేరి, గట్టిగా గొంతెత్తి చదివినట్లు అరిచే వాణ్ణి. నా నోరు, నా నాలుక, నాకు తిరక్కపోతే ఎవడికి తిరుగుతాయి? నేను చిన్నతనంలో ధారాళంగా అమ్మనా బూతులు చాలా సృజనాత్మకంగా కల్పించి కొత్తవి సృష్టించి తిట్టే వాణ్ణి. అట్లాగే ఇవీ అను కొన్నాను. పద్య పఠనం పోటీల్లో కూడా పాల్గొన్నాను. వాటి తిక్క కుదిరింది. పద్యాలది కాదు నోటిది. నాలుకది.

లెక్చరరు అయింతర్వాత, చదవటమే కాదు, చెప్పటం కూడా చేతయింది. ఉపన్యాసాలకు పిలవసాగారు. ఊపాగుతుందా? ఊగింది. పక్కతరగతి పిల్లలు వాళ్ళ క్లాసులు వదిలేసి నా క్లాసులో చేరేవాళ్ళు. నా గొంతు పెద్దది. నూట ఏభై మంది కోసం శ్రుతి పెట్టాను, తగ్గలేదు. పాతిక మందికి కూడా అదే గొంతు. పక్క గదుల వాళ్ళగోల. ఫోనులో మాట్లాడినా అంతే! అనంతపురం అంతా వినిపించాలి. అనంతపురంలో మాట్లాడితే హైద్రాబాదులో వినిపిస్తుందనేవాళ్ళు.

గొంతును స్వాధీనం చేసుకొంటున్నప్పుడు నాటకాలలో వేషాలు, దర్శకత్వం, ఆరంభమయ్యాయి. కవి అని కథ రాశాను (1960). ఆకాశవాణి విజయవాడ ప్రసారం చేయాలి. పింగళి లక్ష్మీకాంతంగారు స్పోకెన్ వర్డ్ ప్రొడ్యూసరు. 15 నిమిషాలు. 21 ఏళ్ళ వాణ్ణి. రికార్డు చేయలేదు. లైవ్ బ్రాడ్ కాస్ట్. తప్పులు రారాదు. సమయానికి అయిపోవాలి. అర్థయుక్తంగా ఉండాలి. పెద్ద పరీక్ష. ఆయన నా ఎదుటే కూర్చున్నాడు. అదొక బెదురు నాకు. నేను ఇబ్బంది పడితే ఆయన తీసుకుని చదివే వాడు. నాకు అంతకంటే అవమానం ఉండదు. అసలు ఉండేదే పొగరు. కొత్తగా వచ్చిన రోషం. అంతా సక్రమంగా అయిందని ఆనందించాను. అదనంగా మరో ఆనందం. ఎవరినీ ముట్టని లక్ష్మీకాంతం గారు నేను చెక్కు తీసుకోగానే నా భుజం మీద చేయి వేసి వుంచారు. అదే అభినందన. కథలు, కవితలు, నాటికలు, ప్రసంగాలు, హైదరాబాదు, విజయవాడ ఆకాశవాణి నుంచి విరివిగా ప్రసారం చేసే అవకాశాలు వచ్చేవి. ఎక్కువ పారితోషికం చెల్లించే వాళ్ళు. ఆరోజుల్లో నాకా డబ్బు చాలా విలువయింది.

ఆ కథ రేడియోలో నేను చదువుతున్నప్పుడు మునసబు గారి ఇంటి రేడియోలో మా మాదిగ పల్లె బంధువులంతా వింటూ ఉన్నారు. మా వాళ్ళకు నేనొక పండగ.

సాహిత్యోత్సవం. వాళ్ళలో మా అమ్మకూడా ఉంది. కవి కథలో, కవి భావనా శిఖరాల నుంచి వాస్తవాల లోయలోకి పడిపోతూ అమ్మా అని అరుస్తాడు. నేను అమ్మా అని అరిచాను. రేడియో కథ వింటున్న మా అమ్మ 'కొడుకా' అని ఏడవటం ప్రారంభించింది. పడిపోయింది. నేనే అనుకొని ఉంటుంది. నన్ను మర్నాడు చూచిందాకా ఏడుపు ఆపలేదు.

నా'యువతి' నాటికలో హేమలత పాత్ర, వాళ్ళ బావను "బావా" అని ఏడుసార్లు పిలుస్తుంది. ఏడుసార్లు ఏడు భావాలు పలకాలి. హేమలత పాత్రను తెన్నేటి హేమలత గారు నటించారు. నన్ను పట్టుకొంది. ఏడు రకాలుగా 'బావా' అనమంది. ప్రయత్నిస్తే పట్టుకొని "పైకొస్తావురా తమ్ముడూ" అంది. కల్లా కపటం లేని మనిషి. బందా కనకలింగేశ్వర రావు గారు గంట, అరగంట,పావుగంట, నాటికలు ఆసంవత్సరం పదిదాకా రాయించారు. గుంటూరులో ఉద్యోగం. రేడియో,ప్రభ, పత్రికలు విజయ వాడలో. బస్సులో ప్రయాణం. లెక్చరరు జీతంకంటే రేడియోల పత్రికల డబ్బు ఎక్కువ వచ్చేది.

గుంటూరు ఉద్యోగం పోయి, చిత్తూరులో చేరినప్పుడు ప్రభలో అనాథ సీరియల్ వస్తూ ఉంది. ఎవరెష్టు ఎక్కినట్లుండేది. అందరు నన్నే చూస్తున్నారని అనుకునేవాణ్ణి. రచయితగా లెక్చరరుగా ఉన్న నన్ను పిల్లలు గొప్పగా గుర్తించే వాళ్ళు. మధురాంతకం రాజారాంగారు, వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారు కలిస్తే కాఫీ తాగే వాళ్లం. ముంగర శంకరరాజు గారు, సి.వేణు గారు అభిమానించే వాళ్ళు. కె.సభాగారిని నేను కలిసి పరిచయం చేసుకున్నాను.

భారతి, ఆంధ్ర పత్రిక ఉగాది సంచికల్లో నా రచనలు పడటమూ, భారతి ఉప సంపాదక ఉద్యోగం రావటమూ, నేను చేరకపోయినా, నన్ను ఆంధ్రపత్రికకు సన్నిహితుణ్ణి చేశాయి. శివలెంక శంభుప్రసాద్‌గారు, శివలెంక రాధాకృష్ణగారు నన్ను బాగా ప్రోత్సహించారు. వాళ్ళ ప్రోత్సాహానికి ఋణపడి ఉన్నాను. ఆంధ్రపత్రికలోనో, ఉగాది సంచికలోనో, వారపత్రికలోనో ప్రచురించేవాళ్ళు. నేను ఆలస్యం చేస్తే రాయమని ఉత్తరాలు రాసే వాళ్ళు. నేను విమర్శనం వైపు, ఆపైన పరిశోధన వైపు చేసిన కృషికి మూలం నేను వీరికి విరివిగా సమీక్షలు రాయటం . నాపేరుతో కాక, మనోరాణి, రాణి, జ్యోతి, రవి పేర్లతో సమీక్షలు చేసేవాణ్ణి. నేను వ్రాసిన గొప్ప కథలు అనేవన్నీ ఆంధ్రపత్రిక ఉగాది సంచికల్లో వచ్చాయి. నేను 1962 నుంచి 72 దాకా విస్తారంగా రాశాను. 1972 నుంచి విశ్వవిద్యాలయంలో చేరటంతో విమర్శనం, పరిశోధనం చేయటం, చేయించటం పెరిగి పోయాయి. పద్య కవిత్వం తగ్గింది. నవలలు రాయటం ఆగిపోయింది.

1968లో ఆంధ్రప్రభ దీపావళి కథల పోటీకి "ఊరబావి' పంపించాను. ప్రచురణకు అంగీకరించారు. ఇప్పుడు సహృదయులు ఎక్కువగా ఊరబావిని ప్రస్తావిస్తారు. దాన్ని స్వాతంత్ర్యం వచ్చాక వచ్చిన అరవై కథల్లోకి ఎంపిక చేశారు. ఆంగ్లంలోకి తెచ్చిన ముప్ఫై కథల్లోకి చేర్చారు. మూడు తెలుగు కథలు కావాలంటే దీన్ని పంపారు. హిందీలోకి తర్జుమా చేశారు. ఫ్రెంచి, జర్మన్, స్పానిష్ భాషల్లోకి అనువదించారు. 1947 తర్వాత తెలుగులో వచ్చిన ఒకే ఒక్క ఉత్తమ కథ ఊరబావి అని బి.యస్. రాములుగారు రాశారు.

1963లో దేశరక్షణ మీద నాటకరచన చేయమని పోటీ పెట్టారు సమాచార శాఖవారు. నా నాటకం 'జైహింద్' కు బహుమతి వచ్చింది. సాంస్కృతిక శాఖ చారిత్రక నాటకం పోటీ నిర్వహిస్తే 'ఆర్య నాగార్జునాచార్యుడు' రాశాను. అది ఇప్పుడు పత్తాలేదు. నా డైరెక్టు నవలలు ప్రచురించిన విజయ సారథి ప్రచురణల అధిపతి అర్జునరావు గారికి 'కాల మేఘాలు' నవల ఇచ్చాను. ముద్రించ లేదు. రాతప్రతీ లేదు.

1980లో ఇంటర్ మీడియేట్ వాళ్ళు చారిత్రక పౌరాణిక నాటక పోటీ పెట్టారు. 'మునివాహనుడు' అని సంగీత రూపకం అరగంటకు తగినట్లుగా రాసి పంపితే, పాలగుమ్మి పద్మరాజు గారు గంటనాటకం రాయమన్నారు. రాశాను. వారోత్సవాలలో ప్రసారం చేశారు. ఇది రాయటానికి కారణం కొత్త సచ్చిదానందమూర్తిగారు. యస్వీ యూనివర్శిటిలో తిరుప్పాణి భవన నామకరణ సమయంలో రేడియోలో నాటికవచ్చేట్టు రాయమన్నారు. వచ్చింది. నామకరణమయింది. ఆ సంగీత రూపకాన్ని స్టేజీ నాటకంగా మార్చాను. రెండుగంటల నాటకంగా రూపొందింది సంప్రదాయ నాటకం. నాందీ భరతవాక్యాలతో సహా. ఇంటర్మీడియేటు వాళ్ళకు పోటికి 36 నాటకాలు వచ్చాయి. దీన్ని ఎంపిక చేశారు. ఇంటర్ విద్యార్థులు 5 ఏళ్ళు దీన్ని చదివారు. ఇది తిరుప్పాణి ఆళ్వారు కథ. శ్రీరంగనాథ దేవాలయంలోకి పోవాలని దళిత తిరుప్పాణ్ ఆశించటం, పూజారి తిరస్కరించటం, రంగనాథుడు ప్రత్యక్షమై, దేవాలయ పవిత్రత కాపాడటం కోసం, భక్తుడు తనను దర్శించటం కోసం పూజారిని భుజాలమీద ఎక్కించి తీసుకుని రమ్మని ఆదేశిస్తే అది పూజారి నిర్వహించటం కథ. కథ నాకిష్టం. వైష్ణవం వైష్ణవుల కిష్టం. రాష్ట్ర సాహిత్య అకాడమీ బహుమతి వచ్చింది. అంబేద్కర్ శతజయంతి ఉత్సవాలలో రాష్ట్రమంతటా పాతిక ప్రదర్శనలు ఇచ్చారు. జి. లక్ష్మీనారాయణగారు దర్శకులు. దీన్ని ఇంగ్లీషు, హిందీ, కన్నడ, తమిళ భాషల్లోకి అనువదించారు. తిరుపతి తిరుమల దేవస్థానం ప్రచురణ గ్రాంటు ఇచ్చింది. అనువాదాల మీద పరిశోధన జరుగుతూ ఉంది.

ఆకాశవాణి 6 కేంద్రాలు, సమాచారశాఖ, సాంస్కృతిక శాఖ ప్రతి ఏడూ నాలుగైదు కవి సమ్మేళనాలు నిర్వహించేవి. నా కవిత్వం ఆహ్వానం నోచుకొనేది. భిన్న రచయితల సంఘాలు కవి సమ్మేళనాలకు ఉపన్యాసాలకు ఆహ్వానించేవి. వేటినీ వదులుకోలేదు. అయితే నేనే చేయవలసిన కొన్ని పనులు చేయలేకపోయాను.

విశ్వవిద్యాలయాలలో నాకృషి మీద నా భవిష్యత్తు ఆధారపడి ఉండే పోటీ పరిస్థితుల్లో అందుకు తగినట్లుగా నన్ను నేను మలుచుకోవటంలో విమర్శన, పరిశోధన దృష్టి పెరిగి, సృజన కృషి ఆగిపోలేదు కానీ తగ్గిపోయింది. ఒకసారి ప్రొఫెసరు అయ్యాక అందుకు యోగ్యుడుగా వర్తించటం ఒక బాధ్యత. దాన్నీ దీన్ని నిలుపు కోవాలి. నేను గట్టిగానే ప్రయత్నించాను. 18 సంవత్సరాలు ప్రొఫెసరుగా కృషి చేసిన వాళ్ళు తక్కువ గానే ఉంటారు. పది ప్రామాణిక పరిశోధన గ్రంథాలు వెలువరించిన వాళ్ళు కొద్ది మందే ఉంటారు.

ఏడు కవితా సంకలనాలు, 9 కథానికా సంకలనాలు, 10 నవలలు, 6 నాటకాలు, 5 నాటికల సంకలనాలు, మొత్తం సృజన, విమర్శన, పరిశోధన సాహిత్యం ఏభై పైచిలుకు వెలువరించాను.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పక్షాన మలేషియా, సింగపూరు, మారిషస్ వెళ్ళి వచ్చాను. విశ్వవిద్యాలయం నుంచి కెనడా, అమెరికా దర్శించాను. కేంద్ర సాహిత్య అకాడమీ పంపగా జోర్డాన్, ఇజ్రాయేలు వెళ్ళాను. భాగీరథి గారి కోసం మళ్ళీ సింగపూరు వెళ్ళి విశ్రాంత జీవితంలో మంచి సమయం గడిపి వచ్చాను. ఇన్ని విదేశాలలో నేను నాటక రచయితను, కవిని, నవలా కర్తను, కథారచయితను, విమర్శకుణ్ణి, పరిశోధకుణ్ణి అని చెబుతుంటే వాళ్ళు తెల్లవాళ్ళు కదా – తెల్లముఖం వేసుకుని చూసేవాళ్ళు. అందువల్ల ఇంగ్లీషులో ఉన్న నాటకం, కథలు విమర్శన గ్రంథం చూపితే వాళ్ళు చూసి తిప్పి, తిరగేసి ఊరుకొనేవాళ్ళు.

వీళ్ళకిది సరికాదని 54 శీర్షికలున్న ఆంగ్ల కవిత్వం 2001లో రాశాను. పేరు Voice of silence. గోవిందరాజు రామకృష్ణారావు గారు మంచి సమీక్షా వ్యాసం రాశారు. ఇంగ్లీషు వచ్చిన వాళ్ళు ఎదురైతే నేనీ కావ్యంతో ఎదురయ్యేవాణ్ణి. అభినందనలు సహజమేకదా! ఈ కవిత్వం తెలుగులో లేదు. తెలుగులో ఉండాలని మిత్రులు అడగటం వల్ల నాకు అనువదిద్దామని ఆశగానే ఉండేది. బైబిల్ న్యూ టెస్టమెంటు ఆధునిక వ్యావహారిక భాషలోకి అనువదిస్తే నాకు ఇబ్బంది కలగలేదు. నా కథానికల్ని ఆంగ్లంలో తర్జుమా చేస్తే నాకు సమస్యరాలేదు. నా ఆంగ్ల కవిత్వం తెలుగులోకి తేవాలంటే ఎందుకో

చేతకాలేదు. ఇంగ్లీషులో రాయగలను. తెలుగు సరేసరి. నా ఇంగ్లీషు నా తెలుగులోకి తర్జుమా కాలేదు. నేను ఇరకాటంలో పడ్డాను.

అద్దేపల్లి రామమోహన రావుగారు, తెలుగుకవి. రచన తెలుగులో లేకుండా, ఆంగ్లంలోనే ఉండిపోవటం అన్యాయమని ఆంధ్రీకరించారు. దాని పేరు "నిశ్శబ్ద స్వరం". ఈ అనువాదం బాగుందన్నారు. ఆ బాగును పరీక్షించటానికి పరిశోధనకు గ్రహించారు, ఫలితాలు చూద్దాం. మంచి అనువాదం. కవి కావ్యం అనువాదం చేస్తే స్వతంత్ర రచన అన్నంత బాగా ఉంటుంది.

నేను చూచిన ఒక సన్నివేశం, సందర్భం, సమస్య నన్ను బాధిస్తే కన్నీరు తెప్పిస్తే, ఏమయినా రాశాను. నా కన్నీరు ఎవరికీ కనబడనీయను. సాహిత్యం కనబడనిస్తాను. నేను ఏడుస్తానని నా బంగారు తల్లి భాగీరథికి మాత్రమే చూచాయగా తెలుసు. మా పిల్లలకు తెలియదు. లోకానికి అసలు తెలియదు. నా నవ్వే తెలుసు. నా షోకో, హుషారో వాళ్ళు చూచి ఉండవచ్చు. నన్ను ఏడిపిద్దామనుకొన్నవాళ్ళకు నవ్వు సమాధానమయినప్పుడు బిత్తరపోయేవాళ్ళు. నన్నెవరూ ఇబ్బంది పెట్టలేదు. ఎందుకంటే నేను ఇబ్బంది పడను కాబట్టి. నేనెవరినీ ద్వేషించను. ప్రేమించటం తప్ప నాకు అన్యం తెలియదు. చేతనయితే సహాయం చేశాను. చేతకాకపోతే చేతులు ముడుచుకొని కూర్చున్నాను. హానిచేయలేదు. కడుపుమీద కొట్టలేదు. వీపు మీద కొట్టి ఉంటాను ప్రోత్సాహించటానికి కార్యరంగంలోకి నెట్టటానికి. తిట్టి ఉంటాను మేలు చేయటానికి, ప్రేమించటానికి, ఆలింగనం చేసుకోవటానికి, ఆరాధించటానికి, ఆత్మీయత ప్రకటించటానికి.

పీడితులు నాకు సన్నిహితులు. పీడన నా వేదన. ప్రతిఘటన నా లక్ష్యం. నా సాహిత్యం నా ఈ స్థితికి ప్రతిబింబం. నా రచనలు నా కన్నీళ్ళు. అందువల్ల కమ్యూనిస్టు అన్నారు. మార్క్సిస్టు నన్నారు. ధన్యుణ్ణి నక్సలైటు అనలేదు. కానీ 'తల లేనోడు' కథను ఏ విప్లవ రచయితా రాయలేకపోయాడు అని ఆర్. యస్. సుదర్శనంగారు ప్రకటించారు. అరసం నన్ను అభిమానించింది. ఆహ్వానించింది. విరసం నా ఉనికిని గుర్తించింది. విరసం వాళ్ళకు నా రచనలు ప్రోత్సాహం కలిగించవచ్చునని భావిస్తాను. స్త్రీ విముక్తి, సమానత్వం, నాకిష్టం. దళితుల అభివృద్ధి నా కభీష్టం. నన్ను రకరకాల పేర్లతో పిలుస్తున్నారు. నా పేరు రాత ఏ భాషలోనూ నేటికి సరిగా కుదరనట్లే నారచనా కేంద్రంకూడా మహాశయుల దృష్టిలో సంకోచవ్యాకోచాలకు గురి అవుతూనే ఉంది.

అనంతపురంలో తపోవననంనగర్ బ్రాహ్మణ అధ్యాపకుల కాలనీ. నేనొక్కణ్ణే మాదిగ కులస్థుణ్ణి. నన్ను నా కులం ఎప్పుడు మర్చిపోనిచ్చారు జనం. సొంత ఇల్లు. వాళ్ళ మధ్య పిల్లలు పెరగాలని పట్టుదల. వాళ్ళ శక్తులు, యుక్తులు, కుయుక్తులు కూడా వీళ్ళు నేర్చుకొన్నారు. మంచి శిక్షణ కేంద్రమది. అక్కడ పిల్లలు పెరగటం వాళ్ళకు అన్ని విధాలా మేలయింది. అక్కడ నీటి సమస్యవల్ల నేను బావి తవ్వించుకోవలసి వచ్చింది. ఆ నీరే 'అస్పృశ్యగంగ'. నేను ఎదుర్కొన్న జీవితమే నా రచనలకు ప్రేరణ. సుఖాలు ఉండేచోట కంటే, కష్టాలుండే చోట్లు వెతుక్కొనే వాణ్ణి. రాటుతేలటానికి. ఆ ప్రయత్నం నాకు సాహిత్యం ప్రసాదించింది.

ఒక కావ్యానికి చెప్పులు అని పేరు పెడితే జనం ఆశ్చర్యంగా చూశారు. నేను చెప్పులకు నమస్కరిస్తున్నాను అని కవిత రాస్తే బిత్తర పోయారు. నా ఆంతర్యం నగ్నంగా ప్రదర్శించినప్పుడు జనం ఆశ్చర్య పోసాగారు.

"త్రిద్రవ పతాకం" కావ్యం చూచి అంటే ఏమిటనే వాళ్ళుంటారు. మూడు ద్రవాలతో పతాకం ఎలా అని. మూడు వర్ణాలతో జెండా ఉంటే అది మువ్వన్నెల జెండా. త్రిద్రవాలతో పతాకం ఉంటే అది భారతదేశం. ప్రపంచం. ఆ మూడు ద్రవాలు, రక్తం, స్వేదం, అశ్రువు. వీటి మూడిటి మీదే సృష్టి విలాసం. ప్రపంచ కార్మికులంతా ఏకం కావటానికి మార్క్సుకి వాళ్ళ శ్రమ మాత్రమే తెలుసు. ప్రపంచ మానవులంతా ఒకటే అవటానికి వాళ్ళ రక్తాశ్రుస్వేదం ఇనాక్‌కి తెలుసు. 'త్రిద్రవ పతాకం' కావ్యం మహా స్వప్నం అన్నారు విమర్శకులు. మహావాస్తవం అంటుంది భవితవ్యం.

జాతీయ పతాకం
మొన్న కన్నీటిని తుడిచింది.
నిన్న చెమటతో తడిసింది
నేడు రక్తంలో మునిగింది.
ఇప్పుడిది త్రిద్రవ పతాకం.

ఈ కావ్యం ఏ పుటతిప్పినా మీకు కన్నీరు, చెమట, రక్తం మరకలు చేతికంటుతాయి. మీరు పవిత్రులు ఈ మురికి భరించలేరు. ధైర్యముంటేనే చదవండి. మీరీ త్రిమూర్తులకు తల్లి దండ్రులవుతారు.

నేను వసుచరిత్రను గూర్చి రాశాను. ఎవరూ ఆ మార్గంలో రాయలేరు. ఆలోచించలేరు. తాను కాబట్టి ఆ ప్రబంధం రాశాడు. ఇతరులు రాయలేరు. నేను కాబట్టి ఆ విమర్శనం రాశాను. ఇదరులకా చూపుండదు. మీరంతా వసుచరిత్ర కారుణ్ణి భట్టు మూర్తి అనో, రామరాజ భూషణుడనో అంటారు. నా పేరు శుభమూర్తి అని అతడన్నా మీరు వినరు. నేను చూపి చెప్పినా మీరు చూడరు.

కవిని నిబద్ధుడని, నిమగ్నుడని మీరు అంటుంటారు వింటుంటారు. అవి పాక్షికమైన కొలబద్దలని ప్రగాఢమయింది. నిబిడతా కోణం ఉందని నెత్తిన నోరు పెట్టుకుని 'ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం' నేను చెబితే విశ్వవిద్యాలయాలు గ్రహించాయి. సాహిత్య విమర్శక పండిత లోకం ఇంకా తటపటాయిస్తూ ఉంది.

ప్రముఖ విమర్శకుల్లో, పరిశోధకుల్లో నన్ను ముఖ్యుడుగానే లెక్కిస్తున్నారు. ప్రసిద్ధ కథానికా నవలా రచయితల్లో ప్రధానుడు గానే పరిగణిస్తున్నారు. పదిమందితో కలిపి కవిగా నాటక కర్తగా గుర్తిస్తున్నారు. అందరూ అన్నీ కాలేరు. కొందరే అన్నీ కాగలిగిన కొందరితో నేను ముందు నిలుస్తానని నాకు తెలుసు. మీకు తెలుసు. తెలిసిన అందరూ మాట్లాడలేరు. మాట్లాడగలిగిన కొందరికి మాటలు చాలవు. మాటలు చాలిన వాళ్ళు మౌనం వహిస్తారు. మౌనం మానహానికన్న ప్రాణ హానికన్న ఘోరం. అందుకే Voice of Silence రాశాను.

ఈ డెబ్బై ఏళ్ళలో నేను చాలా దూరం ప్రయాణం చేశాను. ఏమీలేని నేను ఎంతో వెనక నుంచి బయలుదేరి అన్నీ ఉన్న అందరితో కలవటానికి ఎంత కష్టపడ్డానో ఊహించండి. చాలా వేగంగా ప్రయాణం చేశాను. ఇంకా పరుగు ఆగదు. ఈ సాధన సామాన్యం కాదు. నేను కులాన్ని జయించాను. అయినా లోకాన్ని ప్రేమిస్తున్నాను. నన్ను ద్వేషించినా భూషించినా ప్రేమిస్తున్నాను. విజేతకు గర్వముంటుంది. నేను విజేతను, కాని నాకు గర్వం లేదు. దీనుడు గర్వించడు. నేను దీనుణ్ణి. గర్వించాను. నా దేవత పెట్టుబడిగా గర్వంతో విజయం సాధించాను. నన్నిప్పుడు మీరు అంచనా వేయలేరు. నేను మీకింకా తెలియలేదు. మీకింకా పూర్తిగా తెలియటానికి సమయం అవసరం. నన్నుమరువలేరు. నేను మీకు తెలుస్తాను. చాలా కాలం కావాలి. అప్పటికి నేనుండను చాలా మంది పుణ్యాత్ములు తమ జీవిత కాలంలో నిరాశాదగ్ధ చేతస్కులయ్యారు మనస్కులయ్యారు. నేనే మాత్రం?

డెబ్బై ఏళ్ళ జీవితం 55 ఏళ్ళ సాహిత్య జీవితం. గంటలో చెప్పాలి. ఏం చెప్పగలను. కొండ అద్దంలో కొంతకనిపిస్తుంది. హైదరాబాదులో ఆంధ్ర సారస్వత పరిషత్తు సుప్రసిద్ధ వ్యవస్థిత సంస్థ. గొప్పగా తెలుగు సాహిత్య సేవ చేసింది. పరిణతవాణిలో నన్ను మాట్లాడించటమే నాకు పరమ గౌరవం. ఈ సందర్భంవల్ల నాకు స్వీయ జీవిత చరిత్ర రాయాలన్న సంకల్పం కలిగింది. నాకు వందన సమర్పణ సమయం ఇచ్చినందుకు సి.నారాయణ రెడ్డి గారికి, ఆంధ్ర సారస్వత పరిషత్తుకు ధన్యవాదాలు.

మీకూ, మీ సాహిత్యానికీ, రావలసినంత గుర్తింపు రాలేదని మిత్రులు అంటుంటారు. ఈ గుర్తింపు చాలనిపిస్తుంది. ఇంకా గుర్తింపు అనుగ్రహిస్తామంటే నాకు సంతోషమే కదా. నాకు ఏ కుల సంఘం, మత సంఘం లేదు. ఏ కులం వాళ్ళు ఆ కులం వాళ్ళని, ఏ మతం వాళ్ళు ఆ మతం వాళ్ళని ప్రోత్సహిస్తారు. నాకు ఆ అవకాశం లేదు.

నేను. ఏ రచయితల సంఘంలోనూ సభ్యుణ్ణి కాను. ఆ సంఘ సభ్యులు ఆ సంఘ కవుల్ని రచయితల్ని విమర్శకుల్ని అభిమానించి అండదండలిచ్చి ఆదరించి నట్లుగా నాకు ప్రోత్సాహం లభించదు.

నా ఆలోచనలు నావి. నా ఆరాటం నాది. ఏ కొందరి కోసమో నేను జీవించటం లేదు. నేను పీడితులనుకొన్న వాళ్ళ పక్షాన నా పోరాటం. అదే సాహిత్యరూపం. వాళ్ళకోసం నేను రాస్తున్నా, వాళ్ళు నా కోసం శ్రమించాలని కృషి చేయాలని, నా జెండా మోయాలని నేను అనుకోను. వాళ్ళు విముక్తులైతే చాలు. సాహిత్యం నన్ను విముక్తుణ్ణి చేసింది. దళితులు, స్త్రీలు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల వాళ్ళు, పేదలు నా పరిధి వాళ్ళు. నాప్రమేయం వాళ్ళు. వాళ్ళకు నా సాహిత్య ప్రోత్సాహం నా లక్ష్యం. వాళ్ళు అండదండలందీయగలరు. వాళ్ళ సహాయ సహకారాలు నేను కోరుకోను. ఇదీ ఈ వ్యవస్థలో నా స్థితి.

వీళ్ళనుంచే కాక, వీళ్ళు కాని వాళ్ళ నుంచి నాకు విశేషప్రోత్సాహం లభిస్తూ ఉంది. ఆదరణ దొరుకుతుంది. అనురాగం అందుతుంది. నా సాహిత్యం వర్ధిల్లుతుంది. ఒక కులం, ఒక మతం పరిధిలోనో, ఒక సాహిత్య సంఘం లక్ష్యాల పరిధిలోనో చిక్కుబడి పోకుండా అందరి కోసం రాయటం నేను బాల్యంలోనే నేర్చుకొన్నాను. రాసేది నా అనుభవమే నా చుట్టూ ఉన్న జీవితమే! మా కష్ట సుఖాలె! మా కోసం కాదు–నలుగురి కోసం. మీ కోసం, జన సామాన్యం కోసం.

నేను అందరి కోసం రాస్తున్నాను. నన్ను అందరూ మన్నిస్తున్నారు. నా కదే గౌరవం. నాకా గౌరవం కలకాలం నిలుస్తుంది. పరిమితుల్లో, పరిమితుల వాళ్ళు గుర్తించక పోయినా నేను చింతించను. అపరిమితంగా, అపరిమితుల వాళ్ళు గుర్తిస్తారు. గ్రహిస్తారు అనుగ్రహిస్తారు. అది చాలు. ఆలస్యం కావచ్చు. అయినా సంతోషమే!



ఆచార్య చేకూరి రామారావు

పరిణత వయస్కుడి నన్నమాట నిజమే కాని పరిణత మనస్కుడి నవునో కాదో చెప్పలేను. అయినా పరిణతవాణికి ఎన్నుకోబడ్డాను.

ఇంతకు ముందు ఈ పరిణతవాణి ప్రసంగాలు చాలా వాటికి హాజరయ్యాను. నాకన్నా చిన్నవాళ్ళు, పెద్దవాళ్ళు చాలామంది మాట్లాడగా విన్నాను. ఇది నాదాకా రావటం కొంత ఆశ్చర్యం కలిగించినా మరింత ఆనందాన్ని కలిగించింది.

నేను పుట్టింది ఖమ్మం జిల్లా మధిర తాలూకాలో ఉన్న ఇల్లిందలపాడు అనే చిన్న పల్లెటూళ్లో. ఇది మధిరకు మూడు మైళ్ల దూరంలో దక్షిణాన వైరానది తీరంలో ఉంది. నాకు రెండు పుట్టిన రోజులున్నాయి. స్కూలు రికార్డులో 1934 అక్టోబరు 1. మా అమ్మ చెప్పిన ప్రకారం 1935 జులై 1. ఇది యువ సంవత్సరాషాఢ శుద్ధ పాడ్యమి సోమవారం.

దీన్ని పాతకాలంలో ముత్యాల సరాలు అభ్యాసం చేస్తున్న రోజుల్లో

'యువయనంబడు వత్సరమ్మున
ఉద్భవించితి నాపురమ్మున
శుక్ల పక్షాషాఢ పాడ్యమి
సోమవారమున'

అని రికార్డు చేశాను.

మా తాతలు ముగ్గురన్నదమ్ములు. రామయ్య, కోటయ్య, లింగయ్య అని వాళ్ల పేర్లు. పాము కాటు వలన మరణించిన పెద్ద తాతయ్య రామయ్య గారి పేరు నాకు

పెట్టారు. వాళ్లల్లో రామయ్యగారు ఒక్కడే చదువు కొన్నాడు. ఆయన తాటాకులపై రాసుకున్న భాగవతం దశమ స్కంధం చాలా రోజులు మా ఇంట్లో ఉండేది. మా అమ్మ చిన్నప్పుడు తెలుగు సంస్కృత కావ్యాలు చదువుకున్నది. నాకు ఊహ తెలిసింతరవాత ఇంట్లో శ్రీరామ కర్ణామృతం, పారిజాతాపహరణం కనిపించాయి. ఇవి కూడా నాలో సాహిత్యాభిలాష కలిగించాయి.

చిన్నప్పుడు ఏటి ఒడ్డున కూర్చొని అవతలివైపున మామిడి, జామ తోటల నుంచి ఉదయించే సూర్యుణ్ణి చూడటం అలవాటయింది. బహుశః అది నాలో సౌందర్య దృష్టి కలిగించి ఉంటుంది. తరవాత కలిగిన సాహిత్యాభిలాషకు ఇవన్నీ తమ తమ వంతు పని చేసి ఉంటాయనుకుంటాను.

చిన్నప్పుడు మా ఊళ్ళో నాఈడు స్నేహితుడొకడుండేవాడు. వరసకు మేనమామ అవుతాడు. మేము ఇద్దరమూ ఎవరిళ్ళల్లో వాళ్లు డబ్బు లెత్తుకొని దగ్గర్లో ఉన్న మధిరకు వెళ్లి హోటళ్లలో పిచ్చితిండ్లు తిని కాఫీ, టీలు సేవించి సాయంకాలానికి ఇంటికి తిరిగి వచ్చే వాళ్లం. అతని సంగతేమో గాని నేను ఇంటికి వచ్చి తన్నులు తినేవాణ్ణి. దీని మీద మా ఇంట్లో పెద్ద చర్చలు జరిగేవి. అతన్నుంచి నన్ను వేరుచేయటం ఒకటే మార్గంగా కనిపించింది. మా వాళ్లకు మా మేనత్త కొడుకు నీరుకొండ వెంకయ్య గారని ఒకాయన సత్తెనపల్లి తాలూకాలో సిరిపురం అనే ఊళ్లో ఆయుర్వేద వైద్యుడుగా పనిచేస్తున్నాడు. ఆయనకప్పుడు పిల్లలు లేరు. ఆయన్ను అడిగితే నన్ను తన దగ్గర ఉంచుకొని చదివించటానికి సంతోషంతో అంగీకరించాడు. ఎప్పటి కయినా నైజాము వెళ్లవలసిన వాణ్ణే అనుకున్నారేమో, నన్ను ఒక ముస్లిం స్కూలుకు పంపించారు. అప్పుడు నేను నేర్చుకున్న ఉర్దూ ఇప్పుడు హైదరాబాదులో ఉర్దూ బోర్డులు చదవటానికి పనికివచ్చింది. అయితే అది ఎక్కువ కాలం సాగలేదు. స్కూలునుంచి తిరిగివస్తూ ఒక దేవుడిగుడి దగ్గర సూరయ్య పంతులు గారని ఒకాయన దారిలో నన్ను ఆపి నా పలక తీసుకొని ఇంగ్లీషు అక్షరాలు దిద్ద బెట్టేవారు. తరవాత స్కూలు మానేయించి సూరయ్య పంతులు గారి దగ్గరే ట్యూషన్‌లో చేర్పించి ఇంగ్లీషు నేర్పించి తరవాత సత్తెనపల్లి శరభయ్య గుప్త హిందూ హైస్కూలులో సెకండు ఫారంలో చేర్పించారు.

సిరిపురంలో ఉన్నప్పుడు మా వెంకయ్య బావగారి సతి బంగారమ్మక్కయ్య ఉండేది. అవి జాతీయోద్యమం రోజులు. అక్కడ వాళ్లింటికి కొందరు ఆడపిల్లలు వచ్చి ఆమెతో కలిసి రాటం వడుకుతుండేవారు. గాంధీ గారి ఖద్దరు ఉద్యమ ప్రభావం అది. అప్పుడే నెమ్మదిగా జాతీయోద్యమ భావాలకు బీజం పడింది. ఆ తరవాత భావాల ప్రభావం

పెరిగి జాతీయోద్యమానికి సన్నిహితుడిని అయినాను. సత్తెనపల్లిలో విద్యార్థి కాంగ్రెసులో చేరి ఊరేగింపుల్లో తిరిగేవాణ్ణి. అప్పుడు మా విద్యార్థి నాయకుడు దరువూరి వీరయ్యగారు. ఆయన రంగాగారి భక్తుడు, కమ్యూనిస్టు వ్యతిరేకి. కమ్యూనిస్టు పార్టీ ఆఫీసు రావటంతోనే దేశ ద్రోహులు నశించాలి అనే నినాదం ఇచ్చేవాడు.

సత్తెనపల్లిలో చదువుకొనే రోజుల్లో జరిగిన ఒకటి రెండు ఆసక్తికరమైన విషయాలు గుర్తున్నాయి. హైస్కూలులో ప్రతిరోజు ప్రార్థన ఉండేది. ఏదో దేశభక్తి గీతాలు పాడేవారు. ఆ తరవాత ఒక సీనియర్ టీచరు క్లుప్తంగా ప్రసంగించేవారు. అది 1945 అనుకుంటాను. అమెరికా అధ్యక్షుడిగా మూడు సార్లు ఎన్నుకోబడ్డ ఫ్రాంక్లిన్ రూజ్వెల్టు చనిపోయాడు. ఆ సందర్భంలో ఒక సీనియర్ టీచర్ ఆ సంగతి ప్రస్తావిస్తూ ఆయన బతికి ఉంటే మనకు స్వాతంత్ర్యం ఇప్పించే వాడు అన్నాడు. అప్పుడు హెడ్మాస్టరు జోక్యం చేసుకొని స్వాతంత్ర్యం ఒకరిచ్చేది కాదు, ఇప్పించేది కాదు, మనం పోరాడి తెచ్చుకునేది అని సవరించారు. ఆ మాట నా పై చెరగని ముద్రవేసింది. అప్పటి నా హీరో నేతాజీ సుభాష్ చంద్రబోస్.

సత్తెనపల్లిలో చదివేటప్పుడు అప్పటి నా క్లాస్ మేట్సు చంద్రమౌళి, చాపరాల లక్ష్మీ నారాయణ తెనాలి వెళ్లాం. స్టేషన్ దగ్గర ఒక పెద్ద మైదానంలో మహాత్మాగాంధీ వేదిక మీద ఎక్కడో ఉన్నారు. నాకు చూపు అందలేదు. ఒకాయన నన్ను పైకెత్తి చూపించారు. ఆయన్ని చూడగలిగాను కాని వినలేక పోయాను. ఆ రోజు సోమవారం. ఆయన ఆ రోజు మౌనవ్రతం పాటిస్తారు. ఒక గొప్ప నాయకుణ్ణి చూడగలిగానన్న తృప్తి మాత్రం మిగిలింది.

1946 లో జరిగిన ఎన్నికల్లో వావిలాల గోపాలకృష్ణయ్య గారు కమ్యూనిస్టు అభ్యర్థి గా పోటీ చేశారు. అప్పటికి నాకు ఇంకా కమ్యూనిస్టులు దేశద్రోహులు కనుక ఆయనకు ఓటు వెయ్యవద్దని, పచ్చపెట్టెకే ఓటు వెయ్యమని ప్రచారం చేశాను.

ఆ తరవాత 1946 ప్రాంతంలో నరసరావుపేటలో నా చదువు సాగింది. నరసరావుపేటలో ఉన్నది నాలుగేళ్లే అయినా నా జీవిత చరిత్రలో అతిముఖ్యమైన బీజాలు అక్కడే పడ్డాయి. అప్పటి నా హైస్కూలు చదువులు సాగిన మునిసిపల్ హైస్కూలు హెడ్మాస్టరు నాయని సుబ్బారావుగారు. ఆయన ఆ తరువాత అంటుండేవారు "మీ అభ్యుదయ కవులంతా నాశిష్యులే నోయి" అని. గంగినేని వెంకటేశ్వర రావు, అనిసెట్టి సుబ్బారావు, రెంటాల గోపాలకృష్ణ, కుందుర్తి ఆంజనేయులు - నరసరావుపేట వీధుల్లో నడయాడినవారే. పులుపుల శివయ్యా గారిది వినుకొండ పక్క నరగాయ పాలెం అయినా నరసరావు

పేటలోనే తిరుగుతుండే వారు. పలనాడు 'వెల లేని మాగాణి రా' అనే సుప్రసిద్ధమైన పాట రాసినవారు ఆయన. అప్పటి హైస్కూలులో లంకా సీతారామశాస్త్రి గారు తెలుగు పాఠాలు చెప్తూ బాల వ్యాకరణ సూత్రాలను ఉదాహరించే వారు. భాగవతుల సుబ్బారావుగారు తెలుగు సాహిత్యం వివరించేవారు. అక్కడి మునిసిపల్ లైబ్రరీలో అనిసెట్టి సుబ్బారావు, ఆవంత్స సోమసుందర్, ఆరుద్ర గార్ల కవిత్వంపై ఆనందవాణి పత్రికలో ఒక వ్యాసం చదివాను. ఆ తరవాత ఆపుస్తకాలు కొనుక్కొని చదివాను. ఆధునిక సాహిత్య పరిచయం ఆ విధంగా ఏర్పడింది. ఆ సంవత్సరం ఫ్యాన్సీ డ్రెస్సు కాంపిటీషన్‌లో ఫస్టు ప్రైజు వచ్చింది. అప్పుడు తిక్కన నిర్వచనోత్తర రామాయణం బహుమతిగా వచ్చింది. ఎండాకాలపు సెలవుల్లో దాన్ని చదివాను. బాగానే అర్థమయింది. ప్రాచీన సాహిత్య పరిచయం ఏర్పడింది.

హైస్కూలులో భాగవతుల సుబ్బారావుగారు పిల్లల్ని మీలో ఎవరైనా పద్యాలు రాస్తారా? అని అడిగారు. అప్పుడు నేను రాసిన గీతపద్యాలేవో చదివాను, 'సరససద్గుణ శీల సుశీలయనియె' అని యతి కుదరని పద్యపాదమొక్కటే గుర్తు. అంటే నా కవితా రచనకు బీజాలు కూడా అక్కడే పడ్డాయి.

నరసరావుపేట స్కూల్లో చదువు కొనేటప్పుడే హైస్కూలుకు వెళ్లే దారిలో కమ్యూనిస్టు పార్టీ ఆఫీసు ఉండేది. అక్కడి గ్రంథాలయంలో విశాలాంధ్రలో ప్రజారాజ్యం, రష్యాదేశం భూతల స్వర్గం వాటి పుస్తకాలు తెచ్చుకుని చదివాను. అట్లాగే మా మేన బావ ఎవరో మిత్రులు అడిగారని ప్రజాశక్తి దిన పత్రిక తెప్పించేవాడు. ఆయన చదివేవాడు కాడు కాని నేను శ్రద్ధగా చదివే వాడిని. కమ్యూనిస్టు సిద్ధాంతాలతో పరిచయం ఏర్పడింది. అప్పుడే అక్కడే ఊళ్లో అజ్ఞాతవాసంతో ఉన్న నారాయణ స్వామిగారు నాకు మార్క్సిస్టు సిద్ధాంత పాఠాలు చెప్పారు. ఇవన్నీ తల కెక్కి కమ్యూనిస్టులు దేశ ద్రోహులుగా కనపడటం మానేశారు. కమ్యూనిస్టు గ్రంథాల పరిచయం, మార్క్సిస్టు బోధలు నా ఆలోచనల్లో చాలా మార్పులు కలిగించాయి.

నా హైస్కూలు చదువు నరసరావుపేటతో పూర్తి అయింది. అయితే స్కూలు ఫైనల్లో పరీక్ష తప్పాను. అప్పుడు సెప్టెంబరు పరీక్షలు ఉండేవి కావు. పరీక్షతో తప్పిన వాళ్లు మళ్లీ సంవత్సరమంతా స్కూల్లో చదవాల్సివచ్చేది. అట్లా చదివి 1950లో హైస్కూలు చదువు పూర్తిచేశాను.

ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. నేను స్కూల్ ఫైనల్ నుంచి బి.ఏ. వరకు ఏ క్లాసు మొదటిసారి ప్యాసు కాలేదు. కొన్ని క్లాసులు రెండు సారులు చదివాను. దీని వల్ల జరిగిన నష్టమేమోగాని ఎన్నో విషయాలు తెలుసుకున్న సంతృప్తి ఉంది. ఎంతో మంది

గొప్ప ఉపాధ్యాయులను వినే భాగ్యం కలిగింది. మచిలీపట్నంలో ఒక ఇంటర్మీడియేట్ చదివాను. సెప్టెంబరు పరీక్షలకు వెళ్లి దొంగ జ్వరం తెచ్చుకొని పరీక్ష తప్పాను. ఆ తరువాత హైదారాబాదు నిజాం కాలేజిలో ఇంకో ఇంటర్మీడియెట్ చదివాను. అదీ ఫెయిలయి మళ్లీ సప్లి మెంటరీ పరీక్షల్లో ప్యాసయ్యాను.

నేను బి.ఏ. చదివేటప్పుడు ఆచార్య సి.నారాయణ రెడ్డిగారు అప్పుడే ఎం.ఏ పూర్తి చేసి మాకు టీచర్‌గా వచ్చారు. ఆధునిక కవిత్వం పాఠం చెప్పేవారు. జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి విజయశ్రీ ఆధునిక కవిత్వ పాఠ్య గ్రంథంగా ఉండేది. అందులో పద్యాలను ఛందస్సు చూసుకొని రమ్మనేవారు. అట్లా ఛందస్సుపై ఆసక్తి పెరిగింది.

ఆ తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి.ఏ ఆనర్సులో చేరాను. ఆ రోజుల్లో ఆంధ్రా యూనివర్సిటిలో సీటు దొరకటం అంత తేలికైన విషయం కాదు. నాయని కృష్ణకుమారి గారు గంటిజోగి సోమయాజులు గారితో చేసిన సిఫారసు వలన సీటు దొరికింది. ఆంధ్రా యూనివర్సిటీలో మహామహులైన ఉపాధ్యాయులు దొరకటం నా అదృష్టం. గంటిజోగి సోమయాజులు గారు భాషను గురించి బోధించేవారు. దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారు వ్యాకరణం చెప్పేవారు. భద్రిరాజు కృష్ణమూర్తిగారు భాషా శాస్త్రం బోధించేవారు. కె.వి.ఆర్. నరసింహం గారు సాహిత్యం బోధించారు. ఎస్వీ జోగారావుగారు ఛందస్సు పాఠం చెప్పారు. ఇట్లా మహామహులు ఆయా పాఠాలు చెప్పటం మా అదృష్టం. అప్పుడు మల్లంపల్లి సోమశేఖర శర్మగారు చరిత్ర పాఠాలు చెప్పారు.

నేను ఆనర్సు ఫైనల్లో ఉండగా భద్రిరాజు కృష్ణమూర్తిగారు అమెరికా వెళ్లారు. అప్పుడాయనకు ఒక ఉత్తరం రాశాను. అమెరికానుంచి అక్కడి letter head మీద ఒక సిఫారసు రాసి పంపమని, దాని ఆధారంతో ఇక్కడ ఏదైనా ఉద్యోగం సంపాయించు కుంటానని. ఆయన అందుకు సమాధానంగా రాసిన ఉత్తరం నా జీవిత గమనాన్నే మార్చివేసింది.

అందులో ఏమన్నారంటే "నువ్వప్పుడే ఉద్యోగంలో చేరటం నాకిష్టం లేదు. ఇక్కడి నుంచి (Gerald kelley) జెరల్డ్ కెలీ గారని ఒకాయన వస్తున్నారు. ఆయనకు ఒక తెలుగు అసిస్టెంటు కావాలి. ఆయన దగ్గర చేరు. "He will find many ways to get you to the u.s." అని రాశారు. అన్నట్టుగానే ఒక నెల రోజుల్లో ఆయన రానే వచ్చారు. అంతే కాదు ఆయనే నన్ను వెతుక్కుంటూ హైదరాబాదులో నేనుండే చోటుకే (అమీరుపేట) వచ్చారు. అప్పుడే అన్ని విషయాలూ నాతో చర్చించారు. అప్పుడాయన విస్కాన్సిన్ విశ్వవిద్యాలయం (మేడిసన్) లో భారతీయ భాషల శాఖాధిపతిగా ఉన్నారు. అక్కడి

శాఖాధిపతులకు తమకు అవసరమైన వారిని ఎన్నుకునే అధికారం ఉంది. అట్లా నన్ను తనకు అసిస్టెంటుగా ఎన్నుకొన్నారు. ఆయన చేసిన సాయం మరువరానిది. ఆయన నన్ను మద్రాసు తీసుకెళ్లి అమెరికన్ కాన్సలేట్ కార్యాలయంలో వారికి నేను ఇతన్ని అమెరికా తీసుకెళ్తున్నాను, ఇతనికి వీసా ఇవ్వండి అన్నారు. ఒక గంట సేపు లైబ్రరీలో కూర్చోబెట్టి వీసా ఇచ్చారు. అదొక అనుభవం! ఇప్పుడు వీసా కోసం కొన్ని రోజులు వేచి ఉండాలి. కొన్ని గంటలు వరసలో నుంచోవాలి.

ఇక్కడ కొంచెం వెనక్కి వెళ్లి భద్రిరాజు కృష్ణమూర్తి గారు పరిచయమైన పద్ధతి కూడా చెప్పవలసి ఉంది.

ఒకసారి 1959లో అనుకుంటా నాయని కృష్ణకుమారి గారు ఒక Summer school of Linguistics కి హాజరయి తిరిగివచ్చారు. అప్పుడే భద్రిరాజు కృష్ణమూర్తి గారు కూడా హైదరాబాదు వచ్చారు. అప్పుడాయన ఆమెను అడిగారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వృత్తి పద కోశాల నిర్మాణానికి ప్రణాళిక వేసింది, భాష మీద అభిమానం ఉన్నవాడు, డబ్బుకోసం కాకుండా పని మీద ఆసక్తి ఉన్నవాడు, పెళ్లి కాని వాడు ఒక వర్కర్ కావాలని. అప్పుడామె సరిగ్గా మీకు పనికొచ్చేవాడు నా దగ్గరున్నాడు. హైదరాబాదులో కలుసుకోండి అని చెప్పారు. ఆయన హైదరాబాదులో వారి ఇంటికి వచ్చారు. నేను కలుసుకున్నాను. ఇక్కడో చిన్న విషయం అంత ప్రధానం కాక పోయినా చెప్పవలసి ఉంది. కృష్ణమూర్తిగారు వచ్చినప్పుడు ఆషామాషీగా ఏవో విషయాలు మాట్లాడుకున్నాం. ఆ సంభాషణలో అబ్బూరి రామకృష్ణ రావు గారి ప్రస్తావన వచ్చింది. ఆయన్ను గురించి మాట్లాడుతూ భద్రిరాజు కృష్ణమూర్తి గారు ఆయన పద్యమొకటి ఎత్తుకున్నారు. మధ్యలో మర్చిపోతే నేనే గుర్తు చేశాను. అది ఆయన్ను చాలా impress చేసింది. అబ్బూరి వారు ఆయనకు గురుతుల్యులు. ఇట్లా ఎన్నో విధాల నేను భద్రిరాజు కృష్ణమూర్తి గారికి సన్నిహితుణ్ణి అయ్యాను. ఆ సాన్నిహిత్యం ఇంత కాలంగా కొనసాగటం నా అదృష్టం. ఇక ముందు కూడా కొన సాగుతుందనటంలో నా అభ్యంతరం లేదు.

నా జీవితంలో నేను సాధించిన వాటికి ఎన్నో కారణాలు వున్నా, ఎంతో మంది సహకారం ఉన్నా ప్రధానంగా ముగ్గురు కారణభూతులు. వారిలో క్రమంగా నాయని కృష్ణకుమారిగారు, భద్రి రాజుకృష్ణమూర్తి గారు,జెరల్డ్ ముఖ్యులు. కృష్ణ కుమారి గారు భద్రిరాజు గారికి పరిచయం చేశారు. ఆయన నన్ను జెరల్డ్ కెలీగారికి పరిచయం చేశారు. ఇవన్నీ సకాలంలో జరగటం వల్ల నా విద్యార్జనావకాశాలు పెరిగాయి. నేను భాషా శాస్త్ర పరిశోధకుణ్నికావటానికి తోడ్పడ్డాయి.

కెలీగారు తన శిష్యుల్ని బాగా ప్రేమించే వారు. ఆయన విస్కాన్సిన్ యూనివర్సిటీలో ఉండగా నేను అమెరికా వెళ్లాను. మేడిసన్ నగరంలో నేను దిగగానే నన్ను విమానాశ్రయం నుంచి ఇంటికి తీసుకెళ్లి కాఫీ చేసిచ్చి అక్కడే పని చేస్తున్న కొత్తపల్లి వీరభద్రరావుగారికి ఫోనుచేసి చెప్పారు. అది 1962 జనవరి 24. అంతకు ముందు రోజే ఆయన భార్య ప్రసవించింది. నాకు ఏర్పాటు చేసిన తరవాత ఆసుపత్రికి పరుగెత్తి వెళ్లారు. అప్పుడు వీరభద్రరావుగారు నన్ను తన నివాసానికి తీసుకెళ్లి తరవాత నాకూ ఒక నివాసాన్ని చూసి పెట్టారు.

కెలీగారి దగ్గర పరిశోధక విద్యార్థిగా చేసేవారు తమ మార్గదర్శకుడు చెప్పిన కోర్సులు తీసుకొని వాటిల్లో ఉత్తీర్ణులు కావాలి. దాని వల్ల చాలా నిష్ణాతులైన పండితుల దగ్గర చదువుకునే అవకాశం కలిగింది. Martin joos, Morris Heffner, valdis zeps వంటి విద్వాంసుల దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకోగలిగాను. చివరి విద్వాంసుడు ఏవేవో తెలియని భాషల నుంచి ఏవేవో పదాలు బోర్డుమీద రాసి సూత్రీకరణ చెయ్యమనేవాడు. తెలియని భాషల నుంచి పదాలు సేకరించి వ్యాకరించటం ఆయన దగ్గరి నుంచే నేర్చుకున్నాను. ఆయన కోర్సు కోసమే తొలిసారిగా తెలుగు బహువచనాల పరిశీలన ప్రారంభించాను. ఆ వ్యాస విషయాన్ని అప్పుడు అక్కడే ఉన్న ప్రొఫెసర్ జి.ఎన్.రెడ్డి గారు సూచించారు. ఆ తరవాత దానిని విస్తరించి తెలుగులో భారతిలో ప్రచురించాను. సూత్ర రచనకూడాValdis zeps నేర్పిందే.

ఆ తరవాత ఒక రోజు 1963 సంవత్సరంలో కెలీగారు నన్ను పిల్చి "I am going to Cornell University" అన్నారు. అక్కడాయనకు ఆచార్య పదవి లభించింది. నేను బిక్క మొహం వేసుకొని what happens to me? అన్నాను. అప్పుడాయన You are also going with me. you will get more money and you can bring your wife there అన్నాడు. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే తనకేదో ఉద్యోగం దొరికిందని చెప్పి ఊరుకోక నా కోసం కూడా ప్రయత్నించటం, అది నేనడక్కుండానే చెయ్యటం చాలా ఆశ్చర్యం కలిగించే విషయాలు.

ఆ తరవాత నేను కార్నెల్ విశ్వవిద్యాలయంలో చేరి అక్కడే భాషాశాస్త్రంలో ఎం.ఏ.,పిహెచ్.డి.లు చేశాను. అక్కడ మహా శాస్త్రజ్ఞులు నాకు పాఠాలు చెప్పటం నా అదృష్టం. ముఖ్యంగా Charles Hockett, Gordon Fairbanks అనేవారు మహా నిష్ణాతులైన పండితులు. Hockett ఎక్కడెక్కడివో ఇతర భాషా పదాలు తెచ్చి మా చేత

సూత్రాలు రాయించారు. సూత్రరచనాపద్ధతులు ఆయన దగ్గరి నుంచి చాలా నేర్చుకున్నాను. అట్లా field methods అనే కోర్సులో ఏవేవో భాషల వారి నుంచి విషయ సేకరణ చేయించేవారు. ఇక Fairbanks చారిత్రక భాషా శాస్త్రంలో గొప్ప విద్వాంసుడు.

నాకిప్పటికీ ఒక విషయం గుర్తు. కెలీగారితో ఒకసారి అన్నాను "నేను పరిశోధన చేస్తున్నది వర్ణనాత్మక భాషా శాస్త్రంలోకదా చారిత్రక వ్యాకరణంలో కోర్సులెందుకు?" అని. అందుకాయన నన్ను మందలిస్తూ ఏ భాషా శాస్త్రంలో పరిశోధన చేసినా Fairbanks ఇచ్చే కోర్సులు తీసుకోవాల్సిందే అని హెచ్చరించారు.

నేను మొదట Generative phonology మీద సిద్ధాంతవ్యాసం రాద్దామనుకొని సిద్ధాంత వ్యాసానికి సంబంధించిన విషయ సేకరణ చేసి దాదాపు పూర్తి చేశాను. అప్పుడు కెలీగారు ఏదో ప్రాజెక్టు మీద హైదరాబాదు వచ్చారు. హైదరాబాదులో ఆయన్ని కలుసుకొని నేను రాసింది చూపించాను. సరేనన్నారు కూడా. నేను ఇక్కడికి వచ్చేముందు భద్రిరాజు కృష్ణమూర్తి గారిని కూడా నా కమిటీ మెంబరుగా ఎన్నుకొని వచ్చాను. తెల్లారి జరిగిన మీటింగులో అనుకున్నదంతా తారుమారు అయింది. కృష్ణమూర్తిగారు "ఫోనాలజీ మీద చాలామంది చేశారు. తెలుగు వాక్యనిర్మాణం మీద ఎవరూ చేయలేదు. రామారావు చేస్తే బాగుంటుంది" అన్నారు. కెలీగారు కూడా yes yes krishna! you are right. He should work on syntax అన్నారు. నిజానికి నేను వాక్య నిర్మాణం మీదనే చేద్దామనుకున్నా కాని salterelli అనే ఆయన ప్రభావం వల్ల ఫోనాలజీలోకి ప్రవేశించాను. కృష్ణమూర్తి గారు ఆ విధంగా నన్ను వాక్య నిర్మాణం లోకి దించారు. ఇందువల్ల నాకు లాభమే జరిగింది.

ఆధునిక భాషా శాస్త్రపద్ధతిలో తెలుగు వాక్య నిర్మాణం మీద తొలి పరిశోధన చేసిన గౌరవం నాకే దక్కింది. అప్పటికి Robert Leas అనే ఆయనThe grammar of English Nominalization అని "పరివర్తన సిద్ధాంత" (Transformational Theory) నేపథ్యంలో ఒక సిద్ధాంత వ్యాసం అచ్చేశాడు (1960). A Transformational study of Telugu Nominals అనే సిద్ధాంత వ్యాసాన్ని 1968 లో Cornell University కి సమర్పించాను. ఆ తరవాత కొన్ని మార్పులతో చేర్పులతో 1968 మే నుంచి 1970 వరకు భారతి తెలుగు మాసపత్రికలో ప్రచురించాను. ఈ వ్యాసాలు తెలుగులో వెలుగులు (1982, 2003) అనే సంపుటంలో ఉన్నాయి, సిద్ధాంత వ్యాసంతో మొదలు పెట్టి తరవాత ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ తెలుగు వాక్య నిర్మాణం మీద రాసిన వ్యాసాలున్నాయి. అవి నా ప్రచురణలలో వేరు వేరు సంపుటాలుగా వచ్చాయి. ఆ తరువాత 1975లో

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ తెలుగు వాక్యం ప్రచురించింది. ఆ తరవాత దాన్ని విస్తరించి 1999 లోనూ, ఇంకా విస్తరించి 2002లోనూ ప్రచురించాను. ఈ పుస్తకం M.A. తెలుగుకు, కేంద్రంలో సివిల్ సర్వీసు పరీక్షలకు, రాష్ట్రంలో గ్రూప్ 1 పరీక్షలకు పాఠ్య గ్రంథంగా ఉపయోగిస్తున్నారు. ఇవి కాక, భాషానువర్తనం(2000), భాషాంతరంగం(2001), భాషా పరివేషం(2003) అని క్రమంగా ప్రకటించాను.ఇవన్నీ నేను చేసిన భాషా పరిశోధనకు నిదర్శనాలు.

భాషా సాహిత్యాల శాస్త్రాన్ని సాహిత్యానికి అన్వయిస్తూ చేసిన పరిశోధనకూడా కొంత ఉంది. ముఖ్యంగా ఆధునిక కవుల ఖండికలను వివరిస్తూ అందులో భాషా లక్షణాలను వివరించాను.

వీటి అన్నిటికీ నాకు ఆంధ్రజ్యోతి దిన పత్రిక అవకాశం కల్పించింది. అప్పుడు హైదరాబాదులో ఆంధ్ర జ్యోతికి సంపాదకుడుగా ఉన్న దేవి ప్రియ ప్రతి ఆదివారం ఒక కాలమ్ రాయ వలసిందిగా కోరాడు. 1986 అక్టోబరు మొదటి ఆదివారం ప్రారంభించాను. 1988 ఫిబ్రవరి నుంచి 1988 సెప్టెంబరు వరకు ఒక ఆరు నెలలు మానేసినా ఆ తరవాత 1994 వరకూ కొనసాగించాను.


ఈ కాలమ్‌కు దేవిప్రియ 'చేరాతలు' అని పేరు పెట్టాడు. ఆ పేరు నాకు చాలా ఉపకరించింది. ఆపేరు కాలమ్‌ను నియతం చేసేదిగా కాక ఏది రాసినా చెల్లేదిగా ఉంది. దానితో నాకు స్వేచ్ఛ ఎక్కువయింది, అన్ని రకాలుగా విస్తరించటానికి వీలుకలిగింది. భాషమీద, సాహిత్యంమీద, ఇంకా అనేక వ్యక్తిగత విషయాల మీద, అనుభవాల మీద రాశాను. మధ్యలో ఒకసారి అమెరికా వెళ్లినప్పుడు, నా వ్యక్తిగత పరిచయాలపై అనుభవాలపై నేను అక్కడ కలుసుకొన్న వాళ్లపై రాశాను. ఇట్లాంటివి చాలా వరకు స్మృతికిణాంకం (2000)లో వచ్చాయి. దీనికి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు 2002 లో వచ్చింది (2003 February 18). ఢిల్లీలో ఎవరో అడగనే అడిగారు. "ఇంతకన్నా ఎక్కువ సాహిత్య విమర్శ ఉన్న పుస్తకాలున్నాయి కదా! దీనికిచ్చారేమిటి?" అని (సాహిత్య వ్యాసరింఛోళి 2001 లో అచ్చు అయింది). అదేం విశేషమో గాని వ్యక్తిగత స్పర్శతో రాసినవి ఎక్కువ మందిని ఆకర్షించినట్లున్నాయి.

రెండు ప్రపంచ యుద్ధాల మధ్య రష్యాలోRoman Jacobson నాయకత్వాన రూపవాదం ప్రబలింది. వారిని రష్యన్ ఫార్మలిస్టులు అంటారు. దీన్ని గురించి పుస్తకాలు చదివాను. నన్ను అది ఆకర్షించింది. వాళ్లు భాషా శాస్త్రాన్ని సాహిత్యానికి అన్వయించారు.

ఆ పద్ధతిలో నేను భాషా శాస్త్రాన్ని సాహిత్యానికి అన్వయిస్తూ చాలా వ్యాసాలు రాశాను. ముఖ్యంగా ఆధునిక కవులలో భాషాంశాలను వివరిస్తూ రాశాను. కొత్త కవులను పరిచయం చేస్తున్నప్పుడు కూడా ఆ పని చేశాను.

ఉద్దండ పండితుల దగ్గర సాహిత్యం, భాషా శాస్త్రం, వ్యాకరణం చదువుకోటం వల్ల నా పరిశోధనకు చాలా ఉపయోగించింది. ఆయా రంగాలను మేళవించటానికి అవకాశం దొరికింది. మద్రాసు, కేరళ, పంజాబు రాష్టాలకు, నేపాల్, అమెరికా వంటి దేశాలకు వెళ్ల గలిగాను. అక్కడ సాహితీ వేత్తలను కలుసుకో గలిగాను. ఇది కూడా నా పరిశోధనలో వైవిధ్యానికి ఉపకరించింది.

ఇప్పటివరకు నేను చేసిన పరిశోధన నాకు సంతృప్తినిచ్చినమాట నిజమే. కాని ఇంకా నేను చెయ్యవలసినవి కొన్ని ఉన్నాయి. బాల, ప్రౌఢ వ్యాకరణాలను ఇంగ్లీషులో అనువదించి సూత్రవివరణ చెయ్యాలని ఒక కోరిక చాలా కాలంగా ఉంది. ఆయా వ్యాకరణాలపై కొన్ని ఇంగ్లీషు వ్యాసాలు రాశాను. తెలుగు వచనరచనలో భేదాలను పేర్కొంటూ కొన్ని వ్యాసాలు రాశాను. ఇవన్నీ నేను చెయ్యగలనా? అని అనుమానం. జీవితం ఆ అవకాశం ఇస్తుందా అని నా భయం.



ఆచార్య రవ్వా శ్రీహరి

నేను స్వభాను నామ సంవత్సర భాద్రపద శుద్ధ అష్టమి మంగళవారం (తేది7-9-1943) నాడు నల్లగొండ జిల్లా రామన్నపేట తాలూకాకు చెందిన 'మునిపంపుల' గ్రామంలో జన్మించినాను. మునిపంపుల మా అమ్మమ్మగారి ఊరు. మా స్వంత గ్రామం వెల్వర్తి. నా తల్లిదండ్రులు రవ్వా వెంకట నరసమ్మ, రవ్వా నర్సయ్య, గారలు. మాది సామాన్య చేనేత కుటుంబం. మా కుటుంబంలో పెద్దగా చదువుకున్న వాళ్లు లేరనే చెప్పాలి. మా నాయనగారు మాత్రం వీధిబడిలో సామాన్య వ్యవహారానికి ఉపయోగపడే మామూలు చదువు మాత్రమే చదువుకున్నవారు.

ఆ రోజుల్లో మా ఊళ్లో తమ పిల్లలకు చదువు చెప్పించాలన్న స్పృహ ఉన్న తలిదండ్రులు చాలా తక్కువ. కనుక మా ఊళ్లో విద్యా వాతావరణం శూన్యమే అని చెప్పాలి. అందువల్ల నన్ను మా మాతామహుల గ్రామమైన మునిపంపుల గ్రామంలోని పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం కోసం చేర్పించినారు. ఆ ఊళ్లోనే నా ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్నాను. నా మాతామహులు మిర్యాల కనకయ్యగారు ఆయుర్వేద వైద్యులు. చుట్టు ముట్టు గ్రామాల్లో సంపన్నుల యిండ్లలో వైద్యం చేస్తూ మంచిపేరు గడించుకున్నారు. క్రమశిక్షణకు మారుపేరు. ఇక మా అమ్మమ్మ రత్నమ్మగారు. మంచి గృహిణి. వాత్సల్యమూర్తి. వీరిద్దరి పోషణలో నా బాల్యం గడవడం నా ఉత్తర జీవితానికి ఎంతో మేలు చేసింది.

1952లో ప్రాథమిక విద్య-అంటే నాల్గవ తరగతి- అయ్యింది. ఆ రోజుల్లో ఇప్పటి మాదిరిగా ఊరూరా ఉన్నత పాఠశాలలు లేవు. మా జిల్లాలో అప్పుడు మూడే మూడు

ఉన్నత పాఠశాలలుండేవి. ఒకటి నల్లగొండలో. రెండోది సూర్యాపేటలో. మూడోది భువనగిరిలో. ఈ మూడింటిలో ఎక్కడో ఒకచోట నేను ఐదవ తరగతిలో చేరాలి. కాని మా ఆర్థిక పరిస్థి అంత బాగా లేనందువల్ల మా నాయనగారు నన్ను చదివించడానికి ముందుకు రాలేదు. మా తాత, మా అమ్మ గారల ప్రోత్సాహంతో ఎట్లాగో భువనగిరి ఊళ్లో ఉన్న పాఠశాలలో ఐదవతరగతిలో చేర్చినారు. ఒక సంవత్సరం అక్కడ చదివి 1953లో ఐదవ తరగతి పూర్తిచేసుకున్నాను.

అదే సంవత్సరం ఎండకాలం సెలవుల్లో మా ఊరికి వచ్చినాను. ఆ సెలవుల్లో ఒక దుర్ఘటన జరిగింది. మా అమ్మగారు ప్రసవించి సూతికారోగంతో దివంగతురాలైంది. అప్పటికి నాకు పదకొండేండ్లు. నాకో తమ్ముడూ, చెల్లెలూ ఉన్నారు. మా అమ్మగారి మరణంతో మా కుటుంబం కకావికలై పోయింది. కుటుంబ ఆర్థికపరిస్థితి కూడా మరీ దిగజారడంతో మా నాయనగారు చదువు ఆపేయమన్నారు. నాకెటూ తోచలేదు.

మా అమ్మమ్మ గారింట్లో ఉండగా ఒకరోజు పత్రికలో శ్రీ యాదగిరి లక్ష్మీ నృసింహస్వామి సంస్కృత విద్యాపీఠం వారి ప్రకటన ఒకటి వచ్చింది. ఆ విద్యా పీఠంలో చేరి సంస్కృతం నేర్చుకోదలచుకున్న విద్యార్థులకు ఉచిత భోజన సౌకర్యం ఉంటుందనీ, ఫీజు లేవీ ఉండవనీ, ఐదేండ్లు చదివితే ఉస్మానియా విశ్వవిద్యాలయం వారి ఎంట్రెన్స్ పరీక్షకు అర్హులనీ ఆ ప్రకటన సారాంశం. నాతో పాటు చదువుకున్న 'రామరాజు' అనే విద్యార్థి కూడా ఈ ప్రకటన చూచి ఇద్దరం వెళ్లి ఆ పాఠశాలలో చేరదామని నన్ను ప్రోత్సహించినాడు. మా ఊళ్లో కూడా ముగ్గురు నలుగురు సిద్ధమైనారు.

వాస్తవంగా ఆ వయస్సులో నాకు సంస్కృతం అంటే ఏమిటోకాని, అది చదివితే ఏం లాభమో కానీ తెలియదు. నాకే కాదు మా కుటుంబంలోని వారికి ఎవరికీ తెలియదు. ఉచిత భోజన సౌకర్యం, ఫీజులేవీ లేకపోవడం, అసలే చదువు లేకుండా ఇంట్లో ఉంటూ మా నాయనగారికి చేనేతలో సహాయపడటం ఇష్టం లేకపోవడం - ఇవన్నీ సంస్కృత పాఠశాలలో చేరడానికి దోహదకారులైనాయని చెప్పాలి. మొత్తంమీద ఒక రోజు రామరాజు మొ॥ మిత్రులం ఐదుగురం కలిసి యాదగిరిగుట్టకు బయలు దేరినాం. కప్పగంతుల లక్ష్మణశాస్త్రి గారు విద్యాపీఠం విద్యాధికారులు. వారే మాకు ప్రవేశం ఇవ్వాలి. ఒక రోజు లక్ష్మణశాస్త్రి గారు హైదరాబాదు నుండి యాదగిరికి వచ్చి కొత్తగా చేరదలచుకున్న విద్యార్థులందరినీ పరీక్షించి ప్రవేశానికి అర్హులైనవారి జాబితాను హైదరాబాదుకు వెళ్లి పంపిస్తానని చెప్పి వెళ్లినారు. ఐదారు రోజుల్లో ప్రవేశానికి ఎన్నుకోబడ్డ అభ్యర్థుల జాబితా రానే వచ్చింది. కాని ఆ జాబితాలో మా ఐదుగురి పేర్లూ లేవు. ప్రవేశం లభించనందుకు

బాధ కలిగింది. ఏం చేయాలో ఎటూ తోచలేదు. అందరం కలిసి హైదరాబాదుకు వచ్చి విద్యాపీఠం కమిటీ సభ్యులు సురవరం ప్రతాపరెడ్డిగారు, మందుముల నరసింగరావుగారు, లక్ష్మణశాస్త్రి గారు – వీరందరినీ కలిసి మాకు ప్రవేశమిప్పించ వలసిందిగా కోరినాము. చివరికి వారు మమ్మల్ని చేర్చుకోవడానికి సుముఖత వ్యక్తం చేసినారు. మూడునెలల పరీక్షలో ఉత్తీర్ణత సాధించని పక్షంలో ప్రవేశం రద్దవుతుందనీ, తిరిగి ఇంటికి పోవలసి వస్తుందని చెప్పి ఒక షరతుతో లక్ష్మణశాస్త్రి గారు మాకు ప్రవేశం ఇచ్చినారు. ఆ షరతుకు మేమంతా అంగీకరించి సంస్కృతవిద్యాపీఠంలో ప్రవేశం పొందినాం. ఈ సందర్భంలో ఒక విషయం చెప్పాలి. మేము ప్రవేశంకోసం హైదరాబాదుకు వచ్చినప్పుడు ఒక రోజు రాత్రి ఇక్కడే ఉండాల్సి వచ్చింది. మాకెవరూ తెలిసినవారు లేరు. చిన్నవాళ్లం కూడా. అప్పుడు సురవరం ప్రతాపరెడ్డి గారు ఆ రాత్రి తమ యింట్లోనే పడుకోవడానికి ఆశ్రయమిచ్చి ఆదరించినారు. వారి ఆదరణను నేనెన్నడూ మరవలేను.

విద్యాపీఠంలో మొత్తం ఇరవై ఐదుమంది విద్యార్థులు. రెండు తరగతులుండేవి. విద్యార్థులందరూ లుంగీలు, ఉత్తరీయాలు ధరించి, నామాలు, భస్మరేఖలు పెట్టుకొని తరగతికి వచ్చేవాళ్లు. అందరూ ఆచార్యుణ్ణి శాస్త్రిగారూ, శాస్త్రిగారూ అని సంబోధిస్తుండేవారు. వాతావరణమంతా మొదట విలక్షణంగా ఉండేది. కొంతకాలానికి ఎట్లో సర్దుకు పోయినాను. ఉదయం ఐదింటికి లేచి స్నానాలు ముగించుకొని ఏడింటికే తరగతులకు వెళ్లేవాళ్లం. మధ్యాహ్నం పన్నెండింటి వరకే తరగతులు. మధ్యన గంట విరామం ఉండేది.

యాదగిరి విద్యాపీఠంలో నాకు మొట్ట మొదటి గురువు శ్రీ కేరళ సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. మైలాపూరు సంస్కృత కళాశాలలో శిరోమణి పట్టభద్రులు. గట్టి సాహిత్య విద్వాంసులు. వారివద్ద 'రామ' శబ్దంతో సంస్కృత విద్యను ప్రారంభించినాను. శబ్దాలతో పాటు ధాతువులు, అమరకోశం కూడా ప్రారంభించినారు. ప్రధానంగా వీటిని కంఠస్థం చేసి అప్పగించడమే మా పని. మూడు నెలల పరీక్షలో ఉత్తీర్ణత పొందకపోతే ప్రవేశం రద్దై ఇంటికి పోవాల్సివస్తుందనే భయంతో గురువుగారు చెప్పిన శబ్దాలు, ధాతువులు, అమర కోశం బాగా కంఠస్థం చేసి అప్పజెప్పేవాణ్ణి. అంతేకాని అవి ఎందుకు చదువుతున్నానో, వాటి ప్రయోజనం ఏమిటో తెలిసేది కాదు. మా తరగతిలో నేను ప్రథమస్థానంలో ఉండేవాణ్ణి. మూడు నెలల పరీక్షలు రానే వచ్చినాయి. లక్ష్మణశాస్త్రిగారు పరీక్షకులు. రాతపరీక్షలు లేవు. మౌఖిక పరీక్షలే. ఒక్కొక్క విద్యార్థిని పరీక్షించేవారు. మూడు నెలల పరీక్షలో వారడిగిన శబ్దాలు, ధాతువులు, అమరకోశ శ్లోకాలు ఏమాత్రం

తడుముకోకుండా నిర్దుష్టమైన ఉచ్చారణతో చెప్పినాను. శాస్త్రి గారు నన్నెంతో మెచ్చుకున్నారు. మూడు నెలల పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ప్రవేశం రద్దు కాకుండా చూసుకున్నాను. ఇక నాతో వచ్చిన మా వూరి విద్యార్థులు మాత్రం సరిగా సమాధానాలు చెప్పలేకపోవడంవల్ల ప్రవేశాన్ని రద్దుచేసి వారిని ఇంటికి పంపించినారు. వాళ్లల్లో నేనొక్కణ్ణే మిగిలినాను.

ఒక సంవత్సరం అయ్యేసరికి శబ్దాలు, ధాతువులు అమరకోశంలో రెండు కాండలు, రఘువంశంలో కొన్ని శ్లోకాలు నేర్చుకున్నాను. ఆధునిక పద్ధతుల్లో కాక సంప్రదాయ పద్ధతిలో చదువు సాగుతుండడం వల్ల నా సంస్కృత విద్యాభ్యాసానికి గట్టి పునాది ఏర్పడింది. ఆధునికులు కంఠస్థంచేసే పద్ధతిని హర్షించరు. కాని సంస్కృత విద్యకు అది అవసరమనే విషయం నిర్వివాదాంశం. ఈ విధంగా నాలుగు సంవత్సరాలు శ్రీ లక్ష్మీ నృసింహస్వామి అనుగ్రహంతో రఘువంశం, కుమార సంభవం, కిరాతార్జునీయం, మేఘసందేశం, మాఘకావ్యం, చంపూరామాయణం, దశకుమారచరితం, స్వప్నవాసవదత్తం, వేణీ సంహారం మొదలైన కావ్యనాటకాదులను క్షుణ్ణంగా చదువుకున్నాను. లఘుకౌముది, ప్రతాపరుద్రీయం, తర్క సంగ్రహం, మీమాంసా పరిభాషా మొ॥ శాస్త్ర గ్రంథాల్లో కొన్ని కొన్ని భాగాలను కూడా చదువుకున్నాను.

యాదగిరి దేవస్థానంవారు ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలు జరిపేవారు. ఆ సందర్భంగా విద్వాంసులచేత ఉపన్యాసాలను, సంగీత కార్యక్రమాలను, నిర్వహించేవారు. గొప్ప గొప్ప పండితులక్కడికి వచ్చేవారు. సంస్కృత పండితుల కెవరైనా సంస్కృత విద్యార్థులు కనిపిస్తే వారిని ఏవైనా ప్రశ్నలడగటం పరిపాటి. ఉత్సవాల సందర్భంలో, ఇతర సందర్భాలలో అక్కడికి వచ్చిన పండితులు నన్ను ఎన్నో ప్రశ్నలు వేస్తుండేవారు. నా సమాధానాలు విని సంతోషపడి నన్నెంతో మెచ్చుకునేవారు. ఉత్సవాల సందర్భంలో మేం సంస్కృత నాటకాలు కూడా ప్రదర్శించే వాళ్లం. చిన్న చిన్న వాక్యార్థాల్లో కూడా పాల్గొనేవాళ్లం. ఈ విధంగా నేర్చుకున్నది సభలో ప్రదర్శించే అవకాశం కూడా కలిగి సభాభయం తొలగిపోయింది. లంకా సీతారామశాస్త్రి గారి వంటి పండితుల పరిచయం అక్కడే కలిగింది.

యాదగిరి విద్యాపీఠంలో నాలుగు సంవత్సరాలు చదివి తరువాత కారణాంతరాల వల్ల సికింద్రాబాద్‌లోని మున్నాలాల్ సంస్కృత కళాశాలలో చేరినాను (1956). అక్కడ యాదగిరిలో మాకు అధ్యాపకులుగా ఉన్న కేరళ సుబ్రహ్మణ్య శాస్త్రి, శాస్త్రుల విశ్వనాథ శాస్త్రి, రామస్వామి శాస్త్రి ఘనాపాఠీలు ఆచార్యులుగా ఉండేవారు. వీరి వద్ద లఘుసిద్ధాంత

కౌముది, ప్రతాపరుద్రీయం, ఇతర కావ్య నాటకాలు చదువుకొని 1958లో ఎంట్రెన్స్ పరీక్ష రాసి అందులో ఉత్తీర్ణుణ్ణైనాను. పట్టుదలతో చదవడం వల్ల మంచి విద్యార్థిగా నాకు పేరు వచ్చింది.

మున్నాలాల్ సంస్కృత కళాశాలలో చదువుతుండగానే నాకు అనుకోకుండా ఇద్దరి వ్యక్తులతో పరిచయమైంది. వారు శ్రీ లక్ష్మణమూర్తి గారు, శ్రీ భాగవతం రామారావుగారు. లక్ష్మణమూర్తిగారు తరువాత కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆంగ్ల శాఖలో ఆచార్యులుగా, డీన్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించినారు. భాగవతం రామారావుగారు Dept of History of medicine లో పరిశోధకులుగా, Director గా చేసి విశ్రాంతులైనారు. ఆ తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత శాఖకు అధ్యక్షురాలుగా ఉండి విశ్రాంతురాలైన ఆచార్య కమల గారితో పరిచయ మేర్పడింది. ఈ ముగ్గురి స్నేహం విద్యావిషయకంగా నేనెదగడానికి ఎంతో దోహదం చేసింది. శ్రీ లక్ష్మణమూర్తిగారి వద్ద ఆంగ్లమూ, రామారావుగారి వద్ద అప్పకవీయమూ చదువుకున్నాను.

ఎంట్రెన్స్ తరువాత సీతారాంబాగ్ సంస్కృత కళాశాలగా పేరొందిన వేదాంత వర్ధినీ సంస్కృత కళాశాలలో డి.ఓ.ఎల్ (సాహిత్యం) ప్రథమ సంవత్సరంలో చేరినాను (1958). అప్పుడు కళాశాల అల్వాల్‌లోని కిషన్‌ప్రసాద్ దేవిడీలో ఉండేది. తెలంగాణాలో సంస్కృతం కానీ, సంస్కృతంలోని శాస్త్రాలు కానీ ఈనాడు నిలిచి ఉన్నాయంటే ప్రధాన కారణం ఈ కళాశాలే అని చెప్పాలి. వందలకొద్ది సంస్కృత విద్యార్థు లీ కళాశాలలో చదివి పండితులై ఉన్నత స్థానాలను అలంకరించినారు. ఈ కళాశాలను స్థాపించి దానికోసం అహరహం శ్రమించి విద్యార్థులను కన్నబిడ్డల్లాగా చూచుకుంటూ సంస్కృతా ధ్యయనాన్నీ, శాస్త్రాధ్యయనాన్నీ నిరాఘాటంగా కొనసాగింపజేసినవారు ప్రాతఃస్మరణీయులు నా గురువర్యులు శ్రీమాన్ కోయిల్ కందాళై శఠకోపరామానుజాచార్యులవారు. వీరిని అందరూ 'స్వామివారు' అని వ్యవహరించేవారు. వీరే ఈ కళాశాలకు ప్రిన్సిపాల్ కూడా. తర్క వ్యాకరణ, విశిష్టాద్వైతవేదాంత శాస్త్రాల్లో అగాధమైన పాండిత్యం వారిది. వీరితో పాటు ఆ కళాశాలలో శ్రీ ఖండవల్లి నరసింహశాస్త్రిగారు (వీరి జన్మస్థలం పాలమూరు జిల్లాలోని వట్టెం కనుక వీరిని వట్టెం శాస్త్రులు అనేవారు), శ్రీమాన్ అమరవాది కృష్ణమాచార్యులు, శ్రీమాన్ మరింగంటి శ్రీరంగాచార్యులు, శ్రీమాన్ వేదాల తిరువేంగళాచార్యులు మొదలైన దిగ్దంతుల్లాంటి పండితులు ఆచార్యులుగా ఉండేవారు. వీరిలో ఖండవల్లి వారూ, అమరవాదివారూ వ్యాకరణ విద్వాంసులు. మరింగంటివారు, వంగీపురం వారు తర్కవిద్వాంసులు. వేదాలవారు సాహిత్య, తర్క, వేదాంత శాస్త్రాలలో పారదృశ్యులు. వీరందరి వద్ద శిష్యరికం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

డి.ఓ.ఎల్. లో మొదట సాహిత్యాన్నే ప్రధానాంశంగా ఎన్నుకున్నాను. కాని వ్యాకరణంపైన నాకున్న అభిమానం, ప్రవేశం కారణంగా మా గురువులు శ్రీమాన్ అమరవాది కృష్ణమాచార్యులవారు నన్ను వ్యాకరణం ప్రధానాంశంగా తీసుకొమ్మని ప్రోత్సహించినారు. డి.ఓ.ఎల్. లో వ్యాకరణం ప్రధానాంశంగా తీసుకోవాలంటే ఎంట్రెన్స్‌లో వ్యాకరణం ప్రధానాంశంగా తీసుకుని ఉండాలి, కాని నాకు మినహాయింపు ఇచ్చి వ్యాకరణ డి. ఓ.ఎల్. లో ప్రవేశమిచ్చినారు. వ్యాకరణ ఎంట్రెన్స్‌లో చదువుకొని ఉండాల్సిన సిద్ధాంత కౌముదిలో చాలా భాగాలను నేనే స్వయంగా చదువుకున్నాను. ప్రౌఢ మనోరమ, పరమ లఘుమంజూష, సిద్ధాంత కౌముదిలోని కొన్ని ప్రకరణాలు, ముక్తావళి, మీమాంసాన్యాయ ప్రకాశం మొదలైన గ్రంథాలను డి.ఓ.ఎల్. లో అధ్యయనం చేసినాను. ఇప్పటిలాగా ఒక్కోగ్రంథంలో ఒకటి రెండు ప్రకరణాలు కాక గ్రంథం మొత్తం పాఠ్యాంశంగా ఉండేది. నాకు మొదటినుండీ వ్యాకరణ శాస్త్రమంటే ఎంతో అభిమానం. నా వ్యాకరణగురువులు శ్రీమాన్ శఠకోప రామానుజాచార్యులు, శ్రీ ఖండవల్లి నరసింహశాస్త్రిగారు, శ్రీమాన్ అమరవాది కృష్ణమాచార్యులుగారు. వీరిని నేను మునిత్రయమంటాను. అధ్యయనాధ్యాపనాలు తప్ప మరో వ్యాసంగంలేని నిజమైన గురువులు వీరు. వీరు నన్ను పుత్ర నిర్విశేషంగా చూచుకుంటూ నాపై వాత్సల్యం చూపుతూ ఎంతో ప్రేమతో వ్యాకరణశాస్త్రం చెప్పేవారు. వ్యాకరణానికి ఇద్దరమే విద్యార్థులం. నేనూ, నా సహాధ్యాయుడు శఠకోపాచార్యులు. మేమిద్దరమూ రోజూ 'చింతన' చేసేవాళ్లం. 'చింతన' అనేది ప్రాచీన విద్యావిధానంలో ఒక పారిభాషికపదం, ఒకరోజు గురువు గారి దగ్గర చదివిన పాఠాన్ని అదేరోజు సాయంకాలం పునశ్చరణ చేయడమని అర్థం. ఇలా చింతన చేయకపోతే తెల్లవారి గురువుగారు పాఠం చెప్పేవారు కాదు. ఆవిధంగా శ్రద్ధగా వ్యాకరణశాస్త్రాన్ని అధ్యయనం చేసి 1960లో డి. ఓ. ఎల్. లో ఉత్తీర్ణుణ్ణై బి. ఓ. ఎల్.లో చేరినాను. అక్కడ కూడా ఇద్దరమే విద్యార్థులం. బి.ఓ.ఎల్. లో లఘుశబ్దేందు శేఖరం, మహాభాష్యం, వైయాకరణ భూషణసారం మొ॥ వ్యాకరణశాస్త్ర గ్రంథాలు పాఠ్య గ్రంథాలుగా ఉండేవి. ఇవన్నీ పరీక్షా దృష్టితోకాక విజ్ఞానదృష్టితో అధ్యయనం చేయడం జరిగింది. భాష్యాల్లో పతంజలి రచించిన వ్యాకరణ భాష్యానికే మహాభాష్యమని పేరు. "అల పతంజలి కృతంబైన భాష్యమునకె పరిఢవిల్లును మహా భాష్యపదము' అని తిరుపతి వేంకట కవులు పేర్కొన్నారు. మహాభాష్యాన్ని ప్రదీపోద్యోత వ్యాఖ్యానాలతో చదివే భాగ్యం కలిగినందుకు నేనెంతో గర్వపడుతుంటాను. "మహాభాష్యం వా పాఠయేత్, మహారాజ్యం వా పాలయేత్" అని సూక్తి.

ఆ రోజుల్లో సంస్కృతాన్ని, ప్రత్యేకించి శాస్త్రాలను ఒక వర్గం వారే చదివేవారు. ఇతరులకు శాస్త్రాలు చెప్పేవారు కాదు కూడా. కాని మా గురువు గారు శ్రీమాన్ శఠకోప

రామానుజాచార్యుల వారు ఆ రోజుల్లో అంటే సుమారు 45 ఏండ్లక్రితం నాకు మహాభాష్యం బోధించినారంటే వారి ఔదార్యం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. వారు నాకు మహాభాష్యం చెపుతున్న రోజుల్లో జరిగిన ఒక సంఘటన మనవిచేస్తాను. ఒక గొప్ప వేదపండితుడు -(వారి పేరు చెప్పను)- మా గురువుగారికి ఒక ఉత్తరం రాస్తూ "పూర్వాచారపరాయణులైన మీరు ఒక అబ్రాహ్మణునికి వ్యాకరణ శాస్త్రం చెప్పుతున్నట్లు గానూ, అతణ్ణి మీరు బాగా అభిమానిస్తున్నట్లుగానూ తెలిసింది. ఇది మీకు న్యాయమా" అని నాకు మహాభాష్యం చెప్పడాన్ని ఆక్షేపించినారు. అప్పుడు మా గురువు గారు నేనన్నీ ఆలోచించే అతనికి మహాభాష్యం చెపుతున్నాను. మీ ఆక్షేపానికి నేను సమాధానం రాయాల్సిన అవసరం లేదని వారికి తిరుగు జాబు రాసినారు. దీన్ని బట్టి మా గురువుగారి సామాజిక దృక్పథం, ఔదార్యం అర్థం చేసుకోవచ్చు.

ఆ రోజుల్లో సంస్కృత అధ్యాపకుల ఉద్యోగాలు ఉండేవికావు. కనుక సంస్కృతంలో డిగ్రీలు పొందిన వారంతా పాఠశాలల్లో తెలుగు పండితులుగా ఉద్యోగాల్లో చేరేవారు. తెలుగు పండితులు పదోన్నతులు పొందాలన్నా, ఉద్యోగానికి స్థిరత్వం కలగాలన్నా విధిగా తెలుగుపండిత శిక్షణ పొందాల్సి ఉండేది. తెలుగు పండిత శిక్షణ పొందాలంటే మెట్రిక్యులేషన్ పాసై ఉండాలి. కనుక బి. ఓ. ఎల్. మొదటి సంవత్సరం(1961) లో ఉపాధ్యాయుడు లేకుండానే లెక్కలు, ఆంగ్లం మొదలైన విషయాలు చదువుకొని ఆంధ్రా మెట్రిక్యులేషన్ పరీక్ష రాసి 59% మార్కులతో ఉత్తీర్ణత పొందినాను.

1962 మార్చి పరీక్షల్లో బి.ఓ.ఎల్. (వ్యాకరణం) ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుణ్ణైనాను. అప్పటికి నాకు 19 ఏండ్లు. అప్పుడు మా గురువుగారు ఎక్కడో తెలుగు పండితునిగా చేరితే నీవు వ్యాకరణ శాస్త్రం చదువుకొని ఏం ప్రయోజనం? శాస్త్రరక్షణ ప్రధానం కదా? అని చెప్పి నన్ను తమ వేదాంతవర్ధిని సంస్కృత కళాశాలలో వ్యాకరణ అధ్యాపకునిగా చేరమని ప్రోత్సహించినారు. కాని అప్పటికే కళాశాల ఆర్థిక పరిస్థితి బాగులేనందువల్లా, ఉన్న ఉపాధ్యాయులకే ఏడెనిమిది నెలల నుండి జీతాలు లేక ఇబ్బంది పడుతున్నందువల్లా, వారి ఆజ్ఞను శిరసావహించలేక పోయినాను. జీవితం గడవడానికి వెంటనే ఆదాయం వచ్చే ఉద్యోగం అవసరమైంది. 1962 జులై నెలలో హైదరాబాదులోని వివేకవర్ధిని ఉన్నత పాఠశాలలో జూనియర్ తెలుగు పండితునిగా ఉద్యోగం లభించింది. 80–150 గ్రేడు. విద్యార్హతలు పెంచుకోనిదే పదవిలో ఉన్నతి లభించదు. కనుక మొదట తెలుగు బి.ఓ.ఎల్. ఆ తరువాత బి.ఏ., తెలుగు పండిత శిక్షణ– ఇవన్నీ పూర్తిచేసుకున్నాను.

హైస్కూల్లో తెలుగు పండితునిగా పనిచేస్తున్న రోజుల్లోనే విద్యార్హతలు పెంచుకొని కళాశాలలో లెక్చరర్ కావాలన్న కాంక్ష ఉండేది. కనుక మొదట 1967లో ఎమ్.ఏ.(సంస్కృతం) ప్రైవేటుగా ఇచ్చి అందులో సర్వప్రథముణ్ణిగా ఉత్తీర్ణుణ్ణై ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి Melkote S.Narayan Rao Memorial Gold Medal సంపాదించినాను. M.A. (తెలుగు)లోనూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత పొందినాను. భాషను ఆధునిక భాషాదృష్టితో పరిశీలించాలంటే భాషాశాస్త్రంలో ప్రవేశం అవసరమనే దృష్టితో సాయంకాలపు కోర్సులో చేరి P.G. Dip. in Applied Linguistics లో సర్వప్రథమునిగా ఉత్తీర్ణత సాధించినాను. ఒక్క సంస్కృత బి.ఓ.ఎల్. తప్ప తక్కిన డిగ్రీలన్నీ ప్రైవేటుగా చదివి సంపాదించుకొన్నవే.

విశ్వవిద్యాలయంలో చేరి చదివే అవకాశం కలుగలేదే అనే కొంత బాధ నాకుండేది. ఐతే అన్ని పరీక్షల్లోనూ ప్రథమశ్రేణిని సంపాదించడం నాకు కొంత ఊరట కలిగించింది,.

M.A. సంస్కృతంలో ఉత్తీర్ణుణ్ణైన సంవత్సరంలోనే అంటే 1967లో ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న ప్రాచ్య కళాశాలలో లెక్చరర్ ఉద్యోగం కోసం ప్రకటన వచ్చింది. అప్లై చేసినాను. విశ్వవిద్యాలయంలో చదివిన వాణ్ణి కాదు కనుక నాకక్కడ ఉద్యోగమివ్వమని చెప్పే ప్రొఫెసర్లు, పలుకుబడి కలవారు కానీ ఎవ్వరూ లేరు. ఐనా గుణపక్షపాతులైన సారస్వత పరిషత్తు అధ్యక్షులు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు ప్రాచ్య కళాశాలలో నన్ను లెక్చరరుగా ఎన్నికచేసినారు. పరిషత్తు ఓరియంటల్ కళాశాలలో సుమారు ఆరు సంవత్సరాలు డి.ఓ.ఎల్., బి.ఓ.ఎల్., ఎమ్.ఓ.ఎల్. తరగతులకు సంస్కృతాంధ్రాలు బోధించినాను. మౌలికంగా నేను సంస్కృత విద్యార్థినే ఐనా స్వప్రయత్నంతో తెలుగులో కూడా మంచి ప్రవేశాన్ని సాధించి బాలప్రౌఢ వ్యాకరణాలు, ఆంధ్రశబ్ద చింతామణి మొదలైన గ్రంథాలను అనాయాసంగా బోధించినాను. ఆ రోజుల్లో ఇప్పటిలాగా కాక ఎంతో మంది అనుభవం ఉన్న ఉపాధ్యాయులు విద్యార్థులుగా చేరేవారు. ఎమ్.ఓ.ఎల్.లో నైతే మంచి పాండిత్యం ఉన్న ఉపాధ్యాయులే విద్యార్థులుగా ఉండేవారు. ఎంతో జాగ్రత్తతో పాఠం చెప్పేవాణ్ణి. ప్రాచ్యకళాశాల సాయంకళాశాల కనుక ఉదయమంతా తీరిక ఉండేది. తీరిక సమయంలో తెలుగు కావ్యాలు, ప్రబంధాలు, వ్యాకరణ గ్రంథాలు బాగా చదివేవాణ్ణి. తెలుగు సాహిత్యమంతా నేను స్వయంగా చదువుకున్నదే.

ఇక పరిశోధన చేయాలనే ఆసక్తి కలిగింది. సంస్కృతంలో పరిశోధన చేస్తే దేశంలో ఎక్కడైనా అవకాశాలు లభిస్తాయి అనే దృష్టితో ఆచార్య బి.ఆర్. శాస్త్రి గారి వద్ద

సంస్కృతంలో పిహెచ్.డి. కి రిజిష్టర్ చేసుకున్నాను. "అగస్త్య పండితుని కృతులు -పరిశీలన" పరిశోధనాంశం. "చతుఃసప్తతి కావ్యోక్తి వ్యక్త వైదుష్య సంపదే" అని గంగాదేవిచే ప్రశంసింపబడ్డ 74 కావ్యాలు రచించిన మహాకవి అగస్త్యపండితుడు.

పరిషత్ప్రాచ్య కళాశాలలో సుమారు ఆరు సంవత్సరాలు పని చేసినాను. అక్కడ ఉండగానే 1973లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో లెక్చరర్ పోస్టులకు ప్రకటన వచ్చింది. అప్పటికి నేను డబుల్ ఎమ్.ఏ. (తెలుగులోనూ, సంస్కృతంలోనూ) కనుక అప్లై చేసినాను. నాలుగైదు పోస్టులుండడం వల్ల నాకు సులభంగానే లెక్చరర్ ఉద్యోగం వచ్చింది. అప్పుడు ఆచార్య రామరాజుగారు తెలుగు శాఖకు అధ్యక్షులు. మొదట నిజాంకళాశాలలో చేరి రెండేండ్లు పనిచేసినాను. అక్కడ డా. కే కమల, డా॥ వేటూరి ఆనందమూర్తి, డా॥జీనత్ సాజిదా(ఉర్దూ), డా॥కాహాళేకర్ (మరాఠీ)- మొదలైన వివిధ భాషల ఆచార్యుల పరిచయం కలిగింది. భాషలకు సంబంధించిన అధ్యాపకులమంతా ఒకే హాల్లో కూర్చునేవాళ్లం. మాలో కాహాళేకర్, జీనత్ చాలాపెద్దవాళ్లు. జీనత్ సాజితా ఉర్దూలో మంచి సృజనాత్మక రచయిత్రి. కాహాళేకర్‌గారు మరాఠీలో గొప్ప విద్వాంసులు. ఆనందమూర్తి గారు తాళ్లపాక కవుల పదకవితలను మథించిన పరిశోధకులు. వీరందరితో నిత్యమూ జరిగే చర్చలవల్ల ఇతరభాషల్లో జరుగుతున్న పరిశోధన విశేషాలెన్నో తెలుసుకునే అవకాశం కలిగింది. నా ఆలోచనా పరిధి పెరిగింది.

రెండేండ్లు నిజాం కళాశాలలో పనిచేసిన తరువాత ఆర్ట్స్ కళాశాలకు స్థాన చలనం కలిగింది. ఆర్ట్స్ కళాశాల తెలుగు శాఖ అంటే నాకెంతో గౌరవభావం. రాయప్రోలు సుబ్బారావు, ఖండవల్లి లక్ష్మీరంజనం, దివాకర్ల వేంకటావధాని వంటి మేధావులు, మహామహులు పని చేసిన శాఖ అది. అక్కడ చేరడానికి వెళ్లిన రోజు నాకు నిజంగా భయం వేసింది. నా భయానికి రెండు కారణాలు. ఒకటి అక్కడ పనిచేయడానికి నాకు అర్హత ఉందా? అనే సందేహం. రెండు – ఎంతో మంది సీనియర్లు తెలుగుశాఖలో ఇతర కళాశాలల్లో ఉండగా జూనియర్‌గా ఉన్న నన్ను ఆర్ట్స్ కళాశాలకు transfer చేయడం. మొత్తంమీద ఆర్ట్స్ కళాశాలలో చేరినాను. అప్పుడు రామరాజుగారు తెలుగుశాఖకు అధ్యక్షులు. ఆచార్య సి. నారాయణరెడ్డిగారు, ఆచార్య నాయని కృష్ణకుమారిగారు, ఆచార్య ఎమ్.కులశేఖరరావు గారు ఆచార్యులుగా ఉన్నారు. వీరందరి మార్గదర్శనంలో పని చేయడం నాకెంతో గర్వకారణంగా ఉండేది.

ఆర్ట్స్ కళాశాలలో తెలుగు శాఖ ఉన్న కారిడార్‌లోనే సంస్కృతం,తమిళం,కన్నడం, మరాఠీ, పురాతత్వశాఖలు కూడా ఉండేవి. సంస్కృతశాఖలో ఆచార్య బి.ఆర్. శాస్త్రి,

ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు, ఆచార్య లాల్యే, ఆచార్య గోపాలరెడ్డి, తమిళ శాఖలో సింగారవేలు, కన్నడశాఖలో ప్రొ. రామచంద్రరావు, మరాఠీశాఖలో ప్రొ. కులకర్ణీ, ప్రొ. జోషీ, ప్రొ. ధన్‌పల్‌వార్; పురాతత్వ విభాగంలో ప్రొ. రాధాకృష్ణశర్మ మొదలైన వారి పరిచయం, వారితో చర్చలు విద్యాత్మకంగా నాకెంతో లాభం చేకూర్చినాయి. ఆర్ట్స్ కళాశాలలో ఉండగానే P.G. Diploma in Applied Linguistics చేసినప్పుడు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి, ఆచార్య చేకూరి రామారావు మొదలైన భాషాశాస్త్ర వేత్తల శిక్షణలో భాషా శాస్త్రంపైన అభిరుచి పెంచుకున్నాను. భాషావిషయకంగా నేను చేసిన యత్కించిత్కృషికి నేను చదువుకున్న వ్యాకరణ శాస్త్రంతో పాటు ఈ భాషా శాస్త్రాధ్యయనం కూడా ఎంతో దోహదం చేసింది.

తెలుగు శాఖలో పనిచేస్తుండడం వల్ల సంస్కృతం Ph.D. పైన ఉదాసీనత ఏర్పడింది. ఔద్యోగికంగా ఆ Ph.D. ఉపయోగపడదేమోనని. తెలుగులో Ph.D. చేయాలన్న కోరిక కలిగింది. అప్పటి తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య రామరాజుగారిని సంప్రతించగా ముందు సంస్కృతం Ph.D. పూర్తిచేసుకో. ఆ తరువాత తెలుగులో చేద్దువుగాని అని అన్నారు. ఏమైనా సంస్కృత Ph.D. కొనసాగలేదు. అది మానేసి ఆచార్య రామరాజుగారి వద్ద తెలుగులో భాస్కర రామాయణంపైన Ph.D. కి రిజిస్టర్ చేసుకున్నా. మొత్తం పైన 1981లో పిహెచ్. డి. డిగ్రీ లభించింది. పరిశోధన చేస్తున్నప్పుడు భాస్కర రామాయణ ప్రతులున్న అనేక తాళపత్ర గ్రంథాలయాలను సందర్శించినాను. తంజావూరు సరస్వతీమహల్ లైబ్రరీ, మదరాసు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీ, ఆం.ప్ర. ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ, రాజమండ్రిలోని రాళ్లబండివారి లైబ్రరీ, కాకినాడలోని ఆంధ్రసాహిత్య పరిషత్తు లైబ్రరీ, అడయార్ లైబ్రరీ మొదలైన లైబ్రరీలలోని భా.రా. ప్రతులను పరిశీలించినాను. ఏ ప్రతిలోనైనా 'అవతారిక' లభిస్తుందేమోనని అన్ని ప్రతులూ గాలించినాను. ఎక్కడా దొరకలేదు. కాని భా.రా.లోని పాఠభేదాలకు సంబంధించిన అనేక నూత్నాంశాలు ప్రతుల పరిశీలన వల్ల తెలిసినాయి. ఏమైనా ప్రాచీన కావ్యాలు సుపరిష్కృతాలు కాకుండా వాటిపై పరిశోధన సాగించడం అంత భావ్యం కాదనే భావం కలిగింది. విశ్వవిద్యాలయాల్లో తొలిదశలో గ్రంథపరిష్కరణ (critical edition) కార్యక్రమం విస్తృతంగా సాగి ప్రాచీన కావ్యాలకన్నింటికీ పరిష్కృత ప్రతులు రావాల్సి ఉండింది. అప్పుడు వాటిపై చేసిన పరిశోధన ప్రామాణికంగా ఉండేది.

ఆర్ట్స్ కళాశాలలో ఎమ్. ఏ. తరగతి విద్యార్థులకు ప్రధానంగా నేను తెలుగు వ్యాకరణం, సంస్కృతం, అప్పుడప్పుడు భాషాశాస్త్రం బోధించేవాణ్ణి. వ్యాకరణం, సంస్కృతం

-ఈ రెండూ కఠినమైన విషయాలని కొందరి విద్యార్థుల, అధ్యాపకుల అభిప్రాయం. కాని నా దగ్గర చదువుకున్న విద్యార్థులెవరూ ఇవి కష్టమైన అంశాలని ఎన్నడూ అనలేదు. చాలామంది ఆ అంశాలలో తక్కిన విషయాల్లో వలె మంచి మార్కులతోనే ఉత్తీర్ణులయ్యేవారు.

ఆర్ట్స్ కళాశాలలో చాలా ఏండ్లు పనిచేసినాను. అప్పుడు రామరాజుగారు అధ్యక్షులు. వారి నిరంతర పరిశోధన ప్రభావం నాపై పడింది. ముఖ్యంగా వారికున్న అభిరుచులే నాకుకూడా ఉండడం వల్ల గ్రంథ పరిష్కరణం, ప్రాచీన సాహిత్య పరిశోధన మొదలైన అంశాలపై అభిరుచి పెంచుకున్నాను. వారి ప్రభావంతోనే జానపద సాహిత్యం పరిశీలించి అందులోని నిఘంటువుల కెక్కని పదాలను సేకరించి నా శ్రీహరి నిఘంటువులో చేర్చడం జరిగింది. నా సాహిత్య జీవితం ఫలవంతం కావడానికి ఆచార్య రామరాజుగారి మార్గదర్శనమే ప్రధానకారణం.

ఆర్ట్స్ కళాశాలలో పనిచేస్తుండగానే కేంద్ర విశ్వవిద్యాలయంలో ఎమ్. ఏ. విద్యార్థులకు వ్యాకరణం చెప్పే అవకాశం లభించింది. రెండు మూడేండ్లు అక్కడ పాఠాలు చెప్పినాను. ఇంతలో కేంద్ర విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో రీడర్ పోస్టు ప్రకటించినారు. అప్పుడు నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రీడర్‌గానే పనిచేస్తున్నాను. ఉస్మానియాలోని తెలుగు రీడర్లలో నేను చివరివాణ్ణి కావడం వల్ల అప్పటి పరిస్థితుల్లో-అంటే మెరిట్ ప్రమోషన్ లేని రోజుల్లో- ప్రొఫెసర్ పోస్టు నాకు రాదనే భావంతో రీడర్ పోస్టు ఐనా సరే తరువాత ప్రొఫెసర్ కావచ్చనే భావంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి కేంద్ర విశ్వవిద్యాలయానికి రీడర్‌గానే వెళ్లినాను. అక్కడి వాతావరణం నా సాహిత్యకృషికి ఎంతగానో దోహదం చేసింది. సైన్సు శాఖల్లో, ఇతర శాఖల్లో దిగ్గజాల్లాంటి ప్రొఫెసర్లు ఉండేవారు. కొందరు సంవత్సరానికి రెండు, మూడు పర్యాయాలు విదేశ విశ్వవిద్యాలయాలకు వెళ్లి వస్తుండేవారు. నిత్య పరిశోధనలో నిమగ్నులై ఉండేవారు. ఈ వాతావరణం నాకు భాషా సాహిత్యాల కృషిలో చాలా దోహదం చేసింది. అక్కడ ఆచార్యులుగా ఉన్న ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు, ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు గారు నన్నెంతగానో అభిమానించి ప్రోత్సహించినారు.

కొద్దిరోజుల్లోనే అక్కడ తెలుగు శాఖలో ప్రొఫెసర్ పోస్టు ప్రకటించినారు. అప్లై చేసినాను. అన్ని యోగ్యతలూ ఉన్నట్లయితే సాధారణంగా internel candidates నే ఎంపిక చేస్తారు. కాని నా విషయంలో అది జరగలేదు. ఆశాభంగం కలిగింది. ఉస్మానియా నుండి సెలవుమీద వచ్చినవాణ్ణి కనుక తిరిగి ఉస్మానియాకు వెళ్లినాను. డిగ్రీ తరగతులు చెప్పడానికి కోఠి మహిళా కళాశాలకు పంపినారు. పురుషప్రయత్నమెంత ఉన్నా దైవమూ,

కాలమూ అనుకూలిస్తేనే ఆశించిన ఫలితం లభిస్తుందన్న సత్యాన్ని గ్రహించినాను. మరికొంతకాలానికి కేంద్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో మరో ప్రొఫెసర్ పోస్టుకు ప్రకటన వచ్చింది. అప్లై చేసినాను. ఈ సారి ప్రొఫెసర్ పదవి లభించింది. మొదటి సారి రాకపోవడానికి కొంత బాధపడ్డాను కానీ రెండోసారి వచ్చినందుకు మాత్రం అంతగా సంతోషం కలుగలేదు. మిత్రులందరూ సంతోషించినారు. అభినందించినారు. పదిహేడు సంవత్సరాలు ప్రొఫెసర్‌గా ఉన్నాను. తొమ్మిదేండ్లు (మూడు టర్మ్‌లు) శాఖాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించినాను. తిక్కన, అన్నమయ్య, జాషువా మొదలైన వారిపై సుమారు పది సెమినార్లు జరిపి శాఖలో విద్యావాతావరణాన్ని పెంపొందింపజేయడానికి ప్రయత్నించినాను.

రచనలు

మొట్టమొదటి నా రచన అనువాద రచన. విద్యార్థిగా ఉన్నప్పుడు కాళహస్తీశ్వర శతకంలోని పది పద్యాలను సంస్కృతీకరించినాను. ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత శాఖవారి 'జయంతి' పత్రికలో ప్రచురింపబడ్డాయి. అచ్చులో నా రచనను చూచుకోవటం అదే మొదటి సారి. అప్పుడు నాకు 16, 17 ఏండ్లు. శతకం మొత్తం అనువదించాలనుకున్నాను కాని కాలేదు. 1965 లో అనుకుంటా భారతిలో నా మొదటి వ్యాసం "ఆంధ్ర సంస్కృత కోశము - సమీక్ష" ప్రచురింపబడింది. భారతిలో ప్రచురింపబడడం ఆరోజుల్లో గొప్ప. చాలా ఆనందం కలిగింది.

ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాలలో పనిచేసేప్పుడు డి.ఓ.ఎల్. విద్యార్థులకు లఘుకౌముది పాఠం చెప్పేవాణ్ణి. ఈ పరీక్షలకు ప్రైవేటు అభ్యర్థులు కూడా ఎంతో మంది కూర్చునేవారు. వారికి సంస్కృత వ్యాకరణం చెప్పేవాళ్లు ఎవరూ ఉండక పోవడం వల్ల ఇబ్బంది పడేవారు. కనుక మొట్టమొదట లఘుకౌముదిలోని సంజ్ఞా, సంధి, కృత్ ప్రకరణాలను తెలుగులో అనువదించి ప్రచురించినాను. అది నా మొదటి గ్రంథం. ఇప్పటికి ఆరేడు ముద్రణలను పొందింది. తరువాత కారక, సమాస, స్త్రీ ప్రత్యయ, తద్ధిత ప్రకరణాలను కూడా అనువదించి ప్రచురించినాను. వీటివల్ల తెలుగుకు అవసరమైన సంస్కృత వ్యాకరణాంశాల పరిచయం కలుగుతుంది.

ఇక రెండో రచన సంకేతపదకోశం(1973). సంఖ్యలతో ప్రారంభమయ్యే వివిధ శాస్త్రాలకు సంబంధించిన సాంకేతిక పదాలను (అష్టాదశవిద్యలు, చతుష్షష్టి కళలు మొ॥) వివరించే ఒక విలక్షణ నిఘంటువది. ఈ నిఘంటు రచనకై సంస్కృతంలోని అనేక శాస్త్ర గ్రంథాలను పరిశీలించి ఆరోపపదాలను సేకరించడం జరిగింది. చాలా పదాలకు

ఆకరం చూపడం ఇందులోని విశేషం. తెలుగులో సంకేతపదాలను విశదంగా వివరించే మొట్టమొదటి కోశం ఈ గ్రంథమే అని డా॥ బి.ఆర్ శాస్త్రి గారు అభిప్రాయపడ్డారు. దీనికి సాహిత్య అకాడెమి వారి వేయి రూపాయల ఆర్థిక సాహాయం లభించింది. సుమారు ముప్పై ఏండ్ల తరువాత దీనికి సంవర్ధితరూపంతో ద్వితీయ ముద్రణం కూడా వచ్చింది (2002). ఇది మా అమ్మగారికి అంకితం చేయబడింది. నేను కూర్చిన నిఘంటువుల్లో ఇది మొదటిది.

అభయంకర్ పండితుడు సంస్కృత వ్యాకరణ పదాలను సోదాహరణంగా వివరిస్తూ రచించిన Dictionary of Sanskrit Grammar పద్ధతిలో తెలుగుకు కూడా ఒక వ్యాకరణ పదకోశం రావాలనే సంకల్పంతో తెలుగు అకాడెమీ వారు ఈ నిఘంటు నిర్మాణ బాధ్యతను నాకూ, నాగార్జున విశ్వవిద్యాలయం ఆచార్యులు డా॥ బొడ్డుపల్లి పురుషోత్తం గారికీ అప్పగించినారు. రెండు మూడేండ్లు శ్రమపడి ఆ నిఘంటువును సిద్ధం చేసినాము. దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారు దీనికి సంపాదకులు. తెలుగు అకాడెమీ వారు దీన్ని 1978లో ప్రచురించినారు. రెండో ముద్రణకూడా ఐదారేండ్ల క్రితం వచ్చింది. ఇది నా రెండో నిఘంటువు.

మాండలికాలంటే నాకెంతో మక్కువ. అందులో తెలంగాణా మాండలికాలంటే నాకు ప్రాణం. ఆణిముత్యాల్లాంటి మాండలికాలు తెలుగు దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్నాయి. వివిధ వృత్తులకు సంబంధించిన మాండలికాలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నిఘంటువులు సిద్ధం చేయించి భాషకెంతో ఉపకారం చేసింది. కాని ఏ వృత్తులకూ సంబంధించని మాండలిక పదజాలం - నాలుగు ప్రాంతాలకు సంబంధించింది.-అపరిమితంగా ఉంది. తరువాతి తరువాతి కవులు మాండలిక ప్రయోగాలను ఉపేక్షించడం వల్ల పూర్వ కవులు ప్రయోగించిన మాండలికాలు మనకిప్పుడు అర్థం కావడం లేదు. అన్నమయ్య ప్రయోగించిన మాండలికాలకిప్పుడు అర్థం తెలియక పోవడం అందువల్లే. నిఘంటుకర్తలు కూడా మాండలిక పదాలకు తమ నిఘంటువుల్లో స్థానం కల్పించకపోవడం కూడా యుక్తంగా తోచదు. మాండలిక పదజాలాన్ని, ఎంతో మనం దూరం చేసుకున్నాం. మొత్తం సాహిత్యంలో ఒకే ఒక్క చోట, ఒక్క సారి ప్రయోగించిన పదాన్ని నిఘంటువుల్లోకి ఎక్కించడానికి ప్రయత్నించిన నిఘంటుకారులు లక్షలాది ప్రజల నాలుకల్లో నిత్యమూ వ్యవహారంలో ఉన్న మాండలిక పదాలను ఉపేక్షించడం యుక్తంగా తోచదు. కనుక ప్రతి ప్రాంతంలో ఉన్న మాండలికాలను సేకరించి నిఘంటువులు సిద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ దృష్టితో నేను నల్లగొండ జిల్లాలోని మాండలిక పదాలను సేకరించి 'నల్లగొండ జిల్లా మాండలిక పదకోశం' అనే

పేర ఒక నిఘంటువును సిద్ధం చేసి ప్రకటించినాను (1986). తెలంగాణా మాండలిక భాషా లక్షణాలను వివరించే ఒక పెద్ద పీఠిక కూడా దీనికి చేర్చబడింది. మాండలికాలంటే ఎంతో ఇష్టపడే మాన్యులు ఆచార్య సి.నారాయణ రెడ్డి గారికి ఈ నిఘంటువును అంకితం చేసినాను. ఇది నా మూడవ నిఘంటువు.

తెలంగాణా మాండలిక పదాల్లో కొన్నింటికి ప్రాచీన కావ్యాల్లో ప్రయోగాలు కనిపిస్తున్నాయి. వాటిని గుర్తించి "తెలంగాణా మాండలికాలు- కావ్యప్రయోగాలు" అనే గ్రంథాన్ని ప్రచురించినాను. దుడ్డె, దూప, కొంచ బోవు, ఏరాలు, బొండిగ, బొక్క, డు ప్రత్యయాంతమైన భావార్థకపదాలు- మొదలైన ఎన్నో తెలంగాణా మాండలిక పదాలకు వివిధ కావ్యాల్లోని ప్రయోగాలను గుర్తించి కూర్చడం జరిగింది. ఇదికూడా నిఘంటు రూపంలోనే రచింపబడింది. ఇది నా నాలుగవ నిఘంటువు.

ప్రాచీన సాహిత్య పరిశోధకుల్లో ప్రభాకర శాస్త్రిగారు, మానపల్లి రామకృష్ణ కవిగారు ప్రాతః స్మరణీయులు. తొలిదశలో వీరి రచనలను ఎక్కువగా చదివేవాణ్ణి. ప్రభాకర శాస్త్రిగారు సంకలనం చేసిన 'ప్రబంధ రత్నావళి' సంకలన గ్రంథంవల్ల ప్రభావితుణ్ణై "అలబ్ధ కావ్యపద్య ముక్తావళి" అనే గ్రంథాన్ని సంకలనం చేసినాను. తెలుగు సాహిత్యంలో మనకిప్పటికీ లభించని ఎఱ్ఱన రామాయణం, అథర్వణ భారతం మొదలైన గ్రంథాల్లోని లభ్యమైన పద్యాలన్నింటిని వివిధ ఆకరాల ఆధారంగా సేకరించి ఇందులో కూర్చడం జరిగింది. ముఖ్యంగా లక్షణ గ్రంథాలు మొదలైనవి దీనికి ఆకరాలు. సుమారు వంద గ్రంథాలనుండి ఇందులో పద్యాలు సేకరింపబడ్డాయి. ఇది ఆచార్య బి. రామరాజు గారికి అంకితం చేయబడింది.

కొన్నైనా పద్యాలు లభిస్తున్న అలబ్ధ గ్రంథాలు కొన్నైతే ఒక్క పద్యం కూడా లభించని అలబ్ధ గ్రంథాలు తెలుగు సాహిత్యంలో ఎన్నో ఉన్నాయి. అందుకే జి.ఎన్.రెడ్డి గారు తెలుగువారు నష్ట జాతకులని అన్నారు. తెలుగులో అలబ్ధ సాహిత్యం ఎంత ఉందో పరిశోధన చేయాలనే ఆసక్తి కలిగిస్తుంది. కావ్యావతారికలు మొ॥ ఆధారాలను బట్టి అధ్యయనం చేస్తే సుమారు ఆరువందల గ్రంథాలపైనే అని తేలింది. ఈ అధ్యయనం ఫలితమే "తెలుగులో అలబ్ధ వాఙ్మయం" అన్న గ్రంథం (1983).

విశ్వవిద్యాలయంలో చిరకాలం పనిచేయడం వల్ల విమర్శపైనా, పరిశోధన పైనా మక్కువ కలిగి ఎన్నో విమర్శవ్యాసాలు, పరిశోధన వ్యాసాలు రాసినాను. ప్రధానంగా ఈ వ్యాసాలు ప్రాచీన తెలుగు సాహిత్యానికీ, సంస్కృత సాహిత్యానికీ, భాషకూ సంబంధించినవి. భాస్కర రామాయణంపై పరిశోధన గ్రంథం "భాస్కర రామాయణము

–విమర్శాత్మక పరిశీలనము" అన్న పేరుతో ప్రకటించినాను. భా.రా. పాఠాల విషయంలో చాలా చిక్కులున్నాయి. ఇందుకు దేశంలోని అనేక తాళపత్ర గ్రంథాలయాలను దర్శించి తాళపత్ర గ్రంథాలలోని పాఠ భేదాలకు సంబంధించిన విశేషాలను ఈ సిద్ధాంత గ్రంథంలో పొందుపరచినాను.

ఉభయభారతి, సాహితీనీరాజనం అనే పేర రెండు వ్యాస సంపుటులు ప్రకటించినాను. వీటిలో సుమారు ముప్పై వ్యాసాలు భాషకూ – సాహిత్యానికీ సంబంధించినవి.– ఉన్నాయి. అన్నమయ్య సంకీర్తనలు భాషావిశేషాలకు అమూల్యమైన గనులు అన్న విషయం మనకు తెలిసిందే. వాటిలోని వివిధ భాషాంశాలను పరిశీలిస్తూ రాసిన పదిహేను వ్యాసాలతో "అన్నమయ్య భాషా వైభవం (2006) అన్న గ్రంథాన్ని ప్రకటించినాను. దీనితో నేను ప్రచురించిన విమర్శ పరిశోధనవ్యాస సంపుటులు మూడు.

తులనాత్మక సాహిత్యంపై ఉన్న అభిమానంతో 'తెలుగుకవుల సంస్కృతానుకరణలు' (2006) అనే చిన్న గ్రంథాన్ని రచించినాను. ఇందులో సుమతి శతకకారుడు, శ్రీనాథుడు, పిల్లలమర్రి పినవీరభద్రుడు మొదలైన తెలుగు కవులు వివిధ సంస్కృత కావ్యాల్లోని శ్లోకాలను యథాతథంగా అనువదించుకొని తమ గ్రంథాల్లో చేర్చుకున్న వైనం సోదాహరణంగా వివరింపబడింది.

ఇవి కాక సంపాదకత్వం వహించి వెలువరించిన గ్రంథాలు కూడా ఉన్నాయి. కాణాదం పెద్దన సోమయాజి రచించిన పిల్ల వసుచరిత్రగా పేరొందిన, 'ముకుంద విలాస' కావ్యానికి సంపాదకత్వం వహించి విపులమైన పీఠిక రచించినాను. ఈ కావ్యాన్ని తెలుగు విజ్ఞానపీఠం ప్రచురించింది.

సంస్కృతంలో రచింపబడ్డ 'త్రిలింగ శబ్దాను శాసన'మనే వ్యాకరణ గ్రంథం, శ్రుతి స్మృతి, పురాణేతి హాస కావ్యనాటకాదుల నుండి అనేక సూక్తులను సేకరించి తెలుగు అనువాదంతో కూర్చిన "సంస్కృత సూక్తి రత్నాకరం", సంస్కృతంలోని వివిధ న్యాయాలను వివరణతో కూర్చిన "సంస్కృత న్యాయదీపిక" కొత్తపల్లి సుందర రామయ్య గారు సిద్ధం చేసిన "అకారాది అమర నిఘంటువు"– ఇవి నేను ఎడిట్ చేసిన గ్రంథాలు.

తెలుగుపై సంస్కృత ప్రభావం ఎంతగానో ఉందనడంలో సందేహం లేదు. వార్తా పత్రికల్లోనూ, పాఠ్యపుస్తకాలల్లోనూ సంస్కృత పదాల ప్రయోగం ముందుకంటే ఇప్పుడు అధికమైందనే చెప్పాలి. ఇక పారిభాషికపదాల విషయంలోనైతే సంస్కృతాన్ని ఎంతగా ఆశ్రయిస్తున్నామో చెప్పలేం. సంస్కృత పదాలను వాడేప్పుడు అజాగ్రత్తవల్లో,

సంస్కృతవ్యాకరణ నియమాలు తెలియకపోవడంవల్లో, నిర్లక్ష్యంవల్లో చాలా దోషాలు చేస్తున్నారు. ఈ అంశాన్ని గుర్తించి "వాడుక తెలుగులో అపప్రయోగాలు" అన్న ఒక గ్రంథం రాసినాను. నిత్యం మనం వాడుతున్న సమర్థవంతుడు, వ్యవస్థాపక దినం మొ॥ ఎన్నో పదాలను గుర్తించి అవి ఎందుకు తప్పు ప్రయోగాలో ఇందులో సప్రమాణంగా నిరూపించబడింది. ఇది విద్యార్థులకు, అధ్యాపకులకు, పత్రికా రచయితలకు, జిజ్ఞాసువులకు ఉపయోగపడుతుందని నా విశ్వాసం. నా యీ ప్రయత్నాన్ని కొందరు హర్షించలేదు. తప్పుపదాలు కూడా వ్యవహారంలో ఏర్పడినవైతే తప్పులైనా ఒప్పులుగా భావించవచ్చు. కాని ఒక వ్యక్తి వ్యాకరణ నియమాలు తెలియకుండా సృష్టించినవైతే మాత్రం అవి తప్పులే కాని ఒప్పులు కావు.

పావనిసేవా సమితి వారి అభ్యర్థనపైన ఏనుగు లక్ష్మణకవి నీతిశతకానికి దీపికా వ్యాఖ్యను సంతరించినాను. తెలుగు నిఘంటువుల్లో సూర్యరాయాంధ్రనిఘంటువు అతి ప్రామాణికమైనది. విస్తృతమైనది కూడా. ఐతే సూ.ని.కర్తలు సంప్రతించని సాహిత్యం కూడా ఎంతో ఉంది. ముఖ్యంగా పద సాహిత్యం జానపద సాహిత్యం, సిద్ధేశ్వర చరిత్ర, రాయవాచకం మొదలైన చారిత్రక గ్రంథాలు, ఆంధ్రపదనిధానం మొదలైన నిఘంటువులు ఈ సాహిత్యంలో ముఖ్యమైనవి. సూ.ని. లో చేరని అచ్చమైన తెలుగు పదాలెన్నో ఈ సాహిత్యంలో మనకు లభిస్తాయి. అంతేకాక మాండలిక పదాలకు కూడా ఇందులో స్థానం లేదు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని సూ.ని.లో లేని పదాలను వివిధ ఆకరాల ఆధారంగా సుమారు 36 వేల పదాలను సేకరించి "శ్రీహరి నిఘంటువు" అనే వెయ్యి పేజీల నిఘంటువును ఏడెనిమిదేండ్లు శ్రమపడి సిద్ధం చేసి ప్రకటించడం జరిగింది. (2004) ఈ నిఘంటు నిర్మాణానికి ఏ ఒక్క సంస్థనుండి గానీ ఒక్క పైసా కూడా గ్రాంటుగా తీసుకోలేదు. మైసూరులో ఉన్న భారతీయ భాషాసంస్థ వారు మాత్రం దీని ముద్రణకుగాను ఒక లక్షా నలభై వేల రూపాయలు గ్రాంటుగా ఇచ్చినారు. పరమపూజ్యులు శ్రీ కందుకూరి శివానందమూర్తి గారికి ఈ నిఘంటువు అంకితం చేయబడింది. ఈ గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం వారి అవార్డు లభించింది. విశ్వవిద్యాలయాలు నిఘంటువులకిచ్చిన అవార్డుల్లో ఈ అవార్డు మొదటిది. నేను రచించిన నిఘంటువుల్లో ఇది ఐదవది.

శ్రీహరి నిఘంటు నిర్మాణ సందర్భంలో తాళ్లపాక కవుల సంకీర్తన సాహిత్యం 29 సంపుటాలూ పరిశీలించడం జరిగింది. వీటిలో నుండి నిఘంటువుకు కావలసిన పదాలను సేకరించుకుంటూనే "ఏకా క్రియా ద్వ్యర్థకరీ ప్రసిద్ధా" అనే సూక్తి ప్రకారం వాటిలోని సూక్తుల నన్నిటినీ సేకరించుకున్నాను. అన్నమయ్య కీర్తనలు ప్రధానంగా అధ్యాత్మ శృంగార

సంబంధులే ఐనా ఆయన సూక్తుల్లో సామాజికాంశాలు రాసులు రాసులుగా దర్శనమిస్తాయి. ఆయన సామాజిక స్పృహ వ్యక్తమౌతుంది. అందుకోసమే ఆ సూక్తులనన్నింటిని – సుమారు ఒక వెయ్యి ఐదు వందలు– "అన్నమయ్య సూక్తి వైభవం" అన్న పేరుతో చిన్న పీఠిక వ్రాసి ప్రకటించినాను. (2008).

ఇంతవరకూ నా తెలుగు రచనలను గురించి ప్రస్తావించినాను. ఇక సంస్కృత గ్రంథాలను గురించి నాలుగు మాటలు. ఇప్పటి వరకు నేను సంస్కృతంలో ఏడు గ్రంథాలు రచించినాను. అవి మాతృగీతమ్, ఫిరదౌసీ, తైల పాయికా, ప్రపంచపదీ, అన్నమాచార్య సూక్తి సుధా, వేమన శతకమ్, సంస్కృత వైజయంతీ. వేమన శతకమ్ (150 వేమన పద్యాలకు సంస్కృతానువాదం) ముద్రణలో ఉంది. వీటిలో మాతృగీతమ్, సంస్కృత వైజయంతీ తప్ప అన్నీ తెలుగునుండి అనువదించిన సంస్కృత గ్రంథాలే. వీటిలో 'ప్రపంచపదీ' ఆచార్య సి. నారాయణరెడ్డి గారి తెలుగు ప్రపంచపదులకు సంస్కృతానువాదం. ప్రపంచ పదుల్లో నారాయణరెడ్డి గారు ఛందస్సుతో పాటు శబ్ద సౌందర్యానికి సంబంధించిన ఎన్నో వైచిత్రులను ప్రదర్శించినారు. మూలంలోని భావాన్ని అనువాదంలో సులభంగా తీసుకు రావచ్చు. కాని మూలంలోని శబ్ద సౌందర్యాన్నంతా అనువాదంలోకి తీసుకురావడం కష్టం. ఐనా యథాశక్తి ప్రయత్నించి మూలానికి న్యాయం చేసేట్లుగా అనువాదం చేసినాను. మాత్రాచ్ఛందస్సులో అనువాద రచన సాగింది. ఈ అనువాదానికి కేంద్ర సాహిత్య అకాడెమీ వారి అవార్డు లభించింది(2007).

జాషువా నాకు అభిమాన పద్య కవి. మా మిత్రులు ఆచార్య లక్ష్మణమూర్తిగారు జాషువా ఫిరదౌసీ, గబ్బిలం కావ్యాలలోని పద్యాలను చదువుతూ ఉంటే ఎన్నో పద్యాలు నాకు చిన్ననాడే కంఠస్థమైనాయి. తరువాత జాషువా కావ్యాలను అనువదించాలన్న కోరిక కలిగింది. జాషువాకావ్యాల్లో అత్యంత ప్రసిద్ధి పొందిన గబ్బిలం, ఫిరదౌసీ కావ్యాలను సంస్కృతంలోకి అనువదించినాను. మూలకవి వాడిన ఆటవెలది, తేటగీతి, ఉత్పలమాల, చంపకమాల, సీసం మొదలైన ఛందస్సులను సంస్కృతంలో కూడా వాడి రచన చేయడం వీటిలోని విలక్షణత. ఈ విధమైన రచనలో సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి, కుంటిమద్ది శేషశర్మగారలు నాకు మార్గదర్శకులు. గబ్బిలం కావ్యాన్ని 'తైలపాయికా' పేరుతో అనువదించినాను.

అన్నమయ్య కీర్తనల్లో అడుగడుగునా మానవ జీవితానికి సంబంధించిన సూక్తులు అసంఖ్యాకంగా కనిపిస్తాయి. అన్నమయ్యలో మాత్రమే కనిపించే విలక్షణమైన సూక్తులు కొన్ని సంస్కృత సాహిత్యంలో కూడా కనిపించవు. ఇట్టి సూక్తులను ఆంధ్రేతరులైన

సంస్కృతజ్ఞులకు పరిచయం చేయాలన్న ఉద్దేశంతో కొన్నింటిని సంస్కృతంలోకి అనువదించి "అన్నమాచార్యసూక్తి సుధా" అన్న పేరుతో ప్రచురించినాను.

నా పదకొండో ఏట పరమపదించిన మా అమ్మగారి స్మృత్యర్థం సంస్కృతంలో 'మాతృగీతమ్' అన్నపేరుతో రచించినాను. ఇది శతకరూపంలో సాగిన స్వతంత్రరచన. మాతః, జనని ఇత్యాది సంబోధనలు వాడుతూ లోకవృత్తాన్ని వివరించిన శతకమిది.

సంస్కృతంలో కవితా రచనలోనే కాక విమర్శ, పరిశోధనలో కూడా నాకు ఆసక్తి ఉంది. 15 సంస్కృత వ్యాసాలను 'సంస్కృత వైజయంతీ' పేర ఉస్మానియా విశ్వవిద్యాలయ సంస్కృత అకాడెమీ వారు ప్రచురించినారు(2006). అప్పటి అకాడెమీ డైరెక్టర్ ప్రొఫెసర్ కమలగారు ఈ గ్రంథముద్రణకు ప్రత్యేకశ్రద్ధ తీసుకున్నారు.

ఈ విధంగా నా రచనావ్యాసంగం సంస్కృతాంధ్రాల్లో సమాంతరంగా కొనసాగింది. నా రచనలన్నీ కవిత, నిఘంటు నిర్మాణం, ప్రాచీన తెలుగు సాహిత్యం, భాషా వ్యాకరణాలు, గ్రంథ సంపాదకత్వం మొదలైన రంగాలకు సంబంధించినవి. సంస్కృతంలో కవితా రచన చేసినాను కాని తెలుగులో ఎందుకో నేను కవిత్వం రాయడానికి మాత్రం ప్రయత్నించలేదు.

సంస్కృతం ప్రసక్తి వచ్చింది కనుక ఇక్కడొక విషయం చెప్పాలి. సంస్కృతం నేర్చుకోదలచినవారికి ఆకాశవాణి వారు సంస్కృత పరిచయమనే పేర సంస్కృత పాఠాల కార్యక్రమాన్ని నిర్వహించేవారు. వారానికి రెండు రోజులు ప్రసారమయ్యే ఈ కార్యక్రమాల్లో ఒకటి సీనియర్లకు, రెండోది జూనియర్లకు. కేశవపంతుల నరసింహశాస్త్రిగారు ఈ పాఠాలను ఎన్నో సంవత్సరాలు దక్షతతో నిర్వహించినారు. వారి తరువాత డా॥ రావూరి భరద్వాజగారు ఈ కార్యక్రమంలో నాకు అవకాశం కల్పించినారు. కొంత కొంత వ్యవధితో దాదాపు ఏడెనిమిది సంవత్సరాలు రేడియో సంస్కృత పాఠాల కార్యక్రమాన్ని నిర్వహించినాను. ఈ కార్యక్రమం వల్ల నాకు కొంత ప్రచారమూ, పేరూ లభించినాయి.

అనేక విద్యా సంస్థలతోనూ, సాంస్కృతిక సంస్థలతోనూ నాకు సన్నిహిత సంబంధం ఉంది. నగరంలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలకు ఉపాధ్యక్షునిగా, ఆంధ్ర సారస్వత పరిషత్తుకు కార్యదర్శిగా, ఆం.ప్ర. ఓరియంటల్ కాన్ఫరెన్సుకార్యదర్శిగా, సురభారతీ సమితి సంయుక్త కార్యదర్శిగా, అంజుమన్ తరక్కీ ఉర్దూలో సభ్యునిగా, నంది అవార్డు కమిటీ సభ్యునిగా, కే. కే. బిర్లా ఫౌండేషన్ వారి సరస్వతీ సమ్మాన్ చయన్‌పరిషత్తు సభ్యునిగా తి.తి.. దేవస్థానం పబ్లికేషన్ కమిటీ సభ్యునిగా, ఏ.పి. రెసిడెన్షియల్ ఎజుకేషనల్ సొసైటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ లో సభ్యునిగా, కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘ

సభ్యునిగా, ప్రెస్ అకాడమీ వారి Telugu Neologims సలహా సంఘ సభ్యునిగా ఉండి, నాకు సాధ్యమైనంత సేవ చేసినాను. ప్రస్తుతం ఆంధ్రసారస్వత పరిషత్తు ట్రస్ట్, ఆంధ్ర సారస్వత పరిషత్తు, సురభారతీసమితి, మొదలైన సంస్థల్లో సభ్యునిగానూ, తి. తి. దేవస్థానం వారి కేంద్ర ధార్మిక మండలి సభ్యునిగానూ, సరస్వతీ విద్యాపీఠం అధ్యక్షునిగానూ, సంస్కృత భాషా సమితి కులపతి గానూ, కర్నూలులోని జి. పుల్లారెడ్డి ఇంజినీరింగు కళాశాల పాలక మండలి సభ్యునిగానూ, యస్.వి. వేదిక్ యూనివర్సిటీ అకడెమిక్ కౌన్సిల్ సభ్యునిగాను ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత అకాడెమీ పాలక మండలి సభ్యునిగాను బాధ్యతలను నిర్వహిస్తున్నాను.

నాకు ఇతర సంస్థల కన్నా ఆంధ్ర సారస్వత పరిషత్తుతో సన్నిహిత సంబంధం ఉంది. ఈ సంబంధం దాదాపు ముప్ఫై ఏళ్ల నుండీ కొనసాగుతుంది. పరిషత్తు పండిత శిక్షణకళాశాలలో పండిత శిక్షణ పొందడం (1965), పరిషత్తు ప్రాచ్యకళాశాలలో సుమారు ఆరేండ్లు (1967-73) ఉపన్యాసకునిగా పని చేయడం, తరువాత పరిషత్కార్య వర్గ సభ్యునిగానూ, ఆ తరువాత కార్యదర్శిగానూ ఉండడం జరిగింది. మొదట శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు, ఆ తరువాత డా॥ సి. నారాయణరెడ్డి గారు అధ్యక్షులుగా ఉన్నప్పుడు నేను కార్యదర్శిగా ఉండి అనేక సాహిత్య కార్యక్రమాల నిర్వహణలో పాలు పంచుకునే సదవకాశం కలిగింది. రామానుజరావు గారి దగ్గర సంస్థలను నిర్వహించే నేర్పు, డబ్బును పొదుపుగా ఖర్చు చేసే లక్షణం, క్రమశిక్షణ మొదలైన ఎన్నో లక్షణాలను అలవరచుకున్నాను. నారాయణరెడ్డిగారు అధ్యక్షులుగా ఉండగా అనేక విలక్షణ కార్యక్రమాలతో పాటు పరిషత్తు స్వర్ణోత్సవాలు జరిగినాయి. కార్యదర్శిగా వారి కార్య నిర్వహణ దక్షతను ప్రత్యక్షంగా చూచినాను. నారాయణరెడ్డి గారు పరిణత వాణి కార్యక్రమాన్ని ప్రారంభించినప్పుడు నేనే కార్యదర్శిని. నేను కార్యదర్శిగా ఉన్నప్పుడు ప్రారంభమైన ఈ 'పరిణతవాణి' కార్యక్రమంలో ప్రస్తుతం నాకు అవకాశం కలగడం నాకెంతో ఆనంద దాయకం.

నేను పొందిన సన్మానాలు, పురస్కారాలు కొద్ది మాత్రమే, తెలుగు విశ్వవిద్యాలయం వారినుండి ఉత్తమ పండిత పురస్కారం (1990), సి.నారాయణ రెడ్డి గారి ప్రపంచ పదులు అనువాద గ్రంథమైన 'ప్రపంచపదీ'కి కేంద్ర సాహిత్య అకాడెమీ సాహిత్య పురస్కారం (2001), విజయవాడలోని సిద్ధార్థ అకాడెమీవారి విశిష్ట వ్యక్తి పురస్కారం, సనాతన ధర్మ చారిటబుల్‌ట్రస్ట్ వారి శివానంద ఎమినెంట్ సిటిజన్ అవార్డు (2004), శ్రీహరి నిఘంటువు గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం వారి సాహిత్య పురస్కారం(2007), మైసూరు దత్త పీఠస్వామి శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానందస్వామి వారి స్వర్ణకంకణపురస్కారం లభించినాయి.


పదవులు

కేంద్ర విశ్వవిద్యాలయంలో ఉండగా 2001 సం.లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయానికి నన్ను ఉపాధ్యక్షునిగా నియమించింది. ఆ విశ్వవిద్యాలయానికి నేను రెండో ఉపాధ్యక్షుణ్ణి. మొదటి ఉపాధ్యక్షులు ఎస్. వి. యూనివర్సిటీ గణితాచార్యులుగా విశ్రాంతి పొందిన ప్రొఫెసర్ అరుణాచలంగారు. నేను పదవీ బాధ్యతలు స్వీకరించేనాటికి యూనివర్సిటీ ప్రారంభమై సుమారు నాలుగేండ్లు. రెండు శాఖలు మాత్రమే ఉండేవి. ఒకటి Comparative Dravidian Literature and Philosophy, రెండోది Computer Science. ఈ రెండింటిలో మొత్తం నలుగురైదుగురు లెక్చరర్లు- ఒక రీడర్ ఉండేవారు. ద్రావిడ భాష శాఖలో ఒకే ఒక ఉపాధ్యాయుడు, ఫిలాసఫీలో ముగ్గురు ఉపాధ్యాయులు, కంప్యూటర్ సైన్స్‌లో ఒక ఉపాధ్యాయుడు. కంప్యూటర్, గణితం ఐచ్ఛిక విషయాలుగా B.Sc. తరగతులు జరుగుతుండేవి. ద్రావిడ విశ్వవిద్యాలయం అన్న పేరు నామమాత్రంగానే కనిపించింది. కనుక ప్రభుత్వం వారితో సంప్రదించి మొదట జానపద విజ్ఞానశాఖ, చరిత్ర శాఖ, విద్యా శాఖ (Education Dept) లను ఏర్పాటు చేసి యోగ్యులైన అధ్యాపకులను నియమించడం జరిగింది. ఆ తరువాత తెలుగు, తమిళ, కన్నడ, ఆంగ్ల శాఖల ఏర్పాటుకోసం కూడా ప్రతిపాదనలు పంపినాను. నేను పదవీ విరమణ చేసిన వారం రోజుల్లో ఈ నాలుగు శాఖలకూ అనుమతి లభించింది. ఎన్నో కృత్యాద్యవస్థలు పడి మొత్తం మీద విద్యా కార్యక్రమాలను విస్తృత పరచి దానికొక విశ్వవిద్యాలయ స్వరూపం కల్పించడానికి ప్రయత్నం చేసినాను. విశ్వవిద్యాలయానికి కావలసిన భవనాల నిర్మాణాన్ని కూడా చేపట్టి క్యాంపస్‌ను తీర్చిదిద్దడం జరిగింది. Dravidian Studies అనే జర్నల్‌ను, ప్రధాన ద్రావిడ భాషల నిఘంటు నిర్మాణాన్ని కూడా ప్రారంభించినాను. ఉపాధ్యక్షునిగా ఉన్నప్పుడు పెద్ద సమస్యలేవీ రాలేదు కాని ఒక్క సమస్యను ఎదుర్కోవలసి వచ్చింది. విశ్వవిద్యాలయంలో B.A, B.Sc, B.Com. మెదలైన డిగ్రీ కోర్సులన్నీ పెట్టాలని స్థానికులు పెద్ద ఆందోళన చేపట్టినారు. విశ్వవిద్యాలయంలో డిగ్రీ కోర్సులు వివిధ సైన్సుకోర్సులు- ద్రావిడ విజ్ఞానానికి సంబంధించనివి - ప్రారంభించడం బాగుండదని వ్యతిరేకించినా నా వాదన గెలవలేదు. మొత్తం మీద అన్ని డిగ్రీ కోర్సులు ప్రారంభమై-తరువాత ఏవేవో సైన్సు వగైరాలకు సంబంధించిన - ద్రావిడ విజ్ఞానేతర శాఖలు ఏర్పడి ద్రావిడ విశ్వవిద్యాలయ లక్ష్యం కొంత దెబ్బతిని సామాన్య విశ్వవిద్యాలయంగా మారి పోయిందని కొందరి అభిజ్ఞుల అభిప్రాయం, మొత్తం మీద $3^1/_2$ సంలు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా ఉండి తిరిగి హైదరాబాదు వచ్చి 62 వ ఏట కేంద్ర విశ్వవిద్యాలయం నుండి విశ్రాంతి

పొందినాను. ద్రావిడ విశ్వవిద్యాలయానికి తొలిదశలో విద్యాత్మకంగా, భౌతిక అవసరాల పరంగా ఒక స్వరూపం తీసుకురావడానికి నేను చేసిన కృషి సఫలమైందనే సంతృప్తి నాకుంది. కుప్పంలో ఉండగానే రెండు మూడు నెలలు తెలుగు విశ్వవిద్యాలయానికి ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్‌గా ఉండే అవకాశం కూడా లభించింది. అధ్యాపకులకు పదవీ విరమణ అనేది ఉండదు. పదవీ విరమణ తరువాతే నాలుగైదు గ్రంథాలు ప్రచురించినాను. కుప్పం నుండి హైదరాబాదుకు తిరిగి వచ్చిన తరువాత తాళ్లపాక కవుల సంకీర్తన వాఙ్మయానికి నిఘంటువొకటి సిద్ధం చేయాలనే సంకల్పం కలిగింది. వీలున్నప్పుడల్లా నిఘంటువుకోసం పని చేస్తుండే వాణ్ని. అంతలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఒక సంవత్సరం క్రితం ఈ నిఘంటు నిర్మాణ బాధ్యతను నా కప్పగించినారు. ఆ కార్యక్రమం కొనసాగుతుంది. మూడు వంతులు పూర్తి కావచ్చింది. ఆరు నెలల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయగలనని భావిస్తున్నాను. ఈ నిఘంటు నిర్మాణం నాకు అచ్చ తెలుగుపై అభిమానాన్ని పెంచింది. మారుమూల తెలుగు పదాల మూలాలను వెదకడానికి అవకాశమిచ్చింది. అందమైన తెలుగు పలుకుబళ్ల సోయగాన్ని, అన్నమయ్య–ఇతర తాళ్ల పాక కవుల కవితా వైదగ్ధ్యాన్నీ తెలియబరచింది.

ఎవరికైనా ఒక విద్వాంసునికి శిక్ష వేయదలచుకుంటే నిఘంటు నిర్మాణాన్ని శిక్షగా వేయాలని ఆంగ్లంలో ఒక నానుడి ఉంది. నేనేమీ నేరం చేయలేదు. నాకెవరూ నిఘంటు నిర్మాణాన్ని శిక్షగా వేయలేదు. నాకు నేనే నిఘంటు నిర్మాణ కార్యక్రమాలను చేపట్టి నిర్వహించినాను. తాళ్లపాక కవుల నిఘంటువు పూర్తి ఐతే అది నా ఆరవ నిఘంటువౌతుంది. అన్నమయ్య నిఘంటు నిర్మాణంతో పాటు పాణిని 'అష్టాధ్యాయి'కి తెలుగు అనువాదం కూడా చేపట్టినాను. సంస్కృత భాషకు పాణిని రచించిన అష్టాధ్యాయితో సమానమైన వ్యాకరణం ప్రపంచభాషల్లో ఏ భాషకూ లేకపోవడం దీని విశిష్టత. ఇందులో ఆరు అధ్యాయాల అనువాదం పూర్తయ్యింది. మరో రెండు అధ్యాయాలు ఉన్నాయి. త్వరలోనే పూర్తి అవుతాయని ఆశిస్తున్నాను.

చదువుకునే అవకాశం లేక ఎక్కడో అనామకునిగా ఉండి పోవలసిన నాకు ఆరంభంలో అన్నభిక్షతోపాటు విద్యాభిక్ష కూడాపెట్టి నా జీవితానికొక మార్గం చూపిన శ్రీ యాదగిరి లక్ష్మీ నృసింహస్వామికి నమస్కరిస్తూ, ఈ ప్రసంగం చేయడానికి అవకాశమిచ్చిన పరిషత్తు అధ్యక్షులు ఆచార్య సి. నారాయణ రెడ్డి గారికీ, కార్యదర్శులు ఆచార్య శివారెడ్డిగారికీ కృతజ్ఞతలు తెలుపుతూ నా ప్రసంగాన్ని విరమిస్తాను.



ఆచార్య ముదిగొండ శివప్రసాద్

కాకిపిల్ల కాకికి ముద్దు – బాల్యానికి లేదు హద్దు. ఎవరి బాల్యం వారికి ముద్దు – ఆకాశం కూడా కాదు సరిహద్దు. నేను ప్రపంచ పర్యటన చేశాను. యూరప్, గల్ఫ్, అమెరికాలు చూశాను. ఐనా చిన్నతనంలో మా పల్లెటూరి నుండి ఒంటెద్దు బండిలో స్వప్నసుందరి సినిమా చూడడానికి వెళ్లిననాటి థ్రిల్ మళ్లీ రాలేదు.

ఆకులల్లూరు ఓ సముద్రతీర గ్రామం. కొత్తపట్నానికి పదిహేను నిమిషాల దూరంలో ఉంది. కొత్తపట్నంలో నేటికీ ఓ కోట పురాతనమైన లైట్ హౌస్ పురావైభవ స్మృతి చిహ్నంగా మిగిలి ఉంది. ఆ సమీపంలో అడవి రామలింగేశ్వర స్వామి దేవాలయం, ఆకుతోటలు, సరుగుడు చెట్లు, ఇసుక తిన్నెలు – నాలుగు అడుగులు త్రవ్వితే వచ్చే మధురసలిలాలు అందించే చెలమలు, మరి కొంచెం దూరంలో బకింగ్‌హాంకెనాల్ – సముద్రస్నానాలు చేసి ముద్దపులిబుగరాలు అట్లు అల్లపు పచ్చడి తిన్న రోజులు మళ్లీ రావు.

నా బాల్య స్మృతులు

కొత్తపట్నంలో ఓ టూరింగ్ టాకీసు ఉండేది. అది వర్షాకాలంలో మూత పడేది. భానుమతి నటించిన రత్నమాల సినిమా 1948 ప్రాంతంలో అక్కడే చూచినట్టు గుర్తు. ప్రయాణసాధనాలు లేని రోజులు. ఎడ్ల బండి లేదా కాలినడకన ప్రయాణం. తర్వాత క్రమంగా బస్సులు వచ్చాయి. నైజీరియా బస్‌సర్వీస్ కొత్తపట్నం నుండి ఒంగోలుకి వెళ్ళడానికి అర్ధగంట పట్టేది. ఐనా నా బాల్యమంతా చింత చెట్ల మధ్య దయ్యాల సమాధుల మధ్య నడుచుకుంటూ ఒంగోలు చేరిన రోజులే గుర్తున్నాయి. నేను 1940 డిసెంబరు 23న పుట్టినట్టు నా డాక్యుమెంట్స్‌లో రికార్డు అయింది. ఐతే 1941

పుష్యమాసంలో పుట్టినట్లు చెపుతారు. ఎస్-ఎస్-ఎల్-సి పరీక్షకు పోవాలంటే ఒక సంవత్సరం ఎక్కువ వేసి పంపారని కథనం.

ఆకులల్లూరు నా మాతామహస్థానం. పిల్లమ్మ చెరువు జ్వాలాముఖీ దేవాలయం చాపాయ చక్రాయ చెరువు వీధిబడులు - గంగరావి చెట్లు, బాడిసెచెట్లకు పూచిన ఎర్రనిపూలు వినాయకచవితికి పొలాలు తిరిగి ఇరవై ఒక్క పత్రి సేకరించుకున్న దినాలు - ఆడ పిల్లలతో కలిసి గుజ్జనగూళ్లు ఆడుకుని కంది పచ్చడి నూరిన ఆటలు, అట్లతద్దికి వేపచెట్టుకు వేసిన ఉయ్యాలలో ఊగిన మధురక్షణాలు, అచ్చెనగాయలు, వామన గుంటలు 1946 నాటి ఈ జ్ఞాపకాలెన్నో నన్ను పులకరింపజేస్తూ పలకరిస్తూ ఉంటాయి. అప్పుడు ప్రసూన, కనకం, పోకూరి సుబ్బయ్య కొడుకు మార్కండేయ బాల్య స్నేహితులు ఏమైనారో తెలియదు. కానీ పెడితే బెల్లపు కడ్డీలు ఇచ్చేవారు. కానీ అంటే అణాలో నాల్గవ భాగం.

నా పితామహస్థానం తాడికొండ. ఇది గుంటూరుకు ఇరవై నిమిషాల దూరంలో అమరావతి వెళ్లే దారిలో ఉంది. అక్కడ నా చిన్నప్పుడు చాలా పుస్తకాలు మా ఇంట్లో ఉండేవి. మా నాన్నగారు మల్లికార్జునరావు గారు ఆ రోజుల్లో చాలా ప్రముఖ రచయిత. వక్త. పత్రికా సంపాదకుడు. భారతి, మహతి వంటి ఎన్నో 1940 నాటి పత్రికలు మా ఇంట్లో ఉండేవి. నా బాల్యం అటు ఆకులల్లూరు లోను, ఇటు తాడికొండలోను గడిచిపోయింది. తాడికొండ నుండి వచ్చిన మరొక మహా రచయిత రావూరి భరద్వాజ గారు. శ్రమైక జీవిన సౌందర్యం తెలిసిన ఆంధ్ర బాల్జార్. వారి బంధువు కంచి వెంకటరత్నం నా బాల్య మిత్రుడు. ఇప్పుడు ఎక్కడ ఉన్నాడో తెలియదు. గుంటూరు బ్రాడీ పేటలో ఉన్నాడని అన్నారు. తాడికొండలో బ్రహ్మంగారి మఠం ఊరి వెలుపల ఉండేది. అక్కడికి పోయి మామిడి కాయలు కొట్టుకుని ఉప్పునంజుకుని తినేవాళ్లం.

శివరాత్రికి ప్రభలు కట్టి కొందరు కోటప్ప కొండకు పోతూఉండేవారు. 'హరిలోరంగ హరి' అంటూ తిరిగే జియ్యరులు శంఖం ఊదుతూ వచ్చే జంగం దేవరలు, సోదెమ్మలూ, అర్ధనారీశ్వర వేషాలు ధరించి వచ్చే కూచిపూడి భాగవతులూ, వారు ఆడే ప్రహ్లాద- ఉష నాటకాలు నాకు బాగా గుర్తున్నాయి. 'చెలియా కనరావా' గ్రామఫోను రికార్డు - 'కనపడువరకే కాదీలోకం కలదింకెంతో సౌందర్యం' ఈ పాట స్వప్న సుందరిలోది కాబోలు. నా మూడవ క్లాసులో ఓ మాస్టారు సముద్రగుప్తుడు ఒక రాజు అని పాఠం చెపుతున్నాడు. 'అంటే అతడు సముద్రంలో రహస్యంగా దాక్కొని ఉంటాడా మాస్టారూ?' అని ధైర్యంగా లేచి నిలబడి ప్రశ్నించాను. నా ప్రజ్ఞకు సంతోషపడవలసింది పోయి 'వేలెడు లేవు వెధవవు - ఏమిటీ పిచ్చి ప్రశ్నలు' అంటూ బెత్తంతో కొట్టాడు. ఎందుకు కొట్టాడో నాకు ఇప్పటికీ అర్థం కావటం లేదు.

తాడికొండలో మర్రి చెట్టు ఉండేది. దాని మీద గద్దలు, రామచిలుకలు విశ్రమిస్తూ ఉండేవి. ఋషి పక్షులు చీకటి పడితే రొదచేస్తుండేవి. పక్కనే వేణుగోపాల స్వామి వారి గుడి - వైశాఖమాసంలో తిరుణాలకు పొన్నమాను ఊరేగింపు - వర్తకులు బెల్లంతో చేసిన జిలేబీలు, లడ్డూలు అంగళ్ళలో అమ్ముతూ ఉండేవారు. ఆలయం పక్కనే ఓ కొయ్యరథం ఉండేది. ఇప్పుడది శిథిలమైపోయింది. చెరువు గట్టుమీద ఓ శివాలయం. ఊరికి మధ్యలో గాంధీ, కస్తూరిభా గాంధీల బొమ్మలు. చెరువు గట్టుచుట్టూ మర్రి చెట్లు - రైతులు చుట్టలు కాల్చుకుంటూ విశ్రమించి కబుర్లు చెప్పుకుంటూ ఉండేవారు. మాది ఓ పెంకుటిల్లు. ఓనాడు నా తొడ మీద ఓ పాము పడింది. ఏదో తాడు కాబోలునని చేతితో అవతలికి నెట్టివేశాను. తీరా చూస్తే దాని నోట్లో ఓ ఎలుక వుంది. ఎవరో వచ్చి కొట్టి చంపారు. అప్పుడు నా వయసు ఐదేళ్లు. నా చిన్నతనంలో మా నాయన గారు శ్రీశైలం వెళ్ళి మార్గమధ్యంలో చనిపోయారు. దానితో ఒక్కసారి మా కుటుంబ ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తమైంది. మాతామహస్థానం వచ్చి చదువుకున్నాను. స్వప్న సుందరి, కీలుగుర్రం, రక్షరేఖ, పల్లెటూరి పిల్ల, సంసారం ఆనాటి (1948-50) సినిమాలు, బుర్ర కథలూ, తోలు బొమ్మలాటలు పల్లెటూళ్లల్లో వినోదాలు. ఒక విప్రవినోదివచ్చి రూపాయిని కప్పగా మార్చాడు. పీసపాటి, పూర్ణిమ, అద్దంకి, షణ్ముఖి ఆంజనేయులు వంటి వారు కురుక్షేత్ర నాటకం ఆడేవారు. రాత్రి పదింటికి మొదలు పెడితే తెల్లవార్లూ నడుస్తూనే ఉండేది. చిన్నపిల్లలు నాటకాలు, సినిమాలు చూస్తే చెడిపోతారని పెద్దలు వారించేవారు.

1950 ప్రాంతంలో గుంటూరుజిల్లాలో కాంగ్రెస్, కమ్యూనిష్టు - రెండు పార్టీలు ఉండేవి. ధనికులు, స్వాతంత్ర్య సమరయోధులు కాంగ్రెసు పార్టీలో ఉండేవారు. కూలీ నాలీ చేసుకుని బ్రతికే రైతుకూలీలు కమ్యూనిష్టు పార్టీని నమ్ముకునే వారు. మేము అధికారంలోకి వస్తే ఐదెకరాల భూమి, ఇంటింటికీ పాడి ఆవు ఇస్తాము అని చెప్పేవారు. 1952లో జరిగిన ఎన్నికల సభలకు శ్రీ గోగినేని రంగనాయకులు, నీలం సంజీవరెడ్డి, గార్లు కాంగ్రెసు పార్టీ పక్షాన, పృథ్వీసింగ్, శ్రీపాద అమృతడాంగే. జి. వరలక్ష్మి గార్లు కమ్యూనిష్టు పార్టీ పక్షాన గ్రామాల్లో తిరిగి ఎన్నికల ప్రచారం చేసేవారు. మేము పిల్లలం ఎవరు ఏ జెండా ఇస్తే అది పట్టుకుని తిరిగేవాళ్లం. జెండా అంటే గుర్తుకు వచ్చింది. 1945లో మా మాస్టారు మా చేత కొయ్యకోతులు పట్టించి దసరాకు ఇంటింటికీ తిప్పించారు. "అయ్యవారికి చాలు ఐదు వరహాలు పిల్లవాండ్రకు చాలు పప్పుబెల్లాలు" అని పాటలు పాడించారు.

'ఆర్తజనకుముదచంద్రోదయా - ఆశ్రిత విద్వత్ జనాధారా' అని ధనికులను ప్రశంసించేవారు. ఆ మాటల అర్థాలు అప్పుడు మాకు తెలిసేవి కావు.

తాడికొండ చెరువు గట్టు మీది నుండి అడ్డంగా పడి నడుచుకుంటూ లాంఫాంమీదుగా గుంటూరు చేరే వాళ్లం. దారిలో తేళ్ళూ పాములూ కన్పడేవి. అదో ఉత్సాహం, ఉద్వేగం. పదేళ్ళ వయస్సులో ఎంత నడిచినా శ్రమ కన్పడేది కాదు, ఎంత తిన్నా ఆకలికి హరించుకొనిపోతూ ఉండేది. మా ఊళ్లో సాయంకాలం కాగానే ఆముదపు దీపాలు లేదా కిరోసిన్ దీపాలు పంచాయితీ సమితి వారు పెట్టేవారు. ఇప్పుడు (2009) వెళ్లి చూస్తే గ్రామంలో టి.విలు, ట్రాక్టర్లు, రిఫ్రిజిరేటర్లు వచ్చాయి. నా చదువు ఆముదపు దీపాలతోనే నడిచింది. ఆనాటి మా టీచర్లు ఏమైనారో తెలియదు!

వంగర శ్రీ రామావధాని తెలుగు చెప్పేవాడు. ఓ పేద హిందీమాస్టారు ఉండేవాడు. ఆయన 2008లో సువర్ణ గండ పెండేరం గ్రహీత. 2006లో కనకాభిషేకం జరిగింది. రాయబారం నాటకంలోని పద్యాలు శ్యావ్యంగా పాడేవారు. గోగినేని కనకయ్య గారు మా హైస్కూలు సెక్రెటరీ. రాయపాటి సాంబశివరావుగారు నాకు జూనియర్ కావచ్చు. ఒకే హైస్కూలులో చదివాము. తర్వాత యూనివర్సిటీలల్లో చదివి యూనివర్సిటీ ప్రొఫెసర్ ఉద్యోగాలు చేసినా నా పదేండ్లలోపల బాల్యం మాత్రం అమూల్యంగా ప్రతి సంఘటన సుస్పష్టంగా నేటికీ నా స్మృతి పథంలో మిగిలి ఉంది.

నేను పుట్టిన ప్రాంతంలో ఎండలు తీవ్రంగా ఉండేవి. గాలిదుమారాలు మధ్యాహ్నం సుడిగాలులు మరీచికలు సముద్రతీరంలో ఉప్పు పండించే కళ్లాలు - రాబందుల రెక్కల చప్పుళ్లు- వీటి మధ్య కాలినడకతో ఒంగోలుకు ఒంటరి ప్రయాణం - దాహమైతే కొప్పోలు చెరువు చేరే వరకు నీళ్లు లేవు - ఇళ్ళు లేవు. సుడిగాలిలా దయ్యాలుంటాయని భయపెట్టేవారు. కొంచెం ధనవంతులు రెడ్డిగారు ఒంగోలు గిత్తలు పూన్చిన రెండెడ్ల బండిలో పరదాలు పరుపులు వేసుకుని ప్రయాణాలు చేసేవారు - సైకిళ్లు లేవు - రేడియోలు లేవు - ఎవరు ఎటు పోవాలన్నా నడకయే ప్రయాణ సాధనం. లేదా ఒంటెద్దు బండి. దారిలో చింతకాయలు కోసుకుంటూ కీలు గుర్రం, స్వప్న సుందరి సినిమా పాటలు పాడుకుంటూ ఉత్సాహంగా నడవటమే.

ఆకులల్లూరులో చెరువు గట్టు మీద భ్రమరాంబమ్మ ఓ సత్రం కట్టించింది. రాత్రివేళ బైరాగులు బాటసారులు అక్కడ విశ్రమించేవారు. భ్రమరాంబమ్మ కోడలు 'ఓ భారతీయుల

పాలిటి పిశాచీ – దారి విడిచి చేరో ఇంగ్లాండూ, అని పాటలు పాడుతూ ఉండేది. ఇదంతా 1945కు ముందు ఆంధ్ర దేశంలోని ఓ పల్లెటూరి సజీవచిత్రణం. గ్రామంలోకి గ్రామఫోను రికార్డులు ప్రవేశించాయి. కుక్కబొమ్మ గిరగిరతిరిగే హిజ్ మాస్టార్ వాయిస్ గ్రామఫోను రికార్డులు వచ్చాయి. ఘంటసాల పాటలు, కొవ్వలి, జంపన నవలలు; బ్రహ్మంగారి కాలజ్ఞానతత్వాలు, జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి ఉదయశ్రీ పద్యాలు క్రమక్రమంగా 1947 తర్వాత ఒక సాంస్కృతిక మహత్తర పరిణామం జరిగింది. ఆనాటి అస్వతంత్రభారతానికి సాక్షిగా నేను మిగిలాను. నా బాల్యం మిగిలింది.

కళ్లు మూసుకుంటే సినిమారీల్స్ లాగా కొత్తపట్నం తీరంలోని నాటు పడవలు తమలపాకుతోటలు, పుల్లఅట్లు పోసి అమ్మే పెద్దమ్మ వాల్‌కమాన్ ఆకులల్లూరు, చింతల నల్లవాగు కొప్పోలు చెరువు గట్టుమీది రామాలయం గగనేందిర గళసీమ నుండి జారిన కెంపులు పొదిగిన పచ్చలహారంలాంటి చిలుకల దండు అన్నీ మధురమనోహరంగా కన్పడుతూ ఉన్నాయి.

నేను పుట్టిన, పెరిగిన ఈ రెండు పల్లెటూళ్లకూ కొంత చరిత్ర ఉంది. తాడికొండ పేరు తాన్రికొన్ర అని నాల్గవ శతాబ్దం నాటి శాసనాలలో ఉదాహరించారు. ఇక్కడికి సమీపంలోని లాములో పెద్ద భూగర్భ నిక్షేపం రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడుగారికి దొరికింది.

ఇక ఆకులల్లూరు పేరు 1830 లో ఏనుగుల వీరస్వామి గారు తన కాశీయాత్రలో ఉదాహరించారు. ఒక రాత్రి ఆయన ఇక్కడ విశ్రమించాడు. ఈ సమీపంలోనే కరవడి అనే మరో గ్రామం ఉంది. ప్రసిద్ధనటి కాంచన జన్మస్థలం ఇదే. ఇక జి.వరలక్ష్మి, భానుమతి నా బాల్యంలో ఒంగోలులో ఉన్నారు. తర్వాత చిత్రసీమకు వెళ్లారు.

తాడికొండలో బాల్యంలో నా రచనా వ్యాసంగం ప్రారంభమయింది. 1953లో అంటే నా పదమూడవ ఏట ఛందోబద్ధమైన సీసములు, తేటగీతలు వ్రాసి మా తెలుగు టీచర్‌కు చూపించినాను. ఆయన సంతోషించాడు. అది 1954. అదే నా ముద్రిత ప్రథమ రచన. 'ఇందలి శిల్ప సౌందర్యము కడు రమణీయము' అని ఆ సావనీర్‌ను మెచ్చుకుంటూ తెలుగులెంక శ్రీతుమ్మల సీతారామమూర్తిగారు ఆశీస్సులు పంపారు.

దెబ్బది ఏళ్లనాటి జనపదం: భైరవయ్య ఒక అమాయకుడు. ఒక నాడు వచ్చి 'కాకులు నేతి గరిటెలు ముక్కున కరచుకొని పోయి తమ గూళ్లల్లో దాచి పెట్టుకుంటుంటాయి. వెళ్లి తీసుకు వద్దాం' అన్నాడు. అప్పుడు నా వయస్సు ఎనిమిదేండ్లు ఉండవచ్చు. ఆకులల్లూరులో చిటికేశ్వరపు చెట్లు ఉండేవి – చెట్ల పైన కాకి గూడు

కన్పడింది – ఎక్కి చూస్తే నేతి గరిటెలు కన్పడ లేదు. కాని కాకి పిల్లలు రెండు ఉన్నాయి. ఇంకేముంది రెండు కాకులు భయంకరంగా అరుస్తూవచ్చి నెత్తిమీద పొడవడానికి సిద్ధపడ్డాయి. దీనిని సహజాతం అంటారు. కాకిపిల్ల కాకికి ముద్దు అంటారు కదా!

దాలిగుంటలో కుక్కలు పడుకునేవి. వాటి పిల్లలు కూడా ఆట వస్తువులే – పెంపుడు కుక్కలు కాబట్టి అరిచేవి కావు కరిచేవి కావు – ఆ రోజుల్లో టిటనస్ యాంటీరాబిస్ ఇంజక్షన్ల అవసరం ఉంటుందని మేము విని ఎరుగము.

అడవి రామలింగస్వామి దేవాలయం ఓ మూడు కిలో మీటర్ల దూరంలో దట్టమైన ఆకు తోటలు మధ్య ఉంది. వర్షాలు పడకపోతే అభిషేకాలు చేసేవారు. కార్తీక మాసంలో వన భోజనాలు చేసేవారు.

చుట్టూ అరటి, కొబ్బరి,తమల పాకు తీగలు పూల చెట్లూ సరుగుడు చెట్లూ ఉండేవి – నాలుగడుగులు ఇసుక తవ్వితే అమృతోపమానమైన స్వచ్ఛమైన కొబ్బరి నీళ్ల వంటి జలం పైకి ఉబికి వచ్చేది – దానితోనే వంటలు, అభిషేకాలూ. తుమ్మలపల్లి మంత్రయ్యమామ గొప్ప శివపూజా పరుడు. ఆయన పూజా సమయంలో రుద్రాక్ష కిరీటం ధరించి పరమ శివుని వలె కూర్చునేవాడు. వాళ్ల ఇంటి వద్ద తాటి దుంగలు పోలేరమ్మ తెచ్చి పడేసిందని కథలు చెప్పేవాడు. ఒసేపోలీ! నిప్పు తీసుకురా! అంటే చుట్ట ముట్టించుకోవడానికి పోలేరమ్మ నిప్పు తెచ్చి ఇచ్చిందట! ఈ కథలలోని సత్యాసత్యాలు ఎలా ఉన్నా మా పసి హృదయాలకు వినడానికి చాలా ఆహ్లాదంగా ఉల్లాసంగా ఉండేవి.

జ్వాలాముఖీ దేవాలయం దగ్గర ఒక గణాచారి ఉండేది – ఆమెకు పూనకం వస్తే భవిష్యవాణి చెప్పేది – అక్కడ ఒక ఆబోతు కూడా స్వేచ్ఛగా తిరుగుతూ ఉండేది – ఇదేదో వేయి పడగల కథలా అనిపించేది. టంగుటూరి ప్రకాశం పంతులు గారు ఇతర కాంగ్రెసు నాయకులు తరుచువచ్చి రెడ్డిగారి శంభయ్య శేషమ్మల (గ్రామ పెద్దల)ను కలిసి ఏవేవో రాజకీయాంశాలు, పంచాయితీ ఎన్నికల వంటివి చర్చించి వెళ్లుతూ ఉండేవారు. ఒకసారి ఇద్దరు వర్తకుల మధ్య పోటీ వచ్చింది. ఒకడు కాయ (సీసా) కిరోసిన్ బేడాకు (పన్నెండు పైసలకు) పోస్తే మరొకడు అణా (ఆరు పైసల)కే పోశాడు – తర్వాత ఇద్దరూ దివాలా తీశారని విన్నాను.

చౌడు మట్టి పొలాలకు ఎరువు వేస్తారా? ఏమో మరి – మట్టి గోడల వద్ద చౌడు (ఉప్పురిసిన) మట్టిని చిన్న కుప్పలుగా పిల్లలం సేకరించి పెట్టుకుంటూ బండ్ల మీద వచ్చి బేడా ఇచ్చి మట్టిని కొనుక్కుని పోతూ ఉండేవారు. ఉప్పును మానికలతో అమ్మేవారు. రూపాయికి ఇరవై మానికలు.

మానికకు రెండు తవ్వలు. తవ్వకు రెండు సోలలు సోలకు రెండు గిద్దలు - గిద్దకు రెండు అరగిద్దెలు ఇవీ ఆనాటి (1945) వాటి కొలతలు. అలాగే తూకాలల్లో కూడా పడి కట్టు రాళ్లు వాడేవారు. వాటి సామ్రాజ్యం ఏమిటో తెలియదు. శేరు - సవాశేరు - ఇలా తూకం రాళ్లు ఉండేవి - అవి బండ రాళ్లే. వాటిపై ఎటువంటి సర్కారీ స్టాంపు ఉండేది కాదు - ఇక కొయ్యత్రాసులు ఎటు కావాలంటే అటే వంగుతూ ఉండేవి - ఐనామోసం జరిగిందని ఎవడూ కంప్లైంట్ చేసేవారు కాదు.

ఒక బ్రాహ్మణ కుటుంబంలో విధవా పునర్వివాహం జరిగింది. ఆ కుటుంబాన్ని తక్కిన వారు వెలివేశారు. అలా ఎందుకు జరిగిందో అప్పుడు మాకు తెలియదు ఎవరైనా విదేశాలకు సముద్రం దాటి వెళ్లి వస్తే నాలుక కాల్చుకొని ప్రాయశ్చిత్తం చేసుకోవాలట. కాశీకి పోయి వస్తే కాటికి పోయిన వారితో సమానం (ఏనుగుల వీరస్వామి 1830 కాశీ యాత్ర చదవండి. 1900లో చెల్లపిళ్ల వెంకట శాస్త్రి గారి కాశీయాత్ర కూడా చదవండి - నేను వ్రాస్తున్నది. 1946 నాటి మాట). ఎవరో నల్లటి కాశీ దారాలు పందేరం చేశారు. కాశీకావళ్లు - కాశీ చెంబులు అందులో గంగా జలం ఉంది. కాశీ సమారాధన చేసి గారెలు వండి పెట్టారు. ఒక మాంత్రికుడు వచ్చి తాను అంజనం వేసి పోయిన దొంగడబ్బు కంటిపాపలో చూపిస్తానని చెప్పాడు. అతనిని గ్రామస్థులు నమ్మారు.

ముగ్గులో నన్ను కూర్చుండబెట్టారు - నాకంటిపాపలో ఆ పోయిన వారి డబ్బును ఎవరు దొంగిలించారో కన్పడిందట!!

అక్కడ ఒక వీధి బడి ఉండేది. చంద్రయ్య పంతులు పెద్దబ్బాయి పంతులు పాఠాలు చెప్పేవారు. రెండు రెళ్ల నాలుగు, రెండు మూళ్ల ఆరు ఇట్లా నోటికి ఎక్కాలు వప్ప జెప్పించేవారు. ఇంగ్లీషు అక్షరాలు నేర్పించారు కాని అవేవో గందర గోళంగా కన్పడ్డాయి - నాలుగు రకాల ఆల్ఫ బెట్ ఎందుకు ఉన్నాయో మాకు తెలిసేది కాదు.

ఆడంగి రేకుల సుబ్బారాయుడు 'చందమామ' (1948) మాసపత్రిక తెచ్చాడు - అందులో బాలనాగమ్మ సీరియల్ వస్తూ ఉండేది - నేను కనకం, బుల్లి ప్రసూన - ఇంకెవరో పిల్లులూ పుస్తకం చదువుకొని ఆనందించాక 'నీవు ఆడంగి రేకుల వాడివి - ఆడపిల్లలు ఆడుకునే చోటికి రాకూడదు' అంటూ చెవి మెలేసేవారు. అష్టా చెమ్మా, వామన గుంటలు, చుక్ చుక్ పుల్ల (మట్టిలో పుల్ల దూరుస్తారు - అదెక్కడ ఉందో ఐడెంటిఫై చేసి అక్కడ చేతిని పెట్టాలి) వెన్నెల కుప్పలు రాత్రి వేళ ఇసుకను అక్కడక్కడ చిన్న పరిమాణాల్లో అంటే చిటికెడు చిటికెడు కుప్పలు పోయాలి. వాటిని అవతలి పక్షంవారు గుర్తించి లెక్కపెట్టాలి - ఇలాంటివి మా ఆటలు-

మా పెద్దమామయ్య రెడ్డిగారి దొడ్డిలోకి వెళ్లి చిన్న దూడల మూతల చిక్కాలు విప్పి వచ్చేవాడు - ఇది ఆట కాదు పోకిరీతనం (ఇప్పుడతడు కావలి జవహర్ భారతిలో లెక్చరర్‌గా పనిచేసి విశ్రాంత జీవితం గడుపుతువున్నాడు).

తెల్లవార్లు వర్షం పడితే చెరువులు పొంగేవి - అదనపు నీళ్లకు అలుగుల ద్వారా సముద్రంలోకి (బకింగ్ హాం కాలువలోకి కాబోలు) వదిలేవారు. ఈ బకింగ్ హాం ఎవడో ఆ కాలువ ఎప్పుడు తవ్వారో మాకు తెలియదు. ఇది ఒంగోలు కొత్తపట్నం మధ్యలో ఉండేది - ఈ రెండు గ్రామాల మధ్య దూరం నాలుగు మైళ్లు - (అంటే ఆరు కిలో మీటర్లు.)

బ్రాహ్మణ వీధులు వైశ్యుల వీధులు రెడ్ల వీధులు సాలె వీధులు కుమ్మరి వీధులు ఇలా వేరు వేరుగా ఉండేవి - తర్వాతి కాలంలో బ్రాహ్మణులు తమ భూములు ఇళ్లు తెగనమ్ముకొని వచ్చినకాడికి తీసుకొని పోయి ఒంగోలులో స్థిరపడ్డారు. కనీసం పౌరోహిత్యం చేసే కుటుంబాలు కూడా లేవు - ఏనుగుల వీరాస్వామి అనే ఈస్టిండియా కంపెనీ ఉద్యోగి మద్రాసు నుండి కాశీ పోతూ దారిలో (తిరుగు ప్రయాణంలో ననుకుంటాను) ఆకులల్లూరు వచ్చాడట. ఈ కొత్తవానికి ఆతిథ్యం ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాలేదని తన కాశీ యాత్ర చరిత్రలో వ్రాసుకున్నాడు - ఈ గ్రంథం నా వద్ద ఉంది. మా ముత్తాత అంజయ్యగారు. ఆయనకు జాలయ్య జాలమ్మ రుక్మిణమ్మ పిచ్చమ్మ రామలింగం అని సంతానం ఉండేవారు. వీరంతా శివపూజాధురంధరులు. వీరిలో రామలింగం - రుక్మిణమ్మ గారు వరంగల్‌లో స్థిరపడ్డారు - ఆనాడు దానిని నిజాం రాజ్యం అని పిలిచే వారు.

ధాన్యాన్ని గాదెలలో పోసేవారు. గాదెలను పేడతో అలికి ఎండ బెట్టేవారు. మరి కొంత ధాన్యం భూమిలో పది అడుగుల కింద దాచి పెట్టేవారు. దాని పైన వరి గడ్డి వేసేవారు. కొయ్య భోషాణాలు ఉండేవి. అందులో పాలు పెరుగు కుండలు ఉంచేవారు బ్రాహ్మణులు ఆవులను గేదెలను పెంచేవారు. వ్యవసాయం సరేసరి-

ఆనాటి గ్రామీణ వ్యవస్థలో కులాలు ఉండేవి కాని కుల ద్వేషాలు ఉండేవి కావు.

మాదిగలు మాలలు మాత్రం ఊరికి వెలుపల వేరే వాడలలో ఉండేవారు - చెప్పులు కుట్టడం పశు పోషణ - వంటివి వారి వృత్తి-

పసేబు అనే పాలేరు నాకు చెప్పుల జత ఇచ్చాడు - ఇది యూసఫ్ శబ్ద భవం - అంటే అప్పటికే క్రైస్తవులు భారత దేశంలోని నిమ్నజాతులను మతం మారుస్తున్నారని అర్థమవుతున్నది. ఈ సంగతి ఎవరూ గమనించలేదు. "జై హరనాథ జై కుసుమకుమారి" అంటూ నాయుడిగారి ఇంట్లో భజనలు జరిగేవి. ఈ కుసుమ కుమారి ఎవరో హరనాథ్

ఎవరో కూడా తెలియదు–ఉత్తరాది నుండి తమ బిడ్డలకు ఈకల్ట్ వచ్చిందని విన్నాను. అప్పుడు హరనాథ్, కుసుమ వంటి పేర్లు భక్తులు పెట్టుకొనేవారు. ప్రతి ఇంట్లోనూ గడ్డివాములు ఉండేవి– పల్లమ్మ చెరువు వద్ద శివాలయం, దక్షిణపు వీధిలో విష్ణ్వాలయం పడమట చెరువు వద్ద జ్వాలాముఖి ఉండేవి.

కొత్తపట్నంలో టూరింగు టాకీసు వచ్చింది. రేకులతో కొయ్యలతో దీని నిర్మాణం జరుగుతుంది. అందులో "రత్నమాల" సినిమా సింగిల్ ప్రొజెక్టర్‌లో వేశారు. 1948వ సంవత్సరం అన్నట్లు గుర్తు. అప్పటి వరకూ గ్రామంలో బుర్ర కథలూ తోలు బొమ్మలాటలు మాత్రమే ఉండేవి. మధ్య మధ్య విప్రవినోదులు వచ్చి రూపాయి నాణెమును కప్పగా మార్చేవారు. 'బావులు పూడ్పిస్తాం చెరువులు తవ్విస్తాం' అంటూ కొయ్యతుపాకీ పట్టుకొని టోపీ పెట్టుకోని ఓ పిట్టల దొర వచ్చేవాడు. బ్రూక్ బాండ్ టీ వారు వచ్చి అందరికీ నెల రోజులు మధ్యాహ్నం ఉచితంగా కాఫీ ఇచ్చేవారు. తర్వాత మాని వేశారు. ఇలా కాఫీ – టీలు అలవాటు చేసి కోమటి దుకాణాలల్లో ప్రొడక్ట్సు అమ్మకానికి ఉంచేవారు. ఇదొక వ్యాపార రహస్యం అన్నమాట! గోనిగుంట వెంకటేశ్వర్లు ఎర్ర కిరోసిన్ అమ్మితే వెంకట సుబ్బయ్య పచ్చ కిరోసిన్ అమ్మేవాడు. రంగూన్ బియ్యం వచ్చేవి పొలాలల్లో పండే బియ్యం కూడా ఎర్ర రంగులో ఉండేవి – వడ్లమరలు లేవు. దంపుడు బియ్యం – రోకళ్లు – రాతి కుందులు ఉండేవి. రూపాయిని చూచి ఎరుగము. పచ్చనోటు (వందరూపాయలు) పెద్దలకు కూడా కన్పడేది కాదు. రూపాయికి చాలా విలువ ఉండేది. దమ్మిడీలు, చిల్లి కానీలు, అర్ధణాలు చెలామణీలో ఉండేవి. అల్లం బెల్లం ఉప్పు చింతపండు ఏదైనా కానీ పెడితే వచ్చేవి!!

వరంగల్‌తో మా సంబంధం చాలా పురాతన మైనది. కాకతీయ ప్రభువు మహా రుద్ర దేవుడు పాలిస్తున్నప్పుడు. ఉద్భటారాధ్య వంశీయుడైన విశ్వారాధ్యుడు వరంగల్ వచ్చినట్లు చెపుతారు. వారికి నల్గొండ జిల్లా దేవరకొండ వద్ద అగ్రహారం ఇవ్వబడింది – అది నేటికీ ముదిగొండ అనే పేరుతోనే పిలువబడుతున్నది – శ్రౌత శైవం – అంటే మల్లికార్జున పండితారాధ్య ప్రోక్తం ఆంధ్ర ప్రదేశ్‌లో ముఖ్యంగా తెలంగాణాలో వ్యాపించింది. కర్ణాటకలో బసవేశ్వర ప్రోక్తమైన వీరశైవం ప్రవర్ధ మానమయింది.

1942 ప్రాంతంలో మా నాయనగారు వరంగల్‌లో టీచర్‌గా పనిచేశారు. అక్కడ మాకు సంప్రదాయ శైవ శిష్యగణం ఉండేది. ఒక నాడు వేయి కమలాలతో మా నాయనగారికి (ముదిగొండ మల్లికార్జున రావు) కొండూరి వారు పాద పూజ చేశారు.

అక్కడ నేటికీ పులిపాక, భండారు, అత్తాలూరి శివదేవుని వంటి కుటుంబాలు చాలా ఉన్నాయి.

ఆ రోజుల్లో హాలీ, కల్దార్ అని రెండు రకాల నాణెములు ఉండేవి - అంటే అప్పటికి నిజాం రాష్ట్రం ప్రత్యేక దేశంగా ఉండేది. పాలకుడు ముస్లిం, పాలితులు దెబ్బది శాతం హిందువులు. 1947 స్వాతంత్ర్యం వచ్చాక రజాకార్ ఉద్యమంలో చాలామంది హిందువులు మానప్రాణాలు ఆస్తులు కోల్పోయి వలస కూలీలై విజయవాడకు పోయారు.

ఆ రోజుల్లో ఇక్కడ 'దివ్యవాణి' అనే పత్రిక సికిందరాబాదు నుండి వస్తుండేది - సంపాదకుడు చివుకుల అప్పయ్యశాస్త్రి. రచయితలు మా నాయనగారి వంటివారు. ఇది ప్రధానంగా సనాతన ధర్మాన్ని వంగపల్లి నీలకంఠం (యువభారతి వంగపల్లి విశ్వనాథం గారి తండ్రి) జూలూరి విరేశలింగం వంటి ప్రముఖ వైశ్యులు శైవధర్మాన్ని పోషించేవారు. బూరుగు మహాదేవ శ్రేష్ఠి ఇంట్లో బంగారు ఇటుకలు ఉండేవని చెప్పుకునే వారు. కొండూరి రామలింగం బుచ్చిరాజులు గారు వేంకయ్య లింగం ఆకారపు నరసింగం గుప్త వంటి వరంగల్ శ్రేష్టులు గొప్ప శివపూజాధురంధరులు. వరంగల్‌లో పులిపాక మహానంద శాస్త్రిగారు మాకు బంధువులు. వారి కుమారుడు కేదారీలింగం ఇంగ్లీష్ లెక్చరర్. మంచి విద్యాంసులు. మహానంద శాస్త్రిగారు శివపూజ చేస్తుంటే "పట్టు" (పూజా రంగవల్లి) మీదికి ఒక సర్పం వచ్చింది. ఆయన చలించకుండా అలాగే పూజ చేశాడు. పాము ఎలా వచ్చిందో అలాగే పోయింది.

నా బాల్యం ప్రధానంగా వరంగల్, ఆకులల్లూరు, తాడికొండ - ఈ మూడు గ్రామాలతోనే ముడిపడి ఉంది - క్రమంగా విద్యాబుద్ధులు నేర్చుకొని ఒంగోలులో కొంత తాడి కొండలో కొంత హై స్కూలు విద్యాభ్యాసం ముగించి ఒంగోలు సి-ఎస్-ఆర్. కళాశాలలో ఇంటర్ మీడియట్ పూర్తి చేశాను. అప్పుడు ధారా రామనాథ శాస్త్రిగారు, ఎం. వి. ఎస్ శర్మగారు, భాగమతుల మార్కండేయ శర్మగారు మా తెలుగు అధ్యాపకులు - అప్పుడు మొక్కపాటి కృష్ణమోహన్ అనే మహా నటుడు ఒంగోలులో ఉండేవారు. అనాడు మాకు నటన అంటే ఏమిటో నేర్పాడు. సరదాగా కళాశాల పోటీలల్లో సాంఘిక నాటకాలు వేశాము. ఆవిధంగా నేను నేర్చుకున్న నటన వక్తృత్వ విద్య తర్వాతి కాలంలోనాటకీయ రచనా శిల్ప నిర్మాణంలో నవలలకు సహాయ పడింది. అలాగే తదనంతర కాలంలో ఎనిమిది వందల భువన విజయ ప్రదర్శనములిచ్చాము. అందుకు స్ఫూర్తి బాల్యంలో నేను నేర్చుకున్న నటనయే!

కె - వి- రమణా రెడ్డి విప్లవ రచయిత - మాకు ఇంటర్‌లో బ్రిటిషు హిస్టరీ పాఠం చెప్పారు. తర్వాత డిగ్రీ ఒంగోలులో లేక పోవడం వల్ల కావలి వెళ్లి బి. ఏ

చదువుకున్నాను. అక్కడ వేదుల సత్యనారాయణ శాస్త్రి, పిన్నంరాజు సుబ్రహ్మణ్య శర్మ, శ్రీరాం వేంకటభుజంగరాయశర్మ వంటి అధ్యాపకులు నాపై ప్రభావం చూపారు. ఎం. ఏ చదువుకునేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయంవెళ్లాను. అక్కడ దువ్వూరి వెంకట రమణశాస్త్రిగారు, గంటిజోగి సోమయాజుగారు, భద్రిరాజు కృష్ణమూర్తిగారు, ఎస్.వి. జోగారావుగారు, కె. వి. ఆర్–నరసింహంగారు, కొర్లపాటి శ్రీరామమూర్తి, తూమాటి దొణప్ప వంటివారు అధ్యాపకులుగా ఉండేవారు. చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు అప్పటికి ఇంకా రిసెర్చ్ స్కాలర్ గానే ఉన్నారు, రాష్ట్రీయ స్వయం సేవక సంఘనాయకుడు, చాలా సత్పురుషుడు. విశాఖలో తెన్నేటి విశ్వనాథం గారింట్లో సారస్వత సమావేశాలు జరుగుతూ ఉండేవి. నేనూ పాటీలు తిమ్మారెడ్డి, కూరుటూరి పాండు రంగారావు గార్లు ముగ్గురం మంచి మిత్రులం. మమ్మల్ని కవిత్రయం వారు అని తోటి విద్యార్థులు, అధ్యాపకులు పిలిచేవారు. సాగర తీరంలో రెండేండ్లు సాహిత్య చర్యలు చేస్తూ జీవితాలు గడిపాము. ఎం. ఏ.లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుణ్ణి అయిన తర్వాత ఉద్యోగం కోసం హైదరాబాదు వచ్చాను. అప్పటికి ఇక్కడ సి. నారాయణ రెడ్డి, దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వామి, దివాకర్ల వేంకటావధాని వంటి లబ్ధ ప్రతిష్ఠులైన కవి పండితులు ఉన్నారు. ముందు కొంత కాలం ఒక హై స్కూలులో అధ్యాపక వృత్తి నిర్వహించాను. తర్వాత జర్నలిష్టుగా కృష్ణా పత్రికలో నాలుగేండ్లు పని చేశాను. ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల, బద్రుకా కళాశాలల్లో లెక్చరర్‌గా పని చేస్తూ 'ఆధునికాంధ్రకవిత్వములపై ఉద్యమ ప్రభావము' అనే అంశముపై పరిశోధన చేసి పిహెచ్. డి. పట్టం పొందాను. అప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా నియమింపబడ్డాను. భాగవతుల ఉమాదేవితో వివాహం జరిగింది – అప్పటి వరకు ఉపన్యాసాలు ఇస్తూ దేశం పట్టుకొని తిరిగే నాకు ఒక స్థిరత్వం వచ్చింది. క్రమంగా రచనావ్యాసంగం మొదలైంది. సమ్రాట్ పుష్యమిత్ర (నాలుగు చారిత్రక వాటికల సంపుటి), మహాసర్గ (కవితా సంపుటి) వెలువడ్డాయి. క్రమంగా కథానికా రచన తగ్గించి చారిత్రక నవలలు వ్రాయటం మొదలు పెట్టాను. నాకు బాగా పేరు తెచ్చి పెట్టిన నవలలు ఆవాహన, శ్రీ లేఖ, అనుభవమంటపం – శ్రీ పదార్చన వంటివి 1970–80 దశకాలలో రచించినవే – తత్ఫలితంగా నాకు చారిత్రక నవలా చక్రవర్తి అనే బిరుదు లభించింది. ఆచార్య బి. రామరాజు, ముదిగొండ, సుబ్రహ్మణ్యశర్మగార్లు నా ప్రగతికి చాలా సహాయపడ్డారు.

నేను చారిత్రక నవలా రచన చేయడానికి మూడు కారణాలు: మొదటిది గత వైభవ పునరుద్ధరణకు చారిత్రక నవల చాలా తోడ్పడుతుంది – రెండవది విశ్వనాథ, బాపిరాజు వోలె, నరసింహశాస్త్రి, వంటివారు నేడు లేరు – వారి పరంపర ఆగిపోకూడదని ఆ మార్గం ఎన్నుకున్నాను.

మూడవది చారిత్రక నవలలు అంటే గద్య ప్రబంధము. అందులో రచయిత తన విశ్వరూపం చూపడానికి బాగా అవకాశం ఉంటుంది. లభిస్తుంది. చారిత్రక నవలలు జనాదరణ పొందడానికి ముఖ్యకారణం అందులో రీడబిలిటీ, సస్పెన్సు అధికంగా ఉండేటట్లు చూచుకోవటమే. శాతవాహన రాజుల పరంపరపై ఐదు నవలలు - నాగానీక, శ్రీలేఖ, వసంత గౌతమి, శ్రావణి, నాగపూర్ణిమ రచించాను. ఇందులో నాగపూర్ణిమ 2010 వైశాఖ పూర్ణిమకు వెలువడింది.

అప్పటికి 75 రచనలు చేశాను. గుణాఢ్యుని ప్రాకృత బృహత్కథ సంస్కృత సోమదేవసూరి కథాసరిత్సాగరం ఆధారంగా తెలుగులో రెండు వందల కథలు రచించినాను. నా రచనలు ఎక్కువ ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ దినవార పత్రికలలో, ధారా వాహికంగా వచ్చాయి. దానికి వారు ఏదో తృణమో పణమో పారితోషికం ఇచ్చేవారు. ఆ డబ్బు గ్రంథ ముద్రణకే ఉపయోగించాను. ఇక ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు రూపొందించిన 'భువనవిజయం'లో మహామంత్రి తిమ్మరుసు పాత్రను 800 సార్లు పోషించాను.

గ్రీకు భాషా భ్యాసం

వరంగల్‌లో ఉద్యోగం చేసినందుకు గుర్తుగా ఆవాహన రచించాను. ఇది వేయిస్తంభాల మంటపం చుట్టూ అల్లబడిన కథ. అలాగే 1955-2000 మధ్య కాలంలో కోఠీ ఉమెన్స్ కాలేజీలో ఉద్యోగం చేశాను. అందుకు గుర్తుగా ఆ కళాశాల భవనం కోఠీ రెసిడెన్సీ పై ఒక నవల వ్రాశాను. ఇందులోని కథానాయకుని పేరు అకిలెస్ పాట్రిక్. అకిలెస్ అనేది గ్రీకు (ఇలియడ్) హీరో పేరు - మన అర్జునుని లాంటి వాడు. ఈ నవలను హకీల్ అహ్మద్, గుడ్ల పరమేశ్వర్ హిందీలోకి అనువదించారు. ఆంధ్ర భూమి (తెలుగు), సియాసత్ (హిందీ) దినపత్రికలలో ధారావాహికంగా వచ్చింది. పరమేశ్వర్ రచన ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ హిందీ సంస్థాన్ పక్షాన అనువదింపబడింది - నాకు మంచి పేరు తెచ్చింది. దీనిలో హైదరాబాదు (250 ఏళ్ల నాటి) సంస్కృతి ఉంది. ఈ సందర్భంగా అకిలెస్ కథ ఏమిటో తెలుసుకోవాలని గ్రీకు పురాణాలు చదివాను. గ్రీకు భాషను (డెమొటిక్) అభ్యసించాను. తత్ఫలితంగా నాకు ఎంతో జ్ఞానం నూతనంగా లభించింది. - సంస్కృతం గ్రీకు అక్కా చెల్లెళ్లు అనే విషయం తెలిసింది.

హైదరాబాదు అనుభవాలు

హైదరాబాదు ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని కావటంలో ఎందరో మహనీయులు ఇక్కడ ఉన్నారు. ఆలిండియా రేడియోలో 1960 ప్రాంతంలో ప్రవేశిస్తే శ్రీకృష్ణ దేవరాయల

వారి భువనవిజయం దర్బారులోకి ప్రవేశించినట్లుగా ఉండేది – స్థానం నరసింహారావు, నాయని సుబ్బారావు, సహజానంద, త్రిపురనేని గోపిచంద్, రావూరి భరద్వాజ, ఫ్లాట్ శ్రీనివాసన్, దేవులపల్లి కృష్ణశాస్త్రి, భాస్కరభట్ల కృష్ణారావు – ఇలా ఎందరో మహానుభావులు ఉండేవారు. నగరంలో కూడా పోతుకూచి సాంబశివరావు ప్రపంచ తెలుగు మహాసభలకు దీటుగా అఖిల భారతీయ తెలుగు రచయితల సభలు ఏర్పాటు చేస్తుండేవాడు. వీరందరి పరిచయాలు, ప్రభావాలు ఎంతో ఉన్నాయి. అవి పోరంకి దక్షిణామూర్తిగారు ఆంధ్ర ప్రభలో ముత్యాల పందిరి ప్రచురిస్తున్న రోజులు. పొత్తూరి వెంకటేశ్వరరావు (ప్రభ-ఎడిటర్) గారితో పరిచయం అయింది- వారు నా నవలలు రెండు వీక్లీలో ప్రచురించారు. అందులో స్వప్నకిరీటం మంచి పేరు తెచ్చుకుంది.

జైలు జీవితం

1975 ప్రాంతంలో జయప్రకాశ్ నారాయణ ఉద్యమం ఎమర్జెన్సీ కాలంలో జరిగింది – నన్ను కొద్ది రోజులు ముషీరాబాద్ సెంట్రల్ జైలులో డిటెన్యూగా ఉంచారు – తర్వాత బెయిల్‌పై విడుదల అయినాను. కేసు కొట్టేశారు. 1977 లో జనతా ప్రభుత్వం ఏర్పడింది.జైలులో నాతో బాటు విప్లవ రచయిత జ్వాలాముఖి, అతని అల్లుడు ఇంకా కొందరు కలిశారు. అదొక విచిత్రానుభవం.

బి-ఎ-వి. శాండిల్య వెండితెర పత్రికను నడిపేవారు. అన్నమాచార్య ట్రస్టును స్థాపించారు. దానికి నేను ప్రధాన ప్రచారకుణ్ణి. వారి బృందంలో బ్రిటన్ జర్మనీ పర్యటించాను. రెండుసార్లు అమెరికా వెళ్లాను "తానా" పిలుపుపై. న్యూయార్క్‌లో భువన విజయం ప్రదర్శన ఇచ్చాము.

అలాగే 2008లో సింగపూర్, షార్జాలు వెళ్లి అక్కడి తెలుగు సంస్థల కార్య కలాపాలలో పాల్గొన్నాను. వికారాబాదులో శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో స్వర్ణకంకణం, గుంటూరులో 2006లో కుర్తాళం సీతాధిపతుల వారి చేతుల మీదుగా కనకాభిషేకం (2008), విశాఖపట్నంలో పద్మశ్రీ డా. యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్‌గారి సంస్థ పక్షాన వారి చేతుల మీదుగా స్వర్ణ గండ పెండేరం స్వీకరించటం, సద్గురు కందుకూరి శివానందమూర్తి గారి కరకమలముల మీదుగా సనాతనధర్మ ఛారిటబుల్ ట్రస్ట్ పక్షానవిశిష్ట వ్యక్తి పురస్కారం (30 వేల రూపాయల నగదు) అందుకోవటం నాకు చాలా ఆనందాన్ని కల్గించింది – ఆ ధనమంతా గ్రంథముద్రణకు సద్వినియోగం చేసినాను. విశ్వనాథ, దివాకర్ల మహా పురుషులు. వారికి సన్నిహితుణ్ణి కావటం వల్ల నాకు గౌరవంతో పాటు వారంటే గిట్టని వారి నుండి విమర్శలు కూడా పొందవలసి వచ్చింది. ఐనా లెక్క చేయలేదు

– 1960 నుండి 2009 వరకు అవిచ్ఛిన్నంగా 75 రచనలు చేశాను ఆచార్య నాగార్జునుని జీవితం ఆధారంగా "నాగ పూర్ణిమ" రచించాను.

జ్ఞాపకాల పల్లకి

తెలుగు చలన చిత్ర పరిశ్రమ నేపథ్యంతో 112 వ్యాసాల సంపుటి 650 పుటల గ్రంథం జ్ఞాపకాల వల్లరి రచించాను. ఇది ప్రభ దిన పత్రికలో ప్రతి గురువారం చిత్ర ప్రభ సప్లిమెంట్‌లో ధారావాహికంగా దాదాపు సంవత్సరం పైగా వచ్చింది. ఇది నాకు కళా రంగంలో మంచి పేరును తెచ్చి పెట్టింది. ఎందరో సినీ ప్రపంచంలో పరిచయం కావటంతోబాటు ఆ రంగం లోతు పాతులు అవగాహన చేసుకోవటానికి ఉపకరించింది.

1977లో దివిసీమ తుఫాను కారణంగా తాడికొండలోని మా ఇంటిలోని పాత విలువైన గ్రంథాలన్నీ జలార్పణం అయినాయి. ఆ తర్వాత ఆ గ్రామంతో నాకు ఎట్టి సంబంధం లేకుండా పోయింది. హైదరాబాదులో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాను. యూనివర్సిటీలో ముప్పది సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా పని చేశాను.

ప్రతి రచయితలోనూ కొన్ని గర్వకారణమైన సన్నివేశాలు ఉంటాయి. నేను బ్రిటన్ పర్యటనకు వెళ్లినప్పుడు ఒక పట్టణంలో రాత్రి కార్యక్రమం జరిగింది. అనంతరం ఒక తల్లి నా దగ్గరికి వచ్చి 'సార్ మీ హీరోయిన్‌ను పిలుస్తాను' అన్నది. నేను వింతగా చూస్తున్నాను. ఆమె తన కుమార్తెను పిలిచి 'ఇదుగో ఈ హీరోయిన్ – నీ పేరు చెప్పవే' – అన్నది– అప్పుడు ఆ పాప 'శ్రీలేఖ' అని తన పేరు చెప్పింది. అప్పటికి నాకు సంగతి ఏమిటో అర్థమయింది. – నా నవలలోని (నేను సృష్టించిన) కథానాయిక 'శ్రీలేఖ' పేరును ఒక తల్లి తన కూతురుకు పేరు పెట్టుకున్నది – ఎక్కడి హైదరాబాదు ఎక్కడి బ్రిటన్? ఎక్కడి శ్రీలేఖ? నిజంగా నాకు ఈ సన్నివేశం ఎంతో ఉత్తేజాన్ని కల్గించింది. అలాగే శాన్‌ఫ్రాన్సిస్కోలో మేము భువనవిజయం ప్రదర్శన ఇచ్చిన తర్వాత తెలుగు వారు భాష రాని అమెరికన్ ప్రేక్షకులు కూడా లేచి నిలబడి దాదాపు నలభై నిమిషాలు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు – ఆ సన్నివేశం నాకింకా (ఇరవై ఏళ్లు గడిచినా) స్పష్టంగా గుర్తు ఉంది –

చిన్నప్పుడు ప్రొద్దుటూరులో నాటక పోటీలలో పాల్గొని ట్రాన్స్‌పోర్ట్ లేక లారీలో ఒక రాత్రి ప్రయాణం చేసిన థ్రిల్ – జమలాపురం వెంకటేశ్వరస్వామి సన్నిధానంలో భువనవిజయం ప్రదర్శనకు వెళ్లి ట్రాన్స్ పోర్ట్ దొరుకక ట్రాక్టరులో ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారితో కలిసి ప్రయాణించిన సన్నివేశం–

బర్మింగ్‌హామ్‌లో చాపరాల బాబూరావు గారింట్లో నేను శాండిల్య, ఇతర సాంస్కృతిక బృందం సభ్యులు వాణిశ్రీ వేయించి పెట్టిన అప్పడాలు తిన్న దృశ్యం, బొంబాయి ఆంధ్రమహా సభ (దాదర్)లో భువనవిజయ ప్రదర్శన తర్వాత మహనీయుడు కె-ఎల్-రావు గారితో సన్మానం అందుకున్న సన్నివేశం - ఎలా మరచి పోగలను?

ఒకనాడు నాగార్జునసాగర్‌కు బోటులో పోతున్నాను. నా పక్కన కూర్చున్న ప్రయాణికులలో ఇద్దరు స్త్రీలు పరస్పరం సంభాషించుకుంటున్నారు. "నా వద్ద మాదిరెడ్డి సులోచన, యద్దనపూడి సులోచనారాణి కంప్లీట్‌సెట్ ఉంది."

"నా దగ్గర ముదిగొండ శివప్రసాద్ గారి సెట్టు ఉంది - ఆవాహన నాకు నచ్చింది." అని నా పుస్తకం పై చర్చ జరుపుతున్నారు - నేను నిశ్శబ్దంగా వింటున్నాను. ఇదొక థ్రిల్".

చిన్నప్పుడు నేను చాలా అందంగా ఉండేవాడిని - ఆకర్ణాంత విశాల నేత్రములతో ఎందరి చేతనో ఆకర్షింపబడ్డాను. అభిమానులు అమ్మాయిలు వెంటపడేవారు - ఇప్పుడు వయస్సు పైబడిన తర్వాత త్యాగరాయ గాన సభలో సన్మానం జరిగిన తర్వాత శాలువాతో రోడ్డు మీదికి వస్తే కుక్కలు భయపడి అరుస్తున్నాయి. అయితే ఈ మొరుగుడు కూడా చాలా కాలంగా అలవాటుపడ్డాను.

"నీ వెనుక ఎవరున్నారు?" అని ప్రశ్నిస్తున్నారు. కొందరు-

నా వెనుక వ్యాసుడు, వాల్మీకి, కాళిదాసు, భాసుడు, భవభూతి, కవిత్రయం, శ్రీ నాథుడు, అష్టదిగ్గజాలు, రవీంద్రుడూ, అరవిందుడు ఉన్నారు!!, వారి పరంపరను కాపాడాలనే తపనతో కలం పట్టాను.

ఫలితంగా అభిమాన వర్గాన్ని, వ్యతిరేక వర్గాన్ని కూడా సంపాదించుకున్నాను.

ఇది నా స్వీయ ప్రతిభ కాదు. స్వయంకృతాపరాధం కూడా కాదు. ఒక సిద్ధాంతానికి కట్టుబడి నిబద్ధతతో రచనలు చేసేవారికి ఈ రెండు వర్గాలూ ఉంటారు.

ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా సాహిత్య అధ్యాపకత్వం చేరువగా నేను గడిపిన జీవితం నాకు సంతృప్తి నిచ్చింది. ఎన్ని పేజీలు రాశానో లెక్క లేదు. కాని దాదాపు ఇరవై వేల పుటలకు పైగా ఇప్పటికి రచన చేశాను. ఇరవై వేల ఉపన్యాసాలు ఇరవై వేల పుటల రచన-

ఇది ఏ రచయితకైనా సంతృప్తిని కల్గించే అంశమే!!

ఎనిమిది వందల భువనవిజయ ప్రదర్శనలు (సాహిత్య రూపకం) రాయబారం తులాభారం వలె ఇవ్వటం గర్వకారణమే కదా! అన్నింటిలోనూ తిమ్మరుసు పాత్రయే పోషించలేదు. సందర్భోచితంగా అవసరాన్ని బట్టి పెద్దన, ధూర్జటి, పింగళి సూరన కూడా వేశాను. కొద్ది సార్లు రాయలు పాత్రనూ పోషించాను.

నా చిన్నతనంలో నాకు పాఠం చెప్పిన సుబ్బారావు మాష్టారు చాలా పేదరికంలో ఉండేవాడు - మతి మరుపు ఎక్కువ. దోసకాయ పచ్చడికి ముక్కలు తరిగి నూరానని భ్రమించేవాడు - తీరా వడ్డించుకునే వేళకు, పచ్చడి నూర లేదని గుర్తుకు వచ్చేది -- "రోట్లో నలగక పోతే నోట్లో నలగవా ఏమిటి?" అని అలాగే కలుపుకొని తినేవాడు.

ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారు విశాఖపట్నంలో 16రూపాయల జీతంలో ఉద్యోగంలో చేరారు. పదహారు వందలతో రిటైర్ అయినారు - నేను ఒంగోలులో 1957లో 16 రూపాయల జీతం ఒక ట్యూటోరియల్ కాలేజీలో ఉద్యోగం చేశాను. 120 రూపాయలతో 1962 లో ఒక హైస్కూలులో పని చేశాను. 250 రూపాయల నెల జీతంలో కృష్ణాపత్రిక సంపాదక వర్గంలో పని చేశాను. అప్పటికి అవి మంచి జీతాల క్రింద లెక్క. ఎందుకంటే 1957లో పావలా పెడితే గడ్డ పెరుగుతో భోజనం పెట్టేవారు.

మా అధ్యాపకులలో నా పై ప్రభావం చూపినవారు ధారా రామనాథ శాస్త్రిగారు - నాట్యా ప్రధాన ప్రక్రియా నిర్మాత. లలిత కళలు అనే అంశంపై మూడు నెలలు అవిచ్ఛిన్నంగా పాఠం చెప్పారు. దువ్వూరు వేంకటరమణశాస్త్రి గారు ఎం-ఏ. లో తెలుగు వ్యాకరణం చెప్పేటప్పుడు చీకటిలో అరసున్నా ఉన్నదా? అని ఎవరో ప్రశ్నించారు చీకట్లో ఏం కనపడుతుంది? అని జవాబిచ్చారు. ఆ రోజుల్లో ఎం. ఏ. అధ్యయనం గురుకుల క్లిష్టత వలె ఉండేది. త్రిపురనేని మధుసూదనరావు ఎం. ఏ. తరగతులలో కె-వి-ఆర్-నరసింహంగారు స్వారోచిషమనుసంభవము రసము అనే అంశం పై పాఠం చెపుతున్నప్పుడు "మీరు చెప్పే సిద్ధాంతం తప్పు సార్" అన్నాడు. కె-వి-ఆర్ కు కోపం వచ్చింది. నెల రోజులు వరుసగా మను చరిత్ర రసము అనే అంశం పైనే ఆయన పాఠం చెప్పారు- చివరకు మధుసూదనరావుకు సెకండ్ క్లాస్ ఇచ్చి పంపారు. గురువులు విద్య నేర్పితే కృష్ణా పత్రిక సంపాదకులు ము-సు-శర్మగారు జీవితం అంటే ఏమిటో నేర్పారు.
డెబ్బది ఏండ్ల తరువాత ఇప్పుడు ఒక్కసారి వెనుదిరిగి చూచుకుంటే ఈ జీవన ప్రస్థానంలో ఎన్నెన్ని మజిలీలు ఎన్నెన్ని స్నానఘట్టాలు ఎన్నెన్ని మధుర క్షణాలు - ఎన్ని పురస్కారాలు- అంతా విచిత్రంగా అనిపిస్తుంది.

ఆంధ్ర సారస్వతపరిషత్‌లో 6 అక్టోబరు నాడు పరిణతవాణి శీర్షికలో నా ప్రసంగాన్ని ఏర్పాటు చేసి నా జ్ఞాపకాలను నెమరు వేసుకునే సదవకాశం కల్పించిన గురువర్యులు డా. సి.నారాయణరెడ్డిగారికి కార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారికి వినమ్ర నమస్సుమాంజలి.

✧ ✧ ✧

పరిణతవాణి ఉపన్యాసకులు

1. **డా. వి. వి. యల్. నరసింహారావు**
నం. 84/21- మీర్‌పేట
ఆర్. ఎన్. రెడ్డికాలనీ
వైశాలీనగర్, రంగారెడ్డి జిల్లా
హైదరాబాదు. 500079

2. **డా. తుర్లపాటి కుటుంబరావు**
సీనియర్ జర్నలిస్టు, టెంపుల్‌స్ట్రీట్
లబ్బీపేట,
విజయవాడ - 520 010

3. **ఆచార్య పేర్వారం జగన్నాథం**
నం.1-8-120, మిథిలానగర్,
బాలసముద్రం, హన్మకొండ
వరంగల్ - (అప్పటి చిరునామా)

4. **ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య**
ప్లాట్ నం. ఎ/341, గ్రీన్‌పార్క్ కాలనీ,
6వ రోడు, సరూర్‌నగర్,
హైదరాబాదు - 500 035

5. **డా. వి. యస్. రమాదేవి**
నం. 219/ఏ/ఏ, ఎం. ఎల్. ఏ. కాలనీ
రోడు నం. 12, బంజారాహిల్స్
హైదరాబాదు - 500 034

6. **ఆచార్య ఎం. కులశేఖరరావు**
నం. టి 5, ఆర్కిడ్స్,
డి. డి. కాలనీ,
బాగ్ అంబర్ పేట
హైదరాబాదు. 500 007

7. **ఆచార్య కొలకలూరి ఇనాక్**
ఇంటి నం. 2- 282,
సర్వోదయనగర్ దగ్గర,
మీర్‌పేట, విశాలాక్షినగర్
హైదరాబాదు - 500 079

8. **ఆచార్య చేకూరి రామారావు**
ప్లాట్ నం. 22, స్ట్రీట్ నం.7
హబ్సిగూడ,
హైదరాబాదు - 500 007

9. **ఆచార్య రవ్వా శ్రీహరి**
ఇంటి నం. 16-2-836,/ఎఫ్/2
మాధవనగర్, సైదాబాదు
హైదరాబాదు 500 659

10. **ఆచార్య ముదిగొండ శివప్రసాద్**
ఇంటి నం. 2-2-647/132బి
సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ,
హైదరాబాదు - 500007

ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణలు

1.	ఆంధ్ర మహాభారతోపన్యాసములు	రూ. 100/-
2.	తెలుగు వాగ్గేయకారులు - అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం	రూ. 70/-
3.	తెనుగు సాహితి	రూ. 36/-
4.	స్త్రీల రామాయణపు పాటలు	రూ. 36/-
5.	సమీక్షణం	రూ. 36/-
6.	పరిణతవాణి - 1,2,3,4,5,సంపుటాలు (36,45,60,65,60)	రూ. 266/-
7.	ఆధునిక తెలుగు సాహిత్యంలోని విభిన్న ధోరణులు	రూ. 70/-
8.	ఇరివెంటి వ్యాసాలు	రూ. 30/-
9.	శాలివాహన గాథా సప్తశతీసారము	రూ. 15/-
10.	రాయప్రోలు రచనలు - తత్వవివేచన	రూ. 60/-
11.	తెలుగులో సాహిత్యోద్ధారకులు	రూ. 40/-
12.	మల్లికా గుచ్ఛము	రూ. 8/-
13.	మన జాతినిర్మాతలు	రూ. 4/-
14.	సుమతి, వేమన, కృష్ణ శతకాలు	రూ. 24/-
15.	ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక	రూ. 250/-
16.	తెలంగాణాలో జాతీయోద్యమాలు	రూ. 10/-
17.	సంస్కృత పాఠవల్లరి	రూ. 4/-
18.	నా సాహిత్యోపన్యాసములు	రూ. 5/-
19.	గౌతమబుద్ధుడు-జవహరలాల్ నెహ్రూ	రూ. 3-60
20.	కర్నల్ కాలిన్ మెకంజీ	రూ. 1-50
21.	మన దేశం-తెలుగుసీమ	రూ. 7/-
22.	మన నదులు - కృష్ణా గోదావరులు	రూ. 3/-
23.	మధురభక్తి - ముగ్ధభక్తి	రూ. 80/-
24.	ప్రాచీన కవిత	రూ. 10/-
25.	ప్రసంగ వ్యాసాలు	రూ. 5/-
26.	ఆంధ్ర సారస్వత పరిషత్తు స్వర్ణోత్సవ సంచిక	రూ. 50/-
27.	దశరూపక సారం	రూ. 5/-
28.	భారతీయ వాస్తు శిల్ప విజ్ఞానం	రూ. 2/-
29.	నా రేడియో ప్రసంగాలు	రూ. 5/-
30.	సాహిత్యానువాదం: సమాలోచనం	రూ. 60/-
31.	శివరాత్రి మాహాత్యము	రూ. 75/-
32.	తెలుగు రచన	రూ. 7/-
33.	ఆంధ్రవాఙ్మయ చరిత్ర	రూ. 85/-
34.	సాహిత్య సోపానములు	రూ. 75/-
35.	మన హాస్యము	రూ. 100/-

గమనిక : పైన పేర్కొన్న గ్రంథాలలో ఏవేని కావలసినవారు ఆయా గ్రంథాల మూల్యంలో సగం సొమ్ము ముందుగా పంపించవలెను